
'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 249

గురువారం 23-5-2024

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఫైనల్లో జ్యోతి సురేఖ బృందం

సెమీస్‌లో అమెరికాపై విజయం.. ప్రపంచ కప్ ఆర్చరీ స్టేజ్–2 టోర్నీ - 12లో



బెంగళూరు ఇంటికి...

రెండో క్వాలిఫయర్‌లో సన్‌రైజర్స్‌తో తలపడనున్న రాజస్తాన్ - 12లో



పాలస్తీనా స్వతంత్ర దేశం

పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తిస్తూ నార్వే, ఐర్లాండ్, స్పెయిన్‌లు చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నాయి.

వివరాలు 6లో ▸



బెంగాల్‌లో బంగ్లాదేశ్ ఎంపీ హత్య

చికిత్స కోసం భారత్‌కు వచ్చిన బంగ్లాదేశ్‌కు చెందిన అవామీ లీగ్ ఎంపీ అజీమ్ అన్వర్ హత్యకు గురయ్యారు.

వివరాలు 6లో ▸



వారు పాక్ సానుభూతిపరులు

కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు పాకిస్తాన్ సానుభూతిపరులని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు.

వివరాలు 6లో ▸



ఆర్మీకి అగ్నివీర్ అక్కర్లేదు

'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే అగ్నివీర్‌ను రద్దు చేస్తామని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చెప్పారు.

వివరాలు 6లో ▸

'గేటు'లో గూండాగిరి

పాల్వాయి గేటులో ఓటర్లను బెదిరించి పచ్చమూకల రిగ్గింగ్

వైఎస్సార్ సీపీ ఏజెంట్లను చితకబాది బూత్‌ల నుంచి ఈడ్చివేత

- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళలపై పోలింగ్ బూత్‌లలో దౌర్జన్యం
- పార్టీ నేతల సమాచారంతో అక్కడకు చేరుకున్న ఎమ్మెల్యే పిన్నెల్లి
- రిగ్గింగ్‌ను ప్రతిఘటించి స్పందించాలని పలు దఫాలు ఎన్నికల అధికారులకు ఫోన్లు
- వెబ్ కాస్టింగ్ పరిశీలించి రిగ్గింగ్ అడ్డుకోకుండా అధికార యంత్రాంగం ఉదాశీనత.. పల్నాడులో ఏడు చోట్ల ఈవీఎంలు ధ్వంసమైతే ఒక్క వీడియో మాత్రమే బహిర్గతం
- అవసరమైన మేరకు ఎడిటింగ్..
- వారం తరువాత తాపీగా విదేశాల్లో ఉన్న లోకేశ్ ఎక్స్ ఖాతా నుంచి విడుదల
- భద్రంగా ఉండాల్సిన వెబ్ కాస్టింగ్ సమాచారం బయటకు వెళ్లడంపై సందేహాలు
- రిగ్గింగ్, ఏజెంట్లపై దాడులు, ఓటర్లని బెదిరించిన వారిని పట్టించుకోకుండా ప్రతిఘటించిన వారిపై కేసుల నమోదు పట్ల సర్వత్రా విస్మయం

2 లో





1. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం పాల్వాయి గేట్ పోలింగ్ బూత్ 202 వద్ద వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను బయటకు లాగుతున్న టీడీపీ నేతలు 2. వైఎస్సార్‌సీపీ ఓటర్లను నిలువరిస్తున్న పోలీసులు, పచ్చ మూకలు 3. వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ గూండాల మూకుమ్మడి దాడి 4. టీడీపీ నేతల దాడి అనంతరం గాయాలను ఎమ్మెల్యే పిన్నెల్లికి చూపిస్తున్న స్థానికులు

ఆ వీడియో ఫేకా? ఒరిజినలా?

- మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి వీడియో నిజమైతే రిలీజ్ చేయాల్సింది ఎవరు?
- ఈసీనో, అధికారులో విడుదల చేయాలి.. అది లోకేశ్ ఎక్స్ ఖాతాలోకి ఎక్కడి నుంచి వచ్చింది?: మంత్రి అంబటి రాంబాబు

2 లో

'రిగ్గింగ్' వదిలేసి అడ్డుకుంటే కేసులా?

- పాల్వాయిగేట్‌లో యథేచ్ఛగా టీడీపీ రిగ్గింగ్.
- మా ఏజెంట్లను బయటకు లాగి దాడి చేశారు
- రిగ్గింగ్‌ను అడ్డుకుని ప్రతిఘటించిన పిన్నెల్లిపై కేసులా?
- గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ధ్వజం

3 లో



రూ.2.11 లక్షల కోట్ల డివిడెండ్!

కేంద్రంపై ఆర్‌బీఐ కనకవర్షం

కేంద్రానికి రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గత ఆర్థిక సంవత్సరానికి (2023–24) భారీగా రూ.2,10,874 కోట్ల డివిడెండ్‌ను అందించనుంది. ఆర్‌బీఐ చరిత్రలోనే ఇది రికార్డ్‌కాగా.. బడ్జెట్ అంచనాలకన్నా రెట్టింపు. జీడీపీలో 0.2 నుంచి 0.3 శాతానికి సమానం. ఎన్నికల అనంతరం అధికారంలోకి రానున్న కొత్త ప్రభుత్వానికి ఆదాయపరంగా ఇది పెద్ద ఊరటనిచ్చే అంశం. ఈ మేరకు మిగులు నిధులు కేంద్రానికి బదలాయింపుపై బుధవారం ఢిల్లీలో సమావేశమైన ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ తాజా కీలక నిర్ణయం తీసుకుంది. గవర్నర్ శక్తికాంత్‌దాస్ నేతృత్వంలో జరిగిన 608వ బోర్డ్ సమావేశ నిర్ణయాలపై ఆర్‌బీఐ ఒక ప్రకటన విడుదల చేసింది.

13 లో

న్యూస్‌రీల్

నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం!



నైరుతి బంగాళాఖాతంలో బుధవారం అల్పపీడనం ఏర్పడింది. ఇది ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా తీరాలకు ఆనుకుని ఉంది. ఈ అల్పపీడనం ఈశాన్య దిశగా కదులుతూ శుక్రవారం ఉదయానికి మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడనుంది.

వివరాలు 14లో ▸

వైభవంగా గంగమ్మ విశ్వరూప దర్శనం



తిరుపతి శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న జాతరలో భాగంగా మంగళవారం అర్ధరాత్రి భక్తులకు గంగమ్మ విశ్వరూప దర్శన భాగ్యం ప్రసాదించింది. భారీగా తరలివచ్చిన భక్తజనం అమ్మవారి అపురూప దర్శనంతో పులకించిపోయారు.

వివరాలు 5లో ▸

హార్సిలీహిల్స్‌పై పునుగు పిల్లి ప్రత్యక్షం



అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై బుధవారం పునుగు పిల్లి ప్రత్యక్షమైంది. కంచెలో చిక్కుకున్న పునుగు పిల్లి శరీరానికి అతుక్కున్న కంచెను అటవీ సిబ్బంది కత్తిరించడంతో అది అడవిలోకి వెళ్లిపోయింది.

వివరాలు 14లో ▸

సమష్టి కృషితోనే జీవవైవిధ్య పరిరక్షణ



ప్రజల సమష్టి కృషి, భాగస్వామ్యంతోనే జీవవైవిధ్య పరిరక్షణ సాధ్యమవుతుందని విశాఖలో బుధవారం నిర్వహించిన జాతీయ స్థాయి జీవవైవిధ్య దినోత్సవంలో రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చిరంజీవి చౌదరి అన్నారు.

వివరాలు 13లో ▸

ఉచిత పాఠ్య పుస్తకాలు సిద్ధం

3.12 కోట్ల మొదటి సెమిస్టర్ పుస్తకాలు పంపిణీకి రెడీ

- మండల స్టాక్ పాయింట్లకు తరలింపు
- 8వ తరగతి విద్యార్థులకు ఫ్యూచర్ స్కిల్స్‌పై పుస్తకం
- జూన్ 8కి అన్ని స్కూళ్లకు పుస్తకాలు
- 1.08 కోట్ల సెమిస్టర్–2 పుస్తకాలు జూలైలో పంపిణీ



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్య పుస్తకాలు సిద్ధమయ్యాయి. బడి తెరిచిన రోజే వాటిని అందించేందుకు ఇప్పటికే ప్రింటర్స్ నుంచి జిల్లా స్టాక్ పాయింట్లకు, అక్కడి నుంచి మండల స్టాక్ పాయింట్లకు చేరుతున్నాయి. 2024–25 విద్యా సంవత్సరానికి 1 నుంచి 10వ తరగతి వరకు మొత్తం 4.20 కోట్ల పాఠ్యపుస్తకాలు అవసరం కాగా, మొదటి సెమిస్టర్‌కు అవసరమైన 3.12 కోట్ల పుస్తకాలను పంపిణీకి సిద్ధం చేశారు. 1, 2 తరగతులు మినహా మిగతా అన్ని తరగతుల పాఠ్య పుస్తక ముఖచిత్రాలు మార్చారు. ముఖ చిత్రాల ఆధారంగా సులభంగా పుస్తకాలను గుర్తించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు. గతంలో ఇచ్చినట్టుగానే

మిగతా 14వ పేజీలో ▶

యథావిధిగా ఆరోగ్యశ్రీ సేవలు



- సేవల నిలిపివేత అవాస్తవం
- ఆరోగ్యశ్రీ సేవలకు అంతరాయం కలిగించే ఆస్పత్రులపై చర్యలు
- స్పష్టం చేసిన రాష్ట్ర వైద్య శాఖ

- వివరాలు 14లో

కొబ్బరి రైతులకు బాసట



సంక్షోభంలో ఉన్న కొబ్బరి రైతులను ఆదుకునేందుకు అనువుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు నాఫెడ్ సన్నాహాలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో కేంద్రం వీటి ఏర్పాటుకు అంగీకరించింది. జూన్‌లో వీటిని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఏర్పాటు చేయనుంది. కొబ్బరి దిగుబడి పడిపోవడంతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ పెరిగింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందిన సిఫారసు మేరకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ డిప్యూటీ సెక్రటరీ సంజయ్‌కుమార్ ఆదేశించారు.

- వివరాలు 2లో

'రేవ్' పార్టీలో చిత్తూరు టీడీపీ నేతలు!

బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో టీడీపీ మూలాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పార్టీలో డ్రగ్స్ విక్రయించిన ఐదుగురు ప్రధాన నిందితుల ఫొటోలు, వివరాలను బెంగళూరు పోలీసులు వెల్లడించారు. వీరిలో చిత్తూరుకు చెందిన టీడీపీ యువ నేత రణధీర్ విక్రమ్‌నాయుడు, టీడీపీ కార్యకర్త కాణిపాకానికి చెందిన అరుణ్‌కుమార్‌నాయుడు ఉన్నారు.

13 లో





మొత్తం సీట్లే అన్ని లేవ్!
కాస్త మీ ఊపు తగ్గించుకోండి.. ప్లీజ్!

ఓటమి బాటలో బాబు

కుప్పంలో తప్పిన లెక్కలు.. వికటించిన వ్యూహాలు

- ఇన్నాళ్లూ చంద్రబాబును గెలిపించింది 51 వేల దొంగ ఓట్లే
- రెండు విడతలుగా ఆ ఓట్ల తొలగింపు
- దీంతో ఓటమికి దగ్గరవుతూ వచ్చిన బాబు
- స్థానిక సంస్థల ఎన్నికలన్నింటిలోనూ టీడీపీ ఘోర పరాజయం
- 35 ఏళ్లుగా కుప్పం ప్రజలను నమ్మించి మోసం చేసిన వైనం
- వైఎస్సార్‌సీపీ రాకతో ప్రతి ఇంటికీ సంక్షేమం, అభివృద్ధి
- మారుతూ వచ్చిన ఓటర్ల తీర్పు.. గత ఎన్నికల్లో తగ్గిన మెజారిటీ
- ఈ దఫా ఓటమి ఖాయం అని తేలడంతో కుటుంబ సమేతంగా పరుగులు



10 లో

- కుప్పంలో ఓటు, ఇల్లు లేని బాబు.. ఓటమి భయంతో ఇంటి నిర్మాణ పనులు
- ఓటుకు రూ.2 వేలు పంపిణీ చేసినా విఫల యత్నమే అంటున్న స్థానికులు

చంద్రబాబు 35 ఏళ్ల కుప్పం ప్రస్థానంలో జరిగిన ఎన్నికల్లో వచ్చిన ఓట్లు, సీట్లను బట్టి చూస్తే గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ గట్టి పట్టు సాధించిందని స్పష్టమవుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు వచ్చిన ఓట్లను, ఇటీవల తొలగించిన 33 వేల టీడీపీ దొంగ ఓట్లను పరిగణనలోకి తీసుకుంటే, మే 13న జరిగిన ఎన్నికలో కుప్పం అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి భరత్ గెలుపు వాకిట నించున్నారని తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు, మద్దతుదారులకు వచ్చిన ఓట్ల కంటే కేవలం 3-4 వేల ఓట్లు (0.02%) మాత్రమే అదనంగా అవసరం. అయితే భారీగా టీడీపీ దొంగ ఓట్లకు చెక్ పడటంతో కుప్పంలో చంద్రబాబు ఓడిపోబోతున్నారని స్పష్టమవుతోంది. ఇటు ఓటర్లు, అటు రాజకీయ విశ్లేషకులు, పలు సర్వే నివేదికలు చెబుతున్న వాస్తవం ఇది.



ఓటెత్తిన చైతన్యం

గడచిన నాలుగు దశల్లో 2019 కన్నా అత్యధికంగా పోలైన ఓట్లు

- అత్యధిక ఓటింగ్ రాష్ట్రాల్లో ఏపీకి నాలుగోస్థానం
- తొలి మూడు స్థానాల్లో కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర
- గత ఎన్నికల కన్నా 19.5 లక్షలు పెరిగిన ఓటింగ్
- ఏపీలో గతం కంటే ఎక్కువగా ఓటేసిన 8.4 లక్షల మంది మహిళలు
- నాలుగు దశల పోలింగ్ సరళిపై ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి

2 లో

క్లుప్తంగా...

పీహెచ్‌సీలో ఆరోగ్య సేవలు భేష్

- యూనిసెఫ్ బృందం



వివరాలు సేకరిస్తున్న యూనిసెఫ్ బృందం

ఇబ్రహీంపట్నం (మైలవరం): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పేదలకు వైద్యసేవలు అందుబాటులోనే ఉన్నాయని యూనిసెఫ్ సంస్థ ప్రతినిధి ప్రతిభాసింగ్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని కొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని యూనిసెఫ్ బృందంతో కలిసి ప్రతిభాసింగ్ బుధవారం సందర్శించారు. వైద్యశాలలో రోగులకు అందుతున్న సేవలు, మందుల వెసులుబాటు, మెడికల్ టెస్ట్‌ల వివరాల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. జీవ సంబంధ వ్యర్థాల నిర్వహణ, వర్షం నీటి నిల్వ, నీటి నిర్వహణ, వైద్యశాలలో పరిసరాల పరిశుభ్రత, డ్రైనేజీని తనిఖీ చేశారు. ల్యాబ్, ఫార్మసీ, డెలివరీ రూంను పరిశీలించారు. పేదలకు అందుతున్న వైద్యసేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. యూనిసెఫ్ ప్రతినిధి బృందం సభ్యులు వెంకటేశ్, రాజేశ్, పీహెచ్‌సీ వైద్య బృందం పాల్గొన్నారు.

వైఎస్సార్ జిల్లాలో జర్మనీ బృందం పర్యటన



పులివెందుల: వైఎస్సార్ జిల్లా తొండూరులో బుధవారం జర్మనీ బృందం పర్యటించింది. పులివెందులలో నెలకొల్పిన ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమి ఇన్ ఆగ్రో ఎకాలజి రీసెర్చ్ అండ్ లెర్నింగ్ సెంటర్‌లో 4 రోజుల పాటు జరుగనున్న వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన జర్మనీ కేఎఫ్‌డబ్ల్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ప్రతినిధి బృందం బుధవారం తొండూరులో రమేష్ అనే రైతు శాస్త్రవేత్త ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించింది. అకాడమీలో రమేష్ తన వ్యవసాయ క్షేత్రంలో ఎకరా విస్తీర్ణంలో పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఏ–గ్రేడ్, ఏటీఎం నమూనాలను అవలంబిస్తున్నారు. రైతు సాధికార సంస్థ ఆదేశానుసారం 80 సెంట్ల విస్తీర్ణంలో ఏ–గ్రేడ్, 20 సెంట్ల విస్తీర్ణంలో ఏటీఎం మోడల్స్ వేసి మంచి దిగుబడి సాధిస్తున్నాడు. రమేష్ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన వారిలో జర్మనీ బృంద సభ్యులు ఐరిష్, మాథియాస్, మార్క్, సంగీత ఉన్నారు. వీరు పంట విధానాలను, పురుగు, తెగుళ్ల నియంత్రణకు అనుసరిస్తున్న పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ క్షేత్రంలో రసాయన రహిత ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన అల్పాహారాన్ని స్వీకరించారు. పులివెందులలోని ఐజీకార్ల్ భవనంలో రైతు శాస్త్రవేత్తలు, మెంటార్లతో సమావేశమై అకాడమీలో నిర్వహిస్తున్న కోర్సు, ఫీల్డ్‌లో అనుసరిస్తున్న విధి విధానాలను తెలుసుకున్నారు.

ఓటెత్తిన చైతన్యం

గడచిన 4 దశల్లో 2019 కన్నా అత్యధికంగా పోలైన ఓట్లు



- అత్యధిక ఓటింగ్ రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌కి నాలుగోస్థానం
- గత ఎన్నికల కన్నా 19.5 లక్షలు పెరిగిన ఓటింగ్
- ఏపీలో గతం కంటే ఎక్కువగా ఓటేసిన 8.4 లక్షల మంది మహిళలు
- నాలుగు దశల పోలింగ్ సరళిపై ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి

దేశంలో ఇప్పటివరకూ లోక్‌సభకు జరిగిన నాలుగు దశల ఎన్నికల్లో ఓటర్ల చైతన్యం వెల్లువెత్తింది. 2019లో జరిగిన నాలుగు దశల ఎన్నికలతో పోలిస్తే ఈ సారి(పోస్టల్ బ్యాలెట్లు మినహాయించి) 1.9 కోట్ల మంది ఓటర్లు పెరిగినట్టు ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక స్పష్టం చేసింది.

సాక్షి, అమరావతి: కేంద్ర ఎన్నికల సంఘం లెక్కల ప్రకారం 2019 నాలుగు దశల్లో 42.6 కోట్ల మంది ఓటేస్తే ఈసారి నాలుగు దశల్లో 45.1 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అంటే 2.5 కోట్ల మంది ఓటర్లు పెరిగినట్లు ఎస్‌బీఐ స్పష్టం చేసింది. 4 దశల్లో పెరిగిన ఓటర్లలో మహిళా ఓటర్లే 93.6 లక్షల మంది ఉండగా పురుష ఓటర్లు 84.7 లక్షల మంది ఉన్నట్లు ఆ నివేదిక పేర్కొంది. 2019 కంటే 2024లో అత్యధికంగా ఓట్లు వేసిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ 19.5 లక్షల ఓట్లతో నాలుగో స్థానంలో ఉంది. కర్నాటకలో అత్యధికంగా 35.5 లక్షల ఓటర్లతో తొలి స్థానంలో, తెలంగాణలో 31.9 లక్షల ఓటర్లతో రెండో స్థానంలోనూ, మహారాష్ట్ర 20 లక్షల ఓటర్లతో మూడో స్థానంలో ఉన్నట్లు నివేదికలో వివరించింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఓటేసిన వారి కన్నా 2024లో కేరళలో 5.3 లక్షల ఓటర్లు తగ్గారని, మణిపూర్‌లో 3.4 లక్షల ఓటర్లు తగ్గినట్టు ఎస్‌బీఐ నివేదిక తెలిపింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసిన పథకాలే మహిళా ఓటింగ్ పెరగడానికి దోహదపడిందని వివరించింది. ఏపీలో 2019 లోక్‌సభ ఎన్నికలతో పోల్చితే ఈ సారి ఎన్నికల్లో 8.4 లక్షల మహిళా ఓటర్లు అధికంగా ఓటు వేసినట్టు తెలిపింది.

2019 లోక్‌సభ ఎన్నికలతో పోల్చితే ఈసారి 4 దశల్లో లక్షకు పైగా ఎక్కువగా ఓటేసిన రాష్ట్రాల వివరాలు

రాష్ట్రం	2019లో ఓటింగ్ సంఖ్య	2024లో ఓటింగ్ సంఖ్య	మార్పు (లక్షల్లో)	శాతం
కర్నాటక	351.1	386.6	35.5	10.1
తెలంగాణ	186.3	218.1	31.9	17.1
మహారాష్ట్ర	410.0	430.0	20.0	4.9
ఆంధ్రప్రదేశ్	313.9	333.4	19.5	6.2
ఛత్తీస్‌గఢ్	136.1	150.4	14.3	10.5
పశ్చిమబెంగాల్	246.7	258.7	12.1	4.9
అస్సాం	84.6	96.2	11.6	13.7
మధ్యప్రదేశ్	368.7	378.5	9.7	2.6
బీహార్	198.3	207.4	9.1	4.6
గుజరాత్	280.6	288.5	7.9	2.8
రాజస్థాన్	322.6	328.4	5.8	1.8
జార్ఖండ్	37.3	42.6	5.3	14.3
మేఘాలయ	13.7	17.1	3.4	24.9
ఒడిశా	44.4	47.6	3.1	7.1
తమిళనాడు	431	434.6	2.7	0.6
జమ్మూ-కశ్మీర్	28.1	30.7	2.6	9.1
త్రిపుర	21.4	23.1	1.7	8.1

కొబ్బరి రైతులకు బాసట

సాక్షి అమలాపురం: సంక్షోభంలో ఉన్న కొబ్బరి రైతులను ఆదుకునేందుకు అనువుగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నాఫెడ్ సన్నాహాలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో కేంద్రం వీటి ఏర్పాటుకు అంగీకరించింది. జూన్‌లో వీటిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఏర్పాటు చేయనుంది. ప్రస్తుతం 1,000 కొబ్బరి కాయల ధర రూ.9,500–10,000 వరకు ఉంది. ఇది ఆశాజనకమే అయినా దిగుబడి పడిపోవడంతో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు డిమాండ్ పెరిగింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందిన సిఫారసు మేరకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ డిప్యూటీ సెక్రటరీ సంజయ్‌కుమార్ ఆదేశించినట్లు ఆయిల్ ఫెడ్ మేనేజర్ సుధాకరరావు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 15న రాసిన లేఖ ఆధారంగా 8,000 మెట్రిక్ టన్నుల మిల్లింగ్ కోప్రాను 6 నెలల్లో కొనుగోలు చేయనున్నారు. గతేడాది బాల్ కోప్రాను రూ.11,750కు కొనుగోలు చేయగా ఈసారి రూ.12,000కు, మిల్లింగ్ కోప్రా (ఎండు కొబ్బరి)ను గతంలో రూ.10,860కు కొనుగోలు చేయగా, ఈ ఏడాది రూ.11,120కు కొనుగోలు చేయనున్నారు. కోడ్ నేపథ్యంలో అనుమతులు తీసుకున్నాక కొనుగోలు తేదీని ప్రకటిస్తారు. ఎండు కొబ్బరి కొనుగోలు చేయడం కన్నా పచ్చి కొబ్బరి కాయ, నీటి కాయ కొనుగోలు చేస్తేనే తమకు ప్రయోజనమని రైతులంటున్నారు. ఎండు కొబ్బరి తయారీ కోనసీమ జిల్లాలో తక్కువగా ఉంది. ఇప్పుడు 1,000 కాయల ధర రూ.9,500 వరకు ఉంది. క్వింటాల్ ఎండు కొబ్బరి తయారీకి 1,250 కాయలు అవసరం. అంటే రూ.11,875కి అదనంగా కొబ్బరి కొట్టడం, ఎండబెట్టడం, అరపలపై పెట్టి వేడి పెట్టడం, కూలీ ఖర్చులు క్వింటాల్‌కు రూ.2,500.. అంటే మొత్తం ఖర్చు రూ.14,375 వరకు అవుతోంది. కొనుగోలు కేంద్రాలలో కొనేది మాత్రం రూ.11,120కు మాత్రమే. అదే కొబ్బరి కాయ నేరుగా కొనుగోలు చేస్తే తమకు లాభమని రైతులు చెబుతున్నారు.

ఎన్నికల సంఘం సచ్ఛీలతను నిరూపించుకోవాలి

- గోప్యంగా ఉంచాల్సిన వీడియోలు లోకేశ్‌కు ఎలా చేరాయి?
- మాచర్లతో పాటు పల్నాడులోని వీడియోలన్నీ బయటపెట్టాలి
- ఓ పార్టీకి కొమ్ము కాసిన కొందరు పోలీసులు, ఎన్నికల సిబ్బంది
- బూత్ క్యాప్చరింగ్, రిగ్గింగ్ వీడియోలన్నీ బహిర్గతం చేయాలి
- ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ డిమాండ్

సాక్షి, అమరావతి: మాచర్లతో పాటు పల్నాడు ప్రాంతంలో పోలింగ్ సందర్భంగా చోటు చేసుకున్న బూత్ క్యాప్చరింగ్, రిగ్గింగ్, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోకుండా అడ్డుకున్న ఘటనలపై సమగ్ర దర్యాప్తు జరపాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ కోరింది. అత్యంత గోప్యంగా ఉంచాల్సిన పాల్వాయిగేట్ పోలింగ్ స్టేషన్‌లోని వెబ్ కామ్ ఫుటేజి బయటకు ఎలా వచ్చిందో దర్యాప్తు చేయాలని కోరింది. ఈవీఎంల ధ్వంసానికి సంబంధించి వెబ్ కామ్‌లో రికార్డయిన వీడియో ఓ పార్టీ నేత అయిన లోకేశ్‌కు ఎలా చేరిందో ఎన్నికల కమిషన్ స్పష్టం చేయాలని అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు డిమాండ్ చేశారు. సున్నితమైన అంశం వీడియోను లోకేశ్ ఎక్స్ ఖాతా ద్వారా పబ్లిక్ డొమైన్‌లో పెట్టడమే కాకుండా, ట్వీట్ చేయడం చూస్తుంటే పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ వ్యవహారం వెనుక కొంతమంది ఎన్నికల కమిషన్ అధికారుల హస్తం కూడా ఉందనే అనుమానం కలుగుతోందన్నారు. కోర్టుకు మాత్రమే సమర్పించాల్సిన ఈ వీడియోను బహిర్గతం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మాచర్ల నియోజకవర్గంలోని ఇతర పోలింగ్ స్టేషన్లలో జరిగిన ఘటనల వీడియోలను కూడా విడుదల చేయాలని కోరారు. ఈ పరిణామాలన్నీ నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ అధికారుల సచ్ఛీలతపై అనుమానాలు కలిగిస్తున్నాయని తెలిపారు. ఒక్క మాచర్లలోనే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయని, కొన్ని చోట్ల పోలింగ్ సిబ్బంది, పోలీస్ అధికారులు సైతం ఓ పార్టీకి కొమ్ముకాసేలా వ్యవహరించారని ఈసీ దృష్టికి తీసుకొచ్చారు. పౌరులకు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే పరిస్థితి లేనప్పుడు ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించిందని ఏ విధంగా సగటు ఓటరుకు నమ్మకం కలుగుతుందని ప్రశ్నించారు. ఇతర పోలింగ్ స్టేషన్లలో జరిగిన ఘటనలపైనా ఇదే తరహాలో చర్యలు తీసుకుంటే ఎన్నికల కమిషన్‌పై విశ్వాసం పెరుగుతుందన్నారు. ఇతర వీడియోలను బయటపెట్టడంతో పాటు ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా ఎన్నికల సంఘం సచ్ఛీలతను నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

ఆ వీడియో ఫేకా? ఒరిజినలా?

- మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి వీడియో నిజమైతే రిలీజ్ చేయాల్సింది ఎవరు?
- ఈసీనో, అధికారులో విడుదల చేయాలి.. అది లోకేశ్ ఎక్స్ ఖాతాలోకి ఎక్కడి నుంచి వచ్చింది?
- దీనిపై ఎన్నికల కమిషన్ సమగ్ర విచారణ చేపట్టాలి: మంత్రి అంబటి



సత్తెనపల్లి: 'పోలింగ్ రోజు మాచర్ల నియోజకవర్గంలో దారుణాలు జరిగాయి. అధికారులు, పోలీసులను అడ్డుపెట్టుకుని టీడీపీ మూకలు పేట్రేగిపోయాయి. బూత్ క్యాప్చరింగ్ చేశారు. దొంగ ఓట్లు వేసుకున్నారు. ఈవీఎంలను పగులగొట్టేందుకు యత్నించారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేస్తారనుకున్న ఓటర్లను అడ్డుకున్నారు. కొట్టి బయటకు పంపించారు. వీటన్నింటిపై వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అటు అధికారులకు, ఇటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎలాంటి స్పందనా లేదు. ఈ నేపథ్యంలో ఈ రోజు ఉన్నట్టుండి చిత్రంగా ఒక వీడియో రిలీజ్ అయ్యింది. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఒక పోలింగ్ బూత్‌లో ఈవీఎం పగలకొడుతున్నట్లు అందులో ఉంది. దీన్ని ఎవరు లీక్ చేశారు? ఇది ఫేకా, ఒరిజినలా తేల్చాలి' అని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు డిమాండ్ చేశారు. హైదరాబాద్ నుంచి బుధవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ వీడియో ఎక్కడి నుంచి రిలీజ్ అయిందో అర్థం కావడం లేదన్నారు. వాస్తవంగా ఇలాంటిదేదైనా ఉంటే ఎలక్షన్ కమిషన్ రిలీజ్ చేయాలని చెప్పారు. 'దీన్ని లోకేశ్ ఎక్స్ (ట్విటర్)లో పెట్టారంట! ఎలా చేరింది లోకేశ్ ట్విటర్ లోకి? ఈ వీడియో ఫేకా? ఒరిజినలా? కన్‌క్లూజన్ ఎవిడెన్సా.. కాదా.. ఆలోచించాలి కదా.. కలెక్టర్ అన్న రిలీజ్ చేయాలి, ఎలక్షన్ కమిషన్‌కు సంబంధించిన వారన్నా రిలీజ్ చేయాలి. వీరెవరూ కాకుండా ఇది డైరెక్ట్‌గా తెలుగుదేశం అధినేత కొడుకైన లోకేశ్ ట్విట్టర్‌లోకి ఎట్లా వెళ్లింది?' అని ప్రశ్నించారు. అంటే ఇక్కడ ఏదో కుమ్మక్కు జరిగిందని స్పష్టంగా అర్థమవుతోందన్నారు. అధికారులు, ఎన్నికల కమిషన్‌లో ఉన్న అధికారులు, తెలుగుదేశం పార్టీ వారు కలిసి కుట్ర చేస్తున్నారనే అనుమానం కలగటం సహజం అని స్పష్టం చేశారు. ఒక వేళ అది నిజంగా జరిగి ఉంటే, సంబంధిత అధికారులు విడుదల చేసి ఉంటే చట్టం తన పని తాను చేసుకునేదన్నారు. ఇప్పుడు జరిగింది చూస్తుంటే ఇది ఫేక్ అనిపిస్తోందని చెప్పారు. అంబటి ఇంకా ఏమన్నారంటే..

ఆ వీడియోలన్నీ రిలీజ్ చేయాలి


'పాల్వాయిగేట్ బూత్‌లో టీడీపీ మూకలు ఎంత దారుణంగా వ్యవహరించారో పిన్నెలి రామకృష్ణారెడ్డి చాలా క్లియర్‌గా ఎస్టాబ్లిష్ చేశారు అక్కడ. అది నేను కూడా మీకు చూపిస్తా (వీడియో ప్రదర్శించారు). వైఎస్సార్‌సీపీకి చెందిన వారని భావిస్తున్న ఓటర్లు ఆ బూత్‌లోకి వెళ్లి స్వేచ్ఛగా ఓటు వేస్తే ఒప్పుకోనటువంటి పరిస్థితి. బూత్ బయట హింసించి తరిమేస్తున్నటువంటి సందర్భం. దీని మీద పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రిపోర్టు చేశారు. అయితే ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీకి అనుకూలమైనటువంటి బూత్‌ల దగ్గర గొడవ జరుగుతున్నా పోలీసులు పట్టించుకోకుండా ఉండే పరిస్థితి. ఇది వాస్తవం. చాలా నియోజకవర్గాల్లో బూత్ క్యాప్చరింగ్ జరిగాయి. నా నియోజకవర్గంలో కూడా బూత్ క్యాప్చరింగ్ జరిగి టీడీపీ వాళ్లు ఓట్లు వేసుకున్నారు. వెబ్ క్యామ్ ఓపెన్ చేయండి అంటే పట్టించుకోలేదు. ఎలాంటి చర్యలూ లేవు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పగలగొట్టారని ప్రచారంలో ఉన్న వీడియో ఫేక్ వీడియోనా? కరెక్ట్ వీడియోనా? కరెక్ట్ వీడియో అయితే లోకేశ్ దగ్గర ఎలా రిలీజ్ అయ్యింది. దీనిపై ఎన్నికల కమిషన్ ఏం యాక్షన్ తీసుకుంది? నేరం చేసినట్టుగా భావించేలా అలా ఫేక్‌గా చేయడం తప్పు. నిజంగా నేరం చేసిన వారిని శిక్ష నుంచి తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని మేం ఆందోళన చెందుతున్నాం. ఎక్కడైతే బూత్ క్యాప్చరింగ్ జరిగిందో ఆ వీడియోస్‌ను ఎలక్షన్ కమిషన్ బయటపెట్టాలి. ఒక చోట కాదు.. అనేక చోట్ల మేం ఫిర్యాదు కూడా చేశాం. ఆ వీడియోలన్నీ రిలీజ్ చేయాలి' అని మంత్రి అంబటి డిమాండ్ చేశారు. ఎన్నికల్లో అక్రమాలపై తాము ఈసీకి అనేక రకాలుగా ముందస్తుగా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. తుదకు ఆ అక్రమాలను అందరూ కళ్లారా చూడటంతో కొందరు అధికారులను సస్పెండ్ చేశారని, మరికొందరిని మార్చారని చెప్పారు. తద్వారా తప్పు జరిగిందనే భావన సర్వత్రా వ్యాపించిందన్నారు.

రీ పోలింగ్ పిటిషన్‌పై నేడు విచారణ

పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం ముప్పాళ్ల మండలం నార్నెపాడులో 236, 237 పోలింగ్ కేంద్రాలు, దమ్మాలపాడులోని 253, 254 పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ నాయకులు రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. వెబ్ కెమెరాలను పరిశీలించి రీ పోలింగ్ జరపాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. వారు పట్టించుకోక పోవడంతో రీ పోలింగ్ జరపాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈసీ, సీఈఓ సహా ఐదుగురిని ప్రతివాదులుగా చేర్చారు. దీనిపై హైకోర్టులో గురువారం విచారణ జరగనుంది.

'గేటు'లో గూండాగిరి

- పాల్వాయి గేటులో ఓటర్లను బెదిరించి పచ్చమూకల రిగ్గింగ్
- వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను చితకబాది బూత్‌ల నుంచి ఈడ్చివేత
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళలపై పోలింగ్ బూత్‌ల్లో దౌర్జన్యం
- పార్టీ నేతల సమాచారంతో అక్కడకు చేరుకున్న ఎమ్మెల్యే పిన్నెల్లి



వీడియోను మొబైల్‌లో రికార్డు చేశారని చెప్పడానికి గల ఆధారాలు..

సాక్షి, నరసరావుపేట / రెంటచింతల: మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంను ధ్వంసం చేశారని చెబుతున్న పాల్వాయి గేటులోని పోలింగ్ బూత్‌లో ఆ రోజు అసలు ఏం జరిగిందన్నది కీలకంగా మారింది. మే 13న రెంటచింతల మండలం పాల్వాయిగేటు 201, 202 పోలింగ్ బూత్‌లలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలను బెదిరించి టీడీపీ గూండాలు భయానక వాతావరణం సృష్టించారు. పోలింగ్ సజావుగా జరగకుండా అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారితోపాటు పల్నాడు కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేసేందుకు పిన్నెల్లి పలుసార్లు ఫోన్ చేసినా వారు స్పందించలేదు. తమ పార్టీ పోలింగ్ ఏజెంట్లను పోలింగ్ కేంద్రం నుంచి బయటకు లాక్కొచ్చి దాడులు చేయడంతోపాటు టీడీపీ నేతలు రిగ్గింగ్ చేస్తున్నారనే సమాచారం అందడంతో పిన్నెల్లి అక్కడకు చేరుకున్నట్లు చెబుతున్నారు. యథేచ్ఛగా జరుగుతున్న రిగ్గింగ్‌ను ఆయన ప్రతిఘటించారు. ఈ క్రమంలో వాగ్వాదం చోటు చేసుకుంది. అయితే పచ్చ ముఠాలు పల్నాడు ప్రాంతంలో దాదాపు ఏడు చోట్ల ఈవీఎంల విధ్వంసాలకు తెగబడగా దీన్ని అడ్డుకున్న పిన్నెల్లి వీడియోను మాత్రమే బహిర్గతం చేయడం వెనుక కుట్రకోణం ఉన్నట్లు స్పష్టమవుతోంది.

ఈసీకి మొర పెట్టుకున్నా...

పాల్వాయిగేట్, తుమృకోట, ఒప్పిచర్ల, చింతలపల్లి పోలింగ్ కేంద్రాలలో గతంలో పలుమార్లు టీడీపీ నేతలు రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. ఆయా కేంద్రాలలో పటిష్ట బందోబస్తు కల్పించి ఎన్నికలు సజావుగా సాగేలా చూడాలని పిన్నెల్లి పలు దఫాలు ఈసీ, కలెక్టర్, ఎస్పీలను అభ్యర్థించినా స్పందించలేదు. పోలింగ్ రోజు కూడా రెండుసార్లు ఈసీకి మొర పెట్టుకున్నా ఫలితం శూన్యం. పాల్వాయి గేట్ పోలింగ్ కేంద్రంలో టీడీపీ అరాచకాలకు సహకరించేందుకు 50 ఏళ్లకు పైగా వయసున్న పోలీసు కానిస్టేబుల్‌కే విధులు కేటాయించారు.

ఆ వీడియో వెనుక అసలు నిజాలు..

- మే 13న పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా ఓటర్లను టీడీపీ మూకలు అడ్డుకున్నాయి.
- పాల్వాయి గేట్‌లోని అన్ని బూత్‌లను ఆక్రమించి పచ్చ ముఠాలు రిగ్గింగ్‌కు పాల్పడ్డాయి.
- బ్రహ్మారెడ్డి కుట్రలను ముందే పసిగట్టి మే 11న పిన్నెల్లి ఈసీకి లేఖ రాశారు.
- సమస్యాత్మక ప్రాంతమైన మాచర్లలో భారీగా పోలీసులను మోహరించాలని పిన్నెల్లి కోరారు.
- టీడీపీ అరాచకాలకు పాల్పడినందున రీ పోలింగ్ నిర్వహించాలని లేఖలో పిన్నెల్లి కోరారు.
- ప్రజాస్వామ్యాన్ని టీడీపీ ఖూనీ చేసినందున రీ పోలింగ్ జరపాల్సిందేనని అభ్యర్థిస్తూ పిన్నెల్లి మరో లేఖ రాశారు.
- టీడీపీ కుట్రలపై మే 11న ఒక లేఖ, పోలింగ్ జరిగిన మే 13న రెండు లేఖలను పిన్నెల్లి ఈసీకి రాశారు.
- 11 చోట్ల ఈవీఎంలు ధ్వంసం అయినట్లు ఎన్నికల అధికారి ప్రెస్ మీట్ నిర్వహించి మరీ చెప్పారు.
- టీడీపీ గూండాలు 10 చోట్ల ఈవీఎంలను ధ్వంసం చేసే ఆ వీడియోలను ఎందుకు బయట పెట్టలేదు?
- నారా లోకేష్ ఫిర్యాదుతో 8 రోజుల తరువాత ఒక వీడియో విడుదల చేసి అరెస్టుకు ఆదేశాలిచ్చారు.

దాడి చేసి.. రిగ్గింగ్

202 పోలింగ్ బూత్‌లోకి టీడీపీ నేతలు పెద్ద సంఖ్యలో ప్రవేశించి నాతో పాటు దేరంగుల శ్రీను, చల్లా సుబ్బయ్యలపై దాడి చేశారు. చితకబాది పోలింగ్ బూత్ బయటకు లాక్కొచ్చారు. అనంతరం టీడీపీ నేతలు రిగ్గింగ్ చేశారు. అక్కడున్న పోలీసులు, పోలింగ్ అధికారులు ఏమాత్రం అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. దీంతో మేం పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చాం. అక్కడకు వచ్చిన పిన్నెల్లి, ఆయన అనుచరులపై పచ్చమూకలు దాడులకు పాల్పడ్డాయి.

–చింతా సుబ్బారావు, ఇన్‌చార్జి సర్పంచ్, వైఎస్సార్ సీపీ ఏజెంట్, పాల్వాయి గేట్

వైఎస్సార్ సీపీ ఏజెంట్లను చితకబాది..

పాల్వాయి గేట్ కేంద్రంలో వైఎస్సార్ సీపీ పోలింగ్ ఏజెంట్లుగా ఉన్న చింతా సుబ్బారావు, దేరంగుల శ్రీను, చల్లా సుబ్బయ్యలను టీడీపీ నేతలు కొట్టి బయటకు ఈడ్చేశారు. ఓటు వేయడానికి క్యూలో నిలబడ్డ మహిళలను భయకంపితుల్ని చేసి తరిమేశారు. అనంతరం అక్కడ టీడీపీ నేతలు యథేచ్ఛగా రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. స్థానికులతో కలసి మరోసారి దీన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలింగ్ ఏజెంట్లపై విచక్షణారహితంగా దాడి చేయడంతో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దృష్టికి తెచ్చారు. దీంతో అక్కడకు చేరుకున్న పిన్నెల్లి రిగ్గింగ్‌ను ప్రతిఘటించారు. దీన్ని అడ్డుకోవాలని పోలింగ్ అధికారులను అభ్యర్థించారు. టీడీపీ మూకల అరాచకాలను ఎన్నికల అధికారుల దృష్టికి తెచ్చినా స్పందించలేదు. పిన్నెల్లి కుమారుడు గౌతమ్‌రెడ్డి, డ్రైవర్ అంజిరెడ్డి, మరికొందరిపై టీడీపీ నేతలు దాడులు చేసి తీవ్రంగా గాయపరిచారు. పిన్నెల్లి కాన్వాయ్‌లోని వాహనాలను ధ్వంసం చేశారు. ఓటర్లు, ఏజెంట్లను భయపెట్టి రిగ్గింగ్ చేస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు.

ఆ వీడియో ఒక్కటే.. వారం తరువాత

మాచర్ల నియోజకవర్గంలో పోలింగ్ రోజు మొత్తం ఏడు ఈవీఎంలు ధ్వంసమయ్యాయి. ఒక్క పాల్వాయి గేటు వీడియో మినహా మిగతావి ఏవీ బయటకు రాలేదు. అది కూడా వారం తరువాత తాపీగా విడుదల చేయడంపై సందేహాలు ముసురుకుంటున్నాయి. ఈవీఎంలు ధ్వంసమైన మిగిలిన ఆరు వీడియోలను ఎన్నికల సంఘం ఇప్పటికీ బయట పెట్టకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీడియోను తాము రిలీజ్ చేయలేదని పోలీసులు, రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. పలువురు అధికారులపై సస్పెన్షన్ వేటు పడిన తరువాత విదేశాల్లో గడుపుతున్న నారా లోకేష్ 'ఎక్స్' ఖాతా నుంచి వీడియో పోస్టు కావడం గమనార్హం. ఈసీ ఆధీనంలో ఉండాల్సిన వీడియో లోకేష్ చేతికి ఎలా వచ్చిందనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఈసీ వ్యవహరించిన తీరు కూడా వివాదాస్పదంగా మారింది. పాల్వాయి గేట్ పోలింగ్ బూత్‌లో టీడీపీ మూకలు రిగ్గింగ్ చేస్తుంటే ఎందుకు స్పందించలేదు? ఓటర్లను భయభ్రాంతులకు గురి చేస్తున్నా ఏమి పట్టనట్లు వ్యవహరించడం ఏమిటి? ఫిర్యాదులు అందినా ఎందుకు పట్టించుకోలేదు? అనే ప్రశ్నలకు ఈసీ జవాబు చెపాల్సి ఉంది. మాచర్ల నియోజకవర్గంలో వంద శాతం వెబ్ కాస్టింగ్ జరుగుతోంది. 202 పోలింగ్ బూత్‌లో ఏం జరుగుతోందో ఎప్పటికప్పుడు తెలిసినా ఉదాశీనంగా ఉండటంపై అనుమానాలు ముసురుకుంటున్నాయి.

తుమృకోటలో దాడులు.. ఈవీఎంలు ధ్వంసం

రెంటచింతల మండలం తుమృకోటలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన ఎస్సీ, ముస్లిం మైనార్టీలపై టీడీపీ నేతలు దాడి చేశారు. 203, 204, 205 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలను ధ్వంసం చేశారు. రీపోలింగ్ జరపకుండా సాయంత్రం 4 గంటల సమయంలో కొత్త ఈవీఎంలతో తిరిగి పోలింగ్ కొనసాగించారు. ఆ సమయంలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు లేకుండా రిగ్గింగ్ చేశారు. ఈ వీడియోలను ఎన్నికల సంఘం బయటపెట్టలేదు. కారంపూడి మండలం ఒప్పిచర్లలో వైఎస్సార్‌సీపీ పోలింగ్ ఏజెంట్ పాలకీర్తి శ్రీనివాసరావుపై టీడీపీ అగ్రవర్ణ నేతలు దాడి చేసి పోలింగ్ కేంద్రం నుంచి ఈడ్చేసి అక్రమ కేసు బనాయించారు.

పల్నాడు గ్రామాల్లో టీడీపీ దురాగతాలు..

- మాచర్ల రూరల్ మండలం: కొత్తూరు, కంభంపాడు, భైరవునిపాడు
- రెంటచింతల: రెంటాల, జెట్టిపాలెం, పాలవాయిగేటు, గోలి, మిట్టగుడిపాడు
- కారంపూడి: ఒప్పిచర్ల, కారంపూడి, పేటసన్నెగండ్ల, చింతపల్లి
- దుర్గి: ముటుకూరు, అడిగొప్పల, పోలేపల్లి
- వెల్దుర్తి: లోయపల్లి, వెల్దుర్తి, వజ్రాలపాడు, గొట్టిపాడు, నర్సపెంట
- గురజాల: కేసానుపల్లి, మాదినపాడు, ఇరిగేపల్లి, తంగెడ, కొత్తగణేశునిపాడు, మాచవరం, బ్రాహ్మణపల్లి, పెదఅగ్రహారం, జానపాడు.
- నరసరావుపేట: నరసరావుపేట పట్టణం, దొండపాడు, పమిడిపాడు.
- సత్తెనపల్లి: పాకాలపాడు, మాదల, తొండపి, చాగంటివారిపాలెం, నార్నెపాడు, గణపవరం, చీమలమర్రి, రూపెనగుండ్ల, గుండ్లపల్లి, కుంకలగుంట, చేజర్ల.
- వినుకొండ: నూజెండ్ల, రెడ్డికొత్తూరు, బొల్లాపల్లి, కొచ్చర్ల, గంటావారిపాలెం.
- పెదకూరపాడు: ఎర్రబాలెం, లగడపాడు, చంద్రాజుపాలెం, మాదిపాడు.
- చిలకలూరిపేట: అప్పాపురం

ఈసీ డేటా భద్రమేనా?

సాక్షి, నరసరావుపేట: పాల్వాయి గేట్ పోలింగ్ బూత్‌లో ఈవీఎం ధ్వంసం వీడియోపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిజంగా అది సీసీ ఫుటేజేనా? లేక మార్ఫింగ్ చేసిన వీడియోనా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. వీడియో కుడివైపు పైభాగంలో మొబైల్ 5జీ సిగ్నల్, 65 శాతం బ్యాటరీ పర్సంటేజ్, అలారం ఇండికేషన్స్ కనిపించడం గమనార్హం. వీడియోలో మొత్తం నిడివి 23.52 గంటలు ఉండగా 12.06 గంటల వద్ద తమకు అవసరమైన మేరకు రెండు నిమిషాల పాటు మొబైల్‌లో రికార్డు చేసినట్టు స్పష్టమవుతోంది. ఎంతో భద్రంగా ఉండాల్సిన పోలింగ్ వెబ్ కాస్టింగ్ సమాచారం బయటకు వెళ్లడంపై సందేహాలు అలుముకుంటున్నాయి. ఈ వీడియో తొలుత నారా లోకేష్ ఎక్స్ ఖాతా, టీడీపీ సోషల్ మీడియా గ్రూప్‌లలో కనిపించింది. అంటే వారి ద్వారానే బయటకు వచ్చినట్టు తేలిపోతోంది. గ్రాఫిక్స్‌కు పెట్టింది పేరైన పచ్చ ముఠాల వీడియోను నిర్ధారించుకోకుండా, ఎలా బయటకు వచ్చిందనే విషయాన్ని పట్టించుకోకుండా ఈసీ కేసు నమోదుకు ఆదేశించడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

53 గ్రామాల్లో దాడులు

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి / సాక్షి, నరసరావుపేట: పల్నాడులోని 53 గ్రామాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులపై, ఇళ్లపై టీడీపీ మూకలు దాడులకు తెగబడ్డాయి. ఆస్తులను ధ్వంసం చేశాయి. పోలింగ్ నాడు టీడీపీ నాయకులు హింసాకాండకు పథకం రూపొందించినట్లు మంత్రి అంబటి, పిన్నెల్లి తదితరులు ఎన్నికల యంత్రాంగానికి ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా స్పందించలేదు.

క్లుప్తంగా...

803 వాహనాల జప్తు.. 12 మంది అరెస్ట్

ఓట్ల లెక్కింపు నేపథ్యంలో విస్తృతంగా తనిఖీలు

సాక్షి, అమరావతి: ఓట్ల లెక్కింపు సక్రమంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకుగాను పోలీసు యంత్రాంగం రాష్ట్రవ్యాప్తంగా అసాంఘిక శక్తులను గుర్తించేందుకు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తోంది. కార్డన్- సెర్చ్ ఆపరేషన్లలో భాగంగా ఇప్పటివరకు రాష్ట్రంలో 168 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి ఎటువంటి పత్రాలు లేని 803 వాహనాలను జప్తు చేసింది. 185 లీటర్ల సారాయి, 18.94 లీటర్ల అక్రమ మద్యం, ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తీసుకువచ్చిన 107 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుంది. నేర చరిత్ర కలిగిన 12 మందిని బుధవారం అరెస్ట్ చేసింది. అసాంఘిక శక్తుల కదలికల గురించి టోల్‌ఫ్రీ నంబర్లు 100, 102లకు సమాచారం అందించాలని పోలీసు శాఖ ప్రజలను కోరింది.

దేశానికే ఆదర్శం వైఎస్ జగన్

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



గుడ్లవల్లేరు (గుడివాడ): మాట తప్పని ప్రజా నాయకుడిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి పెద్దపీట వేసి దేశానికే ఆదర్శంగా నిలిచారని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన నాటినుంచి ఈనాటి వరకు ఏనాడూ ఓట్ల కోసం కాకుండా ఎన్నికలతో సంబంధం లేకుండా ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసమే ఆయన పనిచేస్తున్నారని తెలిపారు. అందుకే జగన్‌తో పాటు ఆయన పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు రూ.10 వేల కోట్లకు పైగా డీబీటీ ద్వారా అందితే సీఎం జగన్‌పై రాష్ట్రంలో వచ్చే అమితమైన ప్రజాదరణతో ఓట్లు వేస్తారన్న కుటిలత్వంతో కొన్ని ప్రజావ్యతిరేక శక్తులు కుట్రలు చేశాయని విమర్శించారు. ఎన్నికల అనంతరం ఆ నిధులను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేశారన్నారు. ఎన్నికలకు ముందయినా.. ప్రభుత్వం వచ్చాక అయినా సరే... పేదల సంక్షేమాన్ని చూసుకునేది జగనన్న ప్రభుత్వమేనని స్పష్టం చేశారు.

పిన్నెల్లి వీడియో టీడీపీ ట్విట్టర్‌కు చేరడంపై సమగ్ర దర్యాప్తు చేయాలి

నరసరావుపేట: మాచర్ల శాసనసభ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వీడియో టీడీపీ ట్విట్టర్ హ్యాండిల్ నుంచి ఎందుకు సర్క్యులేట్ అయింది? వారికి ఈ వీడియో ఎలా చేరింది? అన్న దానిపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి ఎలక్షన్ చీఫ్ ఏజెంట్ అయిన కాకుమాను బాలహనుమంత రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి పోలింగ్ రోజు మాట్లాడుతూ అక్కడక్కడ ఈవీఎంల డేటా భద్రంగా ఉందని, రీపోలింగ్ అవసరం లేదని చెప్పారని పేర్కొన్నారు. కానీ పది రోజుల తర్వాత కూడా ఎక్కడెక్కడ ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు ధ్వంసం చేశారు? ధ్వంసం చేసిన వారి మీద ఏ చర్యలు తీసుకున్నారనేది ఈ రోజు కూడా ముఖ్య ఎన్నికల అధికారి, ఆ జిల్లాల ఎన్నికల అధికారులు ఎందుకు తెలియ పరచట్లేదని ప్రశ్నించారు. ఒక్క పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వీడియో ఎలా బయటికి వచ్చిందని ప్రశ్నించారు. వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయడంపై ఉపయోగమేంటి? దానిని మానిటర్ చేస్తున్న అధికారులు ఏ చర్యలు తీసుకోకుండా ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు.

కౌంటింగ్ లోపు నిందితుల అరెస్టు

తాడిపత్రి అర్బన్: ఎన్నికల సందర్భంగా అల్లర్లకు పాల్పడిన కేసుల్లో నిందితులందరినీ ఓట్ల లెక్కింపునకు ముందే అరెస్టు చేసేలా 'సిట్' విచారణను వేగవంతం చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశానుసారం నియమితులైన సిట్ సభ్యులు ఇప్పటికే తొలి దఫా విచారణ పూర్తి చేశారు. రెండో దఫా విచారణలో బుధవారం తాడిపత్రి నియోజకవర్గంలోని అన్ని పోలీసు స్టేషన్ల ఎస్సైలతో రూరల్ స్టేషన్‌లో సమావేశమయ్యారు. ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు, గుంటూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ వి. భూషణం, ఏసీబీ ఇన్‌స్పెక్టర్ జీఎల్ శ్రీనివాస్ తదితర అధికారులతో కూడిన బృందం పోలీసు స్టేషన్ల వారీగా ఎస్సైల నుంచి అల్లర్ల పూర్తి సమాచారాన్ని సేకరించింది. పట్టణంలో అల్లర్లు జరిగిన ప్రాంతాలను 'సిట్' సభ్యులు బుధవారం మరోసారి పరిశీలించారు.

ఎమ్మెల్యే పిన్నెల్లిపై 10 సెక్షన్లు

సాక్షి, నరసరావుపేట: మాచర్ల నియోజకవర్గం రెంటచింతల మండలం పాల్వాయి గేట్ పోలింగ్ బూత్ 202లో ఈవీఎంను ధ్వంసం చేశారనే ఆరోపణలపై ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై 143, 147, 353, 427, 448, 452, 120బీ ఐపీసీ సెక్షన్లు, ఆర్పీ చట్టం 131, 135 రెడ్ విత్ 149 సెక్షన్ల కింద కేసు నమోదైంది. పోలీసులు పిన్నెల్లిని అరెస్ట్ చేశారని ప్రచారం జరుగుతున్నప్పటికీ, పోలీసులు అధికారికంగా ధ్రువీకరించలేదు. మరోవైపు తుమ్మకోటలో పోలింగ్ బూత్‌లలో నాలుగు ఈవీఎంలను ధ్వంసం చేసిన ఘటనపై ఐదుగురు టీడీపీ నేతలు, జెట్టిపాలెం పోలింగ్ బూత్‌లో ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనలో మరో ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని నరసరావుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆశీర్వాదం పాల్ ముందు మంగళవారం రాత్రి ప్రవేశ పెట్టగా రిమాండ్ విధించారు.

కుట్ర విఫలం వల్లే రాద్ధాంతం

ఘోర ఓటమి భయంతో టీడీపీ నేతల దారుణకాండ

- వైఎస్సార్‌సీపీకి దన్నుగా నిలిచే వర్గాల వారు ఓట్లు వేయకుండా అడ్డుకునే కుట్ర
- పల్నాడు, తాడిపత్రి, జమ్మలమడుగు, చంద్రగిరి సహా రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ రోజున అల్లర్లు
- పోలింగ్ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను బయటకు నెట్టి రిగ్గింగ్ చేసిన టీడీపీ రౌడీలు
- వెబ్ కాస్టింగ్‌లో అరాచకపర్వం స్పష్టంగా కన్పిస్తున్నా పట్టించుకోని ఎన్నికల అధికారులు
- టీడీపీ మూక రిగ్గింగ్‌ను అడ్డుకునేందుకు యత్నించిన మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి
- పోలింగ్ రోజున తమ కుట్ర విఫలమవడంతో టీడీపీ అండ్ గ్యాంగ్ యాగీ



కొత్తగణేశునిపాడులో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల వాహనాలు ధ్వంసం చేసిన టీడీపీ మూకలు



సత్తెనపల్లిలో టీడీపీ శ్రేణుల విధ్వంసం



టీడీపీ గూండాల దాడిలో గాయపడిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కుమారుడు గౌతమ్‌రెడ్డి (ఫైల్)



రెంటచింతల మండలం తుమ్మకోటలో ఈవీఎంలు పగలగొట్టిన టీడీపీ గూండాలు(ఫైల్)



మాచర్ల నియోజకవర్గం ఒప్పిచర్ల పోలింగ్ బూత్‌లో ఎస్టీ యువకుడు పాలకీర్తి శ్రీనివాసరావుపై దాడి చేస్తున్న టీడీపీ రౌడీలు(ఫైల్)

సాక్షి, అమరావతి: ఏ విధంగా అయినా సరే పోలింగ్ రోజు పరిస్థితిని తనకు అనుకూలంగా మలుచుకోవడానికి టీడీపీ తొక్కని అడ్డదారులంటూ లేవు. గూండాయిజం, దౌర్జన్యం, బెదిరింపులు, రిగ్గింగ్.. ఇలా అన్ని విధాలా అక్రమాలకు పాల్పడింది. ఎక్కడైనా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గట్టిగా ప్రతిఘటిస్తే ఈసీ అండతో పోలీసులను అడ్డుపెట్టుకుని ఎదురు దాడులు చేస్తూ.. 'పచ్చ' మూక ఎదురు కేసులు పెడుతోంది. నానా యాగీ చేస్తూ రాద్ధాంతం చేస్తోంది. మీ బిడ్డ ప్రభుత్వం వల్ల మీ కుటుంబానికి మంచి జరిగి ఉంటే 'ఫ్యాన్' గుర్తుపై రెండు బటన్లు నొక్కి.. ఓటు వేసి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన విజ్ఞప్తికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదలు భారీ ఎత్తున స్పందిస్తుండటంతో సార్వత్రిక ఎన్నికల్లో కూటమికి ఘోర పరాజయం ఖాయమని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఆందోళనకు గురై ధ్వంస రచనకు తెరలేపారు. పోలింగ్ రోజున విధ్వంసం సృష్టించడం ద్వారా మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, అగ్రవర్ణ పేదలు ఓట్లు వేసేందుకు బయటకు రాకుండా చేయాలని కుట్ర పన్నారు. ఆ కుట్రలో భాగంగానే పోలింగ్ రోజు (ఈనెల 13న) ఉదయం నుంచే రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ శ్రేణులను గొడవలకు ఉసిగొల్పారు. దీంతో వైఎస్సార్‌సీపీకి ఏకపక్షంగా ఓట్లు పడుతున్న పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ గూండాలు రౌడీయిజానికి దిగారు. పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలు, అగ్రవర్ణ పేదలను ఓటు హక్కు వినియోగించుకోకుండా అడ్డుకున్నారు. కొన్ని చోట్ల ఈవీఎంలను ధ్వంసం చేశారు. టీడీపీ గూండాల దారుణకాండ వెబ్ కాస్టింగ్‌లో లైవ్‌లో స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ ఎన్నికల అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పోలీసు ఉన్నతాధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తూ టీడీపీ గూండాల పైశాచికత్వానికి వత్తాసు పలికారు. టీడీపీ రౌడీల అరాచకాలను అడ్డుకుని.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్, ఎస్పీలకు ఎప్పటికప్పుడు ఫిర్యాదు చేయడానికి ఫోన్‌లు చేసినా, వారు స్పందించలేదు. మాచర్ల నుంచి తాడిపత్రి వరకు అనేక ప్రాంతాల్లో ఇదే పరిస్థితి కనిపించింది.

టీడీపీ రౌడీల దారుణకాండ

మాచర్ల నియోజకవర్గం రెంటచింతల మండలం పాల్వాయిగేటు 201, 202 పోలింగ్ బూత్‌లలో ఓట్లు వేసేందుకు వచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలపై టీడీపీ గూండాలు దాడులకు దిగారు. ఓటు హక్కును వినియోగించుకోనివ్వకుండా వారిని అడ్డుకున్నారు. ఈ అరాచక పర్వం గురించి ఓటర్లు మాచర్ల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పోలింగ్‌ను అడ్డుకుంటున్న టీడీపీ గూండాలపై చర్యలు తీసుకోవాలని ఆ నియోజకవర్గ రిటరినింగ్ అధికారితోపాటు పల్నాడు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు పిన్నెల్లి ఫిర్యాదు చేసేందుకు పదే పదే ఫోన్‌లు చేసినా వారు స్పందించలేదు. దీంతో ఆయా వర్గాల వారికి అండగా నిలిచి.. వారు ఓటు హక్కు వినియోగించుకునేలా చేసేందుకు పిన్నెల్లి పాల్వాయిగేటుకు చేరుకున్నారు. టీడీపీ రౌడీల దారుణకాండను అడ్డుకునే యత్నం చేశారు. తమ కుట్ర విఫలమవడంతో పిన్నెల్లిపై పచ్చమూక దుష్ప్రచారం చేస్తోంది.

బడుగులపై దాడులు.. ఈవీఎంల ధ్వంసం

మాచర్ల నియోజకవర్గం కారంపూడి మండలం ఒప్పిచర్లలో పోలింగ్ బూత్ 251లో ఓటు వేసేందుకు వచ్చిన ఎస్టీ వర్గానికి చెందిన పాలకీర్తి శ్రీనివాసరావుపై టీడీపీ రౌడీలు దాడి చేసి, చితకబాదారు. భయోత్పాతం సృష్టించడం ద్వారా ఆ పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లను బెదరగొట్టాలని కుట్ర చేశారు. మాచర్ల మండలం తుమ్మురుకోటలోని 203, 204, 205, 206 పోలింగ్ బూత్‌లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలు, అగ్రవర్ణ పేదలు ఏకపక్షంగా ఓట్లు వేస్తుండటంతో టీడీపీ గూండాలు జీర్ణించుకోలేకపోయారు. ఎలాగైనా సరే ఆ ఓట్లను చెల్లకుండా చేయాలనే లక్ష్యంతో పోలింగ్ కేంద్రంలోకి చొరబడి ఆ నాలుగు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలను ధ్వంసం చేశారు. తాడిపత్రిలో పోలింగ్ సజావుగా జరగకుండా విఘాతం కల్పించడానికి జేసీ ప్రభాకర్‌రెడ్డి నేతృత్వంలో టీడీపీ గూండాలు కవ్వింపు చర్యలకు దిగుతూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి, కార్యకర్తలపై రాళ్ల దాడికి దిగారు. పోలీసులు మాత్రం ప్రేక్షక పాత్ర పోషించారు. జమ్మలమడుగు నవాజ్ కట్టలోని 116, 117 పోలింగ్ బూత్‌ల వద్ద పోలింగ్‌ను అడ్డుకోవడానికి బీజేపీ అభ్యర్థి ఆదినారాయణ రెడ్డి, కడప లోక్‌సభ టీడీపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి కవ్వింపు చర్యలకు దిగుతూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సుధీర్‌రెడ్డిపై రాళ్ల దాడికి దిగారు. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలోని తేలప్రోలు జెడ్పీ హైస్కూల్‌లో ఉన్న 271, 273, 274, 275 పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ ప్రక్రియకు విఘాతం కల్పించడానికి టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు నేతృత్వంలోని పచ్చమంద బరి తెగించింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వల్లభనేని వంశీ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను కవ్విస్తూ దాడికి దిగి భయోత్పాతం సృష్టించింది.

'రిగ్గింగ్' వదిలేసి అడ్డుకుంటే కేసులా?



- గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ధ్వజం
- పాల్వాయిగేట్‌లో యథేచ్ఛగా టీడీపీ రిగ్గింగ్
- మా ఏజెంట్లను బయటకు లాగి దాడి చేశారు
- రిగ్గింగ్‌ను అడ్డుకుని ప్రతిఘటించిన పిన్నెల్లిపై కేసులా?
- అక్కడ ఆ రోజు ఉదయం నుంచి వీడియోలన్నీ బయటపెట్టాలి
- పల్నాడులో ఈవీఎంల ధ్వంసాలపై వీడియోలన్నీ ఈసీ విడుదల చేయాలి
- అక్రమ కేసులతో మాచర్లలో మా విజయాన్ని ఆపలేరు

నరసరావుపేట: ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ యథేచ్ఛగా రిగ్గింగ్‌కు పాల్పడిన వారిని వదిలేసి అడ్డుకున్న వారిపై ఈసీ కన్నెర్ర చేయడం ఏమిటని గురజాల ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై ఇష్టానుసారంగా నోరు పారేసుకుంటున్నారని మండిపడ్డారు. బుధవారం నరసరావుపేటలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు కూడా పిన్నెల్లి నాలుగు సార్లు ప్రజాబలంతో ఎమ్మెల్యేగా గెలిచారని గుర్తు చేశారు. ఈవీఎం ఘటనను పదేపదే చూపిస్తున్న టీడీపీ అనుకూల మీడియా అదేచోట వైఎస్సార్ సీపీ ఏజెంట్లపై జరిగిన దాడులను ఎందుకు దాచి పెడుతోందని నిలదీశారు.

మిగతా వాటి సంగతేంటి?

ఒక్క ఈవీఎం ఘటనను చూపిస్తూ పిన్నెల్లి నిందితుడిగా చేర్చారు. మరి పల్నాడులో పలుచోట్ల ఈవీఎంలు ధ్వంసమైతే ఆ వీడియోలను ఎందుకు బయట పెట్టడం లేదు? టీడీపీ నేతలు దౌర్జన్యాలకు తెగబడి ఈవీఎంలను పగులకొట్టిన వీడియోలు ఎందుకు బహిర్గతం చేయడం లేదు? పోలింగ్ కేంద్రాల్లో వీడియో కెమెరాలు అమర్చిన ఈసీ పది రోజులుగా మేం ఘోషిస్తున్నా ఎందుకు స్పందించలేదు?

రిగ్గింగ్ జరగలేదని నిరూపించాలి..

మాచర్లలో ఈసీకి ఇప్పటి వరకు ఎన్ని ఫిర్యాదులొచ్చాయి? వాటిపై ఏం చర్యలు తీసుకున్నారో వెల్లడించాలి. పాల్వాయి గేటుతో సహా మేం చెబుతున్న చోట్ల రిగ్గింగ్ జరగలేదని వెబ్ కెమెరా వీడియోలను బయటపెట్టి నిరూపించగలరా? ప్రజాస్వామ్య వ్యవస్థలో దీన్ని నివృత్తి చేయాల్సిన బాధ్యత ఈసీదే.

కొత్త గణేశునిపాడులో మహిళల నిర్బంధం

పోలింగ్ రోజు మాచవరం మండలం కొత్త గణేశునిపాడులో అర్ధరాత్రి యాదవులు, ఎస్సీల ఇళ్లపై టీడీపీ మూకలు దాడులకు దిగి స్వైరవిహారం చేశాయి. మహిళలు ప్రాణభయంతో 24 గంటల పాటు ఓ దేవాలయంలో తల దాచుకుంటే ఇరువర్గాలపై కేసులు పెడతారా? ఇదేనా ఈసీ చేసే న్యాయం? పోలింగ్‌కు ముందు పల్నాడులో పోలీసు ఉన్నతాధికారులను బదిలీ చేసిన ఈసీ ఆ స్థానంలో తాను నియమించిన వారు విధుల్లో అలసత్వం ప్రదర్శించారంటూ సస్పెండ్ చేసింది. ఈసీ నియమించిన అధికారులే సస్పెండ్ అయ్యారంటే ఎవరు విఫలమైనట్లు?

రీపోలింగ్‌కు హైకోర్టుకెళ్లి పోరాడతాం..

ఎన్నికల కమిషన్‌కు వైఎస్సార్ సీపీ అందించిన ఫిర్యాదులన్నింటికీ సమాధానం చెప్పాల్సిందే. రిగ్గింగ్ జరిగినట్లు మేం ఫిర్యాదు చేసిన ప్రతి పోలింగ్ కేంద్రం వీడియోలను ఎన్నికల కమిషన్ బహిర్గతం చేయాల్సిందే. అధికారుల నియామకాలు, ఆ తర్వాత వారిని సస్పెండ్ చేయడం, ఎన్నికల ప్రక్రియలో లోపాలపై కచ్చితంగా హైకోర్టును ఆశ్రయిస్తాం. రీపోలింగ్ నిర్వహించేలా పోరాటం చేస్తాం. రిగ్గింగ్ ఆరోపణలు వచ్చిన చోట వెబ్ కెమెరాలను తనిఖీ చేసి రీపోలింగ్ నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉంది. పాల్వాయిగేట్ పోలింగ్ కేంద్రంలో టీడీపీ నేతలు, ఏజెంట్లు కలసి రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. వైఎస్సార్ సీపీ ఏజెంట్లను బయటకు లాగి దాడి చేయడంతో పిన్నెల్లి అక్కడకు చేరుకుని తీవ్రంగా ప్రతిఘటించారు. మేం చెప్పేది నిజం కాకుంటే పూర్తి నిడివి వీడియోలను ఈసీ బయట పెట్టాలి. పిన్నెల్లి నాలుగు సార్లు ప్రజాస్వామ్యబద్ధంగా మాచర్ల ఎమ్మెల్యేగా గెలిచారు. ఐదోసారి కూడా కచ్చితంగా విజయం సాధిస్తారు. నలుగురు అధికారులను మేనేజ్ చేసి ఎడిటెడ్ వీడియోలు లీక్ చేసినంత మాత్రాన భయపడే ప్రసక్తే లేదు. ఇలాంటి రాజకీయాలు చాలా చూశాం.

బాబు నోట నీతులా..?

నరసరావుపేటలో కోడెల ఇంట్లో బాంబులు తయారు చేస్తుండగా నలుగురు చనిపోతే ఆయనకు మంత్రివర్గంలో స్థానం కల్పించిన చంద్రబాబు నీతులు చెబుతున్నారు. ఏడుగురి హత్య కేసులో నిందితుడైన మాచర్ల టీడీపీ అభ్యర్థి బ్రహ్మారెడ్డిపై ఏ 1గా ఎఫ్ఐఆర్ నమోదు చేయించిన చంద్రబాబు ఇప్పుడు అదే వ్యక్తికి పార్టీ టికెట్ ఇచ్చారు. ఫ్యాక్షనిజం, ఫ్యాక్షన్ లీడర్లను ప్రోత్సహించేది చంద్రబాబేనని అందరికీ తెలుసు.

'గేట్' వీడియోలన్నీ బయట పెట్టాలి..

మాచర్ల నియోజకవర్గంలోని తుమ్మకోట, వెల్దుర్తి, చింతపల్లి, వేపకంపల్లె, ఒప్పిచర్లలో టీడీపీ నేతలు యథేచ్ఛగా రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. వైఎస్సార్ సీపీ ఏజెంట్లను బూత్‌ల నుంచి బయటకు లాక్కెళుతున్న వీడియోలను ఎన్నికల కమిషన్ దృష్టికి తెచ్చాం. పాల్వాయిగేట్‌లో మా పార్టీ ఏజెంట్లను పోలింగ్ కేంద్రాల నుంచి బయటకు లాక్కెళ్లి కొడుతుంటే పిన్నెల్లి రిగ్గింగ్‌ను అడ్డుకునేందుకు వెళ్లారు. ఈవీఎం ధ్వంసం ఘటనకు ముందు రెండు మూడు గంటల పాటు సాగిన టీడీపీ మూకల దౌర్జన్యాలు, విధ్వంసకాండను ఎందుకు బయట పెట్టడం లేదు? అక్కడ ఉదయం నుంచి జరిగిన ఘటనల వీడియోలన్నీ బహిర్గతం చేయాలి.

మరీ ఇంత 'పచ్చ'పాతమా!

- ఈవీఎంలు ధ్వంసం చేసిన కేసుల్లో వివాదాస్పదంగా ఈసీ తీరు
- దర్శిలో ఈవీఎం పగలగొట్టిన టీడీపీ నేతపై చర్యలు నామమాత్రం

దర్శి: రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ వ్యవహార శైలి వివాదాస్పదంగా మారుతోంది. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ నెల 13వ తేదీన పోలింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఈవీఎంలు ధ్వంసం చేసిన కేసుల్లో ఈసీ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందన్న ఆరోపణలకు దర్శి ఘటన బలం చేకూరుస్తోంది. పల్నాడు జిల్లా మాచర్లలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎం ధ్వంసం చేశారంటూ వచ్చిన ఫిర్యాదుపై 10 రకాల సెక్షన్లు నమోదు చేశారు. దీనికి సంబంధించి ఓ వీడియో పుటేజ్ బయటకు వచ్చింది. ఈ విషయంపై పచ్చ మీడియా చిలువలు పలువలుగా కథనాలు ప్రచురిస్తోంది. ఇదే తరహాలో ప్రకాశం జిల్లా దర్శిలో టీడీపీ నేతలు ఈవీఎంను ధ్వంసం చేశారు. దానిని పగులగొట్టిన టీడీపీ నేత వీసీ రెడ్డిపై తీసుకున్న చర్యలు మాత్రం నామమాత్రం. 13వ తేదీ పోలింగ్ జరుగుతున్న సందర్భంగా దర్శి ఎంఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన బూత్‌లో ఎంపీ అభ్యర్థికి చెందిన ఈవీఎంను టీడీపీ నేత వేమిరెడ్డి చెన్నారెడ్డి(వీసీ రెడ్డి) పగులగొట్టాడు. ఇదే బూత్ సమీపంలో టీడీపీ నేతలు వీరంగం చేయడంతో కొంతసేపు అక్కడ గందరగోళ వాతావరణం నెలకొంది.

నిందితుడికి 41ఏ నోటీసులతో సరి

ఈవీఎంను ధ్వంసం చేసిన కేసులో వీసీ రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, 41ఏ నోటీసులు ఇచ్చారు. పోలీస్ స్టేషన్‌లో కళ్లు తిరుగుతున్నాయని చెప్పగా వీసీ రెడ్డిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రి నుంచి వీసీ రెడ్డి పరారయ్యాడు. 41ఏ నోటీసులు తీసుకున్న వ్యక్తి పోలీసుల అనుమతి లేకుండా గ్రామం విడిచి వెళ్లకూడదు. పోలీసుల కళ్లుగప్పి పారిపోయిన నిందితుడు ఒంగోలు రామ్‌నగర్‌లో నివాసముంటున్న టీడీపీ కీలక నేత కుమారుడి వద్ద ఆశ్రయం పొందినట్లు గత పది రోజులుగా ప్రచారం జరిగింది. సదరు నాయకుడి ఒత్తిడి మేరకే వీసీ రెడ్డిపై పోలీస్ అధికారులు ఉదాసీన వైఖరిని అవలంబిస్తున్నారని, చట్ట ప్రకారం కేసులు నమోదు చేయకుండా తాత్సారం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇదిలా ఉండగా.. బుధవారం వీసీ రెడ్డి దర్శిలోని ఓ రెస్టారెంట్‌లో ఉన్న సమయంలో అదుపులోకి తీసుకున్నట్టు పోలీసు వర్గాలు చెబుతుండటం గమనార్హం. ఈవీఎం ధ్వంసం చేసిన విషయం, నరసరావుపేట నుంచి వచ్చిన 150 మంది టీడీపీ గూండాలు దర్శి నియోజకవర్గంలో చేసిన రచ్చను ఉద్దేశపూర్వకంగా దాచేసిన ఎల్లో మీడియా.. వైఎస్సార్‌సీపీ నాయకులపై మాత్రం విషం చిమ్మడాన్ని ఆపడం లేదు.

20నే పిన్నెల్లిపై కేసు నమోదు

- సీఈవో ముఖేష్ కుమార్ మీనా
- మాచర్లలో ఏడు చోట్ల ఈవీఎంలు ధ్వంసం
- ఈవీఎం డేటా భద్రంగా ఉన్నందున రీ పోల్ అవసరం రాలేదు
- భారీ భద్రత మధ్య ఓట్ల లెక్కింపు ప్రక్రియ

సాక్షి, అమరావతి: పోలింగ్ కేంద్రంలో ఈవీఎం విధ్వంసానికి సంబంధించి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై పది సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. బుధవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 20వ తేదీనే ఎమ్మెల్యే పిన్నెల్లిని ఏ 1గా చేరుస్తూ పోలీసులు కోర్టులో మెమో దాఖలు చేశారని తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం పోలీసు అధికారులను బదిలీ చేయడంతో పిన్నెల్లి పేరు ఎఫ్ఐఆర్‌లో చేర్చడంలో ఆలస్యం జరిగిందన్నారు. పోలింగ్ రోజు మొత్తం 9 చోట్ల ఈవీఎంలు ధ్వంసం కాగా మాచర్లలో ఏడు చోట్ల ధ్వంసమైనట్లు చెప్పారు. ఈ ఘటనలన్నింటినీ వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించిన తరువాత ఈవీఎంలలో డేటా భద్రంగా ఉందని తేలడంతో కొత్త వాటితో పోలింగ్ కొనసాగించినట్లు వివరించారు. దీంతో రీపోలింగ్ అవసరం రాలేదన్నారు. అల్లర్లు జరిగే అవకాశం ఉన్నందున మాచర్లలో వెబ్ కాస్టింగ్ జరిగిందన్నారు. ధ్వంసం అయిన ఈవీఎంలను పరిశీలించిన 'బెల్' ఇంజనీర్లు ఈవీఎంల్లో డేటా భద్రంగా ఉందని నిర్ధారించాక పోలింగ్ కొనసాగిందని తెలిపారు. వెబ్ కాస్టింగ్ ద్వారా పోలీసులు విచారణ ప్రారంభించారని, సిట్ ఏర్పాటయ్యాక నివేదిక ఇచ్చారన్నారు. ఈవీఎంలు ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిందన్నారు. పిన్నెల్లిపై ఏడేళ్ల వరకు శిక్ష పడే సెక్షన్లు నమోదయ్యాయని, ఎన్నికల్లో ఆయన గెలిచినా కోర్టు శిక్ష విధించే వరకు పదవిలో ఉంటారని తెలిపారు. ఈవీఎంల ధ్వంసం ఘటనను దాచిపెట్టలేదని, మరుసటి రోజే ఆధారాలను పోలీసులకు అందచేశామని స్పష్టం చేశారు. అల్లర్లు జరగటానికి అవకాశం ఉన్న ప్రాంతాలను ఇప్పటికే గుర్తించామని, భారీ భద్రత మధ్య ఓట్ల లెక్కింపు జరుగుతుందని చెప్పారు.

లెక్క 'ఆత్రం'!

- పక్షం రోజుల్లో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు
- అభ్యర్థుల్లో నరాలు తెగే ఉత్కంఠ
- దగ్గరపడుతోన్న ఓట్ల లెక్కింపు
- గెలుపు ఓటములపై ఎవరి అంచనాల్లో వారు
- గత ఫలితాల పునరావృతంపై వైఎస్సార్ సీపీ ధీమా

సాక్షిప్రతినిధి,కాకినాడ: సార్వత్రిక సమరంలో చివరి అంకం ఓట్ల లెక్కింపునకు కౌంట్ డౌన్ మొదలైంది. అభ్యర్థులంతా గెలుపు ధీమాతో ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. ఫలితాల సమయం దగ్గరపడే కొద్దీ బరిలో ఉన్న ప్రధాన ప్రత్యర్థులు నరాలు తెగే ఉత్కంఠను ఎదుర్కొంటున్నారు. ఈ నెల 13న పోలింగ్ ముగిసిన అనంతరం అభ్యర్థులంతా ఎన్నికల్లో పెట్టిన ఖర్చులపై లెక్కలు వేసుకుంటూ నిన్నమొన్నటి వరకూ బిజీగా గడిపారు. పోలింగ్ ముగిసి, ఓట్ల లెక్కింపునకు మధ్య ఉన్న సమయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మూడొంతులు మంది అభ్యర్థులు టూర్‌లకు వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సారి ఎందుకనో అభ్యర్థులు టూర్‌లకు వెళ్లడంపై అంతగా ఆసక్తి కనబరచలేదు. ఇందుకు ఎవరి కారణాలు వారికి ఉన్నాయి.

అందరూ లెక్కల మాస్టర్లే!

ఓట్ల లెక్కింపునకు మరో పక్షం రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో దాదాపు ప్రధాన ప్రత్యర్థులు గెలుపుపై ఆశాభావంతో పోలింగ్ సరళి ఆధారంగా ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. అభ్యర్థుల మాట అటుంచి ప్రజలు, పార్టీల నేతలు కూడా ఎవరి అంచనాల్లో వారు ఉన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎక్కడైనా నలుగురు కలిస్తే చాలు ఫలితాలపైనే చర్చించుకోవడం కనిపిస్తోంది. ఫలితాల సమయం దగ్గర పడుతున్న కొద్దీ సామాజిక మాధ్యమాల్లో గెలుపు ఓటములపై చర్చోపచర్చలు హోరెత్తిస్తున్నారు. నియోజకవర్గాల వారీగా ఎక్కడికక్కడ అభ్యర్థుల గెలుపు, ఓటములకే పరిమితం కాకుండా అభ్యర్థికి వచ్చే ఓట్లు, విజేతకు వచ్చే మెజార్టీ...ఇలా ఎవరికి నచ్చినట్టుగా వారు కూడికలు, తీసివేతలతో బిజీగా కనిపిస్తున్నారు. నాలుగైదు సార్వత్రిక ఎన్నికలలో ప్రత్యక్షంగా పాల్గొని రాజకీయాల్లో తలపండిన నాయకులైతే బూత్‌ల వారీగా పోలైన ఓట్ల లెక్కలు దగ్గర పెట్టుకుని మరీ అంచనాలు తయారు చేసుకుంటున్నారు. ఏ బూత్‌లో ఏ సామాజికవర్గ ఓట్లు ఎన్ని ఉన్నాయి, వాటిలో ఏ సామాజికవర్గం బలంగా మద్దతు ఇచ్చింది, ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయి అనే లెక్కలు తీస్తూ ఒక రకంగా అందరూ లెక్కల మాస్టర్లుగా మారిపోతున్నారు.

పెరిగిన ఓటింగ్.. అధికార పార్టీ ధీమా

గతానికి భిన్నంగా ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో పెరిగిన ఓటింగ్ తమకు ప్లస్ అంటే తమకు ప్లస్ అవుతుందని ప్రధాన పార్టీల అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. కాకినాడ జిల్లాలో 83.65 శాతం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 83.84 శాతం, తూర్పుగోదావరి జిల్లాలో 79.43 శాతం పోలింగ్ నమోదైంది. గత సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు మించి ఈసారి ఎన్నికల్లో పోలింగ్ నమోదైంది. 2019లో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారాన్ని చేపట్టాక నాడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నూటికి నూరుశాతం అమలు చేస్తానని హామీ ఇచ్చారు. ఇందుకు అనుగుణంగా ప్రకటించిన పథకాలన్నింటినీ క్రమం తప్పకుండా గడచిన ఐదేళ్ల కాలంగా అమలుచేస్తూ వచ్చారు. పథకాలను పార్టీ, రాజకీయం, కులం, మతం చూడకుండా పూర్తి పారదర్శకంగా అర్హతే ప్రామాణికంగా అందజేశారు. నిజంగా మీ కుటుంబానికి మేలు జరిగి ఉంటేనే ఓటేయండని ధైర్యంగా ప్రజలను ఓట అడిగిన ముఖ్యమంత్రి తీరు అన్ని వర్గాలపై బలమైన ముద్రవేసింది. పోలింగ్ రోజు క్యూ లలో గంటల తరబడి నిలుచుని చివరకు అర్ధరాత్రి అయినా లెక్క చేయకుండా మహిళలు సైతం ఓట్లు వేశారు. గతంలో ఎప్పుడూ ఈ స్థాయిలో ప్రజలు అంతసేపు వేచి చూసి ఓట్లేయలేదంటున్నారు. ఓటింగ్ సరళిని నిశితంగా గమనిస్తే తమకు మంచి చేసిన వైఎస్సార్ సీపీని కచ్చితంగా గెలిపించుకోవాలనే బలమైన సంకల్పమే కనిపించిందని పార్టీలతో ప్రమేయం లేని ప్రముఖులు విశ్లేషిస్తున్నారు. గత ఎన్నికల్లో వచ్చిన ఫలితాలకు మించే ఈ సారి ఎన్నికల్లో చూడబోతున్నామనే ధీమాతో వైఎస్సార్ సీపీ నేతలున్నారు.

బలపడతాం అంటున్న తెలుగు తమ్ముళ్లు

గత ఎన్నికల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని నాలుగు పార్లమెంటు (అరకు పార్లమెంటు స్థానంతో కలిపి) స్థానాలకు నాలుగింటా వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించింది. 19 అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ నాలుగు(పెద్దాపురం, మండపేట, రాజమహేంద్రవరం సిటీ, రూరల్), రాజోలు నుంచి జనసేన మినహా 14 అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్ సీపీ అప్రతిహతమైన విజయాన్ని అందుకుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మెజార్టీ సీట్లు గెలిచే పార్టీయే రాష్ట్రంలో అధికారాన్ని చేపడుతుండటాన్ని సెంటిమెంట్‌గా పరిగణిస్తారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మూడొంతులకు పైబడి స్థానాలను కై వసం చేసుకున్న వైఎస్సార్ సీపీనే రాష్ట్రంలో 151 అసెంబ్లీ స్థానాలు, 25కు 22 పార్లమెంటు స్థానాలతో విజయదుందుభి మోగించింది. ఉమ్మడి తూర్పులో ప్రభుత్వానికి సానుకూలత పెరగడంతో దాని ప్రభావం పోలింగ్‌లో కనిపించి పాజిటివ్ ఓటింగ్ శాతం పెరిగిందని తలపండిన నేతలు విశ్లేషిస్తున్నారు. వైఎస్సార్ ఆసరా, చేయూత, అమ్మ ఒడి, విద్యా దీవెన, ఏడెనిమిది లక్షలు విలువ చేసే ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేసి స్థిర ఆస్తికి హక్కుదారులను చేయడం వంటి అంశాలతో మహిళలు జగన్‌కు మద్దతుగా ఓటెత్తారంటున్నారు. గత ఎన్నికల్లో టీడీపీ గెలుపొందిన పెద్దాపురం, రాజోలు తదితర స్థానాల్లో తమ పార్టీ పాగా వేస్తుందని వైఎస్సార్ సీపీ శ్రేణులు ధీమాతో ఉన్నాయి. పెరిగిన ఓటింగ్ ప్రభుత్వ వ్యతిరేక ఓటు అని, అది తమకు సానుకూలంగా మారిందని తెలుగుదేశం పార్టీ లెక్కలేసుకుంటోంది. గత ఎన్నికల కంటే ఈ సారి పార్టీ బాగా బలపడిందని తెలుగు తమ్ముళ్లు ధీమా వ్యక్తం చేస్తున్నారు. జనసేన, బీజేపీ కూటమి కట్టడం ఉమ్మడి తూర్పులో తమకు సానుకూలమైందని ఆ పార్టీ నేతలు అంచనాలు వేసుకుంటున్నారు. గత ఎన్నికల్లో గెలిచిన స్థానాలు నిలబెట్టుకోవడమే కాకుండా మరిన్ని స్థానాలలో గెలుస్తామంటున్నారు. ఇలా ఎవరి అంచనాల్లో వారున్నారు.

చిల్లర నోట్లు వేసి.. రూ.3.8లక్షలు స్వాహా

రిటైర్డ్ ఎస్ఐను బురిడీ కొట్టించి దోచుకెళ్లిన వైనం

మదనపల్లె

గుర్తు తెలియని వ్యక్తి చిల్లర నోట్లు పడ్డాయని మాయచేసి.. బ్యాంకు వద్దే రిటైర్డ్ ఎస్ఐను బురిడీ కొట్టించిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో నివాసముంటున్న సీఆర్‌పీఎఫ్ రిటైర్డ్ ఎస్ఐ సిద్దేశ్వర్(60) బుధవారం తన సొంతింటి నిర్మాణ పనులకుగానూ పట్టణంలోని సీటీఎం రోడ్డులోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో రూ.3.80 లక్షల నగదు డ్రా చేశాడు. ఇది గమనిస్తున్న గుర్తుతెలియని ఆగంతకుడు రిటైర్డ్ ఎస్సై వాహనం వద్ద పథకం ప్రకారం చిల్లర నోట్లు పడేశాడు. సిద్దేశ్వర బయటకు వచ్చి తన టీవీఎస్ వాహనానికి క్యాష్ బ్యాగు తగిలించి కిందకు చూడగా చిల్లర నోట్లు కనబడ్డాయి. అతను వాటిని తీసుకుంటుండగా గుర్తుతెలియని వ్యక్తి క్యాష్‌బ్యాగ్ అపహరించుకుని వెళ్లాడు. బాధితుడు వెంటనే టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ యువరాజ్ ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

> మీ ఆనందం బాహ్య పరిస్థితుల ద్వారా నిర్ణయం అవదు. మీ ఆలోచనలు, మాటలు, చర్యల ద్వారా నిర్ణయమవుతుంది.
> – బ్రహ్మకుమారీలు

సాక్షి

గురువారం, 23 మే 2024

నోటిదురుసుకు ఇదా శిక్ష!

నోరు పారేసుకునే అలవాటున్న నేతలకు ఎన్నికలు ఎప్పుడూ పండగే. ఊరూరా తిరుగుతూ ప్రత్యర్థులను ఇష్టానుసారం దూషించటం ఒక్కటే ఆ బాపతు నేతలకు తెలిసిన విద్య. కలకత్తా హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తూ రిటైర్మెంట్‌కు కొన్ని నెలల ముందు పదవికి రాజీనామా చేసి రాజకీయ రంగ ప్రవేశం చేసిన జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ్ అలాంటి నేతలను తలదన్నారు. ఆలస్యంగా వచ్చినా 'అన్నీ నేర్చుకునే' వచ్చారని నిరూపించుకున్నారు. న్యాయమూర్తులుగా పనిచేసినవారు వెనువెంటనే రాజకీయాల్లోకి రావొచ్చా లేదా అన్నది వేరే చర్చ. అసలు జస్టిస్ అభిజిత్ వంటివారిని రానీయొచ్చా అనే సదసత్సంశయం అందరిలోనూ కలిగేలా చేసిన ఘనుడాయన. ఆయన దూషణలు ఎంత హీనాతిహీనంగా ఉన్నాయంటే...అవి పశ్చిమ బెంగాల్ రాష్ట్రం పరువు తీస్తాయని, దేశాన్ని అపఖ్యాతిపాలు చేస్తాయని ఎన్నికల సంఘం(ఈసీ) వ్యాఖ్యానించింది. ఉన్నత విద్యావంతుడై, దీర్ఘకాలం వృత్తిలో కొనసాగిన ఒక బాధ్యతగల వ్యక్తి నుంచి ఇలాంటి చవకబారు మాటలు రావటం బాధాకరమన్నది. అయితే ఆయన దూషణలపై ఇంత తీవ్రంగా స్పందించిన ఈసీ, తీరా ఆయన్ను 24 గంటలపాటు ప్రచారంలో పాల్గొనరాదంటూ నిషేధం విధించి ఊరుకోవటం విడ్డూరంగానే అనిపిస్తుంది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ఉద్దేశించి గత గురువారం ఆయన దూషణలకు దిగారు. 'మీ రేటెంత మమతాజీ...ఎంతకు అమ్ముడుపోయారు? మేకప్ వేసుకుంటున్నారు గనుక పది లక్షలా! అసలామె మహిళేనా అని సందేహం కలుగుతుంది' అని ఆయన మాట్లాడారు. ఆ వెంటనే ఈసీకి తృణమూల్ ఫిర్యాదు చేసింది. గతంలో సమాచారం తెలుసుకోవటం, నిర్ధారించుకోవటం కష్టమయ్యేది. సామాజిక మాధ్యమాలొచ్చాక మరుక్షణంలోనే ప్రపంచానికి తెలిసిపోతోంది. ఎన్నికల సంఘం దీన్నంత సీరియస్‌గా తీసుకుంటే 24 గంటల్లో నివేదిక తెప్పించుకుని చర్య తీసుకోవటం కష్టం కాదు. కానీ ఈసీకి దాదాపు అయిదు రోజులు పట్టింది. ఈలోగా ఆయన ప్రచారమూ యథావిధిగా సాగింది. స్వీయసమర్థన సరేసరి.

మన సమాజం స్త్రీలను గౌరవిస్తుందని, పూజిస్తుందని ఘనంగా చెప్పుకుంటాం. కానీ మహిళలపై సాగుతున్న నేరాలు గమనిస్తే ఆ విషయంలో సందేహం కలుగుతుంది. బయటికెళ్తే ఎదురయ్యే సమస్యల గురించి ఏ బాలికను అడిగినా, మహిళను అడిగినా చెప్తారు. వీటిని రూపుమాపే ప్రభుత్వ ప్రయత్నాలు జరుగుతున్నాయి. కఠిన నిబంధనలతో చట్టాలు కూడా వస్తున్నాయి. కానీ ఆశించిన ఫలితాలేవి? చట్టాలు ఒక్కటే సమాజాన్ని మార్చలేవు. బాధ్యతాయుత స్థానాల్లో ఉంటున్నవారు సక్రమంగావుంటే ఇతరులకు అదొక సందేశమవుతుంది. కానీ వారే విచ్చలవిడి చేష్టలతో, మాటలతో చెలరేగుతుంటే వీధుల్లో తిరిగే పోకిరీలు ఇక నేర్చుకునేదేముంటుంది? మహిళలను కించపర్చటంలో జస్టిస్ అభిజిత్ మొదటివారు కాదు... బహుశా చివరివారు కూడా కాకపోవచ్చు. సాధారణ సందర్భాల మాటెలావున్నా కనీసం ఎన్నికలప్పుడైనా ఈసీ తీవ్రంగా స్పందిస్తే కొద్దో గొప్పో ఫలితం ఉంటుంది. ఎందుకంటే రాజకీయాలు పెద్దగా పట్టనివారు సైతం ఎన్నికలప్పుడు ఆసక్తి చూపుతారు. అందువల్లే ఈసీ కఠినంగా ఉండాలి. ఎన్నికల ప్రచారంలో పాటించే మార్గదర్శకాలేమిటో తమ అభ్యర్థులకూ, పార్టీ ప్రచారంలో పాల్గొనే ఇతరులకూ తెలియజేయాలని బీజేపీ అధినేత జేపీ నడ్డాకు ఈసీ సూచించింది. ఆ పార్టీ దాన్నెంతవరకూ పాటించిందో తెలియదు. అయినా ఇది ఈసీ చెబితేగానీ తెలియనంత విషయమేం కాదు. పార్టీలకు మందీమార్బలం ఉంటుంది. వివిధ హోదాల్లో ఉండేవారంతా బాధ్యతలు పంచుకుని తీరికలేకుండా ప్రచారంలో తలమునకలైన అధినేతలకు అవసరమైన విషయాలను చేరేస్తుంటారు. కానీ వారెవరికీ జస్టిస్ అభిజిత్ సంస్కారహీనమైన మాటలు తప్పనిపించినట్టు లేదు. సరిగదా...'ప్రధానిని విపక్షాలు అంటున్న మాటలు మీకు వినిపించటం లేదా...కళ్లూ, చెవులూ మూతబడ్డాయా?' అని బీజేపీ రాజ్యసభ ఎంపీ సమిక్ భట్టాచార్య ఈసీని ప్రశ్నించారు. 'కంటి వైద్య నిపుణులతో చూపు సరిచేయించుకోండి' అని కూడా ఉచిత సలహా ఇచ్చారు. తమది విభిన్నమైన పార్టీ అని తొలినాళ్లలో చెప్పుకున్న రాజకీయ పక్షం నుంచి ఇలాంటి సమర్థనలు ఆశించగలమా? జస్టిస్ అభిజిత్ ఇప్పుడే కాదు... న్యాయమూర్తిగా పనిచేసినప్పుడు సైతం విమర్శలు ఎదుర్కొన్నారు. మమత ప్రభుత్వంపై వెలువరించే తీర్పుల్లో ఆయన వ్యాఖ్యలు మితిమీరుతున్నాయన్న అభిప్రాయం ఉండేది. ఆయన్ను సమర్థించే మీడియా మాత్రం 'ప్రజా న్యాయమూర్తి' అనే భుజకీర్తులు తగిలించింది. అది వేరే సంగతి. చిత్రమేమంటే ఆయన తీర్పులను గట్టిగా సమర్థించి, ఎవరు ఎప్పుడు పునః సమీక్షించినా అవి ప్రామాణికమైనవని నిర్ధారణవుతుందన్నవారు సైతం బీజేపీలో చేరటం ద్వారా వ్యవస్థ విశ్వసనీయతను జస్టిస్ అభిజిత్ తీవ్రంగా దెబ్బ తీశారని అభిప్రాయపడ్డారు.

ఉద్దేశపూర్వకంగా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించేవారినీ, మహిళల వ్యక్తిత్వహననానికి పాల్పడేవారినీ ఉపేక్షించటం, నామమాత్రపు నిషేధాలతో సరిపెట్టడం న్యాయం కాదు. అవసరమైతే పోటీకి అనర్హులను చేయటంవంటి కఠిన చర్యలకు సిద్ధపడితే తప్ప ఇటువంటి నేతలు దారికి రారు. చట్టసభల్లో ఎలాగూ ఆరోగ్యవంతమైన చర్చలకు తావుండటం లేదు. కీలకమైన నిర్ణయాలు సైతం మూజువాణి ఓటుతో గట్టెక్కి చట్టాలుగా మారి సామాన్యులపై సవారీ చేస్తున్నాయి. కనీసం ఎన్నికల సమయంలోనైనా ఏ పార్టీ చరిత్రేమిటో, ఎవరివల్ల తమకు మేలు కలుగుతుందో నిర్ధారించుకునే అవకాశం ప్రజలకివ్వటం అవసరం. అందుకు నోటిదురుసు నేతలను కట్టడి చేయటం ఒక్కటే మార్గం.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు వైశాఖ మాసం, తిథి: పౌర్ణమి సా.6.42 వరకు, తదుపరి బహుళ పాడ్యమి నక్షత్రం: విశాఖ ఉ.8.51 వరకు, తదుపరి అనూరాధ వర్జ్యం: ప.1.03 నుండి 2.43 వరకు, దుర్ముహూర్తం: ఉ.9.47 నుండి 10.35 వరకు, తదుపరి ప.2.59 నుండి 3.47 వరకు అమృతఘడియలు: రా.11.04 నుండి 1.10 వరకు.

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం: 6.23
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

సమితిపై సంస్కరణల ఒత్తిడి

అభిప్రాయం



ధ్రువ జైశంకర్

భద్రతామండలి సంస్కరణలపై చాలాకాలంగా చర్చ సాగుతోంది. శాశ్వత సభ్యులు కానివారికీ చోటు కల్పించాలని 1960ల నుంచి డిమాండ్ ఉందన్న విషయాన్ని మనం గమనించాలి. ఈ నేపథ్యంలో ఐక్య రాజ్య సమితి భద్రతా మండలి సంస్కరణలపై ఇటీవలే న్యూయార్క్ వేదికగా ప్రపంచ ప్రభుత్వాల మధ్య చర్చలు జరిగాయి. ఇంకో పక్క భారత్ సభ్య దేశంగా ఉన్న ఎల్‌–69 కూటమి భద్రతామండలి శాశ్వత సభ్యుల సంఖ్యతోపాటు ఇతర సభ్యులను కూడా పెంచాలని ప్రతిపాదిస్తోంది. అదే సమయంలో కొత్త సభ్యులకు వీటో అధికారం ఇచ్చే విషయమై ఉదారంగా వ్యవహరించాలని కోరుతోంది. భద్రతా మండలి సంస్కరణలు వేగం పుంజుకోవడం ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆందోళనలకు అద్దం పడుతోంది..



అంతర్జాతీయ స్థాయిలో శాంతి సామరస్యాలను కాపాడే లక్ష్యంతో ఏర్పాటైన ఐక్యరాజ్య సమితిలో ఆసియా, ఆఫ్రికా ఖండాలకు ప్రాతినిధ్యం లేకపోవడం సమితి లక్ష్యసిద్ధిలో పెద్ద అడ్డంకి అని చెప్పక తప్పదు. ఈ అడ్డంకులను అధిగమించేందుకు కొన్ని దశాబ్దాలుగా ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నా అవి ఫలవంతం కావటం లేదు. సమితిలో సంస్కరణలు జరగాలని అధికశాతం దేశాలు డిమాండ్ చేస్తున్నప్పటికీ వీటో పవర్ ఉన్న దేశాలు సమితి కృషికి పీటముడులు వేస్తూ వస్తున్నాయి. ఈ క్రమంలో ఐక్య రాజ్య సమితి భద్రతా మండలి సంస్కరణలపై ఇటీవలే న్యూయార్క్ వేదికగా ప్రభుత్వాల మధ్య చర్చలు జరిగాయి. ఎవరికీ పెద్దగా తెలియని, అస్పష్టమైన దౌత్య ప్రక్రియ ఆ చర్చలన్నవి. అయినప్పటికీ ఈ ఏడాది చివరిలోగా ఓ చరిత్రాత్మక అంతర్జాతీయ ఒప్పందం కుదిరే దిశగా ఈ సమావేశం ముందడుగైతే వేసింది.

భద్రతా మండలి సంస్కరణలు వేగం పుంజుకోవడం ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న ఆందోళనలకు కూడా అద్దం పడుతోంది. ఉక్రెయిన్, గాజా పరిణామాలు... ఐరాస వ్యవస్థ ప్రభావం తగ్గిపోతూండటం, అందరికీ ప్రాతినిధ్యం వహించే అవకాశం ఐరాసకు లేకపోవడం వంటివి మళ్లీ మళ్లీ చర్చకు వచ్చేలా చేస్తున్నాయి. భద్రతా మండలిలోని ఐదు దేశాలకూ వీటో అధికారాలు ఉండటం అన్నది రెండో ప్రపంచ యుద్ధ విజేతలకు మాత్రమే ప్రాతినిధ్యం కల్పిస్తున్నట్లు అవుతోంది. ఇక ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలకు భాగస్వామ్యం లేదు. ఆ ప్రాంత దేశాల ప్రతినిధులు ఐరాసలో నామమాత్రపు పాత్ర పోషిస్తున్నారు అంతే.

1950లో ప్రపంచ జనాభాలో సగం ఆసియాలోనే ఉండగా... ఇరవై శాతం ఆర్థిక లావాదేవీలు ఇక్కడే జరుగుతున్నా భద్రతామండలిలో ప్రాతినిధ్యం మాత్రం ఒక్క దేశానికి మాత్రమే దక్కింది. ఇది అన్యాయమే. అలాగని ఆశ్చర్యపోవడానికీ ఏమీ లేదు. కాగా అప్పటితో పోలిస్తే ఇప్పుడు ప్రపంచం నిస్సందేహంగా చాలా మారిపోయింది. ప్రాతినిధ్యం విషయంలోనూ అన్యాయం కొనసాగుతూనే ఉంది. ఇప్పుడు ఆసియా జనాభా ప్రపంచ జనాభాలో 60 శాతం. ఆర్థిక వ్యవస్థలో 40 శాతం భాగస్వామ్యం కూడా ఈ ఖండానిదే. ఐరాస సభ్యదేశాల్లో 25 శాతం ఇక్కడివే. కానీ... భద్రతామండలిలో ప్రాతినిధ్యం మాత్రం 20 శాతమే.

ఈ నేపథ్యంలోనే భద్రతామండలి సంస్కరణలపై చాలాకాలంగా చర్చ సాగుతోంది. శాశ్వత సభ్యులు కానివారికీ చోటు కల్పించాలని 1960ల నుంచి ఉన్న డిమాండ్‌ను మనం గుర్తు చేసుకోవాలి. దాదాపుగా ఈ సమయంలోనే ఆర్థిక, సామాజిక కౌన్సిల్ సభ్యత్వాన్ని 18 నుంచి 27కు, ఆ తరువాత 54కు పెంచారు.

2015లో కొన్ని నిర్దిష్ట సూచనలతో భద్రతా మండలి సంస్కరణలపై చర్చలు జరిపేందుకు ఒక అంగీకారం కుదిరింది. అయితే అప్పటి నుంచి ఇప్పటివరకూ అవి ముందుకు కదల్లేదు. చర్చల తీరుతెన్నులపై స్పష్టమైన ప్రణాళిక అన్నది లేకుండా పోవడం దీనికి కారణమైంది. ఈ ఏడాది జరిగిన శిఖరాగ్ర సమావేశం మాత్రమే ఈ ప్రక్రియ కాస్త ముందుకు కదిలేందుకు మార్గం చూపింది.

కారణాలు అనేకం!

భద్రతా మండలి సంస్కరణలు స్తంభించిపోయేందుకు అనేక కారణాలు కనిపిస్తాయి. ఇండియా, జర్మనీ, జపాన్ , బ్రెజిల్‌లతో కూడిన జి–4 కూటమి తమను (మరో ఇద్దరు ఆఫ్రికన్ ప్రతినిధులతో కలిపి) భద్రతా మండలి శాశ్వత సభ్యులుగా తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. భారత్, జి–4 దేశాలు వీటో అధికారం లేకుండానే భద్రతామండలిలో చేరేందుకు ఓకే అనవచ్చు. ఈ అంశంపై 15 ఏళ్ల తరువాత ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉండేలా చూస్తారు. ఇంకో పక్క భారత్ కూడా సభ్య దేశంగా ఉన్న ఎల్–69 కూటమి భద్రతా మండలి శాశ్వత సభ్యుల సంఖ్యతోపాటు ఇతరులను కూడా పెంచాలని ప్రతిపాదిస్తోంది. అదే సమయంలో కొత్త సభ్యులకు వీటో అధికారం ఇచ్చే విషయమై ఉదారంగా వ్యవహరించాలని కోరుతోంది.

ఐరాస సభ్యదేశాల్లో అత్యధికులు భద్రతా మండలి శాశ్వత, ఇతర సభ్యుల సంఖ్యను పెంచేందుకు అంగీకారం తెలుపుతూండగా కాఫీ క్లబ్‌గా పేరుగాంచిన 'యునైటెడ్ ఫర్ కన్సెన్సస్' గ్రూపు ఆ ప్రయత్నాలను తీవ్రంగా ప్రతిఘటిస్తోంది. ఇటలీ, పాకిస్థాన్, అర్జెంటీనా వంటి దేశాల నేతృత్వంలో పని చేస్తున్న ఈ గ్రూపు శాశ్వత సభ్యుల సంఖ్యను పెంచడాన్ని వ్యతిరేకిస్తోంది. భారత్, జర్మనీ, బ్రెజిల్ వంటి స్థానిక శత్రువులది పైచేయి కాకుండా అన్నమాట. ఇదిలా ఉంటే భద్రతా మండలి శాశ్వత సభ్యదేశాల్లో నాలుగు అమెరికా, యూకే, ఫ్రాన్స్, రష్యాలు మాత్రం శాశ్వత సభ్యుల సంఖ్యను పెంచేందుకు సూత్రప్రాయ అంగీకారం తెలిపాయి. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఇంకో అడుగు ముందుకేసి భద్రతా మండలి సంస్కరణలకు తాను కట్టుబడి ఉన్నట్లు ప్రకటనైతే చేశారు కానీ ఆచరణలో మాత్రం ఆయన ప్రభుత్వం భిన్నంగా వ్యవహరిస్తోంది. ఇంకో విషయం... ఆఫ్రికా గ్రూపులో ఏకాభిప్రాయం లేకపోవడంతో భద్రతామండలి సభ్యదేశంగా ఎవరిని ఎంపిక చేయాలన్నది సమితి నిర్ణయించుకోలేక పోతోంది. వివరంగా చర్చిస్తే భేదాభిప్రాయాలు వస్తాయని ఆఫ్రికా దేశాలు భయపడుతున్నాయి.

అడ్డంకి ఉండనే ఉంది!

భద్రతా మండలి శాశ్వత సభ్యత్వం పెరిగేందుకు, ఇతర సభ్యుల చేరికకు ఉన్న అతిపెద్ద అడ్డంకి చైనా. భద్రతామండలి విస్తరణపై వ్యాఖ్య చేయని శాశ్వత సభ్య దేశం ఇదొక్కటే. ఆసియాకు మెరుగైన ప్రాతినిధ్యం లభించేందుకు ఆసియా దేశమే ఒకటి అడ్డుగా నిలవడం విచిత్రం. ఈ సమస్యలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని చూస్తే... అసలు రాజీ మార్గమన్నది ఏమాత్రం కనిపించకుండా పోతుంది. శాశ్వత సభ్యుల సంఖ్యను 11కు పెంచడం ఇందుకు ఒక మార్గం. ప్రస్తుత శాశ్వత సభ్యులు ఐదుగురితోపాటు జి–4 సభ్యులు, ఇద్దరు ఆఫ్రికా ప్రతినిధులు అన్నమాట. దీంతోపాటే ఇతర సభ్యుల సంఖ్యను కూడా తగుమాత్రంలో పెంచాల్సి ఉంటుంది. అలాగే పూర్తి వీటో అధికారం స్థానంలో కొంతమంది శాశ్వత సభ్యులకు అభ్యంతరం ద్వారా తీర్మానాన్ని అడ్డుకునే అధికారం కల్పించడం ఒక ఏర్పాటు అవుతుంది. ఇలాంటి ఏర్పాటు ప్రస్తుత శాశ్వత సభ్యులకూ అంగీకారయోగ్యం కావచ్చు.

ఈ ఏర్పాటు ఒకటి రూపుదిద్దుకునేలోగా ఐరాస నిష్క్రియాపరత్వం పాటించడం కూడా ఐరాస ఏర్పాటు అసలు ఉద్దేశాన్ని నిర్వీర్యం చేసేదే. యుద్ధనష్టాలు భవిష్యత్ తరాలకు సోకకుండా కాపు కాయాల్సిన బాధ్యత ఐరాసాదే! అంతర్జాతీయ ఒప్పందాలు, ఒడంబడికల అమలు, సామాజిక పురోగతి, మానవీయతలను కాపాడటం కూడా ఐరాస ఏర్పాటు ఉద్దేశాలలో కొన్ని అన్నది మరచిపోరాదు. ఈ లక్ష్యాలన్నీ ఐరాస భద్రతా మండలి శాశ్వత సభ్యులుగా మారే ఆఫ్రికన్ గ్రూపు లేదా జి–20 వంటి వ్యవస్థలకూ వర్తిస్తాయి. గత ఏడాది భారత్ నేతృత్వంలో జరిగిన జి–20 సమావేశాల్లో చాలా అంశాలపై ఏకాభిప్రాయం సాధించగలగడం ఇక్కడ చెప్పుకోవాల్సిన అంశం. ఐరాస తన పూర్వ వైభవాన్ని మళ్లీ పొందాలంటే ప్రపంచం మొత్తానికి ఏకైక ప్రతినిధిగా వ్యవహరించాల్సి ఉంటుంది. అంతే కానీ... ఎప్పుడో ఎనిమిది దశాబ్దాల క్రితం నాటి ప్రపంచానికి ప్రతినిధిగా కాదు.

వ్యాసకర్త ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఓఆర్ఎఫ్ అమెరికా ('హిందూస్తాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మరీ అంతగానా!!



ప్రతి పైసాను పన్ను కింద మింగేస్తూ, ప్రజల్ని పీల్చి పిప్పిచేస్తూ, వారికి మూడో ప్రపంచ దేశాల స్థాయి వైద్య సదుపాయాలనే అందిస్తూ, ఇప్పుడిక వైద్య బీమా ప్రీమియంపై 80 శాతం జీఎస్టీని తీసుకుంటున్న ఈ ప్రభుత్వాన్ని సమాజం బాగు కోసం గెంటేయాలి.
– కపిల్, పాలనా వ్యవహారాల వ్యాఖ్యాత

నవ్వు తెప్పిస్తున్నాయి




కంగనా రనౌత్ తన ప్రసంగాలతో కపిల్ శర్మకు గట్టి పోటీ ఇస్తున్నారు. ఎన్నికల్లో ఓడిపోయాక ఆమె ముంబైలో 'కామెడీ నైట్స్ విత్ కంగనా' ప్రారంభించవచ్చు. 'మండి'లో ఆమెపై పోటీ పడుతున్న విక్రమాదిత్యసింగ్ తన గెలుపుపై ఆందోళన చెందనవసరం లేదు.
– అంకిత్ మయాంక్, కాంగ్రెస్ మద్దతుదారు

గెలుపు కోసం



ఎన్నికల ఫలితాలలో 'నిపుణుడు' అయిన ప్రశాంత్ కిశోర్, స్క్రిప్టు ప్రకారం అదానీకి చెందిన ఎన్డీటీవీతో మాట్లాడుతూ... బీజేపీ 2019 కి సమానంగా లేదా అంతకన్నా మెరుగైన విజయాలను సాధించబోతోందని అన్నారు. మోదీ ఓడిపోతే నష్టపోయే స్వార్థపరులు ఏదో పెద్ద పథకాన్నే రచిస్తున్నట్లుగా ఉంది. వారు తమ సామ్రాజ్యాన్ని, ప్రయోజనాలను కాపాడుకోవటానికి ఎంతకైనా తెగిస్తారు.
– షాహిద్ సిద్దిఖీ, మీడియా పర్సనాలిటీ

ఇదేనా వికసిత్ భారత్?



నేతల జీవనశైలితో పోలిస్తే, సామాన్యుల జీవన ప్రమాణాలు దుర్భరం. ఎన్నికలు తమ జీవితాల్ని మార్చవని తెలిసీ జనం ఆశగా వోటేస్తున్నారు. పిల్లలకు చదువు, ఆరోగ్య కేంద్రాలు కావాలని ఆశపడుతున్నా, గ్రామాల్లో పరిస్థితి దుర్భరం. వికసిత్ భారత్ సర్కారీ నినాదాలతో కాదు, ఆచరణతో వస్తుంది.
– రాజ్‌దీప్ సర్దేశాయ్, జర్నలిస్ట్

దేనికి సూచన?!



లద్దాఖ్ పార్లమెంటరీ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, ఓటింగ్ శాతం తగ్గిపోతూ వస్తోంది! 2004: 73.52 శాతం, 2009: 72.8 శాతం, 2014: 71.40 శాతం, 2019: 71.5 శాతం, 2024: 67 శాతం. ఇది దేనిని సూచిస్తోంది! శాతాల మధ్య వ్యత్యాసం మరీ ఎక్కువ లేకపోవటాన్ని మాత్రమేనా?
– జెమ్యాంగ్ ట్సెరింగ్ నమ్గ్యాల్, లద్దాఖ్ ఎంపీ

మతం-రాజకీయం



రాజకీయాలకూ మతానికీ, మతానికీ రాజకీయాలకూ సంబంధమే లేదు. రాజకీయ నాయకులు రాజకీయాల కోసం మతాన్ని ఉపయోగించుకోకూడదు. మతాన్ని బోధించేవారు, ఆచరించేవారు రాజకీయాలలో మునిగిపోకూడదు. దీనిని మనం ఆచరిస్తే భారతదేశం ప్రపంచంలోనే మానవ నివాసానికి మంచి ప్రదేశం అవుతుంది.
– చంద్రకుమార్ బోస్, సామాజిక వ్యాఖ్యాత

అక్కడుంది కీలకం!



ఇజ్రాయెల్, హమాస్ యుద్ధ నేరస్థులకు అరెస్ట్ వారెంట్ జారీ చేయాలని ఐ.సి.సి. (ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు) న్యాయవాది కరీమ్ ఖాన్ కోరినందుకు ఆయన పిల్లలను యు.ఎస్. సెనెటర్ ఒకరు బెదిరించారు. అన్ని ముసుగులూ తొలగిపోయాయి. మాఫియా పాలనకు వాషింగ్టన్ డీసీ ప్రధాన కార్యాలయంగా ఉంది.
– మట్ కెన్నార్డ్, దర్యాప్తు అధికారి, యు.కె.

ఇన్‌బాక్స్


మహిళలే గెలిపిస్తున్నారు!

'నూట ఇరవై నాలుగు సార్లు మీకోసం బటన్ నొక్కి, రెండు లక్షల యాభై ఐదు కోట్ల రూపాయలను డైరెక్ట్‌గా మీ అకౌంట్‌లో మీ కుటుంబ అభివృద్ధి కోసం ఇచ్చాము. నా కోసం రెండుసార్లు బటన్ నొక్కండి' అన్న ముఖ్యమంత్రి జగన్ పిలుపు పేద, మధ్య తరగతి మహిళలను చేరింది. అందుకే ఎట్టి పరిస్థితిలోనూ ప్రతిపక్ష కూటమి అధికారంలోకి రాకూడదనీ, గత ఐదేళ్లుగా తమకు ఆసరాగా ఉన్న జగన్ ప్రభుత్వమే మళ్లీ పాలించాలని గంటలు తరబడి లైన్‌లో నిలబడి ఓటు వేశారు. కేవలం వ్యక్తిగత ప్రయోజనాలే కాకుండా, సమాజ పరమైన ప్రయోజనాలనూ చూసిన తర్వాతే మహిళలు ఇంత పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్నారు. ప్రతీ గ్రామంలో రాజకీయ నాయకుల సిఫార్సు లేకుండా ఏ పనైనా జరిగే సచివాలయం, 24 గంటలూ ప్రాథమిక వైద్య సౌకర్యం కల్పించే వెల్‌నెస్ సెంటర్లు, పంట కొనుగోలుచేసే రైతు భరోసా కేంద్రాలు, పూర్తి మౌలిక సౌకర్యాలతో బడి... ఇవన్నీ జగన్ ప్రభుత్వం సాకారం చేసిన కలలు.

వలంటీరు వ్యవస్థ తప్పు అనీ, వలంటీర్లు మహిళలను అమ్ముతున్నారనీ, అవినీతికి పాల్పడుతున్నారనీ దారుణ అభియోగాలు మోపిన ప్రతిపక్షాలవాళ్లు... తాము అధికారం లోకి వస్తే ఈ వ్యవస్థను రద్దు చేస్తాం అన్నారు. కాని, ఎన్నికలు రాగానే మాట మార్చి, వలంటీర్లకు జీతం డబుల్ చేస్తామనీ, వాళ్ళను తొలగించం అనీ అన్నారు. ఎన్నికలకు ముందు జగన్ పెట్టిన పథకాల మూలంగా రాష్ట్ర పరిస్థితి అప్పులపాలైందని అన్నారు. ఎన్నికల ప్రచార సభల్లో అంతకు మించిన సంక్షేమ పథకాలు పెడతాం అంటున్నారు. ఈ అస్థిర, అనాలోచిత మాటల్ని ప్రజలు నిశ్శబ్దంగా గమనించారు. కేవలం పదవీ కాంక్ష తప్ప రాష్ట్ర ప్రగతికి ఏ విధమైన ఉన్నత ప్రణాళికా ప్రతిపక్షాల దగ్గర లేదని ప్రజలు తెలుసుకున్నారు. ముఖ్యంగా గోదావరి జిల్లాలలోని ఆధిపత్యవర్గాల పేద మహిళలు కూడా, కుల, వారసత్వ రాజకీయాల ప్రభావం లోకి వెళ్లకుండా వాళ్ళ కుటుంబ అభివృద్ధికి ప్రణాళికలు వేసిన జగన్‌మోహన్ రెడ్డి వైపే ఎన్నికల్లో మొగ్గు చూపారు. మొత్తంగా జగన్ మోహన్ రెడ్డి అధ్వర్యం లోనే రాష్ట్ర ప్రజల నిజమైన అభివృద్ధి జరిగిందనీ, అది ఇంకా కొనసాగాలంటే ఆయన ప్రభుత్వమే రావాలనే తలంపుతోనే మహిళలు అధిక సంఖ్యలో ఓటు వేశారని చెప్పక తప్పదు.
– వంక రవీంద్ర నాథ్, ఎమ్మెల్సీ, పశ్చిమ గోదావరి జిల్లా

ఈ విద్వేషం ఇంకెన్నాళ్లు?

అభిప్రాయం



డా॥ కాలువ మల్లయ్య

ఈ దేశంలో ఉన్న ముస్లింలు, క్రైస్తవులందరూ ఇక్కడి మూలాలు ఉన్న భారతీయులే. వీరందరూ వేరు వేరు మతవిశ్వాసాలు అనుసరిస్తున్నప్పటికీ... వారందరికీ ఉన్నది భారతీయ ఆత్మే. రాజులు, సుల్తానులు, మొగలాయీలు, బ్రిటిష్ పాలకులూ... పాలకులు ఎవరైనా సరే ఈ పాలితులు మాత్రం ఈ నేలపై పుట్టినవారే. మెజారిటీ మతస్థుల మన్నన, ఓట్లు పొందడం కోసం ఈ మైనారిటీ మతాలవారిని విదేశీయులుగా, చొరబాటుదారులుగా బీజేపీ, తదితర సంఘ్ పరివార్ శక్తులు చిత్రించడం తెలిసిందే. మరీ ముఖ్యంగా ముస్లిం ప్రజలపై ఈ శక్తులు వివక్షను వెళ్లగక్కడం ఎక్కువగా కనిపిస్తుంది. అయితే ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో సాక్షాత్తూ ప్రధాని మోదీ లాంటివారే బహిరంగంగా ముస్లింలపై చేయరాని వ్యాఖ్యలు చేసి దేశంలో ద్వేషాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నించడం తీవ్రంగా గర్హించాల్సిన అంశం.



నిజానికి ఈ దేశంపై దండెత్తి వచ్చి మహాసామ్రాజ్యాన్ని స్థాపించి వందల ఏళ్ల పాలించిన ముస్లిం పాలకులు ఈ మట్టిలోనే కలిసిపోయారు. వారు వ్యాపింపచేసిన ముస్లిం మతాన్ని స్వీకరించిన వారంతా ఇక్కడి మూలవాసులే. అక్బర్ లాంటి చక్రవర్తులు హిందువులతో వివాహ సంబంధాలు ఏర్పరచుకున్నారు. కాబట్టి ఈ పాలకులు ముస్లింలు అయినంత మాత్రాన వారిని విదేశీయులుగా చూడవలసిన పనిలేదు. అలాగే ముస్లింలనంతా విదేశీయులుగా, చొరబాటుదారులుగా చిత్రించడమూ సరికాదు. దురదృష్టవశాత్తు బీజేపీ నాయకులు కింది స్థాయి నుంచి ప్రధానమంత్రిగా ఉన్న వారి వరకూ... అందరూ ఇదే ధోరణిలో వ్యవహరించడం బాధాకరం.

స్వాతంత్ర్య పోరాట కాలంలో హిందువులు, ఇతర మతాలవారితో పాటు ముస్లింలూ ఎన్నో త్యాగాలు చేశారు. జైళ్లకెళ్లారు. స్వాతంత్ర్యానంతరం దేశ విభజన సమయంలోనూ పాకిస్తాన్ వెళ్లకుండా తమ మాతృభూమిలోనే ఉండిపోయి ఈ గడ్డతో తమకున్న అనుబంధాన్ని చాటుకున్నారు.


వైదిక (హిందూ) మతంలోని వర్ణ వ్యవస్థ వంటి అవలక్షణాల కారణంగానే ఇతర మతాలను భారతీయులు స్వీకరించారనేది ఎవరూ కాదనలేని సత్యం. మొదట్లో వైదిక మతానికి వ్యతిరేకంగా తలెత్తిన బౌద్ధాన్ని దళితులు, అణగారిన జాతులు, సమాజపు అట్టడుగున ఉన్న వారూ ఆలింగనం చేసుకున్నారు. ఆ తర్వాత విదేశాల్లో పుట్టుకొచ్చిన క్రైస్తవం, ముస్లిం మతాలనూ అనుసరించడం ప్రారంభించారు. తమకు నచ్చిన మతాన్ని అనుసరించడం, నచ్చిన దేవుణ్ణి పూజించడం ఎవరికైనా ఉన్న సహజమైన హక్కు. ప్రజాస్వామ్య యుగంలోనూ అటువంటి హక్కును నిరాకరించడం లేదా అన్య మతస్థులను చులకన చేసి మాట్లాడడం సబబేనా? మనం ఏ యుగంలో ఉన్నట్లు?

మెజారిటీ హిందూ ప్రజల ఓట్లు కొల్లగొట్టడానికి మైనారిటీలపై వ్యతిరేకతను పెంచడం వల్ల దేశంలో విద్వేషాలు పెరిగిపోతాయి. కేవలం రాజకీయ లబ్ధి కోసం చేసే ఇటువంటి పనుల వల్ల అంతిమంగా దేశ సమగ్రతకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఈశాన్య భారతంలో ఆదివాసీల మధ్య రగిలిన విభేదాలు రావణ కాష్ఠంలా కాలుతూనే ఉన్నాయి. దేశంలో అనేక అస్తిత్వ ఉద్యమాలూ ఉన్నాయి. ధరల పెరుగుదల, నిరుద్యోగిత, పేదరికం, అనారోగ్యం, దేశ సంపద పంపిణీలో తేడాలూ, అవకాశాల లేమితో ప్రజలు అల్లాడుతున్నారు. వీటినేమీ పట్టించుకోకుండా ఈ దేశవాసుల్లో భాగమైన ముస్లింలపై అనుచిత వ్యాఖ్యలు చేసి మరోసారి అధికారంలోకి సులభంగా రావాలనుకోవడం ఏ రాజనీతో ప్రజలే ఆలోచించాలి.

– డా॥ కాలువ మల్లయ్య । 91829 18567

నిత్య ఆచరణీయం

క్రీస్తుపూర్వం 6వ శతాబ్దంలో పుట్టిన కొత్త మతాలలో బౌద్ధం అత్యంత ప్రాముఖ్యం కలిగివుంది. దీని స్థాపకుడు బుద్ధుడు (సిద్ధార్థుడు). గయలో బోధి వృక్షం కింద తపస్సు చేసిన సిద్ధార్థుడు జ్ఞానోదయం పొంది బుద్ధునిగా మారాడు. ఆయనకు జ్ఞానోదయమైన పున్నమి రోజును 'బుద్ధ పూర్ణిమ'గా జరుపుకొంటున్నారు. బుద్ధుడు సరళమైన తాత్వికత, ఆచరణాత్మకతలతో సమాజాన్ని ప్రభావితం చేశాడు. వైదిక మతంలోని అణిచివేత నుంచీ దళిత, పీడిత, అట్టడుగు వర్గాలను విముక్తి చేశాడు. బుద్ధుని ఉపదేశంలో నాలుగు గొప్ప సత్యాలున్నాయి. అవి లోకం దుఃఖమయం. దుఃఖానికి మూలం కోరిక. కోరికను నివారించడం ద్వారా దుఃఖాన్ని నివారించవచ్చు. అష్టాంగ మార్గాన్ని అనుసరించడం ద్వారా కోరికలను నివారించవచ్చు. అష్టాంగ మార్గంలో సరైన దృష్టి, సరైన ఆలోచన, సరైన వాక్కు, సరైన క్రియ, సరైన జీవనం, సరైన సాధన, సరైన స్మృతి, సరైన ధ్యానం వంటి ఎనిమిది శాస్త్రీయ పరిష్కారాలు చూపాడు. వీటిని చక్కగా అర్థం చేసుకొని ఆచరణలో పాటించడం ద్వారా మనశ్శాంతి, జ్ఞానం, నిర్వాణం పొందొచ్చని బౌద్ధం చెబుతోంది.



బౌద్ధం ముఖ్యంగా ధార్మిక రంగాన్ని విప్లవీకరించింది. అర్థం లేని కర్మకాండలు, మూఢ నమ్మకాలు, జంతుబలులతో భ్రష్టుపట్టిన మతాన్ని సంస్కరించి నైతికతను, మానవీయ విలువలను జోడించింది. సామాన్య ప్రజలకు చేరువయ్యే క్రమంలో పాళీ వంటి ప్రజల భాషలలో సాహిత్యాన్నీ, గొప్ప వాస్తు శిల్పకళలనూ ప్రోత్సహించింది.

ఏ పని చేసినా మనస్సాక్షిగా చేయాలని చెప్పాడు బుద్ధుడు. అప్పుడే వారు తమ ఆలోచనలు, భావోద్వేగాలు, పనుల గురించి స్పష్టంగా తెలుసుకోగలుగుతారు. భౌతిక సుఖాలపై అధిక వ్యామోహాలను వీడిన రోజే మనిషికి మానసిక ప్రశాంతత లభిస్తుందనే తాత్వికతను బుద్ధుడు తెలిపాడు. కావున బుద్ధి జీవిగా మారాలంటే బుద్ధుని బోధనలు తెలుసుకోవాల్సిందే, ఆచరించాల్సిందే!!
– జి. శ్యామల (నేడు బుద్ధ పూర్ణిమ)

నిమ్మ.. 'ధర'హాసం





కొద్ది నెలలుగా ఆశాజనకంగా ధరలు

ఏప్రిల్‌లో గరిష్టంగా కిలో రూ.90

ఏరువాకతో మారనున్న కౌలు ఒప్పందాలు

తెనాలి: నిమ్మ ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఆ రైతుల మోముల్లో 'ధర' హాసం కనిపిస్తోంది. దిగుబడి కొంతమేర తగ్గినప్పటికీ, మార్కెట్లో గరిష్ట ధరలకు క్రయ, విక్రయాలు సాగడంతో రైతులు దిల్‌ఖుష్‌గా ఉన్నారు. నిమ్మకాయల ఉత్పత్తిలో దేశంలో అగ్రస్థానంలో ఉన్న ఏడు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. రాష్ట్రంలో గూడూరు, ఏలూరు మార్కెట్ల తర్వాత నిమ్మకాయలకు ప్రసిద్ధి తెనాలి మార్కెట్. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆరు వేల ఎకరాలకుపైగా నిమ్మతోటలు సాగులో ఉంటే అందులో అత్యధిక విస్తీర్ణం తెనాలి డివిజనులోనే ఉంది. కృష్ణా జిల్లాలో తిరువూరు ప్రాంతంలో 800 ఎకరాల్లో నిమ్మతోటలున్నాయి. ఆ జిల్లా రైతులు దగ్గర్లోని ఏలూరు మార్కెట్‌కు వెళుతుంటారు. తెనాలి మార్కెట్ యార్డు ఆవరణలోని నిమ్మ మార్కెట్లో ప్రతిరోజూ లావాదేవీలు జరుగుతుంటాయి. ఇక్కడ్నుంచి ఉత్తర భారతదేశంలోని కాశీ, కోల్‌కతా, ఢిల్లీ, కాన్పూర్‌కు ఎగుమతి చేస్తున్నారు. సీజనులో 12 లారీలకుపైగా అన్ సీజనులో నాలుగైదు లారీల సరుకు ఎగుమతి అవుతుంటుంది.

నికరమైన ఆదాయం

నిమ్మతోటలు ఏటా జూలై, డిసెంబరు, మే నెలల్లో మూడు కాపులనిస్తాయి. ఒక కాపు మూడేసి నెలలు దిగుబడి నిస్తుంటాయి. ప్రతి కాపునకు సుమారు 200 టిక్కీల వరకు కాయ దిగుబడి వస్తుంది. కాయ సైజు ఆధారంగా ఒక్కో టిక్కీకి 55 కిలోలు వస్తాయి. కొన్నేళ్లుగా నిమ్మతోటల రైతులకు నికరమైన ఆదాయం వస్తున్నందున, కౌలు ధరలు పెరిగాయి. ఎకరా కౌలు రూ.90 వేల నుంచి రూ.1.20 లక్షల వరకు చేరిన సందర్భాలున్నాయి. ఎరువులు, పురుగు మందులు, నీటితడులకు కలిపి ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకూ ఖర్చు చేయాల్సివస్తుంది. అయినా సరే నిమ్మ సాగు లాభిస్తున్నందున మెట్ట ప్రాంతం నుంచి డెల్టా, మాగాణి భూములకు విస్తరించింది.

ఈ ఏడాది భేషుగ్గా...

గతంకన్నా ఈ ఏడాది నిమ్మ సాగు రైతులకు సంతృప్తినిచ్చింది. తెనాలి నిమ్మ మార్కెట్లో కిలో రూ.50 నుంచి రూ.70 మధ్య విక్రయాలు జరుగుతూ వచ్చాయి. గత ఏప్రిల్‌లో కనిష్ట ధర రూ.68, గరిష్టంగా రూ.80కి పైగా కొనుగోళ్లు జరిగాయి. ఏప్రిల్ 24న కిలో రూ.90లకు అమ్మకాలు జరిగాయి. ఏప్రిల్ 28 నుంచి కిలో రూ.65లపైన మార్కెట్ లావాదేవీలు కొనసాగుతూ వచ్చాయి. మే ఒకటో తేదీన గరిష్ట ధర రూ.78 పలికింది. ఫుల్ జోష్‌లో ఉన్న రైతులకు, సీజను ముగింపు దశలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తర్వాత ధరల్లో తగ్గుదల కొంత నిరాశపరిచింది. ఎన్నికల కోసం నాలుగు రోజులు సెలవులివ్వటం, తర్వాత వర్షాలు పడటంతో వ్యాపారులు రేటు తగ్గించినట్టు చెబుతున్నారు. అయినప్పటికీ కిలో రూ.30కిపైగా కొనుగోళ్లు జరుగుతుండటం ఒకింత ఊరట. ఎకరాకు రూ.70 వేల నుంచి రూ.1.25 లక్షల వరకు కౌలుకు తీసుకున్న రైతులు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. జూన్‌లో వచ్చే ఏరువాక పౌర్ణమికి నిమ్మ తోటలకు రైతులు మళ్లీ కౌలు ఒప్పందాలు చేసుకుంటారు.

గతంలో తీవ్ర నష్టాలు

లాభదాయకమైన నిమ్మతోటల సాగు 2017, 2018 సంవత్సరాల్లో రైతులకు చేదు అనుభవాలను మిగిల్చింది. 2017 ఏప్రిల్‌లో కిలో రూ.20–30 మధ్య పలికిన ధర, మరో నెలకు రూ.12–20 మధ్యకు దిగజారింది. జూన్‌లో మరింతగా పతనమై రూ.5 నుంచి రూ.10లకు పడిపోయింది. జులైలో రూ.7లకు మించలేదు. మళ్లీ 2018లోనూ అదే పరిస్థితి ఎదురైంది. కిలో ఆరేడు రూపాయలకు మించటం లేదని రైతులు గొల్లుమన్నారు. కోత కూలీ కూడా దక్కదన్న భావనతో కాపు కోయకుండా వదిలేసిన సందర్భాలున్నాయి. ఖర్చులు లెక్కేసుకుంటే ఒక్కో నిమ్మకాయకు రైతుకు మిగిలేది కేవలం 10 పైసలు మాత్రమే. అప్పట్లో ఈ పరిణామాలు నిమ్మ తోటల కౌలు ఒప్పందాలపైనా నష్టాల ప్రభావం చూపాయి. ఎకరా కౌలు రూ.65 నుంచి రూ.70 వేలకు మించలేదు.

కరోనాలో ఆదుకున్న ప్రభుత్వం

కరోనా మహమ్మారి నిమ్మతోటల కౌలుదార్లను బెంబేలెత్తించింది. దేశవ్యాప్త లాక్‌డౌన్ కారణంగా అమ్మకాలకు బ్రేక్ పడింది. తర్వాత కూడా ఇతర రాష్ట్రాల్నుంచి ఆర్డర్లు లేకుండాపోయాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో మార్కెటింగ్ శాఖ చొరవ తీసుకుని వారానికి మూడు రోజులు కొనుగోళ్లు చేసి, ఆదుకోవడంతో కొంతలో కొంత కోలుకోగలిగాం. అప్పట్లో కేవలం నెల రోజుల్లో 850 టన్నులను రైతుల్నుంచి కొనుగోలు చేసి ఎగుమతి చేసింది. లారీల సమ్మె రోజుల్లోనూ నిమ్మ రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం నిలకడగా మంచి ధర లభిస్తుండటంతో ఫర్వాలేదని చెబుతున్నారు.

మిగులు గ్రాములు లెక్కిస్తే మేలు



నిమ్మ కాపు కాస్త తగ్గినప్పటికీ నిమ్మకాయ ధరలు ఈ ఏడాది సంతృప్తికరంగా ఉన్నాయి. మార్కెట్ యార్డులో మిగులు గ్రాములు లెక్కలోకి తీసుకోవటం లేదు. 10 కిలోల 500 గ్రాములు తూకం వస్తే 10 కిలోలకే లెక్కిస్తున్నారు. దీనివల్ల రైతులకు నష్టం. గ్రాములను కూడా పరిగణనలోకి తీసుకుంటే మాకు మేలు జరుగుతుంది. – కొత్త రమేష్‌బాబు, నిమ్మ రైతు, సంగంజాగర్లమూడి

ఘనంగా సత్యదేవుని రథోత్సవం



అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరంలో కొలువైన రత్నగిరి వాసుడు శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం సత్యదేవుని రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు రథాన్ని తొలిపావంచా వద్దకు తీసుకువచ్చి విద్యుత్ దీపాలు, పుష్పమాలలతో అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ సాయంత్రం 5 గంటలకు స్వామి, అమ్మవార్లకు పూజలు చేసిన అనంతరం కొబ్బరి కాయ కొట్టి దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈవో రామచంద్రమోహన్ ప్రారంభించారు. అనంతరం భక్తులు, సిబ్బంది, ధవళేశ్వరం నుంచి వచ్చిన ప్రత్యేక నిపుణులు రథాన్ని ముందుకు లాగారు. తొలిపావంచా నుంచి ఆంధ్రాబ్యాంక్ వరకు అక్కడ నుంచి దేవస్థానం హైస్కూల్ వద్ద గల టోల్‌గేట్ వరకు, తిరిగి తొలిపావంచా వరకు రథోత్సవం సాగింది. 200 మంది కళాకారులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. రూ.1.4 కోట్లతో ఈ రథాన్ని తయారు చేయించారు. 36 అడుగుల ఎత్తు, 14.6 అడుగుల వెడల్పు, 21 అడుగుల పొడవు కలిగిన ఈ రథంపై స్వామి, అమ్మవార్లను ఊరేగించడం ఇదే ప్రథమం. రథోత్సవం సందర్భంగా బుధవారం సాయంత్రం నుంచి అన్నవరంలోకి వచ్చే వాహనాలను జాతీయ రహదారి మీదుగా మళ్లించారు. రథోత్సవం పూర్తయ్యేవరకు మెయిన్‌రోడ్డులో విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

మిల్లెట్స్‌తో బుద్ధుని చిత్రపటం



బుద్ధుని చిత్రపటం వద్ద ప్రార్థనలు చేస్తున్న బౌద్ధ భిక్షువులు

ఏయూక్యాంపస్ (విశాఖ): బుద్ధ పూర్ణిమను పురస్కరించుకుని విశాఖకు చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ మిల్లెట్స్‌తో బుద్ధభగవానుని చిత్రపటాన్ని తీర్చిదిద్దారు. 4 అడుగుల ఎత్తు, 3 అడుగుల వెడల్పు కలిగిన ఈ చిత్రపటాన్ని 20 రోజులు శ్రమించి తీర్చిదిద్దారు. ఏయూ అంతర్జాతీయ వసతిగృహంలో బౌద్ధ భిక్షువుల సమక్షంలో ఈ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. బౌద్ధ భిక్షువులు ఈ చిత్రపటం ముందు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మిల్లెట్స్ ఉపయోగించి ఎంతో కళాత్మకంగా, సహజత్వంతో చిత్రపటాన్ని తీర్చిదిద్దిన విజయ్ కుమార్‌ను సత్కరించారు.

తెలంగాణ

అప్ అండ్ డౌన్ అదే రైలు..

హైదరాబాద్‌కు చెందిన వివేక్ విజయవాడకు అత్యవసరంగా వెళ్లాల్సి వచ్చి వందేభారత్‌లో టికెట్ బుక్ చేసుకున్నాడు. కానీ, ఆ రోజు రైలు దాదాపు మూడు గంటలు ఆలస్యంగా బయలుదేరింది. తక్కువ టికెట్ ధర ఉన్న రైళ్ల కంటే ఆలస్యంగా అది విజయవాడకు చేరింది. వందేభారత్ సర్వీసు మొదలైన 16 నెలల కాలంలో ఈ తరహా సమస్యలు తక్కువే, కానీ, ఇటీవల తరచు చోటు చేసుకుంటున్నాయి. వెంటవెంటనే ఏర్పడుతుండటం ఇటు ప్రయాణికులకు చికాకు తెప్పిస్తుండగా, రైల్వే అధికారులను కలవరపెడుతున్నాయి.

గంటల తరబడి ఆలస్యంగా నడుస్తున్న 'వందేభారత్'

- గత వారంరోజుల్లో నాలుగు పర్యాయాలు విశాఖపట్నం రైలులో జాప్యం
- వారం క్రితం ఏకంగా ఐదు గంటల లేట్ జర్నీ
- రెండు రోజుల క్రితం రెండు గంటల జాప్యం



సాక్షి, హైదరాబాద్: భారతీయ రైల్వే ఆధునికతకు అద్దంపడుతూ దూసుకొచ్చిన 'వందేభారత్'కూ సాంకేతిక సమస్యలు తప్పడం లేదు. రైళ్లలో సాంకేతిక సమస్యలు సాధారణమే అయినా, క్రమంగా ఆ సమస్య పెరుగుతోంది. దూర ప్రాంతాల మధ్య తిరిగే సాధారణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు మూడు జతల రేకు(ఓ రైలు సెట్) ఉంటుంది. ప్రయాణ సమయం దాదాపు 26 గంటలు తీసుకునే హైదరాబాద్–ఢిల్లీ తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌ను తీసుకుంటే.. హైదరాబాద్‌లో ఉదయం ఒక రైలు బయలు దేరగా, దాని ఒక జత రైలు అదే రోజు ఢిల్లీలో బయలుదేరుతుంది. మరో జత రైలు దారిలో ఉంటుంది. తక్కువ దూరం తిరిగే వాటికి రెండు జతలుంటాయి.

- హైదరాబాద్–విశాఖపట్నంలాంటి సాధారణ దూరం తిరిగే (సగం రోజు ప్రయాణ సమయం) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను తీసుకుంటే.. ఒక రైలు హైదరాబాద్‌లో బయలుదేరుతుంటే, అదే సమయానికి దాని జత రైలు విశాఖపట్నంలో బయలుదేరుతుంది.
- హైదరాబాద్‌లో ఉదయం బయలుదేరే తిరుపతి వందేభారత్ రైలు, అదే రోజు మధ్యాహ్నం తిరుపతి చేరుకొని, కాసేపటికే అక్కడ బయలుదేరి రాత్రి హైదరాబాద్‌కు చేరుకుంటుంది. దేశంలోని అన్ని వందేభారత్ రైళ్లది ఇదే తీరు. ఇక్కడే ఇప్పుడు సమస్య ఏర్పడుతోంది. ఒక చోట రైలు బయలుదేరేప్పుడు సాంకేతిక సమస్య ఏర్పడి ఆలస్యంగా బయలుదేరితే, గమ్యస్థానం చేరి, తిరిగి అక్కడ బయలుదేరేందుకు జాప్యం తప్పటం లేదు.
- ఈనెల 16న విశాఖపట్నంలో హైదరాబాద్ వచ్చే వందేభారత్ రైలు మూడు గంటలు ఆలస్యంగా బయలుదేరింది. విజయవాడలో మరో రెండు గంటలు ఆలస్యమైంది. వెరసి ఐదు గంటలు ఆలస్యంగా హైదరాబాద్ చేరుకుంది. సాధారణ రోజుల్లో హైదరాబాద్‌లో మధ్యాహ్నం 3 గంటలకు తిరుగుప్రయాణం ఉండాల్సి ఉండగా, ఐదు గంటలు ఆలస్యంగా రాత్రి 8 గంటలకు ఆ రైలు బయలుదేరాల్సి వచ్చింది.

ఒక కోచ్‌లో సాంకేతిక సమస్య తలెత్తితే రైలు ఆగిపోవాల్సిందే..

ఇక వందేభారత్ డిజైన్ కూడా ఈ జాప్యానికి మరో కారణమవుతోంది. ఇది సంప్రదాయ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు భిన్నంగా ఉంటుంది. డెమూ, మెమూ తరహాలో రెండు ఇంజిన్లు రైలులో అంతర్భాగంగా ఉంటాయి. మూడునాలుగు కోచ్‌లు కలిపి ఒక సెట్‌గా ఉంటుంది. దీనికి పవర్‌కార్ జత కలిసి ఉంటుంది. హైదరాబాద్‌లో ఎంఎంటీఎస్ రైళ్లు కూడా ఇదే డిజైన్‌తో ఉంటాయి. ఓ కోచ్‌లో సాంకేతిక సమస్య తలెత్తితే, ఆ కోచ్ ఉండే సెట్ మొత్తాన్ని తొలగించి దాని స్థానంలో మరో సెట్ చేర్చి రైలును పంపేస్తారు. తర్వాత.. సాంకేతిక సమస్య తలెత్తిన కోచ్‌ను డిపోనకు తీసుకెళ్లి మరమ్మతు చేస్తారు. ఇందుకోసం స్పేర్ కోచ్‌లను అందుబాటులో ఉంచుతారు. హైదరాబాద్‌లో ఎంఎంటీఎస్ సర్వీసుకు 12 కోచ్‌లతో కూడిన రెండు రేక్‌లు స్పేర్ విధుల్లో ఉన్నాయి. కానీ వందేభారత్‌కు స్పేర్ చోక్ సెట్‌లు లేవు. ఓ కోచ్‌లో సమస్య తలెత్తితే దానికి మరమ్మతు చేసేవరకు మొత్తం రైలును నిలిపివేయాల్సిందే. వారంరోజుల క్రితం విశాఖపట్నం నుంచి ఐదు గంటలు ఆలస్యంగా రావటానికి ఇదే కారణమైంది.

రైలులో దంపతులపై బీరు సీసాతో దాడి

అసోంకు చెందిన సత్య బర్మాన్ దాష్టీకం

కాకినాడ క్రైం: కాకినాడ నుంచి ముంబై వెళుతున్న లోకమాన్య తిలక్ టెర్మినల్ (ఎల్‌టీటీ) రైల్‌లో బుధవారం ఉదయం ఓ అనూహ్య ఘటన జరిగింది. జనరల్ బోగీలో కూర్చున్న దంపతులపై ఓ వ్యక్తి పగులగొట్టిన బీరు సీసాతో విరుచుకుపడ్డాడు. వివరాలను జీఆర్‌పీ ఎస్‌ఐ రవికుమార్ వెల్లడించారు. తాడేపల్లిగూడెంకు చెందిన మన్యం రవికుమార్, భవానీ దంపతులు మంగళవారం కాకినాడ వచ్చారు. రవికుమార్ అనారోగ్యంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొంది బుధవారం ఉదయం స్వస్థలం తాడేపల్లిగూడెంకు ఎల్‌టీటీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరారు. ఉదయం 9 గంటల సమయంలో రైలు కాకినాడ పోర్టు స్టేషన్ నుంచి బయల్దేరి టౌన్ రైల్వేస్టేషన్‌కు చేరుకోగానే అసోంకు చెందిన సత్య బర్మాన్ అనే వ్యక్తి ఒక్కసారిగా బోగీలోకి ప్రవేశించి అప్పటికే పగులగొట్టిన బీరు సీసాతో దంపతులపై దాడికి తెగబడ్డాడు. తోటి ప్రయాణికులు నిందితుడిని పట్టుకుని చేతిలో ఉన్న బీరు సీసా లాక్కుని దేహశుద్ధి చేశారు. ఈ లోపు అక్కడికి చేరుకున్న రైల్వే పోలీసులు హత్యకు యత్నించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని గాయపడ్డ దంపతులను కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు.

ఏసీబీకి చిక్కిన జిల్లా పరిశ్రమల శాఖ జీఎం

కాకినాడ రూరల్: కాకినాడ జిల్లా పరిశ్రమల కేంద్రం (డీఐసీ) జనరల్ మేనేజర్ (జీఎం) టి.మురళి అవినీతి నిరోధక శాఖ అధికారుల వలలో చిక్కారు. ఐస్ ఫ్యాక్టరీకి సబ్సిడీ సొమ్ము విడుదలకు లంచం డిమాండ్ చేస్తూ ఏడాదిగా కార్యాలయం చుట్టూ తిప్పడంతో బాధితుడు పెమ్మాడి శ్రీనివాసకుమార్ ఏసీబీని ఆశ్రయించారు. కాకినాడలో ఓ హోటల్ బయట కారులో ఉండి రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా డీఐసీ జీఎం మురళిని ఏసీబీ రాజమహేంద్రవరం డీఎస్పీ శ్రీహరిరాజు ఆధ్వర్యంలోని బృందం అరెస్టు చేసింది. నిందితుడు మురళిని రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టు జడ్జి ముందు హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు.

కనుల పండువగా గంగమ్మ విశ్వరూప దర్శనం

- ముగిసిన తిరుపతి గంగమ్మ జాతర మహోత్సవం
- భారీగా తరలివచ్చిన భక్తజనం



విశ్వరూప ప్రతిమ చెంపనరకడంతో ఆ మట్టి కోసం ఎగబడుతున్న భక్తులు



చిత్తూరు గంగమ్మ జాతరలో ఓం శక్తి భక్తులు

తిరుపతి కల్చరల్/చిత్తూరు రూరల్ (కాణిపాకం): తిరుపతి శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న జాతరలో భాగంగా మంగళవారం అర్ధరాత్రి భక్తులకు గంగమ్మ విశ్వరూప దర్శన భాగ్యం ప్రసాదించింది. భారీగా తరలివచ్చిన భక్తజనం అమ్మవారి అపురూప దర్శనంతో పులకించిపోయారు. అమ్మవారి శరణుఘోషతో ఆ ప్రాంతం మార్మోగింది. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వరూపంలో కొలువైన తల్లికి హారతి ఇచ్చి భక్తులను దర్శనానికి అనుమతించారు. జాతర చివరి రోజు అనగా మంగళవారం రాత్రి పేరంటాల వేషధారుడు కైకాల కులస్థుడు నగర పుర వీధుల్లో విహరిస్తూ భక్తుల పూజలందుకున్నారు. బుధవారం వేకువజామున శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి చేరుకొని గంగమ్మ తల్లి విశ్వరూప ప్రతిమ చెంపనరకడంతో జాతర సమాప్తమైంది. అమ్మవారి విశ్వరూప ఘట్టాన్ని చూసేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. గంగమ్మ విశ్వరూప ప్రతిమ బంకమట్టి కోసం ఎగబడ్డారు. అనంతరం పేరంటాలు శ్రీతాళ్లపాక పెద్ద గంగమ్మ ఆలయానికి చేరుకొని అక్కడ కొలువైన పెద్ద గంగమ్మ విశ్వరూప ప్రతిమ చెంపనరకడంతో జాతర ఘట్టం దిగ్విజయంగా ముగిసింది.

వైభవంగా గంగమ్మ జలధివాసం

చిత్తూరు జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి గంగమ్మ జలాధివాసం వైభవంగా నిర్వహించారు. తొలుత గంగమ్మ తల్లికి విశేష పూజలు చేసి నగర వీధుల్లో ఊరేగించారు. అనంతరం గంగమ్మ తల్లి ప్రతిమను భక్తిశ్రద్ధలతో నీటిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఓం శక్తి విన్యాసాలు ఆకట్టుకున్నాయి. సుమారు 800 మంది భక్తులు నోటికి, శరీర భాగాలకు శూలాలు గుచ్చుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై హత్యాయత్నం

- కేజీహెచ్‌లో కిచిత్స పొందుతున్న బాధితుడు
- ఆరుగురు నిందితుల అరెస్టు



విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితుడు పొన్నపు కుమార్

నర్సీపట్నం (అనకాపల్లి జిల్లా): ఓటమి భయంతో టీడీపీ మూకలు వైఎస్సార్‌సీపీ శ్రేణులపై వరుస దాడులకు తెగబడుతున్నాయి. ఐదు రోజుల క్రితం ధర్మసాగరంలో ఒంటరి మహిళపై టీడీపీ అనుచరులు దుశ్శాసనుల్లా వ్యవహరించిన తీరు మరువక ముందే.. నర్సీపట్నం మున్సిపాలిటీలో మరో ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పెదబొడ్డేపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త పొన్నపు కుమార్‌పై మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు అనుచరులైన టీడీపీ గూండాలు కత్తులతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితుడు ప్రాణాపాయస్థితిలో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు అందించిన వివరాలు ఇలావున్నాయి. వైఎస్సార్‌సీపీలో కుమార్ క్రియాశీలకంగా వ్యవహరించడంతో టీడీపీకి చెందిన జల్లూరి రాజా అలియాస్ యేసు, జల్లూరి రాజు, జల్లూరి లోవరాజు, జల్లూరి కిషోర్‌కుమార్, జల్లూరి చిన్న, సీరం అజయ్‌కుమార్ తదితరులు కొంతకాలంగా రాజకీయంగా ఆయనపై కక్ష పెంచుకున్నారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పనిచేయడంతో జీర్ణించుకోలేక పథకం ప్రకారం కత్తులు, రాడ్లతో దాడి చేసి చంపాలని చూశారు. దళితవాడలో తన అన్నయ్య ఇంటికి వెళ్లి తిరిగి బైక్‌పై వస్తుండగా టీడీపీకి చెందిన 13 మంది ఆయనను చుట్టుముట్టి కత్తితో పొట్టపై గాయపరచి హత్యాయత్నానికి పాల్పడ్డారు.

కాగా, పొన్నపుకుమార్‌పై హత్యాయత్నం కేసులో ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని టౌన్ సీఐ కాంతికుమార్ తెలిపారు. నిందితుల్లో జల్లూరి రాజా అలియాస్ యేసు, జల్లూరి రాజు, జల్లూరి లోవరాజు, జల్లూరి కిషోర్‌కుమార్, జల్లూరి చిన్న, సీరం అజయ్‌కుమార్ ఉన్నారని సీఐ తెలిపారు.

ఇరు రాష్ట్రాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి

శ్రీవారి దర్శనం అనంతరం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి



తిరుమల: ఇరు రాష్ట్రాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీవారిని ప్రార్థించానని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సీఎం హోదాలో ఆయన తొలిసారిగా తిరుమల వెళ్లారు. బుధవారం ఉదయం వీఐపీ విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలసి ఆలయం వద్దకు చేరుకున్నారు. మహా ద్వారం వద్ద ఆలయ అధికారులు, అర్చకులు రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికారు. తొలుత ధ్వజ స్తంభం వద్ద నమస్కరించిన అనంతరం రేవంత్, ఆయన కుటుంబ సభ్యులు శ్రీవారిని దర్శించుకున్నారు. తర్వాత రంగ నాయకుల మండపంలో పండితులు వారికి వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయం వెలుపల రేవంత్ మాట్లాడారు. ఇరు రాష్ట్రాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీవారిని ప్రార్థించానని చెప్పారు. శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం, కల్యాణ మంటపాలు, సత్రాలు నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం టీటీడీకి సహకరిస్తుందన్నారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో రైతులు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు.

జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో సాంకేతిక లోపం

బోగీల మధ్య తెగిన ఎలక్ట్రికల్ కనెక్షన్ కప్లర్



సమస్య తలెత్తిన కోచ్‌లను తొలగించిన సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం నుంచి లింగంపల్లి వెళ్తున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు బుధవారం పెనుముప్పు తప్పింది. ఉదయం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బయల్దేరుతున్న సమయానికి రైలులో సాంకేతిక లోపం తలెత్తింది. ఎం–1, డి–1 కోచ్‌ల మధ్య ఉండే ఎలక్ట్రికల్ కనెక్షన్ కప్లర్ ఊడిపోవడమే దీనికి కారణం. సమస్యను గుర్తించిన వెంటనే డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ ఆదేశాలతో ఈ రెండు కోచ్‌లను తక్షణమే మార్చారు. ఈ కారణంగా విశాఖపట్నంలో ఉదయం 6.20 గంటలకు బయల్దేరాల్సిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఉదయం 9.30 గంటలకు బయల్దేరింది. సమస్య పరిష్కారమవడంతో ప్రయాణికులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

తెలంగాణ

అణుపరీక్షతో దేశం గర్వించింది

ఆటమిక్ ఎనర్జీ కమిషన్ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ చిదంబరం

లాలాపేట (హైదరాబాద్): భారతదేశంలో తొలిసారిగా నిర్వహించిన అణుపరీక్ష దేశం గర్వించదగినదని.. అప్పటి అణుపరీక్షలో కీలక పాత్ర పోషించిన ఆటమిక్ ఎనర్జీ కమిషన్ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.చిదంబరం స్పష్టం చేశారు. అణుపరీక్ష నిర్వహించి యాభైఏళ్లు పూర్తయిన సందర్భంగా నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్స్, తెలంగాణ సైన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సంయుక్తంగా బుధవారం తార్నాకలోని ఐఐసీటీ ఆడిటోరియంలో స్మైలింగ్ బుద్ధా గోల్డెన్ జూబ్లీ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఆర్.చిదంబరం 'మే 1974 టెస్ట్ అండ్ బియాండ్' అనే అంశంపై ప్రసంగిస్తూ అణుపరీక్షను 75 మంది బృందంతో కలిసి నిర్వహించినట్లు తెలిపారు. ఆ బృందంలో ఓ సభ్యుడిగా వ్యవహరించానని వివరించారు. అణుపరీక్ష నుంచి వెలువడిన శక్తితో రాళ్లు సైతం కరిగిపోయాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌సీ చైర్మన్ డాక్టర్ కోమల్ కపూర్, తెలంగాణ సైన్స్ అకాడమీ జనరల్ సెక్రటరీ, ఓయూ మాజీ వీసీ ప్రొఫెసర్ ఎస్.సత్యనారాయణ, సీసీఎంబీ మాజీ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ మోహన్‌రావు, డాక్టర్ ఎ.జ్యోతి, ప్రొఫెసర్ ఎస్ఎం రెడ్డి పాల్గొన్నారు.

గోపీచంద్‌కు యార్లగడ్డ అభినందన



గోపీచంద్‌కు ఎన్టీఆర్ స్మారక నాణేన్ని అందిస్తున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

సాక్షి, అమరావతి: అంతరిక్ష యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకున్న తెలుగు తేజం గోపీచంద్ తోటకూరను రాజ్యసభ మాజీ సభ్యుడు, పద్మభూషణ్ పురస్కార గ్రహీత ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ అభినందించారు. బుధవారం అమెరికాలోని గోపీచంద్ నివాసానికి వెళ్లి భారత తొలి అంతరిక్ష పర్యాటకుడిగా చరిత్ర సృష్టించారని ఆయన్ని లక్ష్మీప్రసాద్ అభినందించారు. రాకేశ్ శర్మ తర్వాత రోదసి యాత్ర చేసిన రెండో భారతీయుడిగా, తొలి తెలుగు వ్యక్తిగా గుర్తింపు సాధించడం గొప్ప విషయమన్నారు. దివంగత నందమూరి తారక రామారావు స్మారకార్థం భారత ప్రభుత్వం విడుదల చేసిన వంద రూపాయల నాణెన్ని ఈ సందర్భంగా గోపీచంద్‌కు బహూకరించారు.

మాచర్లలో దాడులకు తెగబడిందే టీడీపీ

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు యోనా రాజు ఆరోపణ

సాక్షి, అమరావతి: మాచర్లలో అరాచకాలకు పాల్పడింది టీడీపీ నేతలేనని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనా రాజు విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఓటర్లను ఓటు వేయకుండా బ్రహ్మారెడ్డి అడ్డుకున్నారని ఆయన పేర్కొన్నారు. తాడేపల్లిలో బుధవారం ఆయన మాట్లాడుతూ... 'పేద మహిళలనూ కొట్టి తరిమేశారు. అక్కడి వాస్తవాలను కప్పిపుచ్చి పోలీసులు, ఎన్నికల కమిషన్ అధికారులు కూటమికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని' ..యోనా రాజు ఆరోపించారు. రెంటచింతల మండలం పాల్వాయి గేటులోని 201, 202 పోలింగ్ బూత్‌లలో టీడీపీ నేతలు రిగ్గింగ్‌కు పాల్పడ్డారని, వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను ఓటు వేయనివ్వకుండా టీడీపీ పచ్చ మూకలు అడ్డుకున్నాయని తెలిపారు. ఓటర్లు బూత్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో టీడీపీ నేతలు దాడులకు తెగబడ్డారని, ఆ పార్టీ నేతల రిగ్గింగ్ పై పోలీసులు, ఎన్నికల అధికారులకు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఫిర్యాదులు చేసినా, పోలీసులు పట్టించుకోలేదని ఆయన చెప్పారు.

మైనర్‌ను గర్భవతిని చేసి నిమ్స్‌లో వదిలేశాడు!

- నల్లగొండ జిల్లాకు చెందిన ఒక యువకుడి నిర్వాకం
- అది మాజీ ప్రజాప్రతినిధి కుమారుడి నిర్వాకంగా ప్రచారం

లక్డీకాపూల్ (హైదరాబాద్): నల్లగొండ జిల్లాకు చెందిన ఓ యువకుడు.. మాయమాటలు చెప్పి ఓ మైనర్ బాలికను లోబర్చుకున్నాడు.. ఆమె గర్భం దాల్చడంతో గుట్టుచప్పుడు కాకుండా హైదరాబాద్‌లోని 'నిమ్స్ (నిజాం వైద్య విజ్ఞాన సంస్థ)'ఆస్పత్రికి తీసుకువచ్చాడు.. తనకు పరిచయం ఉన్న ఓ ఉద్యోగి సాయంతో నిమ్స్ అధికారిని కలిశాడు.. ఆ అధికారి సహకారంతో మైనర్ గర్భిణిని నిమ్స్ ఆస్పత్రిలో అడ్మిట్ చేయించాడు. కానీ ఈ విషయం బయటికి లీకైంది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు రంగంలోకి దిగి సమగ్ర దర్యాప్తు చేపట్టారు.

మూడు రోజులుగా ఆస్పత్రిలో..

నల్లగొండ జిల్లా నకిరేకల్ ప్రాంతానికి చెందిన ఓ బాలిక (16 ఏళ్లు) కడుపులో నొప్పితో బాధపడుతోందని చెప్తూ.. ఒక యువకుడు మూడు రోజుల క్రితం నిమ్స్ ఆస్పత్రికి తీసుకువచ్చాడు. అప్పటికే ఆమె నాలుగు నెలల గర్భవతి అని, ఆమెను వదిలించుకోవాలనే ఉద్దేశంతోనే తీసుకువచ్చాడని సమాచారం. ఈ విషయం వెలుగులోకి రాకుండా ఉంచేందుకు నిమ్స్‌లో తనకు తెలిసినవారితో కలసి ప్రయత్నించాడని తెలిసింది. వైద్యులు బాలికకు వైద్య పరీక్షలు చేసినప్పుడు.. ఆమె గర్భవతి అని గుర్తించినా, కప్పిపుచ్చే ప్రయత్నం జరిగినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిజానికి ఆమెకు చికిత్స ఏదీ అవసరం లేకున్నా.. ఆశ్రయం ఇచ్చే ఉద్దేశంతో మిలీనియం బ్లాక్ రూమ్ నంబర్ 322లో ఇన్‌పేషెంట్‌గా చేర్చుకున్నట్టు తెలిసింది. వారు ఇలా ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ విషయం బయటికి పొక్కింది. విషయం సీరియస్‌గా మారుతోందని గుర్తించిన నిమ్స్ వర్గాలు.. బుధవారం బాలికను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసి చేతులు దులుపుకొనేందుకు ప్రయత్నించాయని సమాచారం. అయితే పోలీసులు నిమ్స్‌కు చేరుకుని బాలికను నల్గొండకు తరలించినట్టు ప్రచారం జరుగుతోంది. బాలికను మోసం చేసిన సదరు యువకుడు ఆమెకు బావ అవుతాడని ఓవైపు.. ఓ మాజీ ప్రజాప్రతినిధి కుమారుడే కారణమని మరోవైపు ప్రచారం జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే పోలీసులు ఈ వ్యవహారంపై మౌనం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆరో విడత స్థానాల్లో...
కాంగ్రెస్ ఖాతా తెరిచేనా?



58 స్థానాలకు శనివారం పోలింగ్

- 2019లో ఒక్కటీ నెగ్గని కాంగ్రెస్
- 40 స్థానాలు గెలుచుకున్న బీజేపీ

ఏడు విడతలుగా జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటిదాకా ఐదు దశల్లో 428 స్థానాలకు ఎన్నికలు ముగిశాయి. మిగతా 115 లోక్‌సభ స్థానాలకు మే 25న ఆరు, జూన్ 1న ఏడో విడతలో పోలింగ్ జరగనుంది. దాంతో 42 రోజుల సుదీర్ఘ పోలింగ్ ప్రక్రియ ముగుస్తుంది. ఆరో విడతలో మొత్తం 58 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. హరియాణాలోని మొత్తం 10 సీట్లు, రాజధాని ఢిల్లీలోని 7 స్థానాలూ వీటిలో ఉన్నాయి. ఈ 58 స్థానాల్లో 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 44 చోట్ల బరిలో దిగినా కనీసం ఒక్క సీటు కూడా నెగ్గలేకపోయింది. అధికార బీజేపీ మాత్రం 53 చోట్ల పోటీ చేసి ఏకంగా 40 స్థానాలను కైవసం చేసుకోవడం విశేషం! అంతేగాక వాటిలో ఏకంగా 90 శాతం స్థానాల్లో 40 శాతం పై చిలుకు ఓట్లు సాధించింది! ఈ నేపథ్యంలో ఆ 40 స్థానాలనూ నిలబెట్టుకోవడం బీజేపీకి ప్రతిష్టాత్మకంగా మారింది. కానీ ఆప్‌తో జతకట్టిన కాంగ్రెస్ నుంచి అధికార పార్టీ ఈసారి గట్టి పోటీ ఎదుర్కొంటోంది. ఏడో విడతలో పోలింగ్ జరగనున్న పంజాబ్‌లో ఆప్, కాంగ్రెస్ విడిగా పోటీ చేస్తున్నా హరియాణా, ఢిల్లీల్లో మాత్రం ఇండియా కూటమి భాగస్వాములుగా బరిలో దిగాయి. హరియాణాలో 9, ఢిల్లీలో 3 చోట్ల కాంగ్రెస్, మిగతా స్థానాల్లో ఆప్ బీజేపీకి పెను సవాలు విసురుతున్నాయి. దీనికి తోడు హరియాణాలో రైతుల అసంతృప్తి బీజేపీకి మరింత ప్రతికూలంగా మారేలా కన్పిస్తోంది.



ఆరో విడతలో పోలింగ్ జరగనున్న 58 లోక్‌సభ స్థానాల్లో గత మూడు ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ ప్రదర్శన

2019లో బీజేపీదే హవా!

ఆరో విడతలో పోలింగ్ జరుగుతున్న 58 లోక్‌సభ స్థానాల్లో 2019 ఎన్నికల్లో బీజేపీయే పూర్తి ఆధిపత్యం చలాయించింది. ఆరు స్థానాల్లోనైతే ఏకంగా 35 శాతం పై చిలుకు మెజారిటీ సాధించడం విశేషం. అవి కర్నాల్ (6.6 లక్షల మెజారిటీ), ఫరీదాబాద్ (6.4 లక్షలు), వెస్ట్ ఢిల్లీ (5.8 లక్షలు), నార్త్ వెస్ట్ ఢిల్లీ (5.5 లక్షలు), ధన్‌బాద్ (4.9 లక్షలు), భివానీ (4.4 లక్షలు). ఏ స్థానంలో అయినా మూడు వరుస ఎన్నికల్లో కనీసం రెండుసార్లు నెగ్గిన పార్టీని అక్కడ గట్టి పోటీదారుగా రాజకీయ విశ్లేషకులు పేర్కొంటారు. ఆ లెక్కన ఆరో విడత స్థానాల్లో బీజేపీ కనీసం 30 స్థానాల్లో గట్టి పోటీదారుగా ఉంది. కాంగ్రెస్‌కు మాత్రం అలాంటి స్థానం కేవలం హరియాణాలోని రోహ్‌తక్ మాత్రమే. అక్కడ కూడా 2009, 2014ల్లో నెగ్గినా 2019లో మాత్రం వెంట్రుకవాసిలో బీజేపీకి కోల్పోవడం విశేషం!

– సాక్షి, నేషనల్ డెస్క్

బీజేపీ కంచుకోటలు 5

ఆరో విడతలో పోలింగ్ జరగనున్న 58 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్‌కు కంచుకోటగా చెప్పదగ్గ సీటు ఒక్కటీ లేకపోవడం విశేషం. బీజేపీకి ఐదున్నాయి. బీజేపీ జార్ఖండ్‌లో ధన్‌బాద్, జెంషెడ్‌పూర్; బిహార్‌లో పూర్వీ చంపారన్, పశ్చిమ చంపారన్, శివోహర్ స్థానాలను చాలా ఏళ్లుగా గెలుచుకుంటూ వస్తోంది. ఒడిశాలోని కటక్, ఢెంకెనాల్, కియోంఝర్, పూరి స్థానాల్లో బీజేడీకి ఎదురు లేదు. అలాగే పశ్చిమ బెంగాల్లో కాంథీ, తామ్లుక్ లోక్‌సభ స్థానాలు తృణమూల్ కంచుకోటలు. ఆరో విడత స్థానాల్లో 2019లో 5 చోట్ల పోరు హోరాహోరీగా సాగింది. అయితే వాట న్నింట్లోనూ బీజేపీయే విజేతగా నిలవడం విశేషం! మఛ్‌లీషహర్ (యూపీ) నియోజకవర్గంలోనైతే బీజేపీ అభ్యర్థి భోలానాథ్ కేవలం 198 ఓట్ల (0.02 శాతం) మెజారిటీతో గట్టెక్కారు! శ్రావస్తి (యూపీ), రోహ్‌తక్ (హరియాణా), సంబాల్‌పూర్ (ఒడిశా), ఝార్‌గ్రాం (పశ్చిమ బెంగాల్) స్థానాలను కూడా బీజేపీ ఒక్క శాతం కంటే తక్కువ మెజారిటీతో గెలిచి ఊపిరి పీల్చుకుంది. అయితే ఆరో విడత పోలింగ్ జరుగుతున్న 58 స్థానాలకు సంబంధించి ఒక ఆసక్తికరమైన అంశముంది! వీటిలో మూడింట ఒక స్థానంలో ప్రజలు ప్రతి ఎన్నికలోనూ కొత్తవారిని గెలిపిస్తూ వస్తుండటం ఆసక్తికరం.

ప్రధాని కావాలని లేదు

- ఆప్ 22 చోట్ల పోటీ చేస్తున్న చిన్న పార్టీ
- 'మలివాల్'పై పారదర్శక దర్యాప్తు జరగాలి
- నా భార్య రాజకీయాల్లోకి రాబోదు
- పీటీఐ ఇంటర్వ్యూలో కేజ్రీవాల్

న్యూఢిల్లీ: విపక్ష ఇండియా కూటమి కేంద్రంలో అధికారంలోకి వస్తే ప్రధాని కావాలన్న ఆశ తనకు అస్సలు లేదని ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. అయితే ఇండియా కూటమి గెలిస్తే న్యాయ వ్యవస్థను ఒత్తిళ్ల నుంచి విముక్తం చేస్తామన్నారు. తన భార్య సునీతకు రాజకీయాలు నచ్చవని వెల్లడించారు. బెయిల్‌పై విడుదలయ్యాక బుధవారం ఆయన తొలిసారి పీటీఐ వీడియోస్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. సొంత రాజ్యసభ ఎంపీ స్వాతీ మలివాల్‌పై తన ఇంట్లోనే పీఏ బిభవ్ కుమార్ దాడి చేసిన ఉదంతంపై కేజ్రీవాల్ తొలిసారి స్పందించారు. వివరాలు ఆయన మాటల్లోనే...

నియంతృత్వాన్ని నిలువరిస్తాం

''బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే విపక్ష నేతలందర్నీ కట్టగట్టి జైలుకు పంపుతుంది. ఎన్నికలను హైజాక్ చేస్తుంది. రష్యా మాదిరే ఏకపక్ష ఎన్నికలుంటాయి. అక్కడ పుతిన్ విపక్ష నేతల్ని జైలుకు, కొందర్ని పైకి పంపారు. అందుకే తాజా ఎన్నికల్లో 87 శాతం ఓట్లు సాధించారు. పాకిస్థాన్‌లోనూ అంతే. ఇమ్రాన్ ఖాన్‌ను జైలుకు పంపారు. సొంత పార్టీ గుర్తును కూడా ఎన్నికల్లో వాడుకోనివ్వలేదు. బీజేపీ మళ్లీ గెలిస్తే ఎవ్వరినీ వదలదు. కానీ మోదీ నియంతృత్వ పాలనను నిలువరిస్తాం. ఇండియా కూటమి 300 మార్కు దాటుతుంది. చక్కటి, సుస్థిర ప్రజాపాలన సాగిస్తాం. నాకు ప్రధాని కావాలనే ఆలోచనే లేదు. మాది (ఆప్) చాలా చిన్న పార్టీ. కేవలం 22 చోట్ల పోటీ చేస్తున్నాం. ప్రధానిగా రాహుల్‌ను నేను అంగీకరిస్తానా అన్నది ఊహాజనిత ప్రశ్న. అలాంటి అంశాలు చర్చకే గెలిచాక అందరం కలిసి కూర్చొని దీనిపై చర్చిస్తాం.

సానుకూల పవనాలు ఊహించిందే

ఆప్ 2015 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 67 సీట్లు, 2020లో 62 సీట్లు సాధించింది. ఈసారి ఆప్-ఇండియా కూటమికి సానుకూల పవనాలు వీయడంలో ఆశ్చర్యమేమీ లేదు. నన్ను అరెస్టు చేయడంతో ఢిల్లీ ఓటర్లు భావోద్వేగానికి గురయ్యారు. ఆ ప్రజాగ్రహం బీజేపీ ఓటమికి కారణం కాబోతోంది. నాకు బెయిల్ దొరకడం నిజంగా దేవుడి మాయ. నన్ను జైలుకు పంపితే ఆప్ ముక్కలుచెక్కలవుతుందన్న బీజేపీ కల కలగానే మిగిలిపోయింది.



మలివాల్ ఉదంతంలో బాధితులకు న్యాయం జరగాలి

మలివాల్‌పై దాడి కేసు విచారణ నిష్పాక్షికంగా జరగాలి. రెండు వైపుల వాదనలను ఆలకించి పోలీసులు సరైన మార్గంలో దర్యాప్తు జరపాలి. నిజమైన బాధితులకు న్యాయం జరగాలి. ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నందున ఇంతకు మించి మాట్లాడలేను.

న్యాయవ్యవస్థపై ఒత్తిళ్లుండవ్

ఇండియా కూటమి అధికార పగ్గాలు చేపడితే న్యాయవ్యవస్థపై రాజకీయ ఒత్తిళ్లు లేకుండా చేస్తాం. ఆ వ్యవస్థ స్వతంత్రంగా పని చేస్తుంది. అప్పుడు నాపై మోపిన కేసులన్నీ బోగస్ అని తేలుతాయి. అందుకే జూన్ 4 ఫలితాల తర్వాత విపక్షాల కూటమి గెలిచాక కేసుల నుంచి విముక్తుడినవుతా. ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించి బీజేపీ, ఈడీ ఆరోపించినట్లు నగదు అక్రమ బదిలీ జరగలేదు. ఈ కేసులో వాళ్లింతవరకు ఒక్క పైసా కూడా కనుక్కోలేకపోయారు. అవినీతి జరిగి ఉంటే ఆ నగదు అంతా ఎటు పోయినట్లు?

సునీతది ధర్మాగ్రహం

2000 దశకంలో ఢిల్లీ మురికివాడల పరిధిలో ఐటీ కమిషనర్‌గా పని చేశా. పదవీ విరమణ చేసి ప్రజా జీవితంలోకి వచ్చా. సొంతంగా పార్టీ పెడతానని, ఎన్నికల్లో పోటీ చేస్తానని, ఏకంగా సీఎం అవుతానని అస్సలు ఊహించలేదు. నా భార్య సునీతకు రాజకీయాలపై ఆసక్తి లేదు. భవిష్యత్తులోనూ క్రియాశీల రాజకీయాల్లోకి రాదు. నన్ను అక్రమంగా అరెస్టు చేసినందుకే తను ఇల్లు దాటి బయటికొచ్చి ధర్మాగ్రహం చూపింది. సునీత భార్య కావడం నా అదృష్టం. జీవితంలో ప్రతి సందర్భంలోనూ నాకు తోడుగా నిలిచింది. నేను జైల్లో ఉండగా నాకు, ఢిల్లీ ప్రజలకు వారధిగా నిలిచింది. కస్టడీ ముగిసి నేను జైలుకెళ్తే సీఎంగా బాధ్యతల నిర్వహణకు తగిన వసతులు కల్పించాలని కోర్టును కోరతా.

ముందస్తు ఎన్నికలకు సునాక్

జూలై 4న బ్రిటన్ సార్వత్రిక ఎన్నికలు

లండన్: ముందస్తు ఎన్నికలపై జోరుగా సాగిన ఊహాగానాలే నిజమయ్యాయి. పలు రకాలుగా సాగిన ఊహాగానాలకు తెరదించుతూ జూలై 4న బ్రిటన్ సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయని ప్రధానమంత్రి రిషి సునాక్ బుధవారం ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని రాజు చార్లెస్-3కి తెలిపానని, పార్లమెంట్ రద్దుకు ఆయన అనుమతించారని వెల్లడించారు. వేసవిలో ఆరు వారాల్లో ఎన్నికలకు వెళుతున్నట్లు చెప్పారు. అధికారిక నివాసం 10 డౌనింగ్ స్ట్రీట్‌లో కేబినెట్ భేటీ అనంతరం భారతీయ సంతతి బ్రిటన్ ప్రధాని సునాక్ ముందస్తు ఎన్నికల ప్రకటన చేశారు. షెడ్యూల్ ప్రకారమైతే 2025 జనవరిలోగా బ్రిటన్ సార్వత్రిక ఎన్నికలు జరగాల్సి ఉంది. 10 డౌనింగ్ స్ట్రీట్ బయట ఎన్నికల ప్రకటన చేస్తూ.. తన పదవీకాలంలో సాధించిన విజయాలను సునాక్ వివరించారు. 'మీకు వీలైనంత భద్రత ఇవ్వడానికి నా అధికార పరిధికి లోబడి చేయగలిగినంతా చేస్తాను. ఇది నా హామీ. బ్రిటన్ తన భవిష్యత్తును ఎంచుకోవాల్సిన తరుణమిది' అని రిషి సునాక్ దేశ ప్రజలనుద్దేశించి అన్నారు. సునాక్ కన్జర్వేటివ్ పార్టీకి ఓటమి తప్పదని, లేబర్ పార్టీకి విస్పష్ట మెజారిటీ కనిపిస్తోందని చాలా ఒపీనియన్ పోల్స్ స్పష్టం చేశాయి. ఇటీవల జరిగిన ఉప ఎన్నికలు, స్థానిక ఎన్నికల్లో వరుసబెట్టి లేబర్ పార్టీయే గెలుస్తూ వచ్చింది.



ఈ తరుణంలో రిషి సునాక్ ముందస్తు ఎన్నికలకు వెళ్లే సాహసం చేయడం గమనార్హం. అంతకుముందు బుధవారమే పార్లమెంటులో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సునాక్ బదులిస్తూ ఈ ఏడాది ద్వితీయార్ధంలో ఎన్నికలుంటాయని చెప్పారు. అయితే ఆకస్మికంగా కేబినెట్ భేటీని ఏర్పాటు చేయడంతో ముందస్తు ఎన్నికలపై ఊహాగానాలు జోరందుకున్నాయి. ఆకస్మిక కేబినెట్ భేటీ కోసం విదేశాల్లో ఉన్న మంత్రులు సైతం అర్ధంతరంగా తమ పర్యటనలు ముగించుకొని స్వదేశానికి చేరుకున్నారు. చివరికి కేబినెట్ సమావేశం అనంతరం సునాక్ జూలై 4న ఎన్నికలుంటాయని ప్రకటించారు.

శాటిలైట్లను పేల్చేసే ఉపగ్రహం ప్రయోగించిన రష్యా

వాషింగ్టన్: శత్రుదేశాలైన అమెరికా, రష్యా అంతరిక్ష యుద్ధానికి తెరతీస్తున్నాయా? ఇప్పటి పరిణామాలు చూస్తే అదే నిజమనిపిస్తోంది. రష్యా అంతరిక్ష సంస్థ ఈ నెల 16న భూదిగువ కక్ష్యలోకి ఉపగ్రహాన్ని ప్రయోగించిందని అమెరికా రక్షణ శాఖ ప్రధాన కార్యాలయం పెంటగాన్ ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ పాట్ రైడర్ మంగళవారం చెప్పారు. ఇది అంతరిక్షంలోని ఉపగ్రహాలను పేల్చేసే సామర్థ్యం కలదని వెల్లడించారు. ఇప్పటికే అదే కక్ష్యలో ఉన్న తమ ప్రభుత్వ ఉపగ్రహం 'యూఎస్ఏ 314'ను దెబ్బతీయడానికే రష్యా ఈ చర్యకు పూనుకుందని ఆరోపించారు. దీనిపై రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మారియా జఖరోవా స్పందించారు. ఈ నెల 17న సోయుజ్-2.1బీ వాహక నౌక ద్వారా 'కాస్మోస్ 2576' ప్రయోగించిన మాట నిజమేనని పేర్కొన్నారు. అయితే, ఈ ప్రయోగం తమ రక్షణ శాఖ ప్రయోజనాలకే తప్ప మరో ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. అమెరికా ఉపగ్రహం, రష్యా తాజాగా ప్రయోగించిన ఉపగ్రహం ఒకే కక్ష్యలో ఉన్నాయని అంతరిక్ష నిపుణులు చెప్పారు. ఉక్రెయిన్ సైన్యానికి సహకరించే అమెరికా శాటిలైట్లను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తామని రష్యా ఇటీవలే హెచ్చరికలు జారీ చేయడం గమనార్హం.

బెంగాల్‌లో బంగ్లా ఎంపీ హత్య

మృతదేహం కోసం కొనసాగుతున్న అన్వేషణ

కోల్‌కతా/ఢాకా: చికిత్స కోసం భారత్‌కు వచ్చిన బంగ్లాదేశ్‌కు చెందిన ఆవామీ లీగ్ ఎంపీ అన్వరుల్ అజీమ్ అన్వర్ దారుణ హత్యకు గురయ్యారు. కోల్‌కతాలోని న్యూటౌన్ లగ్జరీ అపార్ట్‌మెంట్‌లో పోలీసులు రక్తపు మరకలను గుర్తించారు. మృతదేహం కోసం పోలీసుల అన్వేషణ కొనసాగుతోంది. నిందితులు, హత్యకు గల కారణాల కోసం పోలీసులు వెతుకుతున్నారు. బంగ్లా సీనియర్ నేత హత్యోదంతాన్ని ఇరుదేశాల ప్రభుత్వాలు సీరియస్‌గా తీసుకున్నాయి. పశ్చిమబెంగాల్ సీఐడీ విభాగం ఈ కేసు దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసులో ముగ్గురు నిందితులను ఢాకాలోని వరీ ప్రాంతంలో అరెస్ట్‌చేశారు.



కోల్‌కతాకొచ్చి కనిపించకుండాపోయి..

మే 12వ తేదీన ఎంపీ అన్వర్ నార్త్ కోల్‌కతాలోని బారానగర్‌లో తనకు పరిచయస్తుడైన గోపాల్ బిశ్వాస్ ఇంటికి వచ్చారు. మే 13వ తేదీ మధ్యాహ్నం డాక్టర్ అపాయింట్‌మెంట్ ఉందని చెప్పి అన్వర్ బయటకు వెళ్లారు. రాత్రి భోజనానికి వస్తానని చెప్పి వెళ్లిన వ్యక్తి ఎంతకీ రాకపోవడంతో గోపాల్‌కు అనుమానమొచ్చింది. అయితే అత్యవసర పని మీద ఢిల్లీకి వెళ్తున్నానని, వీఐపీలను కలబోతున్నానని వాట్సాప్ సందేశాలు వచ్చాయి. తర్వాత మే 17వ తేదీదాకా ఆయన నుంచి ఎలాంటి మెసేజ్‌లు, ఫోన్‌కాల్స్ రాకపోవడంతో మే 18వ తేదీన మిస్సింగ్ కంప్లయింట్ ఇచ్చారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు అన్వర్ ఫోన్ జాడను కనిపెట్టే పనిలో పడ్డారు. మే 13న అన్వర్ చివరిసారిగా సంజీబ్ ఘోష్‌కు చెందిన అపార్ట్‌మెంట్‌లో లోపలికి ఇద్దరు వ్యక్తులు, ఒక మహిళతో వెళ్లినట్లు సీసీటీవీలో రికార్డయింది. మే 15, 17 తేదీల్లో ఆ గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు, మహిళ ఆ అపార్ట్‌మెంట్ నుంచి బయటికొచ్చారుగానీ అన్వర్ రాలేదు. అన్వర్ మృతదేహాన్ని ముక్కలుగా చేసి ఎక్కడో పడేసి ఉంటారని సీఐడీ ఐజీ అఖిలేశ్ అనుమానం వ్యక్తం చేశారు.

ఇబ్రహీం రైసీకి ఇరాన్ వీడ్కోలు

సంతాప సభలో నివాళులర్పించిన భారత ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్

టెహ్రాన్: హెలికాప్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీకి దేశ రాజధాని టెహ్రాన్ ప్రజలు ఘన తుది వీడ్కోలు పలికారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయాతొల్లాహ్ అలీ ఖమేనీ సైతం నివాళులర్పించారు. బుధవారం సంతాప ర్యాలీలో టెహ్రాన్ సిటీ వీధుల గుండా భారీ వాహనం మీద రైసీ పార్థివదేహాన్ని తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో ఇరానీయన్లు పాల్గొని తమ నేతకు తుది వీడ్కోలు పలికారు. భారత్ తరఫున ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ బుధవారం టెహ్రాన్ వెళ్లి రైసీకి నివాళులర్పించారు. మహిళా, మానవ హక్కుల హననానికి పాల్పడి 'టెహ్రాన్ కసాయి'గా పేరుబడినందుకే రైసీ సంతాప ర్యాలీలో తక్కువ మంది పాల్గొన్నారని అంతర్జాతీయ మీడియా వ్యాఖ్యానించింది. సంతాప ర్యాలీలో ఖమేనీ పక్కనే తాత్కాలిక దేశాధ్యక్షుడు మహమ్మద్ మొఖ్బర్ ఏడుస్తూ కనిపించారు. బుధవారం ఖమేనీ మినహా మాజీ దేశాధ్యక్షులెవరూ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనకపోవడం గమనార్హం. రైసీ మృతికి సంతాపంగా భారత్‌లోనూ ఒక రోజు సంతాపదినం పాటించారు.

విమానంలో స్టాండింగ్

ముంబై: బస్సు, రైల్లో ప్రయాణికులు నిలబడి ప్రయాణించడం చూస్తుంటాం. కానీ విచిత్రంలో విమానంలో ఓ వ్యక్తి నిలబడి వెళ్లేందుకు సిద్ధపడ్డాడు. ఈ ఘటన ముంబై నుంచి వారణాసి వెళ్లే ఫ్లైట్‌లో మంగళవారం జరిగింది. ముంబైలోని ఛత్రపతి శివాజీ ఎయిర్‌పోర్ట్‌లో ఇండిగో ఫ్లైట్ టేకాఫ్ అవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పుడు ఓ ప్రయాణికుడు నిలబడి ఉండటం చూసిన సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే అతడిని దింపేశారు. ఆ ప్రయాణికుడు ఇండిగో ఉద్యోగి. సిబ్బంది ఎయిర్‌లైన్ టికెట్లను తగ్గించడంలో భాగంగా కలిగించే ప్రయోజనం స్టాఫ్ లీజర్ ట్రావెల్‌లో భాగంగా ప్రయాణిస్తున్నాడు. (సిబ్బందికి ఇలా ప్రయాణించే అవకాశం ఉంటుంది) టేకాఫ్‌కు ముందు తనిఖీ చేయగా.. ఇండిగో ఫ్లైట్‌లో రావాల్సిన ఓ ప్రయాణికుడు రాలేదనే సమాచారం వచ్చింది. ఆ సీటును స్టాండ్‌బైగా ఇండిగో ఉద్యోగికిచ్చారు. తీరా ఫ్లైట్‌లోకి వెళ్లాక చూస్తే ప్రయాణికుడు ఉన్నాడు. దీంతో ఉద్యోగి నిలబడ్డాడు. అది సిబ్బంది గుర్తించి, నిలిపివేయడంతో టేకాఫ్ ఆలస్యమైంది. అది బోర్డింగ్ ప్రాసెస్ తప్పిదంగా గుర్తించారు.

పాలస్తీనా స్వతంత్ర దేశం

- అధికారికంగా గుర్తిస్తున్నాం..
- నార్వే, ఐర్లాండ్, స్పెయిన్ కీలక ప్రకటన

టెల్ అవీవ్: పాలస్తీనా విషయంలో నార్వే, ఐర్లాండ్, స్పెయిన్ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నాయి. స్వతంత్ర పాలస్తీనా దేశాన్ని తాము గుర్తిస్తున్నామని బుధవారం ప్రకటించాయి. ఈ నెల 28న ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించబోతున్నాయి. నార్వే, ఐర్లాండ్, స్పెయిన్ దేశాల తాజా ప్రకటనను పాలస్తీనియన్లు స్వాగతించారు. పాలస్తీనా దేశాన్ని ఇప్పటికే భారత్ సహా దాదాపు 140 దేశాలు అధికారికంగా గుర్తించాయి. అంటే ఐక్యరాజ్యసమితిలో సభ్యత్వం కలిగిన మొత్తం దేశాల్లో మూడింట రెండొంతుల కంటే ఎక్కువ దేశాలు పాలస్తీనాను గుర్తిస్తున్నాయి. తాజాగా మరో మూడు దేశాలు ఈ జాబితాలో చేరడం విశేషం.

శాంతి, సామరస్యం కోసమే..

తూర్పు జెరూసలేం, వెస్ట్ బ్యాంక్, గాజా స్ట్రిప్‌ను కలిపి ప్రత్యేక పాలస్తీనాను దేశంగా గుర్తించాలని లక్షలాది మంది పాలస్తీనియన్లు దశాబ్దాలుగా పోరాడుతున్నారు. 1967లో జరిగిన మిడిల్‌ఈస్ట్ యుద్ధంలో ఆ మూడు ప్రాంతాలను ఇజ్రాయెల్ ఆక్రమించుకుంది. ప్రస్తుతం తూర్పు జెరూసలేం, వెస్ట్ బ్యాంక్, గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ నియంత్రణ కొనసాగుతోంది. పాలస్తీనా దేశాన్ని గుర్తించకపోతే మధ్యప్రాచ్యంలో శాంతి, సామరస్యం నెలకొల్పడం సాధ్యం కాదని నార్వే ప్రధాని జోనస్ గహర్ పేర్కొన్నారు. ఐర్లాండ్‌కు, పాలస్తీనాకు ఇదొక చరిత్రాత్మకమైన, ముఖ్యమైన రోజు అని ఐర్లాండ్ ప్రధాని సైమన్ హ్యారిస్ వ్యాఖ్యానించారు. తమ నిర్ణయం ఇజ్రాయెల్‌సహా ఎవరికీ వ్యతిరేకం కాదని స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ స్పష్టంచేశారు.

హంతకులకు, రేపిస్టులకు బంగారు పతకాలా?

పాలస్తీనాను ఒకదేశంగా గుర్తిస్తూ నార్వే, ఐర్లాండ్, స్పెయిన్ చేసిన ప్రకటన పట్ల ఇజ్రాయెల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మూడు దేశాల నుంచి తమ రాయబారులను వెనక్కి పిలిపించింది. తమ దేశంలో ఉన్న నార్వే, ఐర్లాండ్, స్పెయిన్ దౌత్యవేత్తలకు సమన్లు జారీ చేసింది. తద్వారా తమ నిరసనను తెలియజేసింది. హమాస్ హంతకులకు, రేపిస్టులకు నార్వే, ఐర్లాండ్, స్పెయిన్ బంగారు పతకాలు బహూకరిస్తున్నాయని, ఈ పరిణామాన్ని చరిత్ర గుర్తుపెట్టుకుంటుందని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి కట్జ్ పేర్కొన్నారు.

పక్షి ఈక 23.66 లక్షలు

ఒక పక్షి ఈక విలువెంత? సున్నా అనుకుంటున్నారా? మీరు పొరపాటు పడినట్లే. న్యూజిలాండ్‌లో నిర్వహించిన ఓ వేలంపాటలో పక్షి ఈక అక్షరాలా రూ.23,66,007(28,417డాలర్లు) పలికింది. ఇది పవిత్రమైన హుయియా పక్షి ఈక కావడమే ఇందుకు కారణం. దశాబ్దాల క్రితం నాటి అరుదైన ఈ ఈకను న్యూజిలాండ్‌లోని వెబ్స్ వేలం కేంద్రంలో తాజాగా వేలం వేశారు. ఔత్సాహికుడొకరు సొంతం చేసుకున్నారు. ఇదొక ప్రపంచ రికార్డు. పిట్ట ఈకకు ఈ స్థాయిలో ధర పలకడం చరిత్రలో ఇదే తొలిసారి. న్యూజిలాండ్‌లోని మవోరీ ప్రజలకు హుయియా పక్షిని దైవంగా భావిస్తారు. వారి తెగ పెద్దలు తలపై ఈ పక్షి ఈకలను తలపై కిరీటంగా అలంకరించుకొనేవారు. ప్రజలు బహుమతులుగా ఇచ్చిపుచ్చుకొనేవారు. ఈకల క్రయవిక్రయాలు కూడా జరిగేవి. హుయిమా పక్షులు దాదాపు అంతరించిపోయాయి. చివరిసారిగా 1907లో కనిపించినట్లు నిర్ధారణ అయ్యింది.



ఎలక్షన్ బీట్

కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు పాకిస్తాన్ సానుభూతిపరులు

- అక్కడ అణుబాంబులు ఉంటే, ఇక్కడ 56 అంగుళాల ఛాతీ ఉంది
- ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ స్పష్టీకరణ



బస్తీ/శ్రావస్తి: కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు పాకిస్తాన్ సానుభూతిపరులు అని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. పాకిస్తాన్ వద్ద అణుబాంబులు ఉన్నాయంటూ ఆ రెండు పార్టీలు మన దేశాన్ని బెదిరింపులకు గురి చేస్తున్నాయని మండిపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లో 2017 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ నాయకుడు అఖిలేష్ యాదవ్ కలిసి ప్రచారం చేసి బొక్కబోర్లా పడ్డారని ఎద్దేవా చేశారు. ఆ ఇద్దరు యువరాజుల ఫ్లాప్ సినిమా రీరిలీజ్ అవుతుండడం ఆశ్చర్యంగా ఉందన్నారు. బుధవారం ఉత్తరప్రదేశ్‌లోని బస్తీ, శ్రావస్తిలో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలపై విరుచుకుపడ్డారు. ఒకప్పుడు ఉగ్రవాదంతో మనల్ని భయపెట్టాలని చూసిన పాకిస్తాన్ ఇప్పుడు తిండి లేక అల్లాడుతోందని చెప్పారు. పాకిస్తాన్ పని అయిపోయిందని తేల్చిచెప్పారు. అయినప్పటికీ పాకిస్తాన్ సానుభూతిపరులైన కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు మనల్ని బెదిరించడంలో బిజీగా ఉన్నాయని ధ్వజమెత్తారు. పాకిస్తాన్ వద్ద అణుబాంబులు ఉంటే, ఇండియాలో 56 అంగుళాల ఛాతీ ఉందని వ్యాఖ్యానించారు. పొరుగు దేశాలను చూసి బెదిరిపోవడానికి ఇక్కడున్నది కాంగ్రెస్ ప్రభుత్వం కాదని, బలమైన మోదీ ప్రభుత్వమని స్పష్టంచేశారు.

ఆర్మీకి అగ్నివీర్ అక్కర్లేదు: రాహుల్ గాంధీ



మహేంద్రగఢ్(హరియాణా): దేశ జవాన్లను ప్రధాని మోదీ కార్మికుల స్థాయికి దిగజారుస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం హరియాణాలోని మహేంద్రగఢ్-భివానీ లోక్‌సభ నియోజకవర్గంలో రాహుల్ ఎన్నికల ప్రచారసభలో ప్రసంగించారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన రాహుల్ హరియాణాలో ప్రచారం చేయడం ఇదే తొలిసారి. '' అగ్నివీర్ పథకం మోదీ పథకం. ఇది ఆర్మీ తెచ్చింది కాదు. అసలు ఇలాంటి పథకాన్ని ఆర్మీ అస్సలు కోరుకోలేదు. విపక్షాల 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే ఈ పథకాన్ని బుట్టదాఖలుచేస్తుంది. యువ జవాన్ల చేతుల్లో దేశ సరిహద్దులు భద్రంగా ఉన్నాయి. ఈ దేశభక్తి యువత డీఎన్ఏలోనే ఉంది. అలాంటి యువ జవాన్లను మోదీ కార్మికుల స్థాయికి దిగజార్చుతున్నారు. బీజేపీ ప్రభుత్వం వేస్తున్న లెక్కలను చూస్తే ఆర్మీలో రెండు రకాల అమరవీరులు ఉంటారు. ఒకరు సాధారణ జవానుకాగా మరొకరు అధికారి. ఒకరికి పెన్షన్, అమరవీరుడనే హోదా, ప్రభుత్వ ప్రయోజనాలు దక్కుతాయి. మరోవైపు పేద కుటుంబం నుంచి వచ్చి అగ్నివీర్‌గా ఆర్మీలో పనిచేసి వైదొలగిన వ్యక్తికి ఎలాంటి పెన్షన్ రాదు, అమరవీరుడనే గౌరవం దక్కదు, క్యాంటీన్ సదుపాయాలు ఉండవు'' అని ఆగ్రహంగా మాట్లాడారు.

రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నారు

బీజేపీపై ప్రియాంకా గాంధీ ధ్వజం

గోడ్డా (జార్ఖండ్): బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చివేయాలని కంకణం కట్టుకుందని, గడిచిన పదేళ్లలో పార్లమెంటు, న్యాయవ్యవస్థలను బలహీనపరిచిందని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ అన్నారు. గోడ్డాలో బుధవారం ఒక ఎన్నికల సభలో మాట్లాడుతూ కేంద్ర విధానాలను వ్యతిరేకించే వారందరినీ బాధితులను చేశారని ఆరోపించారు. ఒకవేళ బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే వారు రాజ్యాంగాన్ని మార్చివేసి రిజర్వేషన్లకు కోత పెడతారన్నారు. 'ప్రధాని నరేంద్ర మోదీ జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్‌ను తప్పుడు కేసుల్లో జైలుకు పంపారు. ఆయన భార్య కల్పన సివంగిలా పోరాడుతున్నారు. హేమంత్ సోరెన్‌ను జైల్లో పెడితే తమకు అడ్డు లేకుండా ఉంటుందని బీజేపీ భావించింది. కానీ గిరిజనలు ఆ పార్టీ గిరిజన వ్యతిరేక విధానాలపై గట్టి పోరాడుతున్నారు. గతంలో పార్లమెంటులో చట్టాలు చేయడానికి చర్చలు జరిగేవి.. కానీ ఇప్పుడు బీజేపీ నాయకులు ప్రతిపక్షంపై దాడి చేయడానికే పార్లమెంటు ఉపయోగపడుతోంది' అని ప్రియాంక అన్నారు.


సభలో కల్పనతో ప్రియాంకా గాంధీ

ప్రసంగాలు శృతిమించుతున్నాయి: ఈసీ

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల ప్రచారారంలో ప్రసంగాలూ శృతిమించుతున్నాయని కేంద్ర ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. నేతలు, స్టార్ క్యాంపెయినర్లు కులం, మతం ప్రస్తావనలు తేవడాన్ని ఆక్షేపించింది. భద్రతా బలగాలు, రాజ్యాంగంపై వ్యాఖ్యలు గాడి తప్పుతున్నాయని మండిపడింది. ఈ విషయంలో నేతలు తమ తీరును మార్చుకునేలా, నియంత్రణ పాటించేలా ఆదేశాలు జారీ చేయాలంటూ బీజేపీ, కాంగ్రెస్ అధ్యక్షులు నడ్డా, ఖర్గేలకు బుధవారం ఈసీ నోటీసులు జారీ చేసింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే చర్యలు తప్పవని హెచ్చరించింది. బీజేపీ స్టార్ క్యాంపెయినర్లు సమాజంలో విభజనకు దారితీసే మతపరమైన ప్రసంగాలకు దూరంగా ఉండాలని ఆ పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాకు ఈసీ సూచించింది. లేదంటే ప్రచారంపై నిషేధం విధిస్తామని సూటిగా చెప్పింది. ఎన్నికల ప్రచారంలో స్టార్ క్యాంపెయినర్లు అసంబద్ధ ప్రకటనలు చేస్తూ.. రక్షణ దళాలను ప్రతిష్టను దెబ్బతీయవద్దని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు సూచించింది.

భారత సంతతి శాస్త్రవేత్తకు 'షా' అవార్డ్



హాంకాంగ్: విద్యుదయస్కాంత కిరణాలను వెదజల్లే న్యూట్రాన్ నక్షత్రాలు, నక్షత్రాల పేలుడు, గామాకిరణాల వెల్లువ వంటి ఖగోళ అంశాలపై విశేష పరిశోధనలకు గుర్తింపుగా భారతీయ అమెరికన్ శాస్త్రవేత్త శ్రీనివాస్ రామచంద్ర కులకర్ణి.. ప్రఖ్యాత 'షా' అవార్డ్‌కు ఎంపికయ్యారు. శ్రీనివాస్ ప్రస్తుతం అమెరికాలోని కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఆస్ట్రానమీ, ప్లానెటరీ సైన్స్, డివిజన్ ఆఫ్ ఫిజిక్స్, మేథమేటిక్స్, ఆస్ట్రానమీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. అమెరికాలోని పలోమర్ ట్రాన్సియెంట్ ఫ్యాక్టరీలో ఆ తర్వాత జ్వికీ ట్రాన్సియెంట్ ఫ్యాక్టరీల్లో టెలిస్కోప్‌ల సాయంతో రోదసీలో నిర్దిష్ట ప్రాంతంలోని ఖగోళ అంశాలను పరిశీలించి వాటిపై విశేష పరిశోధనలు చేసినందుకుగాను ఈ అవార్డ్‌ను శ్రీనివాస్‌కు ప్రదానం చేయనున్నారు. 2024 సంవత్సరానికి ఆస్ట్రానమీ విభాగంలో శ్రీనివాస్‌కు అవార్డ్ ఇస్తున్నట్లు షా ప్రైజ్ ఫౌండేషన్ మంగళవారం ప్రకటించింది.

అమెరికాలో రోడ్డు ప్రమాదం ముగ్గురు భారత విద్యార్థుల మృతి

వాషింగ్టన్: అమెరికాలోని జార్జియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు భారతీయ అమెరికన్ విద్యార్థులు దుర్మరణం చెందారు. వీరు ప్రయాణిస్తున్న కారు వేగంగా వెళుతున్నప్పుడు డ్రైవర్ వాహనంపై అదుపు కోల్పోవడంతో పల్టీలు కొట్టి రోడ్డు పక్కనున్న చెట్లను ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రియా అవసరాల, అన్వి శర్మ, ఆర్యన్ జోషి మృతి చెందారు. రిత్విక్ సోమేపల్లి, కారు డ్రైవర్ మొహమ్మద్ గాయపడ్డారు. వీరందరి వయసు 18 ఏళ్లే. శ్రియా, అన్వి జార్జియా యూనివర్సిటీ విద్యార్థులు. ఆర్యన్ జోషి అల్ఫరెటా హైస్కూల్‌లో చదువుతున్నాడు.

సాక్షి 24|7
తమిళనాడు
TAMILNADU
గురువారం : 23 : మే : 2024

పట్టుబడిన మూడో చిరుత

తిరువొత్తియూరు: నెల్లై జిల్లా పాపనాశం పశ్చిమ కనుమల దిగువ ప్రాంతంలోని వీకే పురం సమీపంలోని వెంబయ్యపురం, అంపూర్ సమీపంలోని అనవన్ నివాస ప్రాంతాల్లో చిరుత దాడిలో వరుసగా మేకలు బలయ్యాయి. దీంతో ఆ చిరుతను పట్టుకునేందుకు అటవీశాఖ వారు ఇనుప బోను ఏర్పాటు చేసింది. 18న వెంబయ్యపురం ప్రాంతంలో ఉంచిన బోనులో చిరుతపులి పట్టుబడింది. తర్వాత వెంబయ్యపురం ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఇనుప బోనులో మరో ఆడ చిరుత మంగళవారం రాత్రి చిక్కుకుంది. ఇదే క్రమంలో ఆనవన్ వద్ద ఉంచిన బోనులో బుధవారం ఉదయం మూడో చిరుత పట్టుబడింది. దీంతో స్థానికులు, రైతులు, మేకల కాపరులు ఊపిరి పీల్చుకున్నారు.

పేదరిక నిర్మూలనకు.. తాయుమానవర్

రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు త్వరలో మరో కొత్త పథకం అమల్లోకి రానుంది. అసెంబ్లీలో ప్రకటించిన మేరకు తాయుమానవర్ పేరిట ఈ పథకాన్ని 5 లక్షల కుటుంబాలకు వర్తింపజేయడానికి కసరత్తు మొదలైంది. అలాగే 'ప్రజలతో సీఎం' కార్యక్రమానికి మళ్లీ శ్రీకారం చుట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. జూలై 15 నుంచి ఈ కార్యక్రమం పునః ప్రారంభం కానుంది.

- కొత్త పథకం అమలుకు కసరత్తు
- 5 లక్షల కుటుంబాలకు లబ్ధి
- అట్టడుగున ఉన్న పేద వర్గాల గుర్తింపునకు చర్యలు
- మళ్లీ ప్రజల్లోకి సీఎం స్టాలిన్
- జూలై 15 నుంచి శ్రీకారం




సీఎం స్టాలిన్‌తో ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు, సీఎస్ శివదాస్ మీన (ఫైల్), పేదల గుడిసెలు

సాక్షి, చెన్నై: అధికార పగ్గాలు చేపట్టినానంతరం సీఎం స్టాలిన్ వినూత్న పథకాలు, కార్యక్రమాలతో ముందుకెళ్తున్నారు. ఈ క్రమంలో మూడేళ్ల పాలనను ఈనెల 7వ తేదీతో విజయవంతంగా పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. ఈ కాలంలో ప్రజాహితాన్ని కాంక్షిస్తూ కొత్త పథకాలతో పాటు విద్య, వైద్య, ఉద్యోగాల కల్పన, పేదరిక నిర్మూలన దిశగా ఎన్నో బృహత్తర పథకాలను అమల్లోకి తెచ్చారు. వాటి ఫలితంగా రాష్ట్రంలో పేదరికం తగ్గుతున్నట్టుగా ఇటీవల నీతి అయోగ్ నివేదిక తేటతెల్లం చేసింది. అదే సమయంలో పేదరికాన్ని త్వరితగతిన నిర్మూలించే దిశగా రానున్న రెండేళ్లకాలంలో మరో బృహత్తర పథకం అమలు దిశగా అసెంబ్లీ వేదికగా బడ్జెట్ సమావేశాల్లో సీఎం స్టాలిన్ ప్రకటన చేశారు. దీనిని కార్యరూపంలోకి తెచ్చేందుకు అధికారులు కసరత్తు మొదలెట్టారు.

తాయుమానవర్ పేరిట..

2024–25 సంవత్సర బడ్జెట్‌లో తాయుమానవర్ పథకం ప్రస్తావనను ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు తీసుకొచ్చారు. లోక్ సభ ఎన్నికల ఫలితాల తదుపరి ఈ పథకం అమలు చేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన కసరత్తు ప్రస్తుతం మొదలైంది. రూ. 27,922 కోట్లు ఈ పథకానికి కేటాయిస్తూ, రానున్న రెండేళ్లలో 5 లక్షల పేదల కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగు పరిచే దిశగా అనేక కార్యక్రమాలు చేపట్టబోతున్నారు. ఇందులో భాగంగా జూన్ నెలలో అట్టడుగున ఉన్న పేదలను గుర్తించే పనులకు శ్రీకారం చుట్టనున్నారు. తాయుమానవర్ పథకం పరిధిలో ఆదరణ లేని పేదలు, ఒంటరి వృద్ధులు, తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు, వివిధ రుగ్మతలతో పాటు మానసిక, ప్రత్యేక సమస్యలతో ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలను సైతం తీసుకొచ్చే విధంగా అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిసింది. వీరితో పాటు అట్టడుగున ఉన్న పేదలకు కావాల్సిన అన్ని రకాల వసతులు, విద్య, వైద్యం, ఉద్యోగం, గృహ కేటాయింపు తదితర అవకాశాలను కల్పించనున్నారు. ఈ పథకం లబ్ధిదారులను గ్రామ సభల నిర్వహణ ద్వారా ఎంపిక చేయడానికి పరిశీలిస్తున్నారు. ఈ మేరకు మార్గదర్శకాలను సైతం వెలువరించేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ పథకం రూపురేఖలపై గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో సీఎస్ శివదాస్ మీన ఇప్పటికే సమాలోచన జరిపినట్లు సచివాలయ వర్గాలు పేర్కొన్నాయి.

మరోసారి..

సచివాలయంలోని సీఎం సెల్ ద్వారానే కాకుండా మీ నియోజకవర్గం స్టాలిన్, ప్రజలతో సీఎం, మీరు క్షేమమా? వంటి బృహత్తర కార్యక్రమాల ద్వారా ప్రజలు తమ విజ్ఞప్తులు, సమస్యలు, విన్నపాలను తెలియజేసుకునే అవకాశం కల్పించారు. ఇందులో గ్రామీణ ప్రజల నుంచి విజ్ఞప్తుల స్వీకరణ, వారి సమస్యల పరిష్కారం దిశగా ఇటీవల ప్రజలతో సీఎం కార్యక్రమాన్ని చేపట్టారు. లోక్‌సభ ఎన్నికలకు ముందుగా ఐదు నెలల పాటు ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. 8. 74 లక్షల విజ్ఞప్తులను అందుకుని పరిష్కారించారు. లోక్‌సభ ఎన్నికల కారణంగా ఈ కార్యక్రమం వాయిదా పడింది. దీంతో మళ్లీ ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన బుధవారం వెలువడింది. జూలై 15వ తేదీ నుంచి సెప్టెంబరు 15వ తేదీ వరకు ప్రజలతో సీఎం కార్యక్రమం నిర్విరామంగా ఉంటుందని ప్రకటించారు. ఇందులో వచ్చే ఫిర్యాదులు, విజ్ఞప్తులు, సమస్యలన్నీ ఆగస్టు 15 నుంచి అక్టోబరు 15లోపు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టనున్నారు. ఈ క్రమంలో 12,525 గ్రామ పంచాయతీలలో 2500లకు పైగా ప్రత్యేక శిబిరాలను సైతం నిర్వహించనున్నారు. వ్యవసాయం, విద్యుత్ తదితర 15 శాఖలకు సంబంధించిన విజ్ఞప్తులను ప్రజలతో సీఎం కార్యక్రమం ద్వారా స్వీకరించనున్నట్లు ప్రకటించారు.

న్యూస్‌రీల్

చెన్నైలో రూ.94 లక్షల హవాలా నగదు స్వాధీనం

అన్నానగర్: చెన్నై బీచ్ రోడ్డులో ఓ ద్విచక్రవాహనదారుడి వద్ద ఉన్న రూ.94 లక్షల హవాలా నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. చెన్నై ప్యారిస్ సమీపంలోని నార్త్ బీచ్ రోడ్డులో మంగళవారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఓ వ్యక్తి సరైన పత్రాలు లేకుండా రూ.94 లక్షలు తీసుకెళ్తున్నట్లు తెలిసింది. దీంతో ఆ వ్యక్తి వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ఆ డబ్బును తన యజమాని చెన్నైలోని మన్నడి ప్రాంతానికి చెందిన మహ్మద్ అనే వ్యక్తికి పంపాడని చెప్పాడు. అయితే ఆ డబ్బుకు సంబంధించిన సరైన పత్రాలు అతని వద్ద లేవు. దీంతో పోలీసులు స్వాధీనం చేసుకున్న నుంగంబాక్కంలో ఆదాయపు పన్ను శాఖకు అప్పగించారు. ఈ మేరకు నార్త్ కోస్ట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాదక ద్రవ్యాల విక్రయం కేసుల్లో 58 మంది అరెస్టు

- 61 కిలోల గంజాయి స్వాధీనం

అన్నానగర్: చెన్నైలో గంజాయి సహా మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్న వ్యక్తులపై పోలీసులు నిఘా పెట్టి అరెస్టు చేస్తున్నారు. ఈక్రమంలో గత 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 58 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి 61 కిలోల గంజాయి, 2.5 గ్రాముల మెథాంఫెటమైన్, 5,789 నొప్పి నివారణ మాత్రలు, 13 సెల్‌ఫోన్లు, రూ.50 వేల నగదు, 8 బైకులు స్వాధీనం చేసుకున్నారు. ఇక గంజాయి, మాదక ద్రవ్యాలను అక్రమంగా తరలించి విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తప్పవని చెన్నై పోలీస్ కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ వెల్లడించారు.

డీఎంకే నేతల తీరుతో ఇక్కట్లు

- పార్టీ అధ్యక్షుడికి కాంగ్రెస్ కార్పొరేటర్ల ఫిర్యాదు

సాక్షి, చెన్నై: అధికార డీఎంకే నేతల తీరుపై చెన్నై కార్పొరేషన్ పరిధిలోని కాంగ్రెస్ కార్పొరేటర్లు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. తమ పనులకు అడ్డు పడుతున్నారని, దీంతో వార్డులలో ఏ ఒక్క పనిచేయించుకోలేని పరిస్థితుల్లో ఉన్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు.. కాంగ్రెస్ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా సెల్వ పెరుంతొగై బాధ్యతలు స్వీకరించినానంతరం స్థానిక, నగర పాలక సంస్థల పదవులలో ఉన్న కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఇతర ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తూ పరిస్థితులను అధ్యయనం చేస్తున్నారు. ఆయా ప్రాంతాలలో పార్టీ పరిస్థితి గురించి సమీక్షిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం చెన్నై కార్పొరేషన్ పరిధిలోని పార్టీ కార్పొరేటర్లుతో ఆయన సమావేశమయ్యారు. ఇందులో కార్పొరేటర్లు తమ వార్డుల పరిధిలో ఎలాంటి ప్రజా ప్రయోజనకర పనులు చేయాల్సి ఉన్నా డీఎంకే నాయకుల అనుమతి పొందాల్సి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని అధిగమించి పనులు చేపడితే ఆదిలోనే అడ్డుకుంటున్నారని ఆరోపించారు. వార్డులలో ఉన్న సమస్యలను సైతం పరిష్కరించలేని పరిస్థితుల్లో ఉన్నామని, స్థానికంగా ఉండే డీఎంకే నేతలు తమకు పెద్దన్నల తరహాలో వ్యవహరిస్తూ క్రెడిట్ అంతా వాళ్లు కొట్టేస్తున్నారని ఆరోపించడం గమనార్హం. వార్డులలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం స్టాలిన్ దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. కాగా సీఎంతో చర్చించి సమస్యను పరిష్కరిస్తానని సెల్వ పెరుంతొగై వారికి హామీ ఇచ్చారు.

రాహుల్ గాంధీపై సెల్లూరు రాజు ట్వీట్ తొలగింపు



సెల్లూరు రాజు, రాహుల్ (ఫైల్)

సాక్షి, చెన్నై: ఏఐసీసీ అగ్ర నేత రాహుల్ గాంధీని పొగడ్తలతో ముంచుతూ ట్వీట్ చేయడంతో పాటు వీడియోను షేర్ చేసిన అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి సెల్లూరు రాజు తన ఎక్స్ పేజీ నుంచి వాటిని తొలగించారు. అధిష్టానం ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. వివరాలు.. రాహుల్ గురించి సామాజిక మాధ్యమం వేదికగా 'తాను చూసిన.. మెచ్చిన యువ నాయకుడు రాహుల్' అన్న వ్యాఖ్యలను తన ఎక్స్ పేజీలో సెల్లూరు రాజు చేసిన విషయం తెలిసిందే. అలాగే విద్యార్థులతో రాహుల్ సహజంగా ముచ్చటిస్తున్నట్టుగా ఓ వీడియోను విడుదల చేసి వార్తలలోకి ఎక్కారు. ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోబోతున్నట్టుగా ఓ వైపు, కాంగ్రెస్‌కు దగ్గరయ్యే ప్రయత్నాలలో అన్నాడీఎంకే ఉన్నట్టుందంటూ మరోవైపు చర్చలు జోరందుకున్నాయి. సెల్లూరు రాజు ట్వీట్‌ను కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు సెల్వ పెరుంతొగైతో పాటు పలువురు నేతలు ఆహ్వానించారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా డీఎంకేతోనే కాంగ్రెస్ కూటమి అని స్పష్టం చేశారు. డీఎంకే వర్గాలు సైతం చమత్కారాలతో వ్యాఖ్యల తూటాలు పేల్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో అన్నాడీఎంకే అధిష్టానం సెల్లూరు రాజుపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసినట్టు వార్తలు వెలువడ్డాయి. దీంతో బుధవారం ట్వీట్‌తో పాటు వీడియోను సెల్లూరు రాజు తొలగించారు. సహజత్వంతో రాహుల్ వ్యవహరిస్తున్న అంశాలను నచ్చే తాను ఆ ట్వీట్ చేసినట్టు ఇందులో ఎలాంటి రాజకీయం లేదని మీడియా ముందు సెల్లూరు రాజు వ్యాఖ్యానించారు. తాను అన్నాడీఎంకే సేవకుడిని అని స్పష్టం చేశారు.

స్టెరిలైట్ మృతులకు అశ్రు నివాళి



నివాళులర్పిస్తున్న మంత్రి గీతా జీవన్ తదితరులు

- కొవ్వొత్తులతో ర్యాలీలు
- మంత్రి గీతా జీవన్ నేతృత్వంలో అంజలి
- కాల్పుల ఘటనకు ఆరేళ్లు

సాక్షి, చెన్నై: తూత్తుకుడి కాల్పుల ఘటనకు బుధవారంతో ఆరేళ్లు పూర్తయ్యింది. ఇందులో మరణించిన వారిని స్మరిస్తూ తూత్తుకుడిలో పలు చోట్ల కుటుంబీకులు, ఉద్యమకారులు, ప్రజా సంఘాలు అశ్రు నివాళి అర్పించాయి. వివరాలు.. స్టెరిలైట్ పరిశ్రమకు వ్యతిరేకంగా 2018 మే 22న చేపట్టిన ర్యాలీ అల్లర్లకు దారి తీసిన విషయం తెలిసిందే. ఈ సమయంలో పోలీసులు విచక్షణా రహితంగా జరిపిన కాల్పుల్లో 13 మంది బలయ్యారు. ఈ ఘటన అప్పట్లో పెద్ద కలకలాన్ని సృష్టించింది. ఈ ఘటనపై ప్రజా సంఘాలు, మానవ హక్కుల కమిషన్లు విచారణ చేశాయి. అలాగే రిటైర్డ్ న్యాయమూర్తి అరుణా జగదీశన్ నేతృత్వంలోని కమిషన్ విచారణ జరిపి సీఎం సాలిన్‌కు నివేదికను సమర్పించింది. పలువురు అధికారులపై చర్యలకు ఆమె సిఫార్సు చేశారు. అలాగే బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా పెంచాలని సూచించారు. నష్ట పరిహారం పెంచినా, బాధ్యులైన అధికారులపై ఇంత వరకు శాఖ పరంగా చర్యలు లేవనే విమర్శలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో కాల్పుల విషాద ఘటనకు ఆరేళ్లు పూర్తి కావడంతో బాధిత కుటుంబాలు కన్నీటితో నివాళులర్పించాయి.

కన్నీటితో..

ఉద్యమ కారులు, బాధిత కుటుంబాలు, ప్రజా సంఘాలు శాంతియుతంగా నివాళులర్పించే కార్యక్రమాలు ఉదయం నుంచి జరిగాయి. తూత్తుకుడి నగర, శివారుల్లోని పలు ప్రాంతాల్లోని క్రైస్తవ ఆలయాల వద్ద కొవ్వొత్తులు చేత బట్టి మృతులకు నివాళులర్పిస్తూ, ప్రార్థనలు చేశారు. మరికొని చోట్ల మృతి చెందిన 13 మంది ఫొటోలను ఉంచి పుష్పాంజలి ఘటించారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుని బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలని ఉద్యమ కారులు నినదించారు. ఫాతిమా నగర్, లూథర్ పురంలో మృతుల చిత్ర పటాలతో నివాళులర్పించే కార్యక్రమానికి పెద్దసంఖ్యలో ఆ పరిసర ప్రాంత వాసులు తరలి వచ్చారు. కలైంజ్ఞర్ అరంగంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి గీతా జీవన్ అంజలి ఘటించారు. మృతుల కుటుంబాలను ఓదార్చారు. నివాళి కార్యక్రమాలు పలు చోట్ల ఏర్పాటు చేయడంతో ముందు జాగ్రత్త చర్యగా తూత్తుకుడి, తిరునల్వేలి, తెన్‌కాశి, కన్యాకుమారి, రామనాథపురం జిల్లాల్లో 3 వేలకు పైగా పోలీసులతో భద్రతా చర్యలు చేపట్టారు. నగరంలోని అన్ని మార్గాలను, శివారు ప్రాంతాల నుంచి నగరంలోకి వచ్చే వీధిలోనూ పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం గమనార్హం.

పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు కౌన్సెలింగ్

- 36 మందిని రక్షించిన అధికారులు
- 25 వేలమందికి పైగా విద్యార్థులకు సూచనలు

కొరుక్కుపేట: పరీక్షలో ఫెయిల్ అయితే జీవితంలో ఫెయిల్ అయినట్లే అని నిర్ణయించుకుని విద్యార్థి దశలోనే కొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వీటిని కట్టడి చేసి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపి భవిష్యత్‌పై ఆశలను రేకెత్తించేందుకు, ఆత్మహత్యలు చేసుకోవాలని నిర్ణయించుకున్న విద్యార్థుల ఆలోచనలను మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. దీంతో పరీక్ష ఫలితాల అనంతరం పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల ఫోన్ నంబర్లను తీసుకుని వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ.. ఈ ఏడాది 51 వేల మంది విద్యార్థులు పరీక్షలో ఫెయిల్ అయ్యారు. వెంటనే మానసిక ఆరోగ్య సలహాదారులు వారిని ఫోన్‌లో సంప్రదించడం, వారిలోని ఆదోళనలను, ఒత్తిడిని తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. విద్యార్థి మానసిక స్థితి ఎలా ఉందో తెలుసుకుని తదనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మరికొందరు ఇంటి నుంచి బయటకు రాకుండానే సతమతమవుతున్నారు. కొన్ని ఇళ్లలో విద్యార్థుల కంటే తల్లిదండ్రులే ఎక్కువ ఒత్తిడికి గురవుతున్నారు. తల్లిదండ్రులు తిడతారని భయం, అవమానకరం అని భావించి బయటకు వెళ్లడానికి చాలా మంది ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొన్నారు. అలాంటి విద్యార్థులను గుర్తించి వారికి భరోసా కల్పించే విధంగా కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు వివరించారు. ఫెయిల్యూర్‌తో జీవితం ముగిసిపోదని, తదుపరి దశకు ఎలా సిద్ధం కావాలో తెలియజేస్తూ సలహాలు అందిస్తున్నట్లు తెలిపారు. తీవ్రమైన మానసిక స్థితిలో ఉన్నట్లు తేలితే, సంబంధిత విద్యార్థులను గుర్తించి, జిల్లా అధికారులు స్వయంగా వారిని సందర్శించి వారికి అవసరమైన మానసిక చికిత్స కోసం తీసుకువెళతామన్నారు. ఈ ఏడాది 25 వేల మందికి పైగా విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారి ఆశావాదంతో జీవించేలా చేశామన్నారు. దాదాపు 36 మంది విద్యార్థులను ఆత్మహత్యల నుంచి కాపాడినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ సింధూజ మృతి

- ప్రియుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో ప్రేమికులిద్దరూ బలి

అన్నానగర్: ప్రియుడిపై పెట్రోల్ పోసి కాల్చిన ఘటనలో గాయపడిన యువతి కూడా చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాలు.. మైలాడుదురైకి చెందిన రామమూర్తి కుమారుడు ఆకాష్ (24) పూంబుహార్ కాలేజీలో బీకామ్ 3వ సంవత్సరం చదువుతున్నాడు. కడలూరు జిల్లా భువనగిరికి చెందిన నాగప్పన్ కుమార్తె సింధూజ(22) మైలాడుదురైలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో బీఏ 2వ సంవత్సరం చదువుతోంది. ఆకాశ్, సింధూజ ప్రేమించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆకాష్‌కి మరో యువతితో పరిచయం ఏర్పడడంతో సింధూజను దూరం పెట్టాడు. ఈ క్రమంలో ఆకాష్, సింధూజ 9వ తేదీన పూంబుహార్ బీచ్ ప్రాంతంలో కలుసుకుని మాట్లాడుకున్నారు. ఆ తర్వాత ఇద్దరూ బైక్‌పై మైలాడుదురైకి బయలుదేరారు. కావేరి పాలంగరై అనే ప్రాంతానికి రాగానే ఆకాశ్ తనను ప్రేమించేందుకు నిరాకరించడంతో ముందే బాటిల్‌తో తెచ్చుకున్న పెట్రోల్‌ను ఆకాష్ పైనా, తన పైనా పోసుకుని సింధూజ నిప్పంటించుకుంది. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆకాష్ ఈనెల 14న మరణించాడు. తంజావూరు ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతూ వచ్చిన సింధూజ కూడా మంగళవారం రాత్రి మృతి చెందింది. దీంతో ఇరు కుంటుంబాలు విషాదంలో మునిగిపోయాయి.

బంగాళాఖాతంలో అల్పపీడనం

- రాష్ట్రానికి ఆరంజ్ అలర్ట్



చెన్నై శివార్లలో..



కన్యాకుమారిలో భారీ వర్షం

సాక్షి, చెన్నై: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి వాయుగుండంగా మారిన పక్షంలో ఈ ప్రభావం రాష్ట్రంలోని కొన్ని జిల్లాలపై ఉండే అవకాశం ఉంది. దీంతో ఆయా జిల్లాల్లో వాతావరణ కేంద్రం ఆరంజ్ అలర్ట్ ప్రకటించింది. మిగిలిన జిల్లాల్లో మాత్రం భానుడి భగభగలు తప్పవని స్పష్టం చేసింది. వివరాలు.. అగ్ని నక్షత్రం (కత్తిరి నెల) వేళ అకాల వర్షం పులకింతతో జనం భానుడి సెగ నుంచి ఉపశమనం పొందారు. మరో వారం రోజులలో అగ్ని నక్షత్ర సీజన్ ముగియనుంది. ఈ పరిస్థితులలో నెలాఖరులో నైరుతి రుతు పవనాలు కేరళ తీరాన్ని తాకనున్నాయి. ఇందుకు అనుగుణంగా పశ్చిమ కనుమల వెంబడి కేరళ సరిహద్దులలోని తమిళనాడు జిల్లాలో అనేక చోట్ల అతి భారీ వర్షం కురిసింది. బుధవారం కూడా అక్కడక్కడా చెదురుముదురుగా వర్షం పడింది. చెన్నైలో కొన్ని చోట్ల, శివారులలో మరికొన్ని చోట్ల వరుణుడు పలకరించాడు.

24న వాయుగుండగా?

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో కొన్ని జిల్లాలలో అక్కడక్కడా వర్షాలు పడుతున్నాయి. ఈ అల్పపీడనం 24వ తేదీ వాయుగుండంగా మారనుంది. ఈ ప్రభావం కన్యాకమారి, తూత్తుకుడి, విరుదునగర్, మదురై, దిండుగల్, కోయంబత్తూరు, తిరుప్పూర్, నీలగిరిపై ఉంటుందనే సమాచారంతో ఆ జిల్లాలకు ఆరంజ్ అలర్ట్‌ను ప్రకటించారు. అదే సమయంలో ఈ వాయుగుండం తుఫాన్‌గా మారి బంగ్లాదేశ్ వైపుగా ప్రయాణించే అవకాశాలు ఉన్న నేపథ్యంలో వెళ్తూ వెళ్తూ గాలిలోని తేమను పూర్తిగా తీసుకెళ్లనుంది. ఫలితంగా రాష్ట్రంలో 25వ తేదీ తర్వాత ఉష్ణోగ్రతలు మళ్లీ కొంత మేరకు పెరిగే అవకాశాలు ఉన్నట్టు వాతావరణ నిపుణులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా వర్షం తగ్గడంతో నీలగిరి జిల్లా ఊటికి కొండ రైలు సేవలను బుధవారం పునరుద్ధరించారు. నైరుతి రుతు పవనాలసీజన్ నేపథ్యంలో ముందు జాగ్రత్తగా చెన్నైలో అధికారులు అప్రమత్తమయ్యారు. గతం పునరావృతం కాకుండా ఇప్పటి నుంచే కాలువలలో పూడిక తీతకు సిద్ధమయ్యారు. చెన్నైలో 1,480 కిలోమీటర్ల దూరం ఉన్న వర్షపు నీటి కాలువలో పూడిక తీత పనులను ముమ్మరం చేయనున్నారు. ఇదిలా ఉండగా, అకాల వర్షం రూపంలో అనేక జిల్లాల్లో వరి, అరటి తదితర పంటలు దెబ్బతిన్న విషయం తెలిసిందే. దీంతో నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

వారెంట్ ఉంటేనే ఉచిత ప్రయాణం

- బస్సుల్లో టికెట్ తప్పనిసరి
- పోలీసులకు రవాణా శాఖ ఆదేశాలు

సాక్షి, చెన్నై: ప్రభుత్వ బస్సుల్లో పోలీసులు కూడా అందరి ప్రయాణికుల తరహాలోనే తప్పనిసరిగా టికెట్ తీసుకోవాల్సిందేనని రవాణాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఖైదీలను వెంట బెట్టుకుని వారెంట్‌తో వెళ్తుంటే మాత్రమే ఉచిత ప్రయాణానికి అవకాశం ఉంటుందని సూచించారు. ప్రభుత్వ రవాణా సంస్థ బస్సులలో పోలీసులు ఉచిత ప్రయాణం వ్యవహారం ఆది నుంచి వివాదంలో ఉంటూ వస్తున్న విషయం తెలిసిందే. యూనిఫాంతో విధులకు వెళ్లే వారి నుంచి కండక్టర్లు టికెట్లు తీసుకోమని చెప్పడం, పోలీసులు తిరగబడటం వంటి పరిణామాలు రోజురోజుకూ ఏదో ఒక చోట వెలుగు చూస్తున్నాయి. తాజాగా తిరునల్వేలి మీదుగా తూత్తుకుడికి వెళ్లిన బస్సులో ఆర్ముగ పాండి అనే పోలీసులు యూనిఫాం ధరించి ఎక్కారు. టికెట్టు తీసుకునే విషయంపై కండెక్టరు, ఆ పోలీసు మధ్య పెద్ద గొడవే జరిగింది. రవాణా శాఖ ఉద్యోగులకు మాత్రమే ఉచిత ప్రయాణం అవకాశం ఇస్తారా..?, మేమూ ప్రభుత్వ ఉద్యోగులమే అంటూ ఆ పోలీసు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వీడియో సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారింది. దీనిని తీవ్రంగా పరిగణించిన రవాణా సంస్థ ప్రభుత్వ బస్సులలో పోలీసులుకు ఉచిత ప్రయాణానికి అవకాశం లేదని స్పష్టం చేసింది. బస్సులలో ప్రయాణించేటప్పుడు తప్పని సరిగా పోలీసులు టికెట్ తీసుకోవాలని సూచించారు. ఖైదీలను తీసుకెళ్లేటప్పుడు వారెంట్ కలిగి ఉన్న పక్షంలో మాత్రమే ఉచిత ప్రయాణానికి అవకాశం ఉంటుందన్నారు. మిగిలిన సందర్భాలలో టికెట్టు తప్పనిసరి అని స్పష్టం చేశారు. ప్రస్తుతం బస్సులో కండెక్టర్‌పై ఆగ్రహాన్ని వ్యక్తం చేసిన పోలీసుపై శాఖ పరంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారుల సిఫార్సు చేశామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

తిరుత్తణి: విద్యుత్‌శాఖ సిబ్బంది నిర్లక్ష్యానికి ఓ రైతు ప్రాణాలు కోల్పోయాడు. దీంతో విద్యుత్ శాఖ సిబ్బంది ముగ్గురు బుధవారం సస్పెన్షన్‌కు గురయ్యారు. వివరాలు.. తిరుత్తణి సమీపంలోని కోరమంగళం గ్రామానికి చెందిన తిరుత్తణి ఆలయంలో పనిచేసి రిటైర్డ్ అయిన గోవిందరాజ్ (65) మంగళవారం పొలం వద్దకు వెళ్తుండగా.. విద్యుత్ తీగల తగిలి మరణించాడు. విద్యుత్‌శాఖ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే రైతు ప్రాణాలు కోల్పోయినట్లు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో తిరుత్తణి డివిజన్ విద్యుత్ శాఖ డివిజినల్ అధికారి సూచన మేరకు తిరుత్తణి రూరల్ సహాయ ఇంజినీరు కన్నన్ విచారణ చేపట్టి విధుల్లో నిర్లక్ష్యంగా ప్రవర్తించిన అల్లిముత్తు, ఏలుమలై, అర్జునన్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

హైకోర్టు ఇన్‌చార్జ్ సీజేగా ఆర్. మహాదేవన్

- నేటితో ముగియనున్న సీజే గంగా పూర్వాల పదవీ కాలం



ఆర్. మహాదేవన్

సాక్షి, చెన్నై: మద్రాసు హైకోర్టు ఇన్‌చార్జ్ సీజేగా ఆర్. మహాదేవన్‌ను నియమిస్తూ రాష్ట్రపతి భవన్ బుధవారం ఆమోద ముద్ర వేసింది. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత సీజే ఎస్వీ గంగా పూర్వాల పదవీ కాలం గురువారంతో ముగియనుంది. వివరాలు.. మద్రాసు హైకోర్టు సీజే మునీశ్వర్ నాథ్ బండారీ పదవీ విరమణ అనంతరం తొమ్మిది నెలల పాటు పూర్తిస్థాయిలో సీజే నియామకం జరగలేదు. దీంతో కొంతకాలం ఇన్‌చార్జ్ న్యాయమూర్తుల ద్వారా నెట్టుకు వచ్చారు. ఎట్టకేలకు గత ఏడాది మే 27వ తేదీన పూర్తిస్థాయి ప్రధాన న్యాయమూర్తిగా ముంబై హైకోర్టు ఇన్‌చార్జ్ సీజే ఎస్వీ గంగా పుర్వాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ నియమించారు. మరుసటి రోజే ఆయనతో గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రమాణ స్వీకారం చేయించారు. అప్పటి నుంచి హైకోర్టుకు సీజేగా వ్యవహరిస్తూ వచ్చిన గంగా పూర్వాల గురువారం పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ఇన్‌చార్జ్ సీజే బాధ్యతలను సీనియర్ న్యాయమూర్తికి అప్పగించేందుకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు హైకోర్టులో సీనియర్‌గా ఉన్న ఆర్. మహాదేవన్‌ను ఇన్‌చార్జ్ సీజేగా నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ బుధవారం ఉత్తర్వులు జారీ చేయనున్నారు. శుక్రవారం నుంచి ఇన్‌చార్జ్ బాధ్యతలను ఆర్. మహాదేవన్ చేపట్టనున్నారు. న్యాయవాద వృత్తిలోకి మహాదేవన్ 1989లో వచ్చారు. సివిల్, క్రిమినల్ న్యాయవాదిగా వ్యవహరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు న్యాయవాదిగా పనిచేశారు. 2013లో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.11 సంవత్సరాలుగా మద్రాసు హైకోర్టులో విధులు నిర్వహిస్తూ వచ్చిన ఆయన ఇన్‌చార్జ్ సీజేగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

నేలబొగ్గు కొనుగోలులో రూ. 6 వేల కోట్ల స్కాం



- అరప్పోర్ ఇయక్కం ఆరోపణ

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే హయాంలో నేలబొగ్గు కొనుగోళ్లలో రూ. 6 వేల కోట్ల మేరకు స్కాం జరిగినట్టు అరప్పోర్ ఇయక్కం ప్రతినిధి జయరామన్ ఆరోపించారు. ఓ పత్రిక వెలుగులోకి తెచ్చే ముందే తాము ఆధారాలతో సహా సంబంధిత సంస్థ ద్వారా జరిగిన ఈ స్కాంను బయట పెట్టామని, అయితే ఇంత వరకు చర్యలు తీసుకోక పోవడం శోచనీయమని పేర్కొన్నారు. వివరాలు.. నాణ్యత లేని నేల బొగ్గును ఓ ప్రముఖ సంస్థ ద్వారా దేశంలోకి దిగుమతి చేసినట్టుగా ఓ ఆంగ్ల పత్రిక జాతీయ స్థాయిలో వెలువరించిన కథనం దుమారాన్ని రేపుతున్న నేపథ్యంలో ఇందులో తమిళనాడులోనే రూ. 6 వేల కోట్ల మేరకు స్కాం జరిగినట్టు అరప్పోర్ ఇయక్కం కొన్ని ఆధారాలను బయటపెట్టింది. ఇండోనేషియా నేల బొగ్గును సింగపూర్ సంస్థ నుంచి కొనుగోలు చేసి, దానిని సదరు సంస్థ ద్వారా తమిళనాడులోకి తీసుకొచ్చారని ఆరోపించారు. తమిళనాడు విద్యుత్ బోర్డుకు నాణ్యత లేని నేలబొగ్గు సరఫరా చేసి ఉన్నారని, ఈక్రమంలో తమిళనాడు విద్యుత్ బోర్డుకు చేరేలోపు మూడింతల ధరతో ఇన్వాయిస్ (ధరల పట్టిక) వచ్చి చేరినట్టు వివరించారు. ఓ షిప్‌మెంట్‌కు రూ. 420 కోట్లు చొప్పున ధరల వ్యవహారంలో మోసం జరిగిందని, తమిళనాడుకు చేరిన మొత్తం 22 షిప్‌మెంట్లలో మొత్తం రూ. 6 వేల కోట్ల వరకు స్కాం జరిగినట్టు ఆ రోపించారు. గతంలో తాము వెలుగులోకి తెచ్చిన కొన్ని స్కాంలు, టెండర్ల వ్యవహారంలో నేలబొగ్గు అంశాన్ని కూడా ప్రస్తావించామని, అయితే ఇంత వరకు చర్యలు తీసుకోలేదన్నారు. ఈస్కాంపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

ఉచిత తెలుగు తరగతులు

కొరుక్కుపేట: ప్రపంచ తెలుగు సమాఖ్య (డబ్ల్యూటీఎఫ్) ఆధ్వర్యంలో ఉచిత తెలుగు తరగతులను నిర్వహించనున్నట్టు డబ్ల్యూటీఎఫ్ సెక్రటరీ కె. శ్రీలక్ష్మీ మోహన్‌రావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనలో.. జూన్ నెల నుంచి ప్రతి శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ఉచిత తెలుగు బోధనా తరగతులు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. చెన్నై టి.నగర్, 113 జీఎన్ శెట్టిరోడ్డు, అంకుర్ ప్లాజాలోని ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రధాన కార్యాలయంలో ఈ ఉచిత తరగతులు ఉంటాయన్నారు. వివరాలకు 99403 68880, 73055 57322 నంబర్‌లను సంప్రదించగలరని కోరారు.

ఐదుగురి అరెస్టు

అన్నానగర్: రౌడీ హత్యకేసులో ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. నెల్లై జిల్లా ముండ్రడైప్పు సమీపంలో వాగైకుళానికి చెందిన రౌడీ దీపక్ రాజా(28). ఇతని మీద 20కి పైగా కేసులు ఉన్నాయి. ఇతన్ని సోమవారం పాలై కేటీసీలో ఆరుగురు సభ్యుల ముఠా హత్య చేసింది. ఈ కేసుల ఐదుగురిని పోలీసులు రహస్య ప్రదేశంలో ఉంచి విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో హంతకులను అరెస్టు చేసే వరకు దీపక్ రాజా మృతదేహాన్ని తీసుకోబోమని ఆయన బంధువులు బుధవారం కూడా నిరసన తెలిపారు. ఈ క్రమంలో నిందితులను అదుపులోకి తీసుకుని దీపక్ రాజ మృతదేహాన్ని బంధువులకు అప్పగించేందుకు చర్యలు ప్రారంభించారు.

రోయింగ్ చాంపియన్‌షిప్‌నకు శ్రీరామచంద్ర జట్టు



విద్యార్థులతో జట్టుతో కోచ్

కొరుక్కుపేట: వరల్డ్ యూనివర్సిటీ రోయింగ్ ఛాంపియన్ షిప్ 2024కు శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్, సెంటర్ ఫర్ స్పోర్ట్స్‌కు చెందిన విద్యార్థుల జట్టు ఎంపికైంది. ఈ టోర్నీ జూలై 3 నుంచి 6 తేదీ వరకు నెదర్లాండ్స్ వేదికగా జరగనుంది. ఈ జట్టులో యక్షిత్ సాయి, రోజ్ మెస్టికా, ఎస్.తమిళ్ సెల్వి ఉండగా, సీనియర్ కోచ్ ఎ.భాస్కరరెడ్డి కూడా ఈ టోర్నీకి ఎంపికయ్యారు. జట్టు సభ్యులను శ్రీరామచంద్ర ఇన్‌స్టిట్యూట్ చాన్స్‌లర్ వెంకటాచలం అభినందిస్తూ, విద్యార్థులందరికీ రూ.9 లక్షలు, కోచ్‌కు రూ.2.8 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. వైస్ చాన్స్‌లర్లు ఉమ శేఖర్, మహేష్ వాకమూడీ, డైరెక్టర్ ఎస్.ఆరుముగం, డీన్ కె.బాలాజీ సింగ్ పాల్గొన్నారు.


ఆలయంలో భక్తుల రద్దీ, (ఇన్‌సెట్) విశేషాలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

మురుగన్‌కు వైకాసి విశాఖ పూజలు

తిరుత్తణి: వైకాసి మాసం విశాఖ నక్షత్రం సందర్భంగా తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో బుధవారం భక్తుల సందడి నెలకొంది. వివరాలు.. తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి విశాఖ నక్షత్రంలో జన్మించినట్లు భావిస్తారు. ఈ నక్షత్రం రోజున స్వామిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఈక్రమంలో తమిళ వైకాసి నెల విశాఖ నక్షత్రం సందర్భంగా తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో బుధవారం వేకువజామున మూలవర్లకు విశిష్ట అభిషేక పూజలు చేశారు. ఉదయం 9 గంటలకు స్వామివారికి బిల్వార్చన పూజలు చేపట్టి, బంగారు బిల్వ పత్రాలతో ప్రత్యేకంగా అలంకరించి దీపారాధన చేశారు. ఉదయం నుంచి మురుగన్ భక్తులు పెద్ద సంఖ్యలో కొండకు చేరుకుని క్యూలైన్లలో మూడు గంటల పాటు వేచివుండి స్వామిని దర్శించుకున్నారు. దీంతో తిరుత్తణి కొండ ఆలయంలో రద్దీ నెలకొంది. సాయంత్రం 7 గంటల సమయంలో 40 వేల మంది స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

తిరుచెందూరులో..

తిరువొత్తియూరు: తిరుచెందూరు సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో బుధవారం వైకాసి విశాఖ ఉత్సవాలను పురస్కరించుకుని లక్షల సంఖ్యలో భక్తులు ఆలయంలో సముద్ర స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. రాష్ట్రంలోని మురుగన్ ఆలయాల్లో సుబ్రహ్మణ్యస్వామి అవతరించిన విశాఖ నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెల 13వ తేదీ నుంచి ప్రత్యేక ఉత్సవాలు తిరుచెందూరు ఆలయంలో ప్రారంభించారు. ఇందులో అత్యంత ముఖ్యమైన విశాఖ ఉత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళా శ్రామికశక్తికి తోడ్పాటు అందిద్దాం



సదస్సులో కుమార్ జయంతి, ఫిక్కీ వర్గాలు

సాక్షి, చెన్నై: మహిళా శ్రామిక శక్తికి తోడ్పాటు నివ్వడమే కాకుండా, ఎలాంటి అడ్డంకులు లేకుండా వారు వృత్తిని కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కార్మిక సంక్షేమం, నైపుణ్యాల అభివృద్ధి విభాగం అదనపు ప్రధాన కార్యదర్శి కుమార్ జయంత్ సూచించారు. ఫిక్కీ నేతృత్వంలో బుధవారం తమిళనాడు స్టేట్ కౌన్సిల్ హెచ్‌ఆర్ సమ్మిట్, డిజిటైజ్డ్ హెచ్ ఆర్ సిస్టమ్, ప్రజల శక్తి అనే అంశంపై 2024 అవార్డుల కార్యక్రమం జరిగింది. ఇందులో కుమార్ జయంతి పాల్గొని ప్రసంగించారు. తమిళనాడు ప్రభుత్వం కార్మిక సంక్షేమంతో పాటు నైపుణ్యాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తున్నట్టు వివరించారు. ఏదైనా ఉద్యోగులను హ్యాండ్ హోల్డింగ్ చేసే విషయంలో హెచ్‌ఆర్‌ను ఉపయోగించాలని, ప్రతి పరిశ్రమ సంస్థ దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అత్యంత పోటీ ప్రపంచంలో కార్మిక శక్తిని వినియోగించుకునేందుకు వృత్తి, భవిష్యత్తు దృష్టి సరైన శిక్షణ అవశ్యం అని వివరించారు. మహిళా శ్రామిక శక్తిని ప్రోత్సహించాలని, వారి ఎలాంటి ఆటంకం, ఇబ్బందులు లేకుండా వృత్తిని కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే హెచ్ ఆర్ సిస్టమ్‌ను డిజిటైజ్డ్ మయం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఐటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ జీవీ సెల్వం, ఫిక్కీ కన్వీనర్ ఎన్ఆర్ మణి ప్రసంగించారు.

మత్తుపదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు: జిల్లాలో మత్తు పదార్థాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుబ్బులక్ష్మి అధికారులను ఆదేశించారు. శాంతి భద్రతలు, మత్తు పదార్థాలు లేని జిల్లాగా చేసేందుకు వేలూరు కలెక్టరేట్‌లో పోలీస్, కార్పొరేషన్, వివిధ శాఖల అధికారులతో మంగళవారం ఉదయం ఆమె సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేలూరు జిల్లా ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో ఉన్నందున మత్తు పదార్థాలు ఇతర రాష్ట్రాల నుంచి రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉన్నందున సరిహద్దులోని చెక్ పోస్టుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న చిన్న దుకాణాల్లోనూ మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని వాటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. మత్తు పదార్థాలను ఎవరు విక్రయిస్తున్నారు, ఎక్కడ నుంచి సరఫరా చేస్తున్నారన్న అంశాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. వేలూరు పట్టణంలో తరచూ ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించాలన్నారు. ముఖ్యంగా అన్నారోడ్డు, సీఎంసీ రోడ్డులో తరచూ రోగులు అధికంగా వచ్చి వెళుతుండడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటుందని, దీన్ని అరికట్టాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై పోలీసులు వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా జూన్ 4వ తేదీన పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో అందుకు అవసరమైన బందోబస్తు ఏర్పాట్లను పోలీసు శాఖ సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ మణివన్నన్, డీఆర్వో మాలతి, గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టు అధికారి ఆర్తి, కార్పొరేషన్ కమిషనర్ జానకి, జిల్లాలోని డీఎస్పీలు, పోలీస్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

గృహ రుణాల కోసం ప్రత్యేక పథకం



మాట్లాడుతున్న సంజయ్, కవిత

సాక్షి, చెన్నై: సొంతింటి కల సాకారం చేసుకునే వారి కోసం గృహ రుణాలకు ప్రాధాన్యతను ఇవ్వనున్నామని, ఇందు కోసం 'ది కంప్లీట్ హోమ్ లోన్' పథకానికి శ్రీకారం చుట్టామని ఎల్‌టీఎఫ్ బుధవారం చెన్నైలో ప్రకటించింది. 'కంప్లీట్ హోమ్ లోన్' డిజిటలైజ్డ్ ప్రాసెస్, డెడికేటెడ్ రిలేషన్ షిప్, హోమ్ డెకర్ ఫైనాన్స్ కంపెనీ 'కుమ్ నహీ, కంప్లీట్' అనే ట్యాగ్‌లైన్‌తో కీలకమైన ప్రకటనలతో స్థానికంగా జరిగిన కార్యక్రమంలో ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సంజయ్ గర్యాలి, చీఫ్ మార్కెటింగ్ అధికారి కవిత జగత్యాయిని మీడియాకు వివరించారు. చెన్నైలో తమ సొంత ఇంటి కలను నెరవేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్న వారి సహకారం అందించేందుకు 'ది కంప్లీట్ హోమ్ లోన్'ని ప్రారంభించామని ప్రకటించారు. వినియోగదారులకు సమగ్ర సమాచారం అందించడమే కాకుండా, వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాగిత రహిత వ్యవహారాలపై దృష్టి పెట్టినట్టు పేర్కొన్నారు. అవాంతరాలు లేని డాక్యుమెంటేషన్, ఉత్తమ సేవా ప్రమాణాలు వంటి విలువ ఆధారిత ఫీచర్లు అందిస్తున్నామన్నారు.

జోరుగా తాటి ముంజెల విక్రయం



వేసవిలో ఎండలకు ఆరోగ్యవంతమైన చల్లని తాటి ముంజెలను ఇష్టపడని వారు ఉండరు. ఈ నేపథ్యంలో పొదటూరుపేట నుంచి నగరి వెళ్లే మార్గంలో తాటి ముంజెల కోసం వాహనచోదకులు బారులు దీరుతున్నారు. - పళ్లిపట్టు

కారు ఢీకొని యువకుడి మృతి

అన్నానగర్: కారు ఢీకొని యువకుడు మృతి చెందాడు. చెన్నై కీల్పాక్కం పుల్లాపురం ప్రాంతానికి చెందిన సతీష్ (26) ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి కీల్పాక్కం ప్రాంతంలో పూందమల్లి ప్రధాన రహదారిని దాటే సమయంలో వేగంగా వచ్చిన కారు సతీష్‌ను ఢీకొంది. దీంతో అతడు కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన కారు ఆపకుండా వేగంగా వెళ్లింది. ఆ సమయంలో బందోబస్తులో ఉన్న పోలీసులు కారు రిజిస్ట్రేషన్ నంబర్‌ను ట్రాక్ చేసి స్కైవాక్ వరకు వెంబడించి పట్టుకున్నారు. విషయం తెలుసుకున్న సతీష్ బంధువులు, స్నేహితులు అక్కడికి వెళ్లి కారును ధ్వంసం చేశారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న అన్నా స్క్వేర్ ట్రాఫిక్ ఇన్వెస్టిగేషన్ విభాగం పోలీసులు సతీష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదం అనంతరం తప్పించుకునేందుకు యత్నించిన రాణిపేట ప్రాంతానికి చెందిన అజీమ్ (25)ను పోలీసులు అరెస్టు చేశారు.

పోలీస్ ఉద్యోగం పేరిట రూ.25 లక్షలు మోసం

- సబ్ ఇన్‌స్పెక్టర్ సహా ఇద్దరి అరెస్టు

అన్నానగర్: కోయంబత్తూరులో ఉద్యోగం పేరిట రూ.25 లక్షలు మోసగించిన సబ్ ఇన్‌స్పెక్టర్ సహా ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చి సమీపంలోని కిలవన్ పుదూరుకు చెందిన ప్రశాంత్ (23) పోలీసు శాఖలో చేరాలనుకున్నాడు. ఈక్రమంలో పొల్లాచ్చి మహాలింగపురానికి చెందిన జయరాజ్(49), తిరుపూర్ జిల్లా పోలీస్ స్పెషల్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న మురళీధరన్ (52), చెన్నైకి చెందిన కృష్ణరాజ్ (49)తో ప్రశాంత్‌కు పరిచయం ఏర్పడింది. వీరు పోలీసు శాఖలో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి రూ. 25 లక్షలు తీసుకుని తర్వాత స్పందించలేదు. దీంతో ప్రశాంత్ కోయంబత్తూరు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు జిల్లా క్రైం బ్రాంచ్ పోలీసులు కేసు నమోదు చేసి జయరాజ్, స్పెషల్ సబ్ ఇన్‌స్పెక్టర్ మురళీధరన్‌ను మంగళవారం అరెస్ట్ చేశారు. చెన్నైకి చెందిన కృష్ణరాజ్ కోసం గాలిస్తున్నారు.


నటి నిత్యామీనన్

జయంరవి, నిత్యామీనన్‌ల
కాదలిక్క నేరమిల్‌లై


జయంరవి

తమిళసినిమా: స్టార్ నటులకు విజయాలు ఉత్సాహాన్నిస్తాయి. కానీ అపజయాలు మాత్రం పెద్దగా ప్రభావం చూపవు. ఇందుకు చిన్న ఉదాహరణ నటుడు జయంరవినే. ఈయన మణిరత్నం దర్శకత్వంలో టైటిల్ పాత్రలు పోషించిన పొన్నియిన్ సెల్వన్ 1,2 చిత్రాలు మంచి విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. ఈ చిత్రాల సక్సెస్‌ను జయంరవి బాగా ఎంజాయ్ చేశారు. తన స్థాయిని పెంచాయి. అయితే ఆ తరువాత నటించిన ఇరైవన్, సైరన్ వంటి చిత్రాలు పూర్తిగా నిరాశ పరిచాయి. అయితే వాటి ప్రభావం నటుడు జయంరవిపై ఏమాత్రం పడలేదనే చెప్పాలి. ఇందుకు కారణం ప్రస్తుతం ఆయన చేతి నిండా చిత్రాలతో బిజీగా ఉన్నారు. దీంతో మణిరత్నం దర్శకత్వంలో కమలహాసన్‌తో కలిసి నటించే అవకాశాన్ని కూడా కాల్‌షీట్స్ సమస్య కారణంగా వదులుకున్నారు. ఇకపోతే జయంరవి ప్రస్తుతం సిరీ, బ్రదర్, కాదలిక్క నేరమిల్‌లై చిత్రాల్లో నటిస్తున్నారు. వీటి టైటిల్స్ చూస్తుంటేనే ఒకదానికి ఒకటి భిన్నమైన కథా చిత్రాలుగా ఉంటాయని తెలుస్తోంది. కాగా వీటిలో క్రితిక ఉదయనిధి దర్శకత్వం వహిస్తున్న చిత్రం కాదలిక్క నేరమిల్‌లై. ఇందులో జయంరవికి జంటగా నటి నిత్యామీనన్ నటిస్తున్నారు. రెడ్ జెయింట్ మూవీస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్ర షూటింగ్ ఇప్పటికే చాలా భాగం పూర్తి చేసుకుంది. కాగా జయంరవి మణిరత్నం దర్శకత్వంలో థగ్‌లైఫ్ చిత్రంలో నటించడానికి సమ్మతించడంతో కాదలిక్క నేర మిల్‌లై చిత్రం షూటింగ్‌కు కాస్త విరామం వచ్చింది. అయితే ఇప్పుడు థగ్ లైఫ్ చిత్రం నుంచి వైదొలగడంతో జయంరవి మళ్లీ కాదలిక్క నేరమిల్‌లై చిత్రాన్ని పూర్తి చేయడానికి సిద్ధం అయ్యారు. ఈ చిత్రం షూటింగ్ మరో 10 రోజులు జరిగితే పూర్తి అవుతుందని సమాచారం. దీంతో బుధవారం నుంచి బెంగళూరులో జరుగుతున్న ఈ చిత్రం షూటింగ్‌లో జయంరవి, నటి నిత్యామీనన్ పాల్గొంటున్నారన్నది తాజా సమాచారం. కాగా ఈ చిత్రంలో జయంరవి, నిత్యామీనన్‌లు ఒకరినొకరు కౌగిలించుకున్న ఫొటోను ఇప్పటికే యూనిట్ వర్గాలు విడుదల చేయగా ఇది రొమాంటిక్ లవ్ స్టోరీగా ఉంటుందనే టాక్ స్ప్రెడ్ అయ్యింది. ఇలాంటి రొమాంటిక్ లవ్‌స్టోరీలో జయంరవి నటించి చాలా కాలం అవడంతో కాదలిక్క నేరమిల్‌లై చిత్రంపై ఆసక్తి నెలకొంది.

కోలీవుడ్ టాక్స్

ప్రియాంక మోహన్ జాలీ ట్రిప్


నటి ప్రియాంక మోహన్

తమిళసినిమా: సమ్మర్ వచ్చిందంటే సినీ తారల్లో చాలా మంది విదేశీ ట్రిప్‌కు రెడీ అయిపోతారు. అలాంటి ట్రిప్‌ను నటి ప్రియాంక మోహన్ ఇప్పుడు ఎంజాయ్ చేస్తున్నారు. ఈ కన్నడ బ్యూటీ మాతృభాషతోపాటు, తెలుగు, తమిళం భాషల్లోనూ ప్రముఖ కథానాయకిగా రాణిస్తున్నారు. తెలుగులో నానీ సరసన గ్యాంగ్‌లీడర్ చిత్రంలో నటించిన ఈమె ఆ తరువాత తమిళంలో శివకార్తికేయన్‌కు జంటగా డాక్టర్, డాన్ చిత్రాల్లో నటించారు. ఈ రెండు చిత్రాలు మంచి హిట్ కావడంతో ఈ వెంటనే నటుడు సూర్యకు జంటగా ఎదుర్కు తుణిందవన్ చిత్రంలో నటించే అవకాశాన్ని దక్కించుకున్నారు. ఆ చిత్రం ఆశించిన విజయాన్ని సాధించకపోయినా, ప్రియాంక మోహన్‌కు అవకాశాలు వస్తూనే ఉన్నాయి. ఇటీవల ధనుష్ సరసన నటించిన కెప్టెన్ మిల్లర్ చిత్రం ఈ అమ్మడికి మంచి పేరు తెచ్చిపెట్టింది. ఇక తొలి రోజుల్లో పక్కింటి అయ్మాయి ఇమేజ్‌ను తెచ్చుకున్న ఈ అమ్మడు ఇప్పుడు గ్లామరస్ ఫొటోలతో హల్‌చల్ చేస్తూ అలాంటి పాత్రలకు రెడీ అనే సిగ్నల్‌ను పంపుతున్నారు. కాగా ప్రస్తుతం మరోసారి తెలుగులో నాని సరసన సరిపోదా శనివారం చిత్రంలో నటిస్తున్నారు. అలాగే తమిళంలో యువ నటుడు కవిన్‌తో జత కట్టే అవకాశం తలుపు తట్టింది. ఇలా నటిగా బిజీగా ఉన్న ప్రియాంక మోహన్ ప్రస్తుతం సమ్మర్ ట్రిప్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. ఏ దేశంలో ఉన్నారో గానీ అక్కడ దిగిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తున్నారు. అవి ఇప్పుడు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి.

విభిన్న కథతో పిళ్లైయార్ సుళీ


పిళ్లైయార్ సుళీ చిత్రంలో చిన్నారితో నటుడు ధీరజ్

తమిళసినిమా: ఇటీవల డబుల్ టక్కర్ చిత్రంతో మంచి సక్సెస్‌ను అందుకున్న నటుడు ధీరజ్. ఈయన తాజాగా కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం పిళ్లైయార్ సుళీ. మనోహరన్ పెరియతంబి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సిలంభరసీ.వీ నిర్మిస్తుండగా ఏర్ ఫ్లిక్స్ సంస్థ సహ నిర్మాణ బాధ్యతలను నిర్వహిస్తోంది. నటి రేవతి, మైమ్‌గోపీ, మథ్యూ వర్గీస్, పవర్ స్టార్ శ్రీనివాసన్, దర్శన్, జీవారవి, పళనీదేవి, ఆర్‌జే.మహాలక్ష్మి తదితరులు ముఖ్య పాత్రలు పోషించిన ఇందులో బాల తారలు ఉన్ని కృష్ణన్, ఆర్నా, ఫర్హానా, శ్రీశ్రావణ్ కీలక పాత్రల్లో నటించారు. ప్రసాద్ డీఫ్‌టెక్ ఛాయాగ్రహణం, ఎస్ఆర్.హరి సంగీతం అందించారు. కాగా చిత్రం వివరాలను దర్శకుడు తెలుపుతూ ఇది దివ్యాంగ చిన్నారి నేపథ్యంలో తెరకెక్కిస్తున్న మంచి సందేశాత్మకంతో కూడిన చిత్రం అన్నారు. అదే సమయంలో మంచి జనరంజక కథా చిత్రంగా ఉంటుందన్నారు. చిత్రం షూటింగ్‌తోపాటు నిర్మాణాంతర కార్యక్రమాలు పూర్తి అయ్యాయని చెప్పారు. చిత్రాన్ని ఈ ఏడాదిలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు దర్శకుడు మనోహరన్ పెరియతండి చెప్పారు. కాగా పిళ్లైయార్ సుళీ చిత్రం న్యూయార్క్ అంతర్జాతీయ చిత్రోత్సవాలకు ఎంపికై, తుది రౌండ్‌కు చేరుకుందని చెప్పారు. చిత్రం అన్ని వర్గాల వారిని అలరిస్తుందనే నమ్మకాన్ని దర్శకుడు వ్యక్తం చేశారు.

ఒకే ఒక్క పోస్టర్ ప్రభావం ఎంతో..

తమిళసినిమా: అన్నం ఉడికిందో లేదో తెలియడానికి ఒక్క మెతుకు చూస్తే చాలంటారు. అలాగే కొన్ని చిత్రాల జాతకం ఒక్క పోస్టర్‌తోనే తెలిసి పోతుంది. ఈ విషయాన్ని తాజాగా అజిత్ కథానాయకుడిగా నటించనున్న గుడ్ బ్యాడ్ అగ్లీ చిత్రం నిరూపించింది. అజిత్ ప్రస్తుతం విడాయుయర్చి చిత్రంలో నటిస్తున్నారు. మగిళ్ తిరుమేణి దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న ఇందులో నటి త్రిష నాయకిగా నటిస్తున్నారు. కాగా ఈ చిత్రం షూటింగ్ పలు సమస్యలను అధిగమించి చివరి దశకు చేరుకుంది. ఇకపోతే అజిత్ తన తదుపరి చిత్రానికి సిద్ధం అవుతున్నారు. ఈ చిత్రం పేరే గుడ్ బ్యాడ్ అగ్లీ. ఇంతకు ముందు మార్క్ ఆంటోని వంటి సూపర్‌హిట్ చిత్రాన్ని తెరకెక్కించిన ఆధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ప్రముఖ టాలీవుడ్ చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఇందులో అజిత్ త్రిపాత్రాభినయం చేస్తున్నట్లు సమాచారం. దీంతో ఆయనకు జంటగా నటి శ్రీలీల, మీనా, సిమ్రాన్‌లు నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. కాగా చిత్ర షూటింగ్ వచ్చే నెలలో ప్రారంభం అవుతుందని సమాచారం. కాగా ఈ చిత్రం టైటిల్‌కే సూపర్ రెస్పాన్స్ వచ్చింది. అలాగే చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను సమీపకాలంలో విడుదల చేశారు. అజిత్ మూడు ముఖాలతో కూడిన ఆ పోస్టర్ చిత్రంపై మరింత ఆసక్తిని పెంచేసింది. అంతే కాదు ఆ ఒక్క పోస్టర్ చిత్ర వ్యాపారంపై పెద్ద ప్రభావాన్నే కలిగించిందని, చిత్రం ఓటీటీ హక్కులనే ఒక ఓటీటీ సంస్థ రూ.95 కోట్లకు పొందిందని సమాచారం. అయితే ఇందులో నిజం ఎంత అన్నది తెలియాల్సి ఉంది. మొత్తం మీద అజిత్ గుడ్ బ్యాడ్ అగ్లీ చిత్రం ప్రారంభానికి ముందే సంచలనం సృష్టిస్తోందన్నమాట. ఇకపోతే ఈ చిత్రాన్ని 2025 పొంగల్‌కు విడుదల చేయనున్నట్లు ముందుగానే వెల్లడించడం మరో విశేషం.


గుడ్ బ్యాడ్ అగ్లీ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్

త్వరలో తెరపైకి మళైపిడిక్కాద మణిదన్

తమిళసినిమా: వైవిధ్యభరిత కథా చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్న నటుడు, సంగీత దర్శకుడు విజయ్ఆంటోని. ఈయన ఇటీవల కథానాయకుడిగా నటించిన రోమియో చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. కాగా తాజాగా నటించిన మళైపిడిక్కాద మణిదన్ చిత్రం త్వరలో తెరపైకి రావడానికి ముస్తాబవుతోంది. అళగాయ్ ఇరుక్కిరాయ్ భయమాయ్ ఇరుక్కిరదు, గోలీసోడా, 10 ఎంద్రదుక్కుళ్, గోలీసోడా 2 చిత్రాల ఫేమ్ ఛాయాగ్రహకుడు, దర్శకుడు విజయ్ మిల్టన్ తాజాగా దర్శకత్వం వహించిన చిత్రం ఇది. నటుడు శరత్‌కుమార్, కన్నడ నటుడు డాలీ ధనుంజయ, నటి మెఘాఆకాశ్, మురళీశర్మ, పృథ్వీ ఆంపర్, శరణ్య పొన్‌వణ్ణన్, తలైవాసల్ విజయ్, ఏఎల్.అళగప్పన్, తిరుమలై చిత్ర దర్శకుడు రమణ తదితరులు ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రంలో నటుడు సత్యరాజ్ అతిథిగా కీలక పాత్రను పోషించడం విశేషం. ఇంతకు ముందు కోడియిల్ ఒరువన్, కొలై, రత్తం వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాలను నిర్మించిన ఇన్ఫినిటి ఫిలిం వెంచర్స్ అధినేతలు కమల్ బోహ్రా, డీ.లలిత, పీ.ప్రదీప్ నిర్మిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం ఇది. కాగా షూటింగ్ పూర్తి చేసుకుని ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలను జరుపుకుంటున్న ఈ చిత్రం వివరాలను దర్శకుడు తెలుపుతూ సహ మనిషిపై ప్రేమ, కరుణ కలిగిన వ్యక్తి ఒక కొత్త దీవిలోకి వెళ్లి మరొకరి భవిష్యత్‌ను ఎలా మారుస్తాడన్న పలు ఆసక్తికరమైన అంశాలతో మళైపిడిక్కాద మణిదన్ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు చెప్పారు. చిత్రం షూటింగ్‌ను అండమాన్, డై దమన్ దీవుల్లోనూ, ఇతర నగరాల్లోనూ నిర్వహించినట్లు చెప్పారు. కాగా చిత్రంలోని ఫైట్ సన్నివేశాలను పొయటిక్ యాక్షన్ ఎంటర్‌టెయినర్ అనే కొత్త జానర్‌లో రూపొందించినట్లు చెప్పారు. చిత్రంలోని ఫైట్స్ సాధారణ యాక్షన్ మసాలా చిత్రాల్లో మాదిరి ఉండవన్నారు. చిత్ర నిర్మాణాంతర కార్యక్రమాలు చివరి దశకు చేరుకున్నాయని, త్వరలోనే చిత్రాన్ని తెరపైకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. కాగా అంతకు ముందు చిత్ర టీజర్‌ను ఈ నెల 29వ తేదీన విడుదల చేయనున్నట్లు చెప్పారు. కాగా ఈ చిత్రాన్ని తెలుగులోనూ తుఫాన్ పేరుతో తమిళంతో పాటు ఏక కాలంలో విడుదల చేయనున్నట్లు చెప్పారు.


మళైపిడిక్కాద మణిదన్ చిత్రంలో విజయ్ ఆంటోని, మేఘాఆకాశ్

క్లుప్తంగా

దేవుడా....!

- ఛిద్రమైన వృద్ధురాలి శరీరం
- శరీర భాగాలను ఏరి మరీ మూటకట్టిన వైనం

సాక్షి, చెన్నై : రోడ్డు దాటుతూ వేకువ జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన ఓ వృద్ధురాలి శరీరం మీదుగా పలు వాహనాలు వెళ్లడంతో ఛిద్రమైంది. శరీరంలోని అన్ని భాగాలు మాంసపు ముక్కలై చెల్లా చెదరుగా పడడంతో వాటిని ఏరుకుని మూట కట్టి పోస్టుమార్టానికి తరలించాల్సిన పరిస్థితి పోలీసులకు ఏర్పడింది. హృదయ విదారక ఈ ఘటన సేలం జిల్లా కందం పట్టి బైపాస్ రోడ్డులో బుధవారం చోటు చేసుకుంది. సేలం కందం పట్టి కోనేరి కరైకు చెందిన గోవిందన్ భార్య లక్ష్మి(80) బుధవారం ఉదయం తన ఇంటికీ సమీపంలోని బైపాస్ రోడ్డును దాటే ప్రయత్నం చేసింది. అటు వైపుగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఆమెను ఢీ కొని వెళ్లింది. రోడ్డుపై ఆమె గాయాలతో పడినా, ఎవరూ గుర్తించ లేని పరిస్థితి. ఆ పరిసరాలు చిమ్మ చీకటితో నిండి ఉండటమే కాకుండా అతి వేగంగా బైపాస్ రోడ్డులో వాహనాలు దూసుకెళ్లడంతో ఆమె శరీరం ఛిద్రమైంది. రోడ్డుపై ఆమె మీదుగా ఎన్ని వాహనాలు వెళ్లాయో ఏమోగానీ శరీర భాగాలన్నీ ముక్కలయ్యాయి. మాంసపు ముక్కల వలే ఆమె శరీర అవయవాలు పడి ఉండటాన్ని తెల్లారిన అనంతరం అటు వైపుగా వెళ్లిన వారు గుర్తించారు. ఆమె ముఖం, గొంత భాగం తప్ప, మిగిలిన అవయవాలన్నీ మాంసపు ముక్కలుగా మారడంతో ఆ పరిసర వాసులు గుండెలను బరువెక్కించాయి. సమాచారం అందుకున్న పోలీసులు, ఆరోగ్య, పంచాయతీ సిబ్బంది అక్కడికి చేరుకుని శరీర భాగాలను ఏరుకుని మూట కట్టి మార్చురీకి తరలించారు. అక్కడ హృదయ విదారకంగా ఉన్న ప్రాంతాన్ని శుభ్రం చేయించారు. బైపాస్ రోడ్డులోని ఆమె శరీరంపై ఎన్ని వాహనాలు వెళ్లాయో, ఆ దేహం ఏ మేరకు తల్లడిల్లిందో అని కన్నీళ్లు పెట్టుకున్న వారే ఎక్కువ. మృతి చెందిన లక్ష్మికి ఆరుగురు కుమారులు ఉన్నారు. ఆమెను తొలుత ఢీ కొని వెళ్లిన గుర్తు తెలియని వాహనం కోసం పోలీసులు వేట మొదలెట్టారు.

ప్రాణం తీసిన బీడీ గొడవ

అన్నానగర్: బీడీ అడిగితే ఇవ్వకుండా దూషించాడన్న ఆగ్రహంతో నిద్రిస్తున్న తాపీ మేస్త్రీ తలపై బండరాయితో మోది, హతమార్చి ఆపై పెట్రోల్ పోసి తగులబెట్టిన సంఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. మధురైలోని అతికులం ఏంజెల్ నగర్ ప్రాంతానికి చెందిన చక్కరై(65) మేస్త్రీగా పనిచేస్తున్నాడు. కొద్ది రోజులుగా కుటుంబంలో విభేదాల కారణంగా నారాయణపురం ప్రాంతంలోని కార్పొరేషన్ ఆవరణలోని ఖాళీ స్థలంలో నిద్రిస్తున్నాడు. ఈ క్రమంలో అతని పక్కనే మురుగన్ (43) కూడా నిద్రిస్తున్నాడు. ఆ సమయంలో చక్కరై బీడీ తాగుతుండగా మురుగన్ ఒక బీడీ ఇవ్వమని చక్కరైని అడిగాడు. అయితే చక్కరై ఇచ్చేందుకు నిరాకరించి, మురుగన్‌ను అసభ్యకరంగా దూషించాడు. తీవ్ర ఆవేశానికి గురైన మురుగన్ మంగళవారం అర్ధరాత్రి పడుకుని ఉన్న చక్కెర తలపై బండరాయి వేసి హత్య చేశాడు. తర్వాత అతని శరీరంపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు మురుగన్‌ను అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నారు.

జీపు - కారు ఢీ

- ఇద్దరు మహిళల మృతి
- 9 మందికి తీవ్ర గాయాలు

అన్నానగర్: నెల్‌లై జిల్లా ఉవరి సమీపంలోని దక్షిణ పులిమంగుళం మెయిన్ రోడ్డుకు చెందిన విజయ కుమార్ తన తండ్రి మురుగేశన్‌కు నివాళులర్పించేందుకు బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి జీపులో కన్యాకుమారికి బయలుదేరాడు. కూడంగుళం సమీపంలోని ఈస్ట్ కోస్ట్ రోడ్డులో తోటావిలై మీదుగా వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు వీరి జీపుని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జీపులో ఉన్న 11 మంది గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం కూడంగుళం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే మార్గంమధ్యలోనే విజయకుమార్ భార్య చందనకుమారి (38), సోదరి ముత్తుసెల్వి (32) మృతి చెందారు. మరో 9 మందిని చికిత్స నిమిత్తం నాగర్‌కోయిల్ ఆచారిపాళ్యం ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాణిపాకంలో భక్తజనం

కాణిపాకం: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం బుధవారం భక్తజనంతో కిక్కిరిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు కూడా భక్తులతో ఆలయం రద్దీగా కనిపించింది. ఉచిత దర్శన క్యూలు కూడా భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాధికారులు భక్తుల రద్దీ దృష్ట్యా తక్షణ చర్యలు తీసుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. మరో పది రోజుల పాటు ఆలయానికి భారీగా రద్దీ ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.



నామక్కల్ జిల్లా తిరుచెంగోడ్ అర్ధనారీశ్వర స్వామి ఆలయంలో వైకాసి విశాఖ ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామివారికి కళ్యాణోత్సవం కోలాహలంగా నిర్వహించారు. - సేలం

రత్నగిరిలో వైభవంగా రథోత్సవం



రథంలో ఊరేగుతున్న బాలమురుగన్

వేలూరు: రాణిపేట జిల్లా ఆర్కాడు తాలుకాలోని రత్నగిరి బాల మురుగన్ ఆలయంలో వైకాసి విశాఖ ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉదయం బాల మురుగన్ అడిగల్ స్వామిజీ, కలవై సచ్చిదానం స్వామిజీల ఆధ్వర్యంలో బాలమురుగన్ స్వామివారికి ప్రత్యేక పూజలు, దీపారాధన పూజలు చేసి, విశేషాలంకరణ చేసి, రథం వద్దకు వేంచేపు చేసి, హరోంహర నామస్మరణల నడుమ రథంలో కొలువుదీర్చారు. తరువాత పీఠాధిపతులు రథం దారానికి పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఈశ్వరప్పన్ రథానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తరువాత భక్తులు హరోం హర నామస్మరణాల నడుమ రథాన్ని లాగారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన రథోత్సవం కొండను చుట్టుకుని మధ్యాహ్నం 2 గంటలకు ఆలయం వద్దకు చేరుకుంది. రథోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో గణపతి హోమం, పుణ్యాహవచనం, సుబ్రమణ్యహోమం, మొదటి కాల పూజ, విఘ్నేశ్వర పూజ, కాల యాగ పూజలు జరిపారు. ఈ రథోత్సవంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథంపై మిరియాలు, బొరుగులు చల్లి రథాన్ని లాగి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులతోపాటు పారిశ్రామిక వేత్తలు భక్తులకు అన్నదానం, మజ్జిగ, తాగునీరు అందజేశారు.

సింగిరికుడి లక్ష్మీ నరసింహ ఆలయంలో..

తిరువొత్తియూరు: కడలూరులోని సింగిరికుడిలో ఉన్న లక్ష్మీనరసింహ ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవం నిర్వహించారు. ఏటా స్వామివారికి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది బ్రహ్మోత్సవాలు 14వ తేదీన ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ముఖ్యఘట్టమైన రథోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున 2.30 గంటలకు లక్ష్మీనరసింహస్వామివారికి ప్రత్యేక తిరుమంజనం, పూజలు నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేతంగా లక్ష్మీనరసింహస్వామివారికి ప్రత్యేక అలంకారం చేసి, ఊరేగించారు. అనంతరం గోవింద నామస్మరణల నడుమ భక్తి శ్రద్ధలతో రథాన్ని లాగారు. అనంతరం అందరికీ ప్రసాదాలు అందజేశారు.

కోలాహలంగా గంగజాతర



మహిషాసురమర్దిని అలంకరణలో కొళాపురమ్మ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పళ్లిపట్టు: పట్టణంలో గంగమ్మ జాతర కోలాహలంగా నిర్వహించారు. జాతర సందర్భంగా పట్టణంలో సందడి నెలకొంది. మంగళ, బుధవారాల్లో జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామదేవత కొళాపురమ్మకు విశిష్ట అభిషేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సంగీత విభావరి భక్తులను ఆకట్టుకుంది. రాత్రి కొళాపురమ్మ ఉత్సమూర్తికి మహిషాసురమర్దిని అలంకరణ చేశారు. పట్టణానికి చెందిన గోవిందరాజులు, విజయలక్ష్మి కుటుంబసభ్యులు మంగళవాయిద్యాల నడుమ అమ్మవారికి గజమాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలో అందజేశారు. అలాగే ఆలయ పరిసర ప్రాంతాలు విద్యుద్దీపాలతో కనువిందు చేయగా అమ్మవారి ఆలయ సన్నిధి పూర్తిగా వివిధ పుష్పాలతో మునికృష్ణ యాదవ్ అలంకరించారు. రాత్రి అమ్మవారు ప్రత్యేక వాహనంలో కొలువుదీర్చి పట్టణవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా బాణసంచా సంబరాలు, కరగాట్టం, మంగళ వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. రాత్రి గంగమ్మ పట్టణ వీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులిచ్చి దర్శించుకున్నారు. బుధవారం ఉదయం గంగమ్మ తల్లిని బజారు వీధిలో కొలువుదీర్చారు. మహిళలు కుంభం సమర్పించి దర్శించుకున్నారు. పట్టణంలో యువకులు వివిధ వేషాలతో హల్‌చల్ చేశారు. సాయంత్రం అమ్మవారిని ఊరేగింపుగా తరలించి నిమజ్జనం చేశారు.

69 చిన్న పిల్లల మిస్సింగ్ కేసులు పరిష్కారం



వినతిపత్రాలను పరిశీలిస్తున్న ఆవడి కమిషనర్ శంకర్ తదితరులు

తిరువళ్లూరు: ఆవడి కమిషనరేట్ పరిధిలో 90 మంది చిన్నారులు అదృశ్యమైనట్టు కేసులు నమోదు చేసిన క్రమంలో 69 కేసులను ఛేదించి చిన్న పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించినట్టు కమిషనర్ శంకర్ తెలిపారు. తిరువళ్లూరు జిల్లా ఆవడిలోని ఎస్‌ఎం నగర్ పోలీసు కన్వెన్షన్ హాలులో ప్రజలతో పోలీసులు పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని కమిషనర్ శంకర్ నేతృత్వంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది ప్రజలు పాల్గొని, తమ సమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. వీటితోపాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను ఆయా పోలీసు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేసిన కమిషనర్ సంబంధిత ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం కమిషనర్ శంకర్ మాట్లాడుతూ ఆవడి పోలీసు కమిషనరేట్ పరిధిలో ఇప్పటి వరకు 90 మంది చిన్నారుల మిస్సింగ్ కేసులు నమోదయ్యాయని, వీటిలో 69 కేసులను పరిష్కరించి పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించినట్టు తెలిపారు. కమిషనరేట్ పరిధిలో పోలీసులకు వచ్చే ఫిర్యాదులను తక్షణం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

బైక్, కారు ఢీ.. ఇద్దరి మృతి



నుజ్జునుజ్జయిన కారు. ఇన్‌సెట్‌లో మృతి చెందిన యువకులు

కొరుక్కుపేట: ఉసిలంబట్టి సమీపంలోని ఓ ఆలయంలో జరిగిన ఉత్సవాలకు వెళ్లి తిరిగి వస్తుండగా బైక్‌ను కారు ఢీ కొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. మధురైజిల్లా ఉసిలంబట్టి సమీపంలోని పూచీపట్టికి చెందిన మచ్చకలై (26), లార్డ్ (31) ఇద్దరూ డ్రైవర్లు. వీరిద్దరూ మంగళవారం ఉసిలంబట్టి సమీపంలోని చెటియాపట్టి గ్రామంలోని ఆలయంలో ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో స్వామివారి దర్శనానికి వెళ్లారు. దర్శనం ముగించుకుని అర్ధరాత్రి బైక్‌పై తిరిగి ఇంటికి బయలుదేరారు. మదురై నుంచి తేని వెళుతున్న కారు దంపట్టి సమీపంలో వారి బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో మచ్చకలై, ప్రభు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న ఉసిలంబట్టి తాలూకా పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుతాస్పత్రికి తరలించారు. ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని కారు డ్రైవర్ కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన పూచీపట్టి గ్రామంలో విషాదం నింపింది.

అసభ్యకర వీడియోలను పబ్లిష్ చేస్తానని బెదిరింపు



అరెస్టయిన నిందితులు

కొరుక్కుపేట: అసభ్యకర వీడియోలు సోషల్‌మీడియాలో పబ్లిష్ చేస్తానని బెదిరించి కేంద్రప్రభుత్వ అధికారి నుంచి రూ.2.70 లక్షలు వసూలు చేసిన నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. చెన్నైలోని తిరుముల్‌లైవాయిల్ ప్రాంతానికి చెందిన వెంకటేశన్ (59) కారైకల్‌లో సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. తిరునల్లారు రోడ్డులో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. మైయిలాడుతురై శ్రీనివాసపురం కంబర్ వీధికి చెందిన అయ్యప్పన్ భార్య సుభాషిణి(40)తో వెంకటేశన్‌కు పరిచయం ఏర్పడింది. దీంతో 6 నెలలుగా సుభాషిణి కారైకల్ వెళుతోంది. కుటుంబ పేదరికాన్ని సాకుగా చూపి సుభాషిణి వెంకటేశన్ నుంచి డబ్బులు వసూలు చేస్తోంది. ఈ క్రమంలో గత నెల 27న వెంకటేశన్, సుభాషిణి ఒంటరిగా ఉండగా సుభాషిణి తన సెల్‌ఫోన్‌లో వీడియో తీసింది. అనంతరం అసభ్యకర వీడియోలను పబ్లిష్ చేస్తామని బెదిరిస్తూ అతడి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయాలని సుభాషిణి తన ముఠాతో కలసి ప్లాన్ చేసింది. అందుకు తగ్గట్టుగానే గత నెల 29న సుభాషిణి వెంకటేశన్‌ను మైలడుదురై కావేరీనగర్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌కు ఆహ్వానించింది. ఆ సమయంలో మూవేందర్ మున్నేట్ర కజగం రాష్ట్ర యూత్ డిప్యూటీ సెక్రటరీ మైలాడుదురై శాఖకు చెందిన గిల్లి ప్రకాష్ (40)కి సుభాషిణి సమాచారం అందించి పిలిపించింది. ఆమె, ప్రకాష్ అతని వెంట అతని సహచరులు మహ్మద్ నసీర్ (39), దినేష్ బాబు (31) ఉన్నారు. వాళ్లంతా కలిసి తమకు కావాల్సిన డబ్బు ఇవ్వండి, లేకపోతే సుభాషిణి దగ్గరగా ఉండే ఫొటోలు సోషల్‌మీడియాలో పబ్లిష్ చేస్తామని బెదిరించి ప్రకాష్, సుభాషిణి కలిసి వేంకటేశన్ రూ.2.70 లక్షలు దోపిడీ చేశారు. వీడియోను బయటపెట్టకుండా అదనంగా రూ.10 లక్షలు ఇవ్వాలని బెదిరించారు. వెంకటేశన్ ఈ విషయమై మైలాడుదురై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం గిల్లి ప్రకాష్, సుభాషిణి, మహమ్మద్ నసీర్, దినేష్ బాబును పోలీసులు అరెస్టు చేశారు. వారిని న్యాయమూర్తి వద్ద హాజరుపరిచారు. సుభాషిణిని తిరువారూర్ జైలులో, మిగిలిన ముగ్గురి మైలాడుతురై బ్రాంచ్ జైలులో పెట్టారు. అరెస్టయిన గిల్లి ప్రకాష్ 2011 నుంచి చారిత్రక రికార్డుల నేరగాళ్ల జాబితాలో ఉండడం గమనార్హం.

కనులపండువగా గరుడోత్సవం



తిరుత్తణి: విజయరాఘవ పెరుమాళ్ గరుడోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. తిరుత్తణి నందినది తీరంలోని పురాతన విజయ రాఘవ పెరుమాళ్ ఆలయంలో ఏటా వైకాసి మాసంలో గరుడ సేవ నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో బుధవారం వేకువజామున మూలవర్లకు విశేష అభిషేక పూజలు చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం స్వామివారిని అలంకరించి గరుడ వాహనంలో కొలువుదీరి, కర్పూర హారతులిచ్చారు. అనంతరం స్వామివారి గరుడవాహన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కొబ్బరికాయలకు కొట్టి, కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణ కిరాణా దుకాణాల వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో గరుడసేవ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

గరుడ సేవ ఊరేగింపులో అపశ్రుతి

- పల్లకి నుంచి పడిపోయిన స్వామి విగ్రహం

కొరుక్కుపేట: తిరువొత్తియూర్‌లోని శ్రీకల్యాణ వరదరాజ పెరుమాళ్ ఆలయంలో నిర్వహించిన గరుడసేవ ఊరేగింపులో అపశ్రుతి చోటుచేసుకుంది. పల్లకిలో ఉంచి స్వామివారి విగ్రహం కిందకు పడిపోవటంతో భక్తులు భయాందోళనకు గురయ్యారు. కల్యాణ వరద రాజ పెరు మాళ్ ఆలయంలో వైకాసి బ్రహ్మోత్సవాలు గత సోమవారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో మూడో రోజైన బుధవారం ఉదయం గరుడసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా పెరుమాల్ ఉత్సవమూర్తిని ప్రత్యేక అలంకారంలో కొలువుదీర్చారు. గరుడ వాహనంపై స్వామివారిని కొలువుదీర్చి ఊరేగించారు. దీంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. ఈక్రమంలో ఒక్కసారిగా స్వామి వారి విగ్రహం కిందపడిపోవడంతో భక్తులు ఉలిక్కిపడ్డారు. వెంటనే పల్లకీలోంచి సామివారి విగ్రహం ఎలాంటి నష్టం జరగకుండా సురక్షితంగా పట్టుకున్నారు. అనంతరం స్వామివారి విగ్రహాన్ని ఆలయంలోని తీసుకెళ్లారు. పక్కనే ఉన్న కొంతమంది భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి.

సింగపూర్ విమానంలో సాంకేతికలోపం

- 3 గంటలు ఆలస్యంగా బయలుదేరిన విమానం

కొరుక్కుపేట: చెన్నై విమానాశ్రయం నుంచి సింగపూర్ వెళ్లాల్సిన సింగపూర్ ఎయిర్‌లైన్స్ విమానంలో మంగళవారం సాంకేతిక లోపం ఏర్పడింది. దీంతో ఆ విమానం బుధవారం తెల్లవారుజామున మూడున్నర గంటలు ఆలస్యంగా సింగపూర్‌కు బయలుదేరింది. ఈ విమానం ఎక్కాల్సిన 320 మంది ప్రయాణికులు అవస్థలు పడ్డారు. సింగపూర్ ఎయిర్ లైన్స్ విమానం రాత్రి 10 గంటలకు చెన్నై విమానాశ్రయంలోని అంతర్జాతీయ టెర్మినల్‌కు ప్రయాణికులతో చేరుకుంటుంది. ఆ తర్వాత ఇక్కడి నుంచి రాత్రి 11.15 గంటలకు మళ్లీ సింగపూర్‌కు బయలుదేరుతుంది. ఈ విమానంలో కేవలం సింగపూర్ మాత్రమే కాకుండా ఆస్ట్రేలియా, జపాన్ సహా పలు దేశాలకు వెళ్లే ప్రయాణికులు కూడా ప్రయాణిస్తున్నారు. అలా సింగపూర్ ఎయిర్ లైన్స్ విమానంలో ఎక్కువ మంది ప్రయాణికులతో రద్దీ కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి యథావిధిగా సింగపూర్ నుంచి ప్రయాణికులతో బయలుదేరిన సింగపూర్ ఎయిర్ లైన్స్ విమానం షెడ్యూల్ కంటే ముందే రాత్రి 9.55 గంటలకు చెన్నై విమానాశ్రయంలో దిగింది. ఆ తర్వాత చెన్నై నుంచి తిరిగి రాత్రి 11.15 గంటలకు విమానం సింగపూర్‌కు బయలుదేరాల్సి ఉంది. ఆ విమానంలో మొత్తం 320 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే ఆ విమానంలో చిన్న సాంకేతిక సమస్య తలెత్తిందని, మరమ్మతు చేసి, నడపాలని సింగపూర్ కపూర్ ఎయిర్‌లైన్స్ కంపెనీ పైలట్‌లకు సూచించినట్లు సమాచారం. అలా మంగళవారం రాత్రి చెన్నైలోని సింగపూర్ ఎయిర్‌లైన్స్ విమానంలో సాంకేతిక లోపాన్ని సరిచేసుకుని బుధవారం తెల్లవారుజామున 2.47 గంటలకు సుమారు మూడున్నర గంటలు ఆలస్యంగా 240 మంది ప్రయాణికులతో చెన్నై నుంచి సింగపూర్‌కు బయలుదేరింది.

ఘనంగా వైకాసి విశాఖ ఉత్సవాలు



అన్నదానం చేస్తున్న తిరుచందూర్ అన్నదాన కమిటీ సభ్యులు

వేలూరు: తిరువణ్ణామలై, వేలూరు జిల్లాల్లోని పెరుమాల్, మురుగన్ ఆలయాల్లో వైకాసి విశాఖ ఉత్సవాలు బుధవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. వేలూరు సైదాపేట ఆర్కాడు రోడ్డులోని పయణి ఆండవర్ ఆలయంలో వైకాసి విశాఖ ఉత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం 6 గంటలకు నవ కలశ స్థాపన, వెండి పూజ చేశారు. అరంతరం ఆలయంలో శుత్రు సంహార యాగ పూజలు నిర్వహించారు. 11 గంటలకు మహా దీపారాధన పూజలు జరిపారు. అలాగే తోటపాళెంలోని తిరుచందూర్ అన్నదాన ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కుప్పుస్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆరాధనలు నిర్వహించారు. ఆ తరువాత తోటపాళెం ధర్మరాజ ఆలయ సమీపంలోని మైదానంలో సుమారు వెయ్యి మందికి అన్నదానం చేశారు. నిరుపేదలకు పంచె, చీరలు అందజేశారు. ఉత్సవ కమిటీ నిర్వహకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వైకాసి విశాఖాన్ని పురస్కరించుకుని కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానంతోపాటు దుస్తులను అందజేస్తామన్నారు. అందులో భాగంగానే ఈ సంవత్సరం కూడా ఈ కార్యక్రమం నిర్వహించి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కార్యదర్శి విజిటి సుందర్, కోశాధికారి వీఎస్ రాజు, సభ్యులు బాలాజీ, శాంతామూర్తి, సురేష్ బాబు పాల్గొన్నారు. అలాగే తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలోని మురుగన్ సన్నధిలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దీపారాధన పూజలు చేశారు.

వాటర్ ట్యాంక్‌లో పడి రెండేళ్ల చిన్నారి మృతి

అన్నానగర్: మీంజూరు సమీపంలో వాటర్ ట్యాంక్‌లో పడి రెండేళ్ల చిన్నారి మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. తిరువళ్లూరు జిల్లా మీంజూర్ మున్సిపాలిటీ అరియన్వాళ్ ప్రాంతంలో వసంత్ (26), వల్లి (24) దంపతులు నివాసమున్నారు. వీరికి కీర్తన (2) కుమార్తె ఉంది. మంగళవారం సాయంత్రం వల్లి ఇంట్లో పని చేసుకుంటుండగా ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నారి కీర్తన అక్కడున్న వాటర్ ట్యాంక్‌లో పడి మునిగిపోయింది. దీంతో షాక్‌కు గురైన కుటుంబ సభ్యులు చిన్నారిని రక్షించి, మీంజూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. తర్వాత చిన్నారిని మెరుగైన చికిత్స కోసం పొన్నేరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించగా మార్గం మధ్యలోనే చిన్నారి మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై మీంజూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూతురిని బావిలో తోసేసింది!

వేలూరు: తల్లి వివాహేతర సంబంధం విషయం తండ్రితో చెబుతానన్న కుమార్తెను కన్నతల్లి బావిలో తోసి, హత్య చేసిన సంఘటన మదురై జిల్లా మేలూరులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మేలూరు సమీపంలోని ఆట్టుకులం గ్రామానికి చెందిన సమయముత్తుకు భార్య మలర్‌సెల్వి, కుమార్తె కార్తిక(5) ఉన్నారు. సమయముత్తు కువైట్‌లో పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో చిన్నారి కార్తిక మంగళవారం ఉదయం ఉన్న ఫలంగా మాయమైంది. దీంతో చిన్నారి అవ్వ కాత్తాయి మేలూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు చిన్నారి కోసం గాలించారు. ఆ సమయంలో ఇంటి సమీపంలోని ఒక వ్యవసాయ బావిలో చిన్నారి మృతదేహం తేలుతుండడంతో మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని విచారణ చేపట్టారు. పోలీసులు చిన్నారి తల్లి మలర్‌సెల్విని విచారణ జరపగా చిన్నారి తండ్రి కువైట్‌లో పనిచేస్తుండడంతో ఒంటరిగా ఉన్న మలర్‌సెల్వికి మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయాన్ని చిన్నారి నేరుగా చూసిన వెంటనే వివాహేతర సంబంధం గురించి తండ్రికి ఫోన్ చేసి చెబుతానని చెప్పడంతో భయపడిన మలర్‌సెల్వి కుమార్తెను ఇంటి సమీపంలోని బావిలో తోసి వేసి, హత్య చేసినట్లు అంగీకరించింది. దీంతో మలర్‌సెల్విని పోలీసులు అరెస్టు చేసి, విచారణ చేస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘించి మట్టి తవ్వకాలు



అధికారుల తనిఖీలతో వెనుదిరుగుతున్న లారీలు

తిరువళ్లూరు: అక్రమ మట్టి తవ్వకాలపై మైనింగ్ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. తిరువళ్లూరు జిల్లా కొరక్కతండలం, మెయ్యూరు, రాజపాళెంతోపాటు పలు ప్రాంతాల్లో మట్టి తవ్వకాలకు అధికారులు అనుమతి ఇచ్చారు. అనుమతి ఇచ్చిన ప్రాంతాల్లో మూడు అడుగుల మేరకు మాత్రమే తవ్వకాలు చేపట్టాల్సి ఉంది. అలాగే సెల్‌ఫోన్, విద్యుత్ టవర్లకు సమీపంలో తవ్వకాలు చేపట్టకూడదన్న నిబంధనను కచ్చితంగా పాటించాలని అనుమతిలో స్పష్టం చేశారు. అయితే అనుమతి పొందిన ప్రాంతాల్లో కాకుండా ప్రభుత్వ అస్సైన్ భూముల్లో యథేచ్ఛగా తవ్వకాలు చేపట్టారు. రోజుకు వందలాది లారీల్లో మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనలను ఉల్లంఘించి చేపట్టిన తవ్వకాలతో విద్యుత్ టవర్లకు సైతం ప్రమాదం ఏర్పడే పరిస్థితి నెలకొంది. దీంతో అక్రమ తవ్వకాలపై స్థానికులు కలెక్టర్‌కు సమాచారం అందించారు. కలెక్టర్ డాక్టర్ ప్రభుశంకర్ స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు వెంటనే తనిఖీలు చేపట్టాలని మైనింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగానే బుధవారం ఉదయం అధికారులు తనిఖీలు చేపట్టారు. అధికారులు వస్తున్నారన్న సమాచారంతో అక్రమంగా మట్టి తవ్వకం జరిపే అక్రమార్కులు తమ జేసీబీ తదితర వాహనాలను అక్కడే వదిలిపెట్టి పరుగులు పెట్టారు. అప్పటికే మట్టి కోసం బారులు తీరిన లారీలు తమపై కేసులు నమోదు చేస్తారన్న భయంతో వెనక్కి తిరిగాయి. కాగా అక్రమ తవ్వకాలు చేపట్టిన ప్రాంతంలో అధికారులు తనిఖీలను చేపట్టారు. అక్కడ నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ కావడంతో అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో 12 మందికి గాయాలు



చికిత్స పొందుతున్న మహిళ కార్మికులు

తిరువళ్లూరు: పట్రపెరంబదూరు వద్ద కార్మికులతో వెళుతున్న మినీ వ్యాన్‌ను మరో పరిశ్రమకు కార్మికులతో వెళుతున్న బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో మినీ వ్యాన్‌లో ప్రయాణిస్తున్న 12 మంది మహిళ కార్మికులు గాయపడ్డారు. వీరిని 108 ద్వారా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. తిరువళ్లూరు జిల్లా ఎగువనల్లాత్తూరు ప్రాంతంలో ఓ ప్రైవేటు కంపెనీ ఉంది. ఈ కంపెనీకి నారాయణపురం, పట్రపెరంబదూరు తదితర గ్రామాల నుంచి ఒప్పంద కార్మికులు వెళ్లి పని చేస్తున్నారు. అలాగే ఆ ప్రాంతంలోనే ఉన్న మరో కంపెనీకి పట్రపెరంబదూరుతోపాటు ఇతర గ్రామాలకు చెందిన కార్మికులు పనులకు వెళుతున్నారు. ఈ క్రమంలో సుమారు 20 మంది కార్మికులతో పట్రపెరంబదూరు నుంచి ఎగవనల్లాత్తూరుకు బయలుదేరడానికి సిద్ధంగా ఉన్న వ్యాన్‌ను కార్మికులతో వెళుతున్న మరో బస్సు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో మినీవ్యాన్‌లో ఉన్న మహిళా కార్మికులు పార్వతి, ఎయిలరసి, దేవి, తమిళరసి, కళావతి, అంజలితో పాటు 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 ద్వారా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సీతారామయ్య సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న తెలుగు ప్రముఖులు

కొరుక్కుపేట: వైద్య, సాహిత్య, సమాజ సేవా రంగాలకు కందనూరు సీతారామయ్య చేసిన సేవలు చిరస్మరణీయం అని, ఆయన స్మృత్యంజలి సభలో పలువురు వక్తలు కొనియాడారు. వేద విజ్ఞాన వేదిక కార్యదర్శి కందనూరు మధు తండ్రి డాక్టర్ కందనూరు సీతారామయ్య వృద్ధాప్యం కారణంగా ఈ నెల 8వ తేదీన మృతి చెందిన విషయం తెలిసిందే. చెన్నై టి.నగర్ లోని ఆంధ్రా క్లబ్ గోదావరి హాలులో బుధవారం సీతారామయ్య స్మృత్యంజలి సభ నిర్వహించారు. ముందుగా తెలుగు ప్రముఖులు ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి, వేదవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు జేకే రెడ్డి, ఏచూరి చలపతిరావు, సనత్ కుమార్ రెడ్డి, బొమ్మిరెడ్డి సురేంద్ర, శ్రీనివాసరాజు, ప్రముఖ నటి సావిత్రి కుమార్తె విజయచాముండేశ్వరి, సూర్యకాంతం కుమారుడు అనంత పద్మనాభమూర్తి, రాధా లక్ష్మి తదితరులతో కలసి సీతారామయ్య కుమారులు కందనూరు మధు, డాక్టర్ శ్రీరామ్, కుటుంబ సభ్యులు పుష్పాంజలి ఘటించారు అనంతరం జేకే రెడ్డి, అరుణ శ్రీనాథుడితో కలసి అన్నమయ్య కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. అలాగే భగవద్గీతలోని శ్లోకాలను వినిపించారు.

మహిళలు 10 శాతమైనా లేరు!

ఈ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో మహిళల సంఖ్య 10 శాతం కంటే తక్కువే ఉంది! ఈసారి మహిళా అభ్యర్థులు కేవలం 797 మందేనని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) వెల్లడించింది. అంటే 9.5 శాతం! తొలి విడతలో 1,618 మంది అభ్యర్థుల్లో మహిళలు 135 మంది. రెండో విడతలో 1,192 మంది అభ్యర్థుల్లో 100 మంది, మూడో విడతలో 1,352 మందిలో 123, నాలుగో విడతలో 1,717 మందిలో 170, 5వ విడతలో 695 మందిలో 82 మంది మహిళలున్నారు. పోలింగ్ జరగాల్సిన ఆరో విడతలో 869 మంది అభ్యర్థుల్లో 92 మంది మహిళలున్నారు. ఏడో విడతలో కూడా 904 మంది అభ్యర్థుల్లో మహిళలు కేవలం 95 మందే. మహిళా రిజర్వేషన్ల అమలుపై పార్టీల చిత్తశుద్ధి ఏపాటితో చెప్పేందుకు ఈ ఉదంతం ఒక్కటి చాలని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

ఈసారి మొత్తం 8,337 మంది అభ్యర్థులు లోక్‌సభ బరిలో నిలిచారు. ఇంతమంది పోటీలో ఉండటం 1996 తర్వాత ఇదే తొలిసారి. 1996లో రికార్డు స్థాయిలో 13,952 మంది పోటీ చేశారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఇద్దరికీ కీలకమే

బెంగాల్లో తృణమూల్, బీజేపీ హోరాహోరీ

- 25న ఆరో విడతలో 8 స్థానాలకు పోలింగ్
- బరిలో మంత్రి, మాజీ న్యాయమూర్తి, నటులు

తృణమూల్, బీజేపీ ముఖాముఖి పోరుకు వేదికైన పశ్చిమబెంగాల్‌లో ఎన్నికలు ఆరో దశకు చేరుకున్నాయి. ఇప్పటిదాకా ఐదు విడతల్లో 25 లోక్‌సభ స్థానాలకు ఎన్నిక ముగిసింది. ఆరో దశలో భాగంగా 8 స్థానాలకు శనివారం పోలింగ్ జరగనుంది. తామ్లుక్, కాంథీ స్థానాల్లో బీజేపీ కీలక నేత సువేందు అధికారిపై ప్రతీకారానికి తృణమూల్ ఉవ్విళ్లూరుతోంది. సువేందు సోదరుడు సౌమేందు, హైకోర్టు మాజీ న్యాయమూర్తి అభిజిత్ గంగోపాధ్యాయ, కేంద్ర మంత్రి సుభాష్ సర్కార్, పలువురు బెంగాలీ నటుల భవితవ్యాన్ని ఈ దశలో ఓటర్లు తేల్చనున్నారు...

- సాక్షి, నేషనల్ డెస్క్

కాంథీ



● సౌమేందు అధికారి

ఈస్ట్ మిడ్నాపూర్ జిల్లా పరిధిలోని ఈ స్థానమూ సువేందు కుటుంబానికి కంచుకోటే. ఆయన తండ్రి శిశిర్ అధికారి తృణమూల్ టికెట్‌పై 2009, 2014, 2019ల్లో వరుసగా గెలిచారు. ఈసారి సువేందు తమ్ముడు సౌమేందు అధికారి బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. పతాష్‌పూర్ ఎమ్మెల్యే ఉత్తమ్ బారిక్ తృణమూల్ నుంచి, యువ న్యాయవాది ఊర్వశి భట్టాచార్య సీపీఎం మద్దతుతో కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నారు. తామ్లుక్‌తో పాటు కాంథీలోనూ నెగ్గి సువేందుపై ప్రతీకారం తీర్చుకోవాలని తృణమూల్ చూస్తోంది.

మేదినీపూర్



● జూన్ మాలియా

బీజేపీ నుంచి ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ అగ్నిమిత్ర పాల్ పోటీ చేస్తున్నారు. ఆమె బీజేపీ మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు. అసన్‌సోల్ దక్షిణ ఎమ్మెల్యే. తృణమూల్ నుంచి మేదినీపూర్ ఎమ్మెల్యే జూన్ మాలియా బరిలో ఉన్నారు. అభ్యర్థులిద్దరికీ సొంత పార్టీల్లో విభేదాలు తలనొప్పిగా మారాయి. తమ పార్టీలో విభేదాలు సర్దుకున్నాయని అగ్నిమిత్ర చెబుతున్నారు. సీపీఐ నుంచి బిప్లబ్ భట్టా పోటీలో ఉన్నారు.

ఝార్‌గ్రాం



● ప్రణత్ తుడు

ఇక్కడ బీజేపీ సిట్టింగ్ ఎంపీ కునార్ హెంబ్రమ్ పార్టీని వీడటంతో ప్రణత్ తుడుకు టికెట్ దక్కింది. సంథాలీ రచయిత, పద్మశ్రీ, సాహిత్య అకాడమీ అవార్డుల గ్రహీత కాళీపద సోరెన్‌ను టీఎంసీ బరిలోకి దింపింది. మరోసారి విజయంపై ధీమాతో ఉంది. సీపీఎం నుంచి సోనామణి ముర్ము పోటీ చేస్తున్నారు. జార్ఖండ్ పీపుల్స్ పార్టీ, ఐఎస్ఎఫ్ కూడా పోటీలో ఉన్నాయి.

పురూలియా



● జ్యోతిర్మయ్ మహతో

బీజేపీ సిట్టింగ్ ఎంపీ జ్యోతిర్మయ్ సింగ్ మహతో ఈసారి కూడా బరిలో ఉన్నారు. తృణమూల్ నుంచి మాజీ మంత్రి శాంతిరాం మహతో, కాంగ్రెస్ నుంచి నేపాల్‌దేవ్ మహతో, ఫార్వార్డ్ బ్లాక్ తరఫున ధీరేంద్ర నాద్ మహతో, బీఎస్పీ నుంచి సంతోష్ రాజోవర్ పోటీ చేస్తున్నారు. వీరికి ఎస్‌యూసీఐ విద్యార్థి నేత సుష్మిత మహతో, స్వతంత్ర అభ్యర్థి అజిత్ ప్రసాద్ మహతో గట్టి పోటీ ఇస్తున్నారు. మహతోలంతా కుర్మి సామాజిక వర్గీయులే. బలమైన కుర్మి ఓటు బ్యాంకు కోసం తృణమూల్ బాగా ప్రయత్నిస్తోంది. దాంతో కుర్మిల ఓటు బ్యాంకు చీలేలా కన్పిస్తున్నాయి. ఆ లెక్కన బీజేపీకి ఈసారి విజయం సులువు కాదంటున్నారు.

బాంకురా



● సుభాష్ సర్కార్

2019లో తృణమూల్ సీనియర్ నేత సుబ్రతా ముఖర్జీపై కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి సుభాష్ సర్కార్ 1.74 లక్షల ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఈసారీ ఆయనే బరిలో ఉన్నారు. కానీ సొంత కార్యకర్తలే ఆయనకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు! టీఎంసీ నుంచి బాంకురా ఎమ్మెల్యే అరూప్ చక్రవర్తి, సీపీఎం నుంచి న్యాయవాది నీలాంజన్ దాస్ గుప్తా పోటీలో ఉన్నారు. త్రిముఖ పోటీలో ఎవరు నెగ్గుతారన్నది ఆసక్తికరం.

ఘాటల్



● దీపక్ అధికారి

సిట్టింగ్ ఎంపీ, నటుడు, గాయకుడు దీపక్ అధికారి (దేవ్) తృణమూల్ నుంచి హ్యాట్రిక్ కోసం ప్రయత్నిస్తున్నారు. బీజేపీ కూడా ప్రముఖ బెంగాలీ నటుడు, ఖరగ్‌పూర్ ఎమ్మెల్యే హిరేన్ ఛటర్జీని పోటీకి దించింది. ఎంపీ భారీ సభల ద్వారా దర్పం ప్రదర్శిస్తుంటే తాను రోడ్లపైకొచ్చి సామాన్యులతో మమేకం అవుతున్నానని హిరేన్ అంటున్నారు. సీపీఐ కూడా బరిలో ఉండటంతోటిక్కడ త్రిముఖ పోటీ నెలకొంది.

తామ్లుక్

తృణమూల్, బీజేపీ ఇక్కడ విజయాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అసెంబ్లీలో విపక్ష నేత, రాష్ట్ర బీజేపీ దిగ్గజం సువేందు అధికారి 2009, 2014ల్లో ఇక్కణ్నుంచే లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2016 ఉప ఎన్నికలో, 2019 ఎన్నికల్లో ఆయన సోదరుడు దిబ్యేందు అధికారి తృణమూల్ టికెట్‌పై గెలవడం విశేషం! ఈసారీ గెలుపు కోసం తృణమూల్ గట్టిగా పోరాడుతోంది. ఈస్ట్ జిల్లా పరిధిలో సువేందు కుటుంబానికి అపార పలుకుబడి ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం మమతపై నందిగ్రాం స్థానంలో సువేందు 1,956 ఓట్లతో గెలిచారు! మాజీ న్యాయమూర్తి అభిజిత్ గంగోపాధ్యాయకు బీజేపీ ఇక్కడ టికెటిచ్చింది. సీపీఎం కూడా కలకత్తా హైకోర్టు యువ న్యాయవాది సాయన్ బెనర్జీకి టికెటిచ్చింది. తృణమూల్ నుంచి పార్టీ ఐటీ సెల్ చీఫ్ 27 ఏళ్ల దేబాన్షు భట్టాచార్య బరిలో ఉన్నారు.



● అభిజిత్ గంగోపాధ్యాయ

దేశ రాజధానిలో... బీజేపీకి సవాలే

ఆప్-కాంగ్రెస్ గట్టి పోటీ ● 7 లోక్‌సభ స్థానాలకు 25న పోలింగ్

దేశ రాజధానివాసులు గత రెండు లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీకి జైకొట్టారు. ఈసారి మాత్రం కాంగ్రెస్-ఆప్ గట్టి పోటీ ఇస్తున్నాయి. 2014, 2019 ఎన్నికల్లో మూడు పార్టీలూ విడిగా పోటీ చేయడం బీజేపీకి బాగా కలిసొచ్చింది. ఇండియా కూటమి భాగస్వాములైన కాంగ్రెస్ 3, ఆప్ 4 చోట్ల బీజేపీకి సవాలు విసురుతున్నాయి. దాంతో అధికార వ్యతిరేకతను అధిగమించేందుకు ఏకంగా ఆరుగురు సిట్టింగులను కాషాయ పార్టీ మార్చేసింది! ఆప్ సర్కారుపై అవినీతి ఆరోపణలనే ప్రచారాస్త్రంగా చేసుకుంది. అదంతా తమ పార్టీని అంతం చేసే కుట్రలో భాగమంటూ ఆప్ తిప్పికొడుతోంది. జైలు నుంచి తిరిగొచ్చిన అధినేత కేజ్రీవాల్ ప్రచార భారాన్ని భుజాలపై మోశారు. శనివారం జరిగే పోలింగ్‌లో ఓటర్లు ఎవరిని దీవిస్తారన్నది ఉత్కంఠగా మారింది...

- సాక్షి, నేషనల్ డెస్క్



న్యూఢిల్లీ కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి స్థానంలో దివంగత సుష్మా స్వరాజ్ కుమార్తె, యువ న్యాయవాది, బాసురీ స్వరాజ్‌కు బీజేపీ టికెటిచ్చింది. 40 ఏళ్ల బాసురీ రాజకీయాలకు కొత్త కాదు. 2013, 2015, 2020 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మాలవీయనగర్ నుంచి విజయం సాధించారు. ఆప్ అభ్యర్థి సోమనాథ్ భారతి కూడా లాయరే. ఇద్దరూ పోటాపోటీగా ప్రచారం చేశారు. ప్రధాని, కేంద్ర మంత్రులు, విపక్ష నేతలు, ప్రభుత్వ ఉన్నతాధికారుల నివాసాలు ఈ వీఐపీ స్థానం పరిధిలోనే ఉన్నాయి. ట్రాఫిక్ జామ్, మురుగు నీటి సమస్యలపై ప్రజల్లో అసంతృప్తి ఉంది.

చాందినీ చౌక్ విస్తీర్ణంలో దేశంలోనే అతి చిన్న లోక్‌సభ స్థానమిది. సిట్టింగ్ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి హర్షవర్ధన్ బదులు వ్యాపారి ప్రవీణ్ ఖండేల్వాల్ (64)కు బీజేపీ టికెటిచ్చింది. కాంగ్రెస్ నుంచి జై ప్రకాశ్ అగర్వాల్ పోటీలో ఉన్నారు. ఇక్కడ పెద్ద సంఖ్యలో ఉండే వర్తకుల కోసం తాము చేసిన పనులను గుర్తు చేస్తూ అగర్వాల్, ఖండేల్‌వాల్ ఓట్లడిగారు. ఆప్ మద్దతు అగర్వాల్‌కు అదనపు బలం.

నార్త్ ఈస్ట్ ఢిల్లీ బీజేపీ సిట్టింగ్ ఎంపీ, భోజ్‌పురి నటుడు మనోజ్ తివారీ హ్యాట్రిక్ కోసం ప్రయత్నిస్తున్నారు. మాజీ విద్యార్థి నేత కన్హయ్య కుమార్ కాంగ్రెస్ అభ్యర్థిగా సవాల్ విసురుతున్నారు. బిహార్, యూపీ, జార్ఖండ్ నుంచి వలస వచ్చిన ఓటర్లు ఇక్కడ ఏకంగా 30 శాతం పైగా ఉంటారు. అందుకే బిహార్‌కు చెందిన కన్హయ్యకు కాంగ్రెస్ చాన్సిచ్చింది. అయితే ఆయన పోటీ తమకే కలిసొస్తుందని బీజేపీ అంటోంది. ఢిల్లీ జేఎన్‌యూ విద్యార్థి సంఘం నాయకునిగా కన్హయ్య ఎదుర్కొన్న ఆరోపణలను ప్రచారంలో పదేపదే ప్రస్తావించింది.

ఈస్ట్ ఢిల్లీ సిట్టింగ్ ఎంపీ, ప్రముఖ క్రికెటర్ గౌతమ్ గంభీర్ బదులు హర్షా మల్హోత్రాకు బీజేపీ టికెటిచ్చింది. ఆప్ నుంచి కులదీప్ కుమార్ పోటీ చేస్తున్నారు. వీరిద్దరూ తొలిసారి లోక్‌సభ బరిలో దిగారు. అయితే ఈస్ట్ ఢిల్లీ మేయర్‌గా చేసిన అనుభవం మల్హోత్రా సొంతం. ఈస్ట్ ఢిల్లీ బీజేపీ కంచుకోట అనే చెప్పాలి. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అయిన పీసీసీ మాజీ చీఫ్ రవిందర్ సింగ్ లవ్లీ ఇటీవలే బీజేపీలో చేరడం ఆ పార్టీకి మరింత కలిసి రానుంది.

నార్త్‌వెస్ట్ ఢిల్లీ

ఈ ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ హన్స్‌రాజ్ హన్స్ బదులు కౌన్సిలర్ యోగేంద్ర చందోలియాకు బీజేపీ చాన్సిచ్చింది. ఆయన గతంలో నార్త్ ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా చేశారు. 2014 ఎన్నికల్లో బీజేపీ టికెట్‌పై ఎంపీగా గెలిచిన ఉదిత్‌రాజ్ ఈసారి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగడం ఆసక్తికరం. ఆయన ఎంపీగా నియోజకవర్గానికి ముఖం కూడా చూపించలేదని ప్రచారంలో చందోలియా పదేపదే చెప్పారు.

వెస్ట్ ఢిల్లీ

ఆప్ నేత మహాబల్ మిశ్రా, బీజేపీ అభ్యర్థి కమలీత్ షెరావత్ మధ్య గట్టి పోటీ నెలకొంది. 70 ఏళ్ల మహాబల్ మిశ్రాది బిహార్‌లోని మధుబని. ఇక్కడ బిహారీ ఓటర్లు భారీగా ఉండటం ఆయనకు అనుకూలించే అంశం. షెరావత్ బీజేపీ మహిళా మోర్చా ప్రెసిడెంట్‌గా పనిచేశారు. ఎక్కువ మంది ఇంటి నుంచి ఓటేసిన లోక్‌సభ స్థానంగా ఈసారి వెస్ట్ ఢిల్లీ వార్తల్లోకెక్కింది. 85 ఏళ్లు పై బడిన 969 మంది, 179 మంది దివ్యాంగులు ఇంటి నుంచి ఓటేశారు.

సౌత్ ఢిల్లీ

సిట్టింగ్ ఎంపీ, వివాదాస్పద నేత రమేశ్ బిధురి బదులు బదార్‌పూర్ ఎమ్మెల్యే రామ్‌వీర్ సింగ్ బిధురికి బీజేపీ టికెటిచ్చింది. ఆప్ నుంచి సాహిరాం పహిల్వాన్ బరిలో ఉన్నారు. ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని 10 అసెంబ్లీ సీట్లలో బీజేపీ చేతిలో ఉన్నది బదార్‌పూర్ ఒక్కటే! అభ్యర్థులిద్దరూ గుర్జర్ సామాజికవర్గానికి చెందిన వారే కావడంతో పోటీ ఆసక్తికరంగా మారింది.

● తెలంగాణ

మీ సెల్‌ఫోన్ బ్లాక్ అవుతోంది..

'ట్రాయ్' పేరుతో సైబర్ నేరగాళ్ల మోసాలు

సాక్షి, హైదరాబాద్: ప్రజలను మోసగించడమే పనిగా పెట్టుకున్న సైబర్ నేరగాళ్లు కొత్తగా భారత టెలికం నియంత్రణ ప్రాధికారిక సంస్థ (ట్రాయ్) రికార్డెడ్ ఫోన్‌కాల్స్‌తో మోసాలకు తెరతీశారు. మరో రెండు గంటల్లో మీ సెల్‌ఫోన్ బ్లాక్ అవుతోందంటూ రికార్డెడ్ కాల్స్‌ను పంపిస్తూ ఫోన్‌నంబర్, ఆధార్ కార్డు, ఇతర వివరాలు సేకరించి మోసం చేస్తున్నారు. గత రెండు నెలలుగా ట్రాయ్ పేరుతో వస్తున్న ఇలాంటి కాల్స్ సంఖ్య విపరీతంగా పెరిగింది. ప్రధానంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నారు. ట్రాయ్ పేరుతో వచ్చే ఇలాంటి ఫోన్‌కాల్స్‌ను నమ్మి మోసపోవద్దని అదనపు డీజీ, ఇన్‌చార్జి సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ మహేశ్ భగవత్ ప్రజలకు సూచించారు. ట్రాయ్ పేరుతో సేకరించిన వివరాలతో సైబర్ కేటుగాళ్లు పోలీస్ అధికారుల పేరుతో ఫోన్లు చేసి ఎఫ్ఐఆర్ నమోదైందని బెదిరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కేసు నుంచి తప్పించాలంటే డబ్బులు పంపాలని బెదిరిస్తున్నారని, ఇలాంటి ఫోన్‌కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డీజీ సూచించారు. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యగా గుర్తు తెలియని నెంబర్ల నుంచి వచ్చే కాల్స్‌ను లిఫ్ట్ చేయవద్దని సూచించారు.

సీసీఎస్ ఏసీపీకి జ్యుడీషియల్ రిమాండ్

ఉమామహేశ్వరరావు అక్రమాస్తుల మార్కెట్ విలువ రూ.50 కోట్ల పైనే

సాక్షి, హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అరెస్టు చేసిన హైదరాబాద్ సీసీఎస్ ఏసీపీ టీఎస్ ఉమామహేశ్వరరావును అధికారులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. మంగళవారం రాత్రి ఆయన్ను అశోక్‌నగర్‌లోని ఇంట్లో అదుపులోకి తీసుకున్న ఏసీబీ బుధవారం నాంపల్లిలోని ప్రత్యేక కోర్టులో హాజరుపరిచింది. కేసు పూర్వాపరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి వచ్చే నెల 5 వరకు ఉమామహేశ్వరరావుకు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. మంగళవారం అశోక్‌నగర్‌లోని ఇల్లు, రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఆయన బంధువులు, స్నేహితుల నివాసాలు సహా మొత్తం 14 చోట్ల అధికారులు సోదాలు చేశారు. రూ.37.5 లక్షల నగదు, 60 తులాల బంగారం, వెండి ఆభరణాలు, 17 చోట్ల ఉన్న స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలు స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఉమామహేశ్వరరావు అక్రమాస్తుల అధికారిక విలువ రూ.3.8 కోట్ల వరకు ఉంటుందని అధికారులు ప్రకటించినప్పటికీ బహిరంగ మార్కెట్‌లో ఇది రూ.50 కోట్ల పైమాటే అని తెలుస్తోంది. ఈయన కూడగట్టిన అక్రమాస్తుల్లో విలాసవంతమైన విల్లా కూడా ఉన్నట్లు ఏసీబీ అధికారులు చెప్తున్నారు.

అంబానీల అతిథులకు కరీంనగర్ బహుమతులు

400 ఫిలిగ్రీ వస్తువులకు ఆర్డర్ ఇచ్చిన కుబేరుల కుటుంబం

విద్యానగర్ (కరీంనగర్): ప్రపంచ దేశాల ప్రజలను ఆకట్టుకున్న కరీంనగర్ ఫిలిగ్రీ కళానైపుణ్యం మరోసారి తన వైభవాన్ని చాటుకుంటోంది. ఆర్థిక కుబేరుడు ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్–రాధిక వివాహ వేడుకలు భారీ స్థాయిలో నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ వేడుకలకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రముఖులతోపాటు బాలీవుడ్‌లోని పెద్దస్టార్స్ కూడా హాజరుకానున్నారు. ఈ పెళ్లికి హాజరయ్యే వీవీఐపీలకు విలువైన బహుమతులను ఇచ్చేందుకు అంబానీ కుటుంబం యోచిస్తోంది. వాటిలో కరీంనగర్ వెండి ఫిలిగ్రీ కూడా ఉన్నాయి. ఈ విలువైన ఫిలిగ్రీ గిఫ్ట్స్ డెలివరీ కోసం దాదాపు 400 రకాల వస్తువుల ఆర్డర్స్ వచ్చినట్లు కరీంనగర్ హ్యాండీక్రాఫ్ట్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అర్రోజు అశోక్ తెలిపారు. ఇందులో నగల పెట్టెలు, పర్సులు, ట్రేలు, పండ్ల గిన్నెలు, ఇతరత్రా వస్తువులు ఉన్నట్లు వెల్లడించారు. అంబానీ తీసుకున్న ఈ నిర్ణయం 400 సంవత్సరాల నాటి పురాతన కళకు ప్రోత్సాహకంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న ఈ పురాతన హస్తకళకు 2007లో జీఐ ట్యాగ్ లభించింది. స్వచ్ఛమైన వెండిని కరిగించి.. అవసరమైన ఆకారాల్లో వస్తువులు తయారు చేయడం, తీగలు అల్లడం ఈ కళ విశేషం.

ఓటమి బాటలో చంద్రబాబు

సాక్షి, తిరుపతి: ఐదేళ్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగినంత మేలు చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ జరగలేదని, అందుకే కుప్పం ప్రజలు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఓటెత్తారని స్పష్టమవుతోంది. 35 ఏళ్ల పాటు మాయ మాటలతో ప్రజలను నమ్మించి.. సీఎంగా, ఎమ్మెల్యేగా కొనసాగిన చంద్రబాబును కుప్పం ఓటర్లు ఈసారి శంకరగిరి మాన్యాలకు పంపుతున్నట్లు ఈవీఎంలలో ఫ్యాన్ గుర్తుపై గట్టిగా నొక్కి చెప్పినట్లు తెలుస్తోంది. 2019 సాధారణ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కుప్పం వాసులు ఇచ్చిన తీర్పే.. ఇప్పుడూ పునరావృతం కాబోతోందని సమాచారం. నాటి చంద్రబాబు.. నేటి వైఎస్ జగన్ పాలనను బేరీజు వేసుకునే ఓటర్లు ఓటెత్తారని స్పష్టమవుతోంది. సీఎం వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో డీబీటీ ద్వారా 4,32,067 మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.1,400 కోట్లకుపైగా జమ చేశారు. నాన్ డీబీటీ ద్వారా మరో 3,03,080 మంది లబ్ధిదారులకు రూ.1,175.21 కోట్లు అందించారు. కుప్పం వాసులకు కలగా మారిన కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు కృష్ణా జలాలు తీసుకొచ్చారు. చంద్రబాబు ఉన్నన్ని రోజులు అదిగో ఇదిగో అంటూ కాలం గడిపేశారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక హంద్రీ–నీవా సుజల స్రవంతిలో భాగంగా రూ.560.29 కోట్లతో కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులను పూర్తి చేసి కృష్ణా జలాలను తీసుకొచ్చి కలను నిజం చేశారు.

కుప్పం బ్రాంచ్ కెనాల్ వివరాలు

- పలమనేరు నియోజకవర్గం అప్పినపల్లి వద్ద 0 పాయింట్ నుంచి కుప్పం మండలం పరమసముద్రం వరకు సుమారు 124 కి.మీ వరకు హంద్రీ–నీవా కాలువ తవ్వారు.
- 5 కిలోమీటర్లలో పశు పత్తురు వద్ద, 39వ కిలోమీటర్ కృష్ణాపురం వద్ద లిఫ్ట్ ఏర్పాటు
- వి.కోట మండలం ఆదిరే పల్లి 54.కి.మీ వద్ద లిఫ్టల ద్వారా హంద్రీ–నీవా కృష్ణా జలాలు అందించారు.
- కుప్పం నియోజకవర్గంలో 110 చెరువులకు నీళ్లివ్వడం ద్వారా 6,500 ఎకరాల ఆయకట్టుకు అండగా నిలిచారు.
- అనంతపురం జిల్లా చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి 300 క్యూసెక్కుల నీరు హంద్రీ–నీవా కాలువల ద్వారా విడుదలవుతుంది. ఆవిరి, లీకేజీ పోగా 220 క్యూసెక్కుల నీరు కుప్పం చేరుతుంది. 4 లక్షల జనాభాకు తాగు నీరు అందుతుంది.

కుడి ఎడమల సంక్షేమం, అభివృద్ధి


- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక కుప్పం నియోజకవర్గంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు పలు అభివృద్ధి పనులు పూర్తయ్యాయి.
- కుప్పం మేజర్ పంచాయితీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసి, పట్టణ అభివృద్ధి కోసం రూ.66 కోట్లు ప్రత్యేక నిధులు కేటాయించారు.
- నియోజకవర్గాన్ని రెవెన్యూ డివిజన్ చేయటంతో పాటు.. కుప్పం పోలీస్ డివిజన్ ఏర్పాటు చేశారు. ఆర్డీఓ, డీఎస్పీలను నియమించారు.
- రూ.15 కోట్ల వ్యయంతో కుప్పం పట్టణ నడిబొడ్డు, డికె పల్లి వద్ద రైల్వే అండర్ బ్రిడ్జిలు నిర్మించారు.
- నియోజకవర్గంలో ఏడు పురాతన దేవాలయాలు జీర్ణోద్ధరణకు సుమారు రూ.12 కోట్లు వెచ్చించారు.
- రూ.5 కోట్ల వ్యయంతో మున్సిపాలిటి పాలన వ్యవస్థ కోసం ప్రత్యేకంగా రెండు అంతస్తుల నూతన భవనాలు నిర్మించారు.
- శాంతిపురం మండలంలోని కేటీ పల్లి, పోడిచేన్లు, ప్రతిచామనూరులకు రూ 7.25 కోట్లతో తారు రోడ్లు, సిమెంట్ రోడ్లు వేయించారు.
- నియోజకవర్గంలో 78 సచివాలయాలకు రూ.87.55 కోట్లు ఖర్చు చేశారు. రూ.15.77 కోట్లతో 77 రైతు భరోసా కేంద్రాలు, రూ.7.9 కోట్లతో 58 వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేశారు.
- కుప్పం మున్సిపాలిటీ పరిధిలో మరో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు.
- కుప్పంలో మెజారిటీ ఓటర్లుగా ఉన్న వన్నె కులస్తుల కోసం క్షత్రియ భవనం ప్రారంభించారు.

బాబును గెలిపిస్తూ వచ్చింది దొంగ ఓట్లే

చంద్రబాబు 1989 నుంచి కుప్పంలో గెలుపొందుతూ వచ్చారు. కుప్పం వాసుల అమాయకత్వంతో పాటు పక్కనే ఉన్న కర్ణాటక, తమిళనాడుకు చెందిన 52 వేల మంది పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చి.. దొంగ ఓట్లు వేయించుకోవడమే ఇందుకు కారణం. 2014, 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఐఏఎస్ అధికారి చంద్రమౌళి.. బాబు దొంగ ఓట్ల బాగోతాన్ని బయటపెట్టారు. ఎన్నికల సమయంలో కర్ణాటక, తమిళనాడు నుంచి జనం భారీగా తరలివచ్చి, ఓట్లు వేసి వెళ్లటం గమనించిన చంద్రమౌళి దొంగ ఓట్లపై విచారణ జరిపించారు. అధికారుల విచారణలో దొంగ ఓట్లు ఉన్నట్లు తేలడంతో ఇదివరకు 18 వేల ఓట్లు, ఈ ఎన్నికలకు ముందు 33 వేల ఓట్లు తొలగించారు. దొంగ ఓట్లను తొలగించటంతో పాటు కుప్పం వాసులు చైతన్య వంతులు కావటంతో చంద్రబాబుకు భయం పట్టుకుంది.

కుటుంబ సమేతంగా కుప్పానికి పరుగు

- కుప్పంలో 2014 ముందు ఒక లెక్క. ఆ తర్వాత ఒక లెక్క అన్న చందంగా మారింది. వైఎస్సార్‌సీపీ రానంత వరకు అన్ని గ్రామాల్లో చంద్రబాబు చెప్పిందే శాసనంలా సాగింది. భయపెడుతూ.. బెదిరిస్తూ ప్రత్యర్థి లేకుండా జాగ్రత్త పడుతూ వచ్చారు. 2014లో వైఎస్సార్‌సీపీ అడుగు పెట్టడంతో షాక్‌ల మీద షాక్‌లు తగలటం మొదలయ్యాయి.
- బాబు అండ్ కో బ్యాచ్ అరాచకాలను జీర్ణించుకోలేని స్థానికులు ప్రతి గ్రామంలో టీడీపీకి పోటీగా వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేయటం ప్రారంభించారు. 2019 సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో మొదటి రెండు రౌండ్లలో టీడీపీ అభ్యర్థి కంటే వైఎస్సార్‌సీపీ అభ్యర్థికే మెజారిటీ ఓట్లు నమోదవ్వటంతో చంద్రబాబు షాక్‌కు గురయ్యారు. 2019 తర్వాత జరిగిన స్థానిక సంస్థలకు జరిగిన అన్ని ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేసింది. సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ, మున్సిపల్ చైర్మెన్ అంతా వైఎస్సార్‌సీపీ మద్దతు దారులే గెలుపొందటంతో చంద్రబాబు మైండ్ బ్లాక్ అయ్యింది.
- 35 ఏళ్లుగా కుప్పంలో ఇల్లు కట్టుకోవాలనే ఆలోచనే చేయని చంద్రబాబుకు వైఎస్సార్‌సీపీ నేతల మాటలతో జ్ఞానోదయం అయింది. ఎట్టకేలకు ఇంటి నిర్మాణం చేపట్టారు. కుప్పానికి చుట్టపు చూపుగా వచ్చి వెళ్లే చంద్రబాబు.. 2019 ఎన్నికల తర్వాత కుటుంబ సమేతంగా పరుగులు పెట్టారు. 2014–19 మధ్య కాలంలో సీఎం హోదాలో చంద్రబాబు 8 పర్యాయాలు మాత్రమే కుప్పానికి ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. 2019–2024 మధ్య 14 సార్లు కుప్పం రావడంతో పాటు కనీసం రెండు, మూడు రోజులు ఉండి వెళ్తున్నారు.
- కుమారుడు లోకేశ్, సతీమణి భువనేశ్వరి సైతం కుప్పం దారిపట్టారు. ఓటమి భయంతోనే లోకేశ్ తన పాదయాత్రను కుప్పం నుంచి ప్రారంభించి అభాసుపాలయ్యారు. నారా భువనేశ్వరి ఇటీవలి కాలంలో రెండు పర్యాయాలు కుప్పానికి వచ్చి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గతంలో చంద్రబాబు నామినేషన్ వేయటానిక్కూడా కుప్పానికి వచ్చిన దాఖలాలు లేవు. స్థానిక నాయకులే చందాలు వేసుకుని ఆయన తరుపున నామినేషన్ వేసేవారు. అటువంటిది ఈసారి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి నేరుగా కుప్పానికి చేరుకుని, సొంత డబ్బులతో నామినేషన్ వేశారు. అనంతరం గడప గడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



చంద్రబాబు మెజారిటీ ఇలా..

1989	6,918
1994	56,588
1999	65,687
2004	59,588
2009	46,066
2014	47,121
2019	30,722

ఓటుకు రూ.2 వేలు పంపిణీ

చంద్రబాబు గతంలో కుప్పంలో ఓటర్లకు పెద్దగా డబ్బులు ఇచ్చిన దాఖలాలు లేవు. స్థానిక నాయకులే అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమంగా సంపాదించిన సొమ్ములో నుంచి ఓటుకు రూ.200 లేదా రూ.300 పంపిణీ చేసేవారు. ఈ నగదు కూడా ఓటర్లందరికీ ఇచ్చే వారు కాదు. సగం ఓటర్లకు ఇచ్చి మిగిలిన సగం నగదు నొక్కేసి అందరికీ పంపిణీ చేశామని లెక్క చూపేవారని ఆరోపణలు ఉన్నాయి. అటువంటి చంద్రబాబు ఈ ఎన్నికల్లో మే 10, 11, 12 తేదీల్లో ఒక్కో ఓటుకు రూ.2 వేలు చొప్పున డబ్బులు పంపిణీ చేశారు. ఈ నగదును చంద్రబాబే స్వయంగా పంపించారని స్థానిక టీడీపీ నేతలు చర్చించుకుంటున్నారు. చంద్రబాబు మరోసారి ఎమ్మెల్యేగా గెలిచేందుకే డబ్బులు పంపిణీ చేసి మాయ చేయాలని చూస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. సీఎం వైఎస్ జగన్ 2019 ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చారని, ఐదేళ్ల పాటు సంక్షేమ పథకాల ద్వారా కుటుంబ ఆర్థిక పురోభివృద్ధికి దోహద పడ్డారని, కుప్పాన్ని అభివృద్ధి చేసినందుకే తాము ఫ్యాన్ గుర్తుకు ఓటేశామని అత్యధికులు స్పష్టం చేస్తున్నారు.

బాబు కుప్పం ప్రస్థానం

1989లో పోలైన ఓట్లు: 95,157
చంద్రబాబుకు వచ్చిన ఓట్లు: 50,098 (52.65%)
మెజారిటీ: 6,918

1994లో పోలైన ఓట్లు: 1,07,582
చంద్రబాబుకు వచ్చిన ఓట్లు: 81,210 (75.49%)
మెజారిటీ: 56,588

1999లో పోలైన ఓట్లు: 1,25,357
చంద్రబాబుకు వచ్చిన ఓట్లు: 93,288 (74.42%)
మెజారిటీ: 65,687

2004లో పోలైన ఓట్లు: 1,40,153
చంద్రబాబుకు వచ్చిన ఓట్లు: 98,123- (70%- 4.42% తగ్గాయి.. 6,195 ఓట్లు కోల్పోయారు)
మెజారిటీ: 59,588

2009లో పోలైన ఓట్లు: 1,45,287
చంద్రబాబుకు వచ్చిన ఓట్లు: 89,954 (61.9% - 8.1% తగ్గాయి.. 11,770 ఓట్లు కోల్పోయారు)
మెజారిటీ: 46,066

2014లో పోలైన ఓట్లు: 1,64,071
చంద్రబాబుకు వచ్చిన ఓట్లు: 1,02,953 (62.5% -0.6% పెరిగాయి. 985 ఓట్లు అదనంగా వచ్చాయి)
మెజారిటీ: 47,121

2019లో పోలైన ఓట్లు: 1,79,329
చంద్రబాబుకు వచ్చిన ఓట్లు: 1,00,146 (55.18% - 7.32% తగ్గాయి. 13,127 ఓట్లు కోల్పోయారు)
మెజారిటీ: 30,722

మే 13న జరిగిన ఎన్నికల్లో కుప్పంలో మొత్తం ఓటర్లు: 2,13,145
పోల్ అయిన ఓట్లు: 1,83,027 (85.87%)

గత రెండు సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి వచ్చిన ఓట్లు
2014 - 55,839 ఓట్లు (33.9%)
2019 - 69,424 ఓట్లు (38.25% - 4.35% పెరుగుదల

2019 తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇరు పార్టీలకు వచ్చిన ఓట్లు

మండలం	మొత్తం ఓట్లు	వైఎస్సార్‌సీపీ	టీడీపీ
కుప్పం	55,432	22,171	7,364
శాంతిపురం	46,153	22,526	5,633
రామకుప్పం	44,756	20,121	4,508
గుడుపల్లి	34,607	14,815	3,533
మొత్తం	1,78,948	79,633	21,038

మున్సిపాలిటీ ఎన్నికల్లో మొత్తం వార్డులు: 25

వైఎస్సార్‌సీపీ గెలిచినవి: 19
టీడీపీ గెలిచినవి: 6
మొత్తం ఓట్లు: 39,023
వైఎస్సార్‌సీపీ: 21,708
టీడీపీ: 12,401

టీడీపీ గెలిచిన 6 వార్డుల్లో ఆధిక్యం

సెల్వరాజ్ 156 ఓట్లు
కస్తూరి 6 ఓట్లు
షబానా తాజ్ 104 ఓట్లు
దామోదరం 95 ఓట్లు
సోమశేఖర్ 151 ఓట్లు
సురేష్ 232 ఓట్లు

కుప్పం నియోజక వర్గంలో మొత్తం పంచాయతీలు : 89

వైఎస్సార్‌సీపీ మద్దతు దారులు గెలిచినవి: 76
టీడీపీ మద్దతుదారులు గెలిచినవి: 13
మొత్తం ఎంపీటీసీలు: 71
వైఎస్సార్‌సీపీకి దక్కినవి: 68
టీడీపీకి దక్కినవి: 03
జెడ్పీటీసీలు: 04
వైఎస్సార్‌సీపీకి దక్కినవి: 04
టీడీపీకి దక్కినవి: 0



దీప్తి జివాంజీ

కలకు సాధన తోడైంది

అథ్లెటిక్ చాంప్ దీప్తితో మాటామంతి

కలకు సాధన తోడైతే చాలు మిగతావన్నీ వాటికవే వచ్చి చేరతాయి. ఈ మాట నా విషయంలో అక్షర సత్యం అంటోంది దీప్తి జివాంజీ. తెలంగాణలోని వరంగల్ వాసి అయిన దీప్తి జివాంజీ దినసరి కూలీ కుమార్తె. జపాన్‌లో జరుగుతున్న ప్రపంచ పారా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ మహిళల విభాగంలో సోమవారం 400 మీటర్ల పరుగులో ప్రపంచ రికార్డు సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా 21 ఏళ్ల దీప్తిని పలకరిస్తే ఇలా సమాధానమిచ్చింది.

క్రీడలే ప్రధానంగా!

నా చిన్నప్పుడు స్కూల్‌లో పీఈటీ సర్ చెప్పిన విధంగా ప్రాక్టీస్ చేసేదాన్ని. అప్పుడే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే దాన్ని. నాకు చిన్నతనంలో తరచూ ఫిట్స్ వస్తుండేవి. రన్నింగ్ చేసేటప్పుడు బాడీ షేక్ అయ్యేది. దీంతో మా పీఈటీ సర్ పారా అథ్లెట్స్‌తో మాట్లాడి, టెస్టులు చేయించారు. వారితో మాట్లాడి 'ఇక పారా అథ్లెట్స్ గ్రూప్‌లో పాల్గొనమ'ని చెప్పారు. మా అమ్మనాన్నలది మేనరికం కావడం వల్ల జన్యుపరమైన సమస్యలు వచ్చాయని తెలిసింది. అక్కణ్ణుంచి పారా అథ్లెటిక్ కాంపిటీషన్‌లో పాల్గొంటూ వచ్చాను. ఖమ్మంలో స్టేట్ మీట్ జరిగినప్పుడు అందులో పాల్గొన్నాను. మెడల్ రావడంతో అక్కణ్ణుంచి నా జీవితంలో క్రీడలు ప్రధాన భాగంగా మారిపోయాయి. డిగ్రీలో చేరాను కానీ, అప్పటికి ఇంకా పరీక్షలు రాయడం పూర్తి చేయలేదు.

బలహీనతలను అధిగమించేలా..

స్పోర్ట్స్‌లో పాల్గొనడం వల్ల ఒక ఆరోగ్యపరమైన సమస్యను ఆ విధంగా అధిగమించాను అనుకుంటాను. చిన్నప్పుడు మా చుట్టుపక్కల ఈ ఆటలు నీకు అవసరమా అన్నట్టు మాట్లాడేవారు. కానీ, కానీ, మా అమ్మ మాత్రం 'అవన్నీ పట్టించుకోవద్దు. నీవనుకున్నదానిపైనే దృష్టి పెట్టు. ఈ రోజు నిన్ను అన్నవాళ్లే రేపు నీ గురించి గొప్పగా చెప్పుకుంటారు' అని చెప్పేది. ఆ విధంగా మానసిక ధైర్యం కూడా పెరిగింది. స్పోర్ట్స్ అన్ని బలహీనతలను దూరం చేస్తుందని.. గెలిచినా, ఓడినా.. ఎప్పుడూ పాఠాలు నేర్చుకుంటూనే ఉంటామని నమ్ముతాను. ఇప్పటివరకు నాలుగు వరల్డ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్నాను. నాకు సాయం చేయడానికి దాతలు ముందుకు వస్తున్నారు.

ధైర్యమే బలం

మా ఇంటి పరిస్థితులు ఎప్పుడూ కష్టంగానే ఉండేవి. మా అమ్మ ధనలక్ష్మి కూలి పనులకు వెళుతుంది. నాన్న


కుటుంబ సభ్యులతో దీప్తి

పైపుల కంపెనీలో పనిచేస్తాడు. చెల్లెలు స్కూల్‌కు వెళుతుంది. ఉండటానికి మాకు కనీసం అద్దె ఇల్లు కూడా ఉండేది కాదు. మొన్న మొన్నటి వరకు మా అమ్మమ్మ వాళ్లింటోనే ఉన్నాం. ఎన్నో అవమానాలూ ఎదుర్కొన్నాం. ఈ మధ్య ఆ ఇంటినే కొనుగోలు చేశాం. ఇక బలమైన ఆహారం అంటే స్పోర్ట్స్ అకాడమీలోకి వచ్చిన తర్వాతే అని చెప్పుకోవాలి. అమ్మ ఎప్పుడూ చెప్పే విషయాల్లో బాగా గుర్తుపెట్టుకునేవి కొన్ని ఉంటాయి. వాటిలో 'కష్టపడితే ఏదీ వృథా పోదు. నీకు నువ్వు ధైర్యంగా నిలబడాలి. అప్పుడే నిన్ను కాదని వెళ్లిపోయినవి కూడా నీ ముందుకు వస్తాయి' అంటుంది. మొన్న జపాన్‌లో జరిగిన పారా ఒలింపిక్‌లో బంగారు పతకం సాధించిన విషయం చెప్పినప్పుడు అమ్మ చాలా సంతోషించింది. నా బలం మా అమ్మే. ఆమె ఏమీ చదువుకో లేదు. కానీ, ధైర్యంగా ఎలా ఉండాలో చెబుతుంది. ఆడపిల్లలమైనా మేం బాగా ఎదగాలని కోరుకుంటుంది.

ప్రాక్టీస్ మీదనే దృష్టి

టీవీ కూడా చూడను. పొలిటికల్ లీడర్స్‌కు సంబంధించి వచ్చే సాంగ్స్ వింటుంటాను. ఆ పాటల్లో స్ఫూర్తిమంతమైన పదాలు ఉంటాయి. హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో ఉంటున్నాను. మరో మూడు నెలల్లో ఒలపింక్స్ లో పాల్గొనబోతున్నాను. దేశం తరపున పాల్గొనబోతున్నాను కాబట్టి నా దృష్టి అంతా ప్రాక్టీస్ మీదనే ఉంది. సాధారణంగా ఉదయం రెండు గంటలు; సాయంత్రం రెండు గంటలు ప్రాక్టీస్ ఉంటుంది. మధ్యలో మా రోజువారీ పనులు, విశ్రాంతికి సమయం కేటాయిస్తాం. నాతో పాటు ఉన్న స్నేహితులతో చిట్ చాట్ ఉంటుంది.

బాధ్యతగా ఉండాలి

చిన్నప్పటి నుంచి అమ్మనాన్నల కష్టం చూస్తూ పెరగడం వల్ల సొంతంగా ఇష్టాలు, అభిరుచులు అనే ధ్యాస ఏమీ లేదు. కానీ, చిన్నప్పటి నుంచి పోలీసు కావాలనేది నా కల. ఇప్పటికీ అదే ఆలోచన. నా కృషి నేను చేస్తున్నాను. నేను కోరుకున్నది వస్తుందనేది నా నమ్మకం. అమ్మనాన్నలు ఇంకా కష్టపడుతూనే ఉన్నారు. పోలీసుని అయి మా అమ్మ నాన్నలను, చెల్లెలిని బాగా చూసుకోవాలి, అది నా బాధ్యత అనుకుంటున్నాను'' అంటూ ముగించింది దీప్తి.

ఆమె ఆశలు, ఆశయాలు నెరవేరాలని కోరుకుందాం.

– నిర్మలారెడ్డి

ఆస్ట్రేలియాలో 'బేర్‌ఫుట్ వాకింగ్' ఇప్పుడు చాలామంది అలవాటు చేసుకుంటున్నారు.
ఉత్తకాళ్లతో నడవడం భారతీయులకు వేల ఏళ్లుగా తెలిసినా ఆ తర్వాత వ్యాయామ నడక కోసం తగిన షూస్, చెప్పులు తప్పనిసరిగా ఉపయోగిస్తున్నారు.
కాని 'భూమితో పాదాలను తాకించడం' వల్ల ఆరోగ్యమని ఇంకా ప్రయోజనాలున్నాయని నిపుణులు అంటున్నారు.
ఉత్తకాళ్ల నడక ప్రయోజనాలేమిటి?

ఈ నడక ఆరోగ్యం అంటున్నారు

ట్రెండ్





ఆస్ట్రేలియాలో ఉత్త కాళ్లతో నడవడం ఇప్పుడు ఒక వ్రతంలా పాటిస్తున్నారు. కొందరు మార్నింగ్ వాక్ కోసం ఉత్త కాళ్లను ఉపయోగిస్తుంటే మరికొందరు ఎల్లవేళలా చెప్పులు, షూస్‌కు దూరంగా ఉంటున్నారు. ఇదొక పెద్ద ధోరణిగా మారిందక్కడ. మన దేశంలో చెప్పుల్లేని పాదాలతోనే జనం నడిచారు. ఇప్పటికీ నడిచేవారున్నారు. కాని ఆరోగ్య చర్యల్లో భాగంగా చెప్పుల్లేకుండా భూస్పర్శను పొందడం అనేది మెల్లమెల్లగా మన దేశంలోనూ కనిపిస్తోంది. గతంలో చూస్తే చిత్రకారుడు ఎం.ఎఫ్.హుసేన్ తన జీవితంలో ఎప్పుడూ చెప్పులు వేసుకోలేదు. ఆయన ఎన్ని దేశాలు తిరిగినా ఖాళీ పాదాలతోనే తిరిగాడు. ఇక ఇటీవల యువ దర్శకుడు అనుదీప్ ఖాళీ పాదాలతో నడకను ప్రచారం చేస్తున్నాడు. ఆస్ట్రేలియా వారైనా గానీ, ఇలా నడవడాన్ని ఇష్టపడుతున్నవారు గానీ చెబుతున్నదేమిటి? ఇలా నడవడం వల్ల ఉపయోగాలేమిటి?

ఎక్కడ నడవాలి: ఉత్తపాదాలతో నడిచే వారు కూసు రాళ్లు లేదా ముళ్లు లేని మట్టి బాటల్లోగాని, గడ్డి మైదానంలోగాని, ఇసుక దారుల్లో గాని నడవడం మంచిదని నిపుణులు అంటున్నారు. సూపర్ మార్కెట్‌లో లేదా నున్నటి రాళ్లు పరిచిన స్థలాల్లో నడిస్తే జారి పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

1. ప్రకృతితో అనుసంధానం

ప్రకృతిలో పుట్టిన మనిషి ప్రకృతితో అనుసంధానం కావడం లేదు. ప్రకృతి స్పర్శను అనుభవించడం లేదు. ఏసీ గదుల్లో ఉంటూ కాలికి నేలంటకుండా జీవిస్తున్నాడు. నేల తగిలితే– కాలి కింద భూమికి ఉన్న రకరకాల స్వభావాలు అంటుతూ ఉంటే ప్రకృతితో ఒక అనుసంధానం ఏర్పడుతుంది. వినమ్ర భావన కలుగుతుంది. ఇంకా మామూలు భాషలో చెప్పాలంటే కళ్లు నెత్తికెక్కి ఉంటే అవి కిందకు దిగుతాయి.

2. విద్యుదయస్కాంత సమతుల్యత

ఖాళీ పాదాలతో నడవడం వల్ల భూమిలోని నెగెటివ్ అయాన్లు శరీరంలోకి ప్రవేశిస్తాయి. మనం నిత్యం వాడే ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ వల్ల శరీరంలో పేరుకున్న అయాన్లను ఇవి బేలెన్స్ చేస్తాయి. దాని వల్ల శరీరంలోని విద్యుదయస్కాంత స్థితి సమతుల్యం అవుతుంది. దీంతో వాపులు తగ్గడం, నిద్ర బాగా పట్టడం వీలవుతుంది.

3. ఒత్తిడి దూరం

ఖాళీ పాదాలతో నడవడం వల్ల పాదాలలో ఉండే నరాలు క్రమబద్ధంగా తాకిడికి లోనవుతాయి. దాని వల్ల ఒత్తిడి దూరమయ్యి సేదదీరిన భావన కలుగుతుంది.

4. సరైన పోశ్చర్

ఖాళీ పాదాలతో నడిచినప్పుడు పాదాలు, కాళ్లు, మడమలు అనుసంధానంలోకి వస్తాయి. చెప్పులు లేదా షూస్ వేసుకుని నడిచేటప్పుడు తెలియకనే నడక పోశ్చర్ మారుతుంది. కాని ఖాళీ పాదాలతో నడిచేటప్పుడు నడకకు వీలుగా శరీరం సరైన పోశ్చర్‌కు వస్తుంది. అంతేకాదు కాలి కండరాలు బలపడతాయి. శరీరాన్ని సరిగ్గా బేలెన్స్ చేస్తూ నడవడం తెలుస్తుంది. కాళ్లను పూర్తిగా ఆన్చి నడవడం వల్ల నడకలో కుదురు వస్తుంది.

5. రక్తప్రసరణ

ఖాళీ పాదాలతో నడవడం వల్ల రక్తప్రసరణ బాగా జరుగుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. పాదంపై ఒత్తిడి పడటం వల్ల రక్తప్రసరణలో చురుకు వచ్చి గుండెకు మేలు జరుగుతుంది. అంతేకాదు పాదాలపై ఉండే మృతకణాలు వదిలిపోయి చర్మం మెరుగవుతుంది.

నేడు ప్రపంచ తాబేలు దినోత్సవం

తాబేలు నడకల గురించి తక్కువ చేసి నవ్వుకునే కాలం కాదు ఇది. ప్రమాదం అంచున ఉన్న తాబేలు జాతి గురించి సీరియస్‌గా మాట్లాడుకోవాల్సిన సమయం ఇది. చెన్నైకి చెందిన సుప్రజ నుంచి లక్నోకు చెందిన అరుణిమ సింగ్ వరకు ఎంతోమంది నారీమణులు తాబేళ్ల సంరక్షణకు విశేష కృషి చేస్తున్నారు...

నారి... తాబేలు మేలు కోరి


సౌందర్య

చుట్టుపక్కల చూడరా...

ముంబైకి చెందిన మోడల్ సౌందర్య గార్గ్ సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఎడ్యుకేషన్ కార్యాలయానికి సమీపంలోని చెత్తకుప్పలో ఒక ప్లాస్టిక్ బ్యాగ్ కదలడం చూసి ఆ బ్యాగును ఓపెన్ చేసింది. అందులో చావు బతుకుల మధ్య ఊగిసలాడుతున్న ఒక పెద్ద తాబేలు కనిపించింది. వెంటనే ప్లాంట్ అండ్ యానిమల్ వెల్ఫేర్ సొసైటీ హెల్ప్ లైన్‌కు ఫోన్ చేసింది. అక్కడి నుంచి వచ్చిన వాలంటీర్ సూచనలతో తాబేలును ఇంటికి తీసుకెళ్లి నీటిలో పెట్టింది. ఆ తరువాత ఆ తాబేలును పాస్–రెస్క్యూ టీమ్‌కు అప్పగించింది. 'నేను–నా పని అని మాత్రమే... అని కాకుండా చుట్టుపక్కల కూడా తొంగి చూడాలి. ఇంటికి వెళ్లడానికి ఆలస్యం అవుతుందని ఆరోజు సౌందర్య అనుకొని ఉంటే, తాబేలే కదా వదిలేద్దాం అనే నిర్లక్ష్యంలో ఉండి ఉంటే ఒక జీవి బతికేది కాదు' అంటుంది యానిమల్ వెల్ఫేర్ ఆఫీసర్ నిషా సుబ్రమణ్యియన్.

దిల్లీలో మార్నింగ్ వాక్‌కు వెళుతున్న ఒక మహిళ రోడ్డుపై తాబేలును గమనించి రక్షించింది. దీని తాలూకు వీడియో వైరల్ కావడమే కాదు నీటిలో ఉండాల్సిన తాబేళ్లు రోడ్డు మీదికి ఎందుకు వస్తున్నాయి? వాటిని రక్షించడానికి ఏంచేయాలి?' అనే విషయం మీద సోషల్ మీడియాలో చర్చ కూడా జరిగింది.

ఆ విషాదంలో నుంచే...


కొన్ని సంవత్సరాల క్రితం ప్రపంచ ప్రఖ్యాత పర్యావరణవేత్త డా.జేన్ గుడాల్‌పై వచ్చిన నేషనల్ జియోగ్రాఫిక్ డాక్యుమెంటరీని చూసింది చెన్నైకి చెందిన సుప్రజ ధరణి. 'ప్రతి ఒక్కరు తమవంతుగా కృషి చేస్తే పర్యావరణానికి మేలు జరుగుతుంది' అనే మాట ఆమెకు బాగా నచ్చడమే కాదు 'నా వంతుగా ఏం చేయగలను' అని ఆలోచించింది.

ఒకరోజు పెరియ నీలంకరై బీచ్‌లో మార్నింగ్ వాక్ చేస్తున్న సుప్రజ ఒడ్డున కనిపిస్తున్న తాబేలు దగ్గరికి వెళ్లింది. అది చనిపోయి ఉంది. దాని శరీరంపై పదునైన తీగలతో కోతలు కోశారు. ఈ దృశ్యం తనని చాలా బాధ పెట్టింది. ఒక రకంగా చెప్పాలంటే కొన్ని రోజుల వరకు ఆ బాధ తనని వెంటాడింది.

ఈ నేపథ్యంలోనే తాబేళ్ల సంరక్షణకు నడుం బిగించింది. పుస్తకాలు చదవడం, మత్స్యకారులతో మాట్లాడం ద్వారా తాబేళ్ల గురించి ఎన్నో విషయాలు తెలుసుకుంది. ఆ తరువాత ట్రీ ఫౌండేషన్ (ట్రస్ట్ ఫర్ ఎన్విరాన్‌మెంట్, ఎడ్యుకేషన్, కన్జర్వేషన్ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్)కు శ్రీకారం చుట్టింది.

తాబేళ్ల సంరక్షణ విషయంలో చేసిన కృషికి గుర్తింపుగా డిస్నీ వరల్డ్ వైడ్ కన్జర్వేషన్ అవార్డ్, సీ వరల్డ్‌లాంటి ఎన్నో అవార్డ్‌లు అందుకుంది సుప్రజ.


సుప్రజ


విజయ

విజ్జీ–ది టర్టిల్ గర్ల్

భారతదేశ మొట్టమొదటి మహిళా హెర్పెటాలజిస్ట్, టర్టిల్ ఫీల్డ్ బయోలజిస్ట్‌గా గుర్తింపు పొందింది జె.విజయ. చిన్న వయసులోనే చనిపోయింది. అయితే ఆమె తన జీవితంలో ఎక్కువ భాగం తాబేళ్ల సంరక్షణ కోసం కృషి చేసింది. మద్రాస్ క్రొకడైల్ బ్యాంక్ పక్కన ఉన్న టర్టిల్ పాండ్ దగ్గర ఆమె స్మారక చిహ్నం ఉంది. మద్రాస్ స్నేక్ పార్క్‌లోకి వాలంటీర్‌గా అడుగుపెట్టింది విజయ. అప్పుడు ఆమె మద్రాస్‌లోని ఎతిరాజ్ కాలేజీ జువాలజీ ఫస్ట్ ఇయర్ స్టూడెంట్. స్నేక్‌పార్క్‌లో రకరకాల తాబేళ్లను వేరు వేరు వ్యక్తులకు అప్పగించేవారు. అలా విజ్జీకి మంచినీటి తాబేళ్లను అప్పగించారు. అక్కడితో మొదలైన తాబేళ్లతో చెలిమి ఎంతో దూరం వెళ్లింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ నుంచి పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కత్తా వరకు తాబేళ్లకు ఎదురవుతున్న ముప్పు, సంరక్షణ గురించి ఎంతో పరిశోధన చేసింది. తాను తెలుసుకున్న వాటిని అక్షరబద్ధం చేసింది.

అరుణోదయం

ఉత్తర్‌ప్రదేశ్‌లోని లక్నోకు చెందిన అరుణిమ సింగ్ వేలాది తాబేళ్లను రక్షించింది. తాబేళ్ల జీవితం, వాటి ప్రాధాన్యత, సంరక్షణ గురించి ఎన్నో విద్యాలయాల్లో విద్యార్థుల కోసం అవగాహన సదస్సులు నిర్వహించింది. తాబేళ్ల సంరక్షకురాలిగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన అరుణిమ సింగ్ తన బాటలో ఎంతోమందిని నడిపిస్తోంది.


అరుణిమ

గ్రీన్ టర్టిల్స్ ... మీరు పచ్చగా బతకాలి

ఆకుపచ్చ తాబేళ్లు (చెలోనియా మైడాస్) ప్రమాదం అంచున అంతరించిపోయే జాతుల జాబితాలో ఉన్నాయి. లక్షద్వీప్ దీవుల్లో ఆకుపచ్చ తాబేళ్లపై గతంలో జరిగిన పరిశోధనలను పీహెచ్‌డీ స్టూడెంట్ నుపుల్ కాలే మరింత ముందుకు తీసుకు వెళుతోంది. సముద్రపు గడ్డి మైదానాలు తగ్గడంలాంటివి గ్రీన్ టర్టిల్స్‌పై ఎలాంటి ప్రభావాన్ని చూపుతుంది అనేది తన పరిశోధనలో తెలుసుకుంది. 'సముద్ర తాబేళ్ల గురించి అధ్యయనం చేయడానికి ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయి' అంటుంది కాలే. యూనివర్శిటీలో ఒకరోజు 'గ్రీన్ టర్టిల్స్ గురించి పనిచేయడంపై ఆసక్తి ఉందా?' అని అడిగారు లెక్చరర్. 'ఉంది' అని చెప్పింది. ఆ తరువాత గ్రీన్ టర్టిల్స్‌కు సంబంధించి శ్రీలంకలో ఫీల్డ్‌వర్క్ చేసింది.'గూడు కట్టుకోవడానికి ఒక గ్రీన్ టర్టిల్ బీచ్‌లోకి వచ్చిన దృశ్యం తొలిసారిగా చూశాను. ఆ దృశ్యం చెక్కుచెదరకుండా ఇప్పటికీ నా మదిలో నిలిచిపోయింది' అంటుంది కాలే.


నుపుల్ కాలే



వింబుల్డన్ మెయిన్ 'డ్రా'లో సుమిత్ నగాల్

భారత టెన్నిస్ నంబర్‌వన్ సుమిత్ నగాల్ తన కెరీర్‌లో తొలిసారి ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మెయిన్ 'డ్రా'కు నేరుగా అర్హత సాధించాడు. గ్రాండ్ స్లామ్ టోర్నీ ప్రారంభానికి ఆరు వారాల ముందు ఏటీపీ ర్యాంకింగ్స్‌లో టాప్–104లో ఉన్న క్రీడాకారులకు నేరుగా మెయిన్ 'డ్రా'లో చోటు లభిస్తుంది. సుమిత్ నగాల్ ప్రస్తుతం 94వ ర్యాంక్‌లో ఉన్నాడు. 2019లో చివరిసారి భారత్ తరఫున ప్రజ్నేశ్ గుణేశ్వరన్ వింబుల్డన్ టోర్నీలో పాల్గొన్నాడు.

అర్జున్‌కు తొమ్మిదో స్థానం



షార్జా మాస్టర్స్ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ తొమ్మిదో స్థానంలో నిలిచాడు. బర్దియా దానేశ్వర్ (ఇరాన్)తో జరిగిన చివరిదైన తొమ్మిదో రౌండ్ గేమ్‌ను అర్జున్ 47 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. అర్జున్‌తోపాటు మరో ఏడుగురు 6 పాయింట్లతో ఉమ్మడిగా రెండో స్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా ... అర్జున్‌కు తొమ్మిదో స్థానం ఖరారైంది. పంక్‌లాండ్ (అమెరికా), వొఖిదోవ్ (ఉజ్బెకిస్తాన్), బర్దియా, ముర్జిన్ (రష్యా) 6.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు.

రాయల్స్ ముందుకు...
చాలెంజర్స్ ఇంటికి...

అసాధారణ రీతిలో ఆరు వరుస విజయాలతో 'ప్లే ఆఫ్స్' వరకు దూసుకొచ్చిన బెంగళూరు ప్రస్థానం ఎలిమినేటర్ మ్యాచ్‌లో ముగిసింది. 'కప్ నమ్‌దే' అంటూ కొత్త ఆశలు రేపిన టీమ్ నాకౌట్ సమరంలో కుప్పకూలి మరోసారి అభిమానులను నిరాశకు గురి చేసింది. వరుసగా నాలుగు ఓటముల తర్వాత ఎట్టకేలకు అసలు పోరులో తమ స్థాయిని ప్రదర్శించిన రాజస్తాన్ రాయల్స్ మరో అడుగు ముందుకేసి రెండో క్వాలిఫయర్‌లో సన్‌రైజర్స్‌తో సమరానికి సిద్ధమైంది. ముందుగా పదునైన బౌలింగ్‌తో బెంగళూరును కట్టిపడేసిన రాజస్తాన్ ఆ తర్వాత సాధారణ లక్ష్యాన్ని ఆరు బంతుల ముందే అందుకుంది. అక్కడక్కడా కాస్త తడబాటు కనిపించినా...ఆఖరికి గెలుపు తీరం చేరింది. 700కుపైగా పరుగులు చేసిన తర్వాత కూడా ఇక్కడే ఆగిపోయిన విరాట్ కోహ్లి చిత్రం చూస్తే చాలు ఆర్‌సీబీ దురదృష్టం ఎలాంటిదో చెప్పేందుకు!

- ఎలిమినేటర్‌లో రాజస్తాన్ విజయం
- 4 వికెట్ల తేడాతో ఓడిన బెంగళూరు
- రేపు రెండో క్వాలిఫయర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్‌తో రాజస్తాన్ 'ఢీ'


చహల్, అశ్విన్


యశస్వి జైస్వాల్


నిరాశలో కోహ్లి

అహ్మదాబాద్: ఐపీఎల్ ఫైనల్లో స్థానం కోసం రెండో క్వాలిఫయర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో రాజస్తాన్ రాయల్స్ తలపడనుంది. బుధవారం జరిగిన 'ఎలిమినేటర్' మ్యాచ్‌లో రాజస్తాన్ 4 వికెట్ల తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది. రజత్ పటిదార్ (22 బంతుల్లో 34; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), విరాట్ కోహ్లి (24 బంతుల్లో 33; 3 ఫోర్లు, 1 సిక్స్), మహిపాల్ లోమ్రోర్ (17 బంతుల్లో 32; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. అనంతరం రాజస్తాన్ 19 ఓవర్లలో 6 వికెట్లకు 174 పరుగులు సాధించి గెలిచింది. యశస్వి జైస్వాల్ (30 బంతుల్లో 45; 8 ఫోర్లు), రియాన్ పరాగ్ (26 బంతుల్లో 36; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. కీలకమైన రెండు వికెట్లు తీసిన అశ్విన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

దూకుడు లేకుండా...

బెంగళూరు ఇన్నింగ్స్ ఆరంభం నుంచి తడబడుతూనే సాగింది. కోహ్లి, డుప్లెసిస్ ఆశించిన మెరుపు ఆరంభాన్ని ఇవ్వలేకపోయారు. బౌల్ట్ తన 3 ఓవర్లలో 6 పరుగులే ఇచ్చి ప్రత్యర్థిని కట్టిపడేశాడు. డుప్లెసిస్, కోహ్లి తక్కువ వ్యవధిలో వెనుదిరిగిన తర్వాత కామెరాన్ గ్రీన్ (21 బంతుల్లో 27; 2 ఫోర్లు, 1 సిక్స్) కొన్ని పరుగులు జోడించాడు. అయితే గ్రీన్, మ్యాక్స్‌వెల్ (0)లను వరుస బంతులకు అవుట్ చేసి అశ్విన్ దెబ్బ కొట్టాడు. ఈ దశలో పటిదార్ ఇన్నింగ్స్ ఆర్‌సీబీని ముందుకు నడిపించింది. 5 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద జురేల్ సునాయాస క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన పటిదార్ కొన్ని చక్కటి షాట్లు ఆడాడు. చహల్ ఓవర్లో అతను 2 సిక్స్‌లు, ఫోర్ బాదడంతో స్కోరు వంద పరుగులు దాటింది. తన చివరి ఐపీఎల్ ఇన్నింగ్స్‌లో దినేశ్ కార్తీక్ (11) విఫలం కాగా, చివర్లో లోమ్రోర్ ధాటిగా ఆడాడు.

రాణించిన జైస్వాల్...

ఛేదనను జైస్వాల్, టామ్ కోలర్ (20) జాగ్రత్తగా మొదలు పెడుతూ తొలి 2 ఓవర్లలో 6 పరుగులే చేశారు. అయితే యశ్ దయాళ్ వేసిన మూడో ఓవర్లో జైస్వాల్ 4 ఫోర్లు బాది జోరు మొదలు పెట్టగా, సిరాజ్ వేసిన తర్వాతి ఓవర్లో కూడా 3 ఫోర్లు వచ్చాయి. కోలర్ వెనుదిరిగిన తర్వాత జైస్వాల్, శామ్సన్ ఇన్నింగ్స్‌ను నడిపించారు. అయితే వీరిద్దరు ఐదు పరుగుల వ్యవధిలో వెనుదిరగడం, జురేల్ (8) రనౌట్ కావడంతో కొంత ఉత్కంఠ పెరిగింది. అయితే మరో ఎండ్‌లో పరాగ్ ఆకట్టుకునే ఆటతో గెలుపు భారాన్ని తీసుకున్నాడు. పరాగ్, హెట్‌మైర్ (14 బంతుల్లో 26; 3 ఫోర్లు, 1 సిక్స్) మధ్య 45 పరుగుల భాగస్వామ్యం (25 బంతుల్లో) రాజస్తాన్‌ను విజయం దిశగా తీసుకెళ్లింది. విజయానికి చేరువైన దశలో వీరిద్దరు నిష్క్రమించినా రావ్‌మన్ పావెల్ (8 బంతుల్లో 16 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) పని పూర్తి చేశాడు.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (సి) (సబ్) ఫెరీరా (బి) చహల్ 33; డుప్లెసిస్ (సి) పావెల్ (బి) బౌల్ట్ 17; గ్రీన్ (సి) పావెల్ (బి) అశ్విన్ 27; పటిదార్ (సి) పరాగ్ (బి) అవేశ్ 34; మ్యాక్స్‌వెల్ (సి) జురేల్ (బి) అశ్విన్ 0; లోమ్రోర్ (సి) పావెల్ (బి) అశ్విన్ 32; కార్తీక్ (సి) జైస్వాల్ (బి) అవేశ్ 11; స్వప్నిల్ (నాటౌట్) 9; కరణ్ (సి) పావెల్ (బి) సందీప్ 5; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 172. వికెట్ల పతనం:** 1–37, 2–56, 3–97, 4–97, 5–122, 6–154, 7–159, 8–172. **బౌలింగ్:** బౌల్ట్ 4–0–16–1, సందీప్ శర్మ 4–0–48–1, అవేశ్ ఖాన్ 4–0–44–3, అశ్విన్ 4–0–19–2, చహల్ 4–0–43–1.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) కార్తీక్ (బి) గ్రీన్ 45; టామ్ కోలర్ (బి) ఫెర్గూసన్ 20; సామ్సన్ (స్టంప్డ్) కార్తీక్ (బి) కరణ్ 17; పరాగ్ (సి) సిరాజ్ 36; జురేల్ (రనౌట్) 8; హెట్‌మైర్ (సి) డుప్లెసిస్ (బి) సిరాజ్ 26; పావెల్ (నాటౌట్) 16; అశ్విన్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (19 ఓవర్లలో 6 వికెట్లకు) 174. వికెట్ల పతనం:** 1–46, 2–81, 3–86, 4–112, 5–157, 6–160. **బౌలింగ్:** స్వప్నిల్ 2–0–19–0, సిరాజ్ 4–0–33–2, దయాళ్ 3–0–37–0, ఫెర్గూసన్ 4–0–37–1, కరణ్ శర్మ 2–0–19–1, గ్రీన్ 4–0–28–1.

ఫైనల్లో జ్యోతి సురేఖ బృందం

ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్–2 టోర్నీ


అదితి, పర్ణీత్ కౌర్, జ్యోతి సురేఖ

యెచోన్ (దక్షిణ కొరియా): కొత్త సీజన్‌లో తమ జోరు కొనసాగిస్తూ భారత మహిళల కాంపౌండ్ ఆర్చరీ జట్టు వరుసగా రెండో స్వర్ణ పతకంపై గురి పెట్టింది. ప్రపంచకప్ స్టేజ్–2 టోర్నీలో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, పర్ణీత్ కౌర్, అదితి స్వామిలతో కూడిన టీమిండియా ఫైనల్లోకి దూసుకెళ్లింది. సెమీఫైనల్లో జ్యోతి సురేఖ బృందం 233–229 పాయింట్లతో అమెరికా జట్టును ఓడించింది. టీమ్ క్వాలిఫయింగ్‌లో రెండో స్థానంలో నిలువడం ద్వారా నేరుగా క్వార్టర్ ఫైనల్ ఆడిన భారత జట్టు 236–234 పాయింట్లతో ఇటలీ జట్టుపై గెలిచింది. శనివారం జరిగే ఫైనల్లో టర్కీతో భారత జట్టు పోటీపడుతుంది. షాంఘైలో గత నెలలో జరిగిన ప్రపంచకప్ స్టేజ్–1 టోర్నీలో జ్యోతి సురేఖ, పర్ణీత్, అదితి బృందం పసిడి పతకాన్ని సాధించింది. మరోవైపు ప్రియాంశ్, ప్రథమేశ్, అభిషేక్ వర్మలతో కూడిన భారత పురుషుల జట్టు కాంపౌండ్ టీమ్ విభాగంలో కాంస్య పతకాన్ని చేజార్చుకుంది. కాంస్య పతక పోరులో భారత్ 233–233తో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయింది. స్కోరు సమం కావడంతో 'షూట్ ఆఫ్' నిర్వహించగా... 'షూట్ ఆఫ్'లోనూ రెండు జట్లు 30–30తో సమంగా నిలిచాయి. అయితే భారత ఆర్చర్లు సంధించిన బాణాల కంటే ఆసీస్ ఆర్చర్లు కొట్టిన రెండు బాణాలు కేంద్ర బిందువుకు అతి సమీపంగా ఉండటంతో ఆస్ట్రేలియాకు కాంస్య పతకం ఖరారైంది.

ప్రిక్వార్టర్స్‌లో సింధు

సిక్కి రెడ్డి–సుమీత్ జోడీ కూడా ముందంజ



కౌలాలంపూర్: భారత స్టార్ షట్లర్ విజేత పీవీ సింధు మలేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో శుభారంభం చేసింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 15వ ర్యాంకర్ సింధు 21–17, 21–16తో క్రిస్టీ గిల్మోర్ (స్కాట్లాండ్)పై గెలుపొంది ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. భారత్‌కే చెందిన అష్మిత చాలిహా ప్రిక్వార్టర్ ఫైనల్ చేరగా... ఆకర్షి కశ్యప్, ఉన్నతి హుడా తొలి రౌండ్‌లోనే వెనుదిరిగారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి రెడ్డి–సుమీత్ రెడ్డి జోడీ కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. తొలి రౌండ్‌లో సిక్కి–సుమీత్ 21–15, 12–21, 21–17తో లుయి చున్ వే– ఫు చి యాన్ (హాంకాంగ్)లపై గెలిచారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో కిరణ్ జార్జి (భారత్) 21–16, 21–17తో టకుమా ఒబయాషి (జపాన్)పై నెగ్గాడు.

'షూటౌట్'లో భారత పురుషుల హాకీ జట్టు గెలుపు



అంట్‌వర్ప్ (బెల్జియం): అంతర్జాతీయ హాకీ సమాఖ్య ప్రో లీగ్‌లో భారత జట్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల జట్టు 'షూటౌట్'లో 5–4తో అర్జెంటీనాపై నెగ్గింది. నిర్ణీత సమయం ముగిసే సరికి ఇరుజట్లు 2–2తో సమంగా నిలిచాయి. భారత్ తరఫున మన్‌దీప్ (11వ ని.లో), లలిత్ (55వ ని.లో)... అర్జెంటీనా తరఫున మార్టినెజ్ (20వ ని.లో), థామస్ డొమినె (60వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. 'షూటౌట్'లో హర్మన్‌ప్రీత్, సుఖ్‌జీత్ చెరో రెండు గోల్స్ చేయగా, అభిషేక్ ఒక గోల్ చేశాడు. రాజ్‌కుమార్, లలిత్ విఫలమయ్యారు. ప్రత్యర్థి జట్టులో మైకో రెండు గోల్స్ కొట్టగా, లుకాస్, టోబియస్ ఒక్కో గోల్ చేశారు. ముగ్గురు విఫలమవడంతో భారత్ నెగ్గింది. ఇదే వేదికపై జరిగిన మరో మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 0–5 గోల్స్‌తో అర్జెంటీనా చేతిలో ఓడింది.

సినిమా


నాగ చైతన్య

వేటకు వేళాయె...

'ప్రేమమ్, సవ్యసాచి' వంటి చిత్రాల తర్వాత హీరో నాగచైతన్య– దర్శకుడు చందు మొండేటి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న మూడో చిత్రం 'తండేల్'. ఈ మూవీలో సాయి పల్లవి హీరోయిన్‌గా నటిస్తున్నారు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాకి సంబంధించి ఇప్పటికే కొన్ని ఫొటోలు విడుదల అయ్యాయి. తాజాగా మరో ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు నాగ చైతన్య. ఈ ఫొటోలో పల్లెటూరి గెటప్‌లో, ఫుల్ మాస్ లుక్‌లో కనిపిస్తున్నారు. వేటకు వెళ్లడానికి సిద్ధమవుతున్నట్లుగా ఫొటోలో కనబడుతోంది. ''తండేల్'లో నాగచైతన్య మత్స్యకారుడి పాత్ర చేస్తున్నారు. ఈ పాత్ర కోసం ఇంటెన్స్ ట్రైనింగ్ తీసుకొని కంప్లీట్‌గా మేకోవర్ అయ్యారాయన. అలాగే ఈ సినిమాలో శ్రీకాకుళం యాసలో డైలాగులు పలికేందుకు ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, కెమెరా: శ్యామ్‌దత్.

నూతన నటీనటులతో...


వైవీఎస్ చౌదరి

'శ్రీ సీతారాముల కళ్యాణం చూతము రారండి, సీతారామరాజు, లాహిరి లాహిరి లాహిరిలో, సీతయ్య, దేవదాసు' వంటి హిట్ చిత్రాల దర్శకుడు వైవీఎస్ చౌదరి నుంచి మరో సినిమా రానుంది. నేడు (మే 23) ఆయన బర్త్ డే. అలాగే ఆయన అభిమాన దర్శకుడు కె. రాఘవేంద్రరావు పుట్టినరోజు కూడా. ఈ సందర్భాలను పురస్కరించుకొని ఓ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టబోతున్నారు వైవీఎస్ చౌదరి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– ''ప్రతిభగల నూతన నటీనటులతో ఓ సినిమా తీయనున్నాను. న్యూ ఏజ్ యునిక్ కంటెంట్‌తో హై టెక్నికల్ వాల్యూస్‌తో ఈ ప్రాజెక్ట్ ఉంటుంది. ఈ సినిమాకి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే తెలియజేస్తాను'' అన్నారు.



''హాయ్ డార్లింగ్స్.. ఎలా ఉంది బుజ్జి, భైరవ గ్లింప్స్. ఎంజాయ్ చేశారా? 'కల్కి..'లో అమితాబ్ సార్, కమల్ సార్‌తో పని చేసే అవకాశం ఇచ్చిన అశ్వినీదత్‌గారికి, నాగీ (నాగ్ అశ్విన్)కి థ్యాంక్స్. హోల్ ఇండియా ఇన్‌స్పైర్ అయ్యే అమితాబ్, కమల్‌గారు లాంటి గ్రేటెస్ట్ లెజెండ్స్‌తో పని చేసే అవకాశం నాకు రావడం నా అదృష్టం'' అని హీరో ప్రభాస్ అన్నారు. ఆయన హీరోగా నటించిన పాన్ ఇండియన్ చిత్రం 'కల్కి 2898 ఏడీ'. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దీపికా పదుకోన్ హీరోయిన్. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దిశా పటానీ కీలక పాత్రలు చేశారు. వైజయంతీ మూవీస్‌పై సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ సినిమా జూన్ 27న విడుదలవుతోంది. కాగా బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'కల్కి స్పెషల్ క్రియేటివ్ ఈవెంట్'లో సినిమాలోని బుజ్జి (కారు) పాత్రను పరిచయం చేశారు. ఈవెంట్‌లో ఈ వాహనాన్ని ప్రభాస్ నడిపారు. అనంతరం ప్రభాస్ మాట్లాడుతూ– ''నాగీ మూడేళ్లు నన్ను బుజ్జితో వేధించాడు. ఫైనల్లీ బుజ్జిని పరిచయం చేశాం. నేనేదో మన డార్లింగ్స్‌కి హాయ్ చెప్పి వెళ్లిపోదాం అనుకుంటే ఈ కార్లు.. ఫీట్లు ఏంటి సార్ (నవ్వుతూ). బుజ్జి సూపర్ ఎగ్జయిటింగ్. నేను కూడా 'కల్కి' టీజర్, సినిమా ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తున్నాను. కమల్ సార్ 'సాగర సంగమం' సినిమా చూసి నాకలాంటి బట్టలు కావాలని మా అమ్మను అడిగాను.. అలాంటివి కుట్టించుకుని వేసుకున్నాను. ఇక ఈ వయసులో కూడా అశ్వినీదత్‌గారి ప్యాషన్ చూసి ఆయన వద్ద ఎంతో నేర్చుకోవాలనిపిస్తుంది. నాకు తెలిసి 50 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్న నిర్మాత ఆయనొక్కరే. ఆయన కుమార్తెలు స్వప్న, ప్రియాంకలకు కూడా ఆయనలా ప్యాషన్, ధైర్యం ఉంది. వాళ్ల పని చేసే విధానానికి మేమంతా స్ఫూర్తి పొందుతాం అని మా సిస్టర్స్‌కి చెబుతుంటాను'' అన్నారు. ''బుజ్జి కారుని ఎంతో కష్టపడి తయారు చేయించాం. ఇందుకోసం మహీంద్ర ఆటోమొబైల్ ఇంజినీర్స్ ఎంతో శ్రమించారు'' అన్నారు నాగ్ అశ్విన్. నిర్మాతలు అశ్వినీ దత్, స్వప్నా దత్, ప్రియాంకా దత్, కృష్ణంరాజు సతీమణి శ్యామల పాల్గొన్నారు.

> 'నా జీవితంలోకి ఒక ముఖ్యమైన వ్యక్తి రాబోతున్నారు' అంటూ మీరు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఎంతమంది అమ్మాయిల గుండెలు జారిపోయాయో తెలుసా? అని యాంకర్ అడగ్గా.. 'ఆ అమ్మాయిల కోసమే పెళ్లి చేసుకోలేదు' అని ప్రభాస్ నవ్వుతూ సమాధానం ఇచ్చారు.

భూతల్లి పై ఒట్టేయ్...


కమల్‌హాసన్

'శౌర..' అంటూ చైతన్య గీతం పాడారు సేనాపతి. హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో విడుదలైన సూపర్ హిట్ ఫిల్మ్ 'ఇండియన్' ('భారతీయుడు'). ఈ సినిమాకు సీక్వెల్స్‌గా 'ఇండియన్ 2, ఇండియన్ 3' ('భారతీయుడు 2, 3')' సినిమాను తెరకెక్కించారు దర్శకుడు శంకర్. ఈ చిత్రంలో సేనాపతి పాత్రలో కనిపిస్తారు కమల్ హాసన్. రెడ్ జెయింట్ మూవీస్, లైకా ప్రొడక్షన్స్‌పై సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రం ఆడియో ఆవిష్కరణ వేడుక జూన్ 1న చెన్నైలో జరగనుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలోని తొలి పాటను తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల చేశారు. 'భూతల్లి పై ఒట్టేయ్... తెలుగోడి వాడి చూపెట్టేయ్...' అంటూ సాగే తెలుగు పాట 'శౌర..'కు సుద్దాల అశోక్‌తేజ సాహిత్యం అందించగా, రితేష్ జి. రావ్, శ్రుతికా సముద్రాల పాడారు. ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ డైరెక్టర్. జూలై 12న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో 'ఇండియన్ 2' చిత్రం విడుదల కానుంది.

ఆ గ్యాప్‌లో లవ్ మీ చేశా!

– ఆశిష్



ఆశిష్, వైష్ణవీ చైతన్య జంటగా నటించిన చిత్రం 'లవ్ మీ'. శిరీష్ సమర్పణలో 'దిల్' రాజు ప్రొడక్షన్స్‌పై హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించిన చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం ఆశిష్ విలేకర్లతో మాట్లాడుతూ– ''లవ్ మీ'లో నేను అర్జున్ అనే యూ ట్యూబర్ పాత్ర చేశాను. ఎవరైనా ఏదైనా చేయవద్దు అంటే ఆ పని చేయాలనుకునే స్వభావం నా పాత్రకు ఉన్న ఓ లక్షణం. 'లవ్ మీ'లో హారర్ అనేది ఓ భాగం మాత్రమే. ఇందులో మంచి లవ్‌స్టోరీ, చక్కని ఎమోషన్స్ ఉన్నాయి. కీరవాణి, పీసీ శ్రీరామ్ గార్లు ఈ సినిమా ఒప్పుకోవడం మా తొలి విజయంగా భావించాం. కథలో పట్టు లేకపోతే వారు ఒప్పుకునేవారు కాదు కదా. 'లవ్ మీ'కు సీక్వెల్ చేయవచ్చు. కానీ అది 'దిల్' రాజుగారి చేతిలో ఉంది. 'రౌడీ బాయ్స్' తర్వాత యాభైకి పైగా కథలు విన్నాను. అలా నా రెండో చిత్రంగా 'సెల్ఫిష్' స్టార్ట్ చేశాం. కానీ ఈ మూవీలోని క్యారెక్టర్‌ను మరింత బాగా చూపించవచ్చని కథపై మళ్లీ వర్క్ స్టార్ట్ చేశాడు ఈ చిత్రదర్శకుడు కాశీ. ఈ గ్యాప్‌లో నేను 'లవ్ మీ' చేశాను. 'సితార ఎంటర్‌టైన్‌మెంట్స్'లో సినిమా కమిట్ అయ్యా. మరో రెండు కథలు విన్నాను'' అని చెప్పుకొచ్చారు.

ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్‌లో..?


కీర్తి సురేష్

ప్రముఖ గాయని ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్‌లో హీరోయిన్ కీర్తి సురేష్ నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి తమిళ చిత్ర పరిశ్రమ వర్గాలు. మహానటి సావిత్రి బయోపిక్‌గా రూపొందిన 'మహానటి' (2018)లో తన అద్భుత నటనతో ప్రేక్షకులను కట్టిపడేశారు కీర్తి సురేష్. ఈ చిత్రానికిగాను ఉత్తమ నటిగా జాతీయ అవార్డును కూడా అందుకున్నారామె. ఆ తర్వాత రెగ్యులర్ కమర్షియల్ సినిమా లతో పాటు లేడీ ఓరియంటెడ్ చిత్రాలు చేస్తున్న కీర్తి తాజాగా ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్‌లో నటించనున్నారని భోగట్టా. ఈ సినిమా దర్శకుడు, నిర్మాణ సంస్థ వంటి వివరాలు అధికారికంగా ప్రకటించన ప్పటికీ ఎంఎస్ సుబ్బలక్ష్మి పాత్రని కీర్తి సురేష్ పోషించే అవకాశాలు ఉన్నట్లు కోలీవుడ్ టాక్. తమిళనాడులోని మధురైలో ఒక మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన సుబ్బలక్ష్మి ప్రపంచమంతా కీర్తించే గాయనిగా ఎలా ఎదిగారు? ఆమె ఎదుర్కొన్న ఒడిదొడుకులు, ఆనందం, విషాద ఘటనల నేపథ్యంలో ఈ బయోపిక్ తెరకెక్కనుందట. ఈ పాత్రకి కీర్తి సురేష్ సరైన ఎంపిక అని చిత్ర యూనిట్ ఆమెను సంప్రదించగా, ఆమె పచ్చజెండా ఊపారని టాక్. కాగా ఎంఎస్ సుబ్బలక్ష్మి 2004 డిసెంబరు 11న తుది శ్వాస విడిచారు.

అందుకే నా పేరుకి బ్లూ చేర్చా!

– దీపక్ బ్లూ



అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'పుష్ప: ది రూల్'. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న రిలీజ్ కానుంది. కాగా ఈ సినిమా టైటిల్ సాంగ్ 'పుష్ప పుష్ప' లిరికల్ వీడియో ఈ నెల 1న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజైంది. ఈ పాట తెలుగు, తమిళ వెర్షన్స్‌లోని కొంత భాగాన్ని ఆలపించిన సింగర్ దీపక్ బ్లూ మాట్లాడుతూ– ''నా స్వస్థలం చెన్నై. మా నాన్నగారు కొంతకాలం రేపల్లెలో ఉన్నారు. అలా నాకు తెలుగు భాషపై అవగాహన ఉంది. మా అమ్మమ్మ, మా అమ్మగార్లకు సంగీతంలో ప్రావీణ్యం ఉంది. అలా సంగీతంపై నాకు ఆసక్తి కలిగింది. మైక్రోబయాలజీలో పీజీ చదివాను. కొంతకాలం ఉద్యోగం చేస్తూనే, సింగర్‌గా ఉన్నాను. ఆ తర్వాత ఉద్యోగం వదిలిపెట్టి సింగర్‌గా బిజీ అయ్యా. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో దాదాపు మూడొందలకు పైగా పాటలు పాడాను. విజయ్ ఆంటోనీగారి 'నాన్' సినిమాలో తొలి పాట పాడాను. తేజగారి దర్శకత్వంలో వచ్చిన 'నీకు నాకు డాష్ డాష్' చిత్రంలో 'బాయ్ బాయ్' పాట పాడాను. తెలుగులో అదే నా తొలి పాట. ఆ తర్వాత 'బీరువా, పండగ చేస్కో, కిక్ 2, చుట్టాలబ్బాయి, డిక్టేటర్, ఇటీవల 'వారసుడు' చిత్రాల్లో పాటలు పాడాను. కానీ ఎన్టీఆర్ 'నాన్నకు ప్రేమతో..' చిత్రంలోని 'లవ్ దెబ్బ', రామ్‌చరణ్ 'బ్రూస్‌లీ'లోని 'మెగా మీటర్' పాటలు గుర్తింపు తీసుకువచ్చాయి. ఇక 'పుష్ప'లోని 'హే బిడ్డ..' పాట బ్యాక్‌గ్రౌండ్‌లో ఓ చిన్న వాయిస్ ఇచ్చాను. ఇప్పుడు 'పుష్ప: ది రూల్' సినిమా టైటిల్ సాంగ్ 'పుష్ప పుష్ప' పాడటం హ్యాపీగా ఉంది. ఈ పాట నా కెరీర్ బిగ్గెస్ట్ హిట్‌గా భావిస్తున్నాను. నాకు చాలా మంది సింగర్స్ స్ఫూర్తి. ఎస్పీబీగారు ప్రేరణ'' అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''నా పేరు దీపక్. కానీ దీపక్ పేరుతో చాలామంది సింగర్స్ ఉన్నారు. నా ఫేవరెట్ కలర్ బ్లూ. అలా నా పేరుకి బ్లూ చేర్చుకున్నాను'' అన్నారు.

సస్పెన్స్... థ్రిల్


అదా శర్మ

'ది కేరళ ఫైల్స్, బస్తర్' వంటి చిత్రాల తర్వాత అదా శర్మ నటించిన చిత్రం 'సి.డి' (క్రిమినల్ ఆర్ డెవిల్). కృష్ణ అన్నం దర్శకత్వంలో ఎస్ఎస్‌సీఎమ్ ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదలవుతోంది. ''హారర్, యాక్షన్, సస్పెన్స్, థ్రిల్లర్ జానర్లకు ప్రస్తుతం ఎక్కువగా డిమాండ్ ఉంది. కంటెంట్, కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలు ఎక్కువగా సక్సెస్ అవుతున్నాయి. మా 'సి.డి' సినిమా కూడా ఓ డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రూపొందింది. ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్స్, టీజర్, ట్రైలర్ సినిమా మీద అంచనాలు పెంచాయి. పైగా చాలా రోజుల తర్వాత తెలుగులో అదా శర్మ నటించడంతో ఈ సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి కెమెరా: సతీష్ ముత్యాల, సంగీతం: ఆర్ఆర్ ధృవన్.

సాక్షి బిజినెస్
గురువారం
23-5-2024

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
268	69
74,221	22,598

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్‌	16,791	▽ 41
డోజోన్స్‌	39,721	▽ 152
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,370	▽ 46
డాక్స్‌	18,680	▽ 47
షాంఘై	3,159	▽ 1
నికాయ్‌	38,617	▽ 329

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	72,640
బంగారం (22 క్యారట్)	69,180
వెండి (కిలో)	99,000

ఫారెక్స్‌ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఎస్‌బీఐ	82.91	83.93
£	బ్రిటన్‌ పౌండ్‌	ఎస్‌బీఐ	104.77	107.33
€	యూరో	ఎస్‌బీఐ	89.37	91.74
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఎస్‌బీఐ	52.80	53.96
AU$	ఆస్ట్రేలియా డాలర్‌	ఎస్‌బీఐ	54.65	56.59
S$	సింగపూర్‌ డాలర్‌	థామస్‌కుక్‌	59.54	64.19
SAR	సౌదీ రియాల్‌	థామస్‌కుక్‌	21.31	22.87
UAE D	యూఏఈ దిర్హామ్‌	థామస్‌కుక్‌	21.79	23.57
¥	చైనా యువాన్‌	థామస్‌కుక్‌	10.38	12.45

కేంద్రంపై ఆర్‌బీఐ కనకవర్షం

2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ. 2.11 లక్షల కోట్ల రికార్డ్‌ డివిడెండ్‌

ముంబై: కేంద్రానికి రిజర్వ్‌ బ్యాంక్‌(ఆర్‌బీఐ) గత ఆర్థిక సంవత్సరానికి (2023-24) భారీగా రూ.2,10,874 కోట్ల డివిడెండ్‌ను అందించనుంది. ఆర్‌బీఐ చరిత్రలోనే ఇది రికార్డ్‌ కాగా.. బడ్జెట్‌ అంచనాలకన్నా రెట్టింపు. జీడీపీలో 0.2% నుంచి 0.3 శాతానికి సమానం. ఎన్నికల అనంతరం అధికారంలోకి రానున్న కొత్త ప్రభుత్వానికి ఆదాయపరంగా ఇది పెద్ద ఊరటనిచ్చే అంశం. ఈ మేరకు గవర్నర్‌ శక్తికాంత్‌దాస్‌ నేతృత్వంలో జరిగిన ఆర్‌బీఐ 608వ సెంట్రల్‌ బోర్డ్‌ ఆఫ్‌ డైరెక్టర్ల సమావేశం తాజా కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకూ కేంద్రానికి ఆర్‌బీఐ నుంచి అందిన అత్యధిక నిధుల బదలాయింపు విలువ(2018-19) రూ. 1.76 లక్షల కోట్లు. తాజా నిర్ణయాలపై ఆర్‌బీఐ ఒక ప్రకటన విడుదల చేసింది. కొన్ని ముఖ్యాంశాలు..

- 2024-25లో ఆర్‌బీఐ, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రూ.1.02 లక్షల కోట్ల డివిడెండ్లు అందుతాయని ఈ ఏడాది ఫిబ్రవరి బడ్జెట్‌ అంచనావేసింది. అయితే దీనికి రెట్టింపు మొత్తాలు రావడం గమనార్హం.
- తాజా బోర్డ్‌ సమావేశం దేశీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చించింది. వృద్ధి అవుట్‌లుక్‌కు ఎదురయ్యే సవాళ్లను, తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించింది.

ద్రవ్యలోటు, బాండ్‌ ఈల్డ్‌ తగ్గే చాన్స్‌...

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కేంద్రానికి వచ్చే ఆదాయం చేసే వ్యయానికి మధ్య నికర వ్యత్యాసం- ద్రవ్యలోటు రూ.17.34 లక్షల కోట్లుగా ఉంటుందని ఫిబ్రవరి బడ్జెట్‌ అంచనావేసింది. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ తాజా నిర్ణయం కేంద్ర ఖజానాకు పెద్ద ఊరటకానుంది. తాజా నిర్ణయం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు 4 బేసిస్‌ పాయింట్ల వరకూ తగ్గడానికి దోహదపడే అంశం. కేంద్రంపై రుణ భారాన్ని తగ్గిస్తుంది. తద్వారా బాండ్‌ మార్కెట్‌ విషయంలో కేంద్రానికి సానుకూల వాతావరణం ఏర్పడుతుంది. దేశ బెంచ్‌మార్క్‌ 10 సంవత్సరాల బాండ్‌ ఈల్డ్‌ కూడా 4 శాతం తగ్గి 7 శాతం వద్ద స్థిరపడే వీలుంది.

ఆర్‌బీఐ నుంచి కేంద్రానికి ఆదాయాల పెరుగుదల (రూ.కోట్లలో)

సంవత్సరం	బదలాయింపు
2012-13	33,010
2013-14	52,679
2014-15	65,896
2015-16	65,876
2016-17	30,659
2017-18	50,000
2018-19	1,76,051
2019-20	57,128
2020-21	99,122
2021-22	30,307
2022-23	87,416
2023-24	2,10,874



భారీ మిగులుకు కారణం?

అమెరికా ఫెడరల్‌ రిజర్వ్‌ వడ్డీరేట్ల పెంపు నేపథ్యంలో ఆర్‌బీఐ ఫారిన్‌ ఎక్ఛ్సేంజ్‌ అసెట్స్‌ ద్వారా లభించిన అధిక వడ్డీ ఆదాయాలు ఆర్‌బీఐ భారీ నిధుల బదలాయింపులకు ఒక ప్రధాన కారణం. దేశీయ, అంతర్జాతీయ సెక్యూరిటీలపై అధిక వడ్డీరేట్లు, ఫారిన్‌ ఎక్ఛ్సేంజ్‌ భారీ స్థూల విక్రయాలు కూడా ఇందుకు దోహదపడ్డాయి.

ఎకానమీపై భరోసాతో 6.5 శాతానికి సీఆర్‌బీఐ పెంపు

మరోవైపు సెంట్రల్‌ బ్యాంక్‌ నిధుల నిర్వహణకు సంబంధించిన కంటింజెంట్‌ రిస్క్‌ బఫర్‌ను (సీఆర్‌బీ) ఆర్‌బీఐ బోర్డ్‌ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 6.50 శాతానికి పెంచింది. భారత్‌ ఎకానమీ రికవరీని ఇది సూచిస్తోంది. ఆర్‌బీఐ బ్యాలెన్స్‌ షీట్‌ మొత్తంలో తన వద్ద ఎంత స్థాయిలో మిగులు నిధులను ఉంచుకోవాలి, కేంద్రానికి ఎంత మొత్తంలో మిగులును బదలాయించాలి అనే అంశంపై మాజీ గవర్నర్‌ బిమల్‌ జలాన్‌ నేతృత్వంలోని కమిటీ ఒక ఎకనమిక్‌ క్యాపిటల్‌ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించింది. సీఆర్‌బీఐ 5.5% - 6.5 % శ్రేణిలో ఉండాలని ఈ ఫ్రేమ్‌వర్క్‌ నిర్దేశించింది. దీని ప్రకారమే ఆర్‌బీఐ మిగులు బదలాయింపు నిర్ణయాలు జరుగుతాయి. ఆర్థిక పరిస్థితులు, కోవిడ్‌-19 మహమ్మారి వంటి పరిణామాల నేపథ్యంలో 2018-19 నుంచి 2021-22 వరకూ 5.50 శాతం సీఆర్‌బీ నిర్వహణకు ఆర్‌బీఐ నిర్ణయం తీసుకుంది. తద్వారా కేంద్రానికి అధిక మిగులు నిధులు అందించి ఆర్థిక పురోగతి, ఎకానమీ క్రియాశీలతకు దోహదపడాలన్నది సెంట్రల్‌ బ్యాంక్‌ ఉద్దేశం. ఎకానమీ పురోగతి నేపథ్యంలో 2022-23లో సీఆర్‌బీని 6 శాతానికి, తాజాగా 6.5 శాతానికి సెంట్రల్‌ బ్యాంక్‌ బోర్డ్‌ పెంచింది.

సన్‌ ఫార్మా లాభం అప్‌

- క్యూ4లో రూ. 2,655 కోట్లు
- షేరుకి రూ. 5 తుది డివిడెండ్‌

న్యూఢిల్లీ: సన్‌ ఫార్మాస్యూటికల్‌ ఇండస్ట్రీస్‌ గత ఆర్థిక సంవత్సరం(2023-24) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్‌ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో రూ. 2,655 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 10,931 కోట్ల నుంచి రూ. 11,983 కోట్లకు బలపడింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 5 చొప్పున తుది డివిడెండ్‌ ప్రకటించింది. అంతేకాకుండా కంపెనీ ఎండీ దిలీప్‌ సంఘ్వీని చైర్మన్‌గా నియమించింది. కాగా.. పూర్తి ఏడాదికి సన్‌ ఫార్మా నికర లాభం రూ. 9,576 కోట్లను అధిగమించింది. 2022-23లో దాదాపు రూ. 8,474 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 43,886 కోట్ల నుంచి రూ. 48,497 కోట్లకు ఎగసింది. దేశీ ఫార్ములేషన్ల అమ్మకాలు రూ. 14,889 కోట్లను దాటగా.. యూఎస్‌ నుంచి 185.4 కోట్ల డాలర్లు (రూ. 15,440 కోట్లు)సాధించింది.

ఈ షేరు బీఎస్‌ఈలో నామ మాత్ర లాభంతో రూ. 1,540 వద్ద ముగిసింది.

100 శాఖల ఏర్పాటులో కరూర్‌ వైశ్యా బ్యాంక్‌


చెన్నై: ప్రైవేట్‌ రంగ కరూర్‌ వైశ్యా బ్యాంక్‌ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దేశవ్యాప్తంగా కొత్తగా 100 శాఖలు ఏర్పాటు చేసే యోచనలో ఉంది. అయోధ్యలో తమ 840వ బ్రాంచీ ప్రారంభం సందర్భంగా బ్యాంకు ఎండీ బి. రమేష్‌ బాబు ఈ విషయాలు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటిదాకా 39 శాఖలు ప్రారంభించినట్లు వివరించారు. గత ఆర్థిక సంవత్సరం రూ. 1,605 కోట్ల నికర లాభంతో పటిష్ట పనితీరు కనపర్చినట్లు పేర్కొన్నారు.

పవర్‌గ్రిడ్‌ లాభం డౌన్‌

- క్యూ4లో రూ. 4,166 కోట్లు
- షేరుకి రూ. 2.75 డివిడెండ్‌

న్యూఢిల్లీ: విద్యుత్‌ రంగ ప్రభుత్వ దిగ్గజం పవర్‌ గ్రిడ్‌ కార్పొరేషన్‌ గత ఆర్థిక సంవత్సరం(2023-24) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్‌ నికర లాభం 4 శాతం నీరసించి రూ. 4,166 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2022-23) ఇదే కాలంలో రూ. 4,323 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 12,557 కోట్ల నుంచి రూ. 12,305 కోట్లకు స్వల్ప వెనకడుగు వేసింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 2.75 చొప్పున తుది డివిడెండ్‌ ప్రకటించింది. ఇక పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 15,420 కోట్ల నుంచి రూ. 15,573 కోట్లకు నామమాత్రంగా పుంజుకుంది. మొత్తం ఆదాయం రూ. 46,606 కోట్ల నుంచి రూ. 46,913 కోట్లకు బలపడింది. బ్యాంకుల కన్సార్షియం నుంచి రూ. 5,000 కోట్ల సమీకరణకు బోర్డు గ్రీన్‌సిగ్నల్‌ ఇచ్చినట్లు పవర్‌ గ్రిడ్‌ పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో పవర్‌గ్రిడ్‌ షేరు బీఎస్‌ఈలో యథాతథంగా రూ. 326 వద్ద ముగిసింది.



గ్లాండ్‌ ఫార్మా లాభం రూ. 192 కోట్లు

హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో గ్లాండ్‌ ఫార్మా లాభం రూ. 192 కోట్లుగా నమోదైంది. అంతక్రితం క్యూ4లో ఇది రూ. 79 కోట్లు. మరోవైపు, ఆదాయం రూ. 785 కోట్ల నుంచి రూ. 1,537 కోట్లకు చేరింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను షేరు ఒక్కింటికి రూ. 20 చొప్పున కంపెనీ తుది డివిడెండ్‌ ప్రకటించింది. యూరప్‌కు చెందిన సెనెక్సీ కొనుగోలు అంశం రాబోయే రోజుల్లో గణనీయంగా ప్రయోజనాలు చేకూర్చగలదని గ్లాండ్‌ ఫార్మా ఎండీ ఎస్‌. శ్రీనివాస్‌ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)

23-5-2024

విశాఖ	550-00
చిత్తూరు	628-00
ఈస్ట్‌, వెస్ట్‌ గోదావరి	540-00
విజయవాడ	540-00
రిటైల్‌ ధర (డజను)	72.00
హైదరాబాద్‌	550-00
వరంగల్‌	552-00
రిటైల్‌ ధర	6.10

సెన్సెక్స్‌ లాభం 268 పాయింట్లు

నిఫ్టీకి అయిదో రోజూ లాభాలు



ముంబై: రిలయన్స్‌ ఇండస్ట్రీస్‌(2%), ఇన్ఫోసిస్‌(1.50%)తో పాటు ఎఫ్‌ఎంసీజీ షేర్లు రాణించడంతో స్టాక్‌ సూచీలు బుధవారం లాభపడ్డాయి. సెన్సెక్స్‌ 268 పాయింట్లు పెరిగి 74,221 వద్ద ముగిసింది. నిఫ్టీ 69 పాయింట్లు బలపడి 22,598 వద్ద స్థిరపడింది. ఈ సూచీకిది అయిదో రోజూ లాభాల ముగింపు. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ఎఫ్‌ఎంసీజీతో పాటు రియల్టీ, ఐటీ, యుటిలిటీ, ఇంధన, ఫార్మా షేర్లకు కొనుగోళ్ల మద్దతు సూచీలకు దన్నుగా నిలిచింది. ఒక దశలో ట్రేడింగ్‌లో సెన్సెక్స్‌ 354 పాయింట్లు ఎగసి 74,308 వద్ద, నిఫ్టీ 101 పాయింట్లు బలపడి 22,630 వద్ద ఇంట్రాడే గరిష్టాలను తాకాయి. మరోవైపు కమోడిటీ, ఫైనాన్సియల్‌ సర్వీసెస్‌, బ్యాంకులు, మెటల్‌ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బ్రిటన్‌లో అంచనాలకు మించి ద్రవ్యోల్బణ గణాంకాల నమోదు, ఫెడరల్‌ రిజర్వ్‌ సమావేశ వివరాలు వెల్లడికి ముందు(బుధవారం రాత్రి) అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.



పేటీఎంకు పెరిగిన నష్టాలు

న్యూఢిల్లీ: ఫిన్‌టెక్‌ కంపెనీ వన్‌97 కమ్యూనికేషన్స్‌ క్యూ4లో నికర నష్టం భారీగా పెరిగి రూ. 168 కోట్ల నుంచి రూ. 550 కోట్లకు చేరింది. పేటీఎం బ్రాండ్‌ కంపెనీ మొత్తం ఆదాయం 3 శాతం క్షీణించి రూ. 2,267 కోట్లకు పరిమితమైంది. యూపీఐ లావాదేవీలు తదితరాలలో తాత్కాలిక అవరోధాలు, పేటీఎం పేమెంట్స్‌ బ్యాంక్‌(పీపీబీఎల్‌)కు శాశ్వత అంతరాయం కారణంగా పనితీరు దెబ్బతిన్నట్లు కంపెనీ పేర్కొంది. బ్యాంక్‌ భవిష్యత్‌ బిజినెస్‌పై అనిశ్చితి కొనసాగనున్న నేపథ్యంలో పీపీబీఎల్‌లో 39 శాతం వాటాకుగాను క్యూ4లో రూ. 227 కోట్ల పెట్టుబడులను రద్దు చేసినట్లు కంపెనీ వెల్లడించింది. ఇక మొత్తం ఆదాయం 3 శాతం క్షీణించి రూ. 2,267 కోట్లను తాకినట్లు తెలియజేశారు. 2022-23లో రూ. 2,465 కోట్ల టర్నోవర్‌ సాధించిన విషయాన్ని ప్రస్తావించారు. ఇక గతేడాది నికర నష్టం రూ. 1,422 కోట్లకు చేరగా.. 2022-23లో రూ. 1,777 కోట్ల నష్టం నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో పేటీఎం షేరు బీఎస్‌ఈలో 5 శాతం జంప్‌చేసి రూ. 369 వద్ద ముగిసింది.

‘రేవ్‌’ పార్టీలో చిత్తూరు టీడీపీ నేతలు!

డ్రగ్స్‌ విక్రయించిన ‘పచ్చ’ నేతలు ● మాదకద్రవ్యాల నిరోధక చట్టం కింద అరెస్ట్‌



రణధీర్‌ విక్రమ్‌ నాయుడు · అరుణ్‌కుమార్‌ నాయుడు · పోలీసులు అరెస్టు చేసిన నిందితులు వీరే..

చిత్తూరు అర్బన్‌: కర్ణాటకలోని బెంగళూరు నగరంలో జరిగిన రేవ్‌ పార్టీలో టీడీపీ మూలాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రేవ్‌ పార్టీలో డ్రగ్స్‌ విక్రయించిన ఐదుగురు ప్రధాన నిందితుల ఫొటోలు, వివరాలను బెంగళూరు పోలీసులు వెల్లడించారు. వీరిలో చిత్తూరుకు చెందిన టీడీపీ యువనేత రణధీర్‌ విక్రమ్‌ నాయుడు, టీడీపీ కార్యకర్త కాణిపాకానికి చెందిన అరుణ్‌కుమార్‌నాయుడు ఉన్నారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేసిన బెంగళూరు పోలీసులు, వీళ్లపై మాదక ద్రవ్యాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రణధీర్‌విక్రమ్‌ నాయుడుకు చిత్తూరులోని టీడీపీకి చెందిన పలువురు నేతలతో సన్నిహిత సంబంధాలున్నాయంటున్నారు. అరుణ్‌కుమార్‌నాయుడుది కాణిపాకం సమీపంలోని మద్దిపట్లపల్లెగా చెబుతున్నారు. బెంగళూరు ఎలక్ట్రానిక్‌ సిటీలో జరిగిన రేవ్‌ పార్టీలో 101 మందిని పట్టుకున్న పోలీసులు ఐదుగురు మినహా.. మిగిలినవాళ్లను సొంత పూచికత్తుపై విడుదల చేశారు. వీళ్ల రక్తనమూనాలు సేకరించగా, విచారణకు ఎప్పుడు పిలిచినా హాజరుకావాలని షరతు పెట్టారు. మాదక ద్రవ్యాలు విక్రయించిన ఐదుగురిలో వీరిద్దరితో పాటు మొహ్మద్‌ అబూబక్కర్‌ సిద్ధికి, ఎల్‌.వాసు, డి.నాగబాబులున్నారు. నిందితుల నుంచి 15.56 గ్రా. ఎండీఎంఏ పిల్స్‌, 6 గ్రాముల హైడ్రో గాంజా, 6.2 గ్రాముల కొకైన్‌తో పాటు ఇతర మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. వీళ్లపై మాదక ద్రవ్యాల నిరోధక చట్టం -1985, సెక్షన్‌ 8(సి), 22(బి), 22(సి), 22(ఏ), 27(బి), 25, 27, ఐపీసీ 1860 సెక్షన్‌ 290, 294 కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అంతా ఓ పద్ధతి ప్రకారం..

వాసు బర్త్‌ డే పేరుతో నిర్వహించిన ఈ రేవ్‌ పార్టీలో వాస్తవానికి ఎలాంటి బర్త్‌ డే వేడుకలు జరగలేదు. ఉద్దేశపూర్వకంగా డ్రగ్స్‌ విక్రయించడం, వేశ్యా గృహాన్ని నిర్వహించడాన్ని పోలీసులు గుర్తించారు. రేవ్‌ పార్టీలోకి వచ్చే ప్రతి ఒక్కరికీ ఓ పాస్‌వర్డ్‌ ఇచ్చారు. వాసు బర్త్‌ డే పార్టీ అనే యూజర్‌ నేమ్‌, పాస్‌వర్డ్‌ చెప్పినవాళ్లకు మాత్రమే ఇక్కడ ప్రవేశం ఉంటుంది. ఇందుకోసం నిర్వాహకులు ఓ ప్యాకేజీ ఇచ్చారు. ఒక్కో వ్యక్తి నుంచి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేసినట్టు తెలిసింది. ‘సన్‌సెట్‌ టు సన్‌రైజ్‌ విక్టరీ’ పేరిట ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 నుంచి 20వ తేదీ ఉదయం 6 గంటల వరకు రేవ్‌ పార్టీ జరిగేలా ప్రణాళిక రూపొందించారు. తొలుత ఎలక్ట్రానిక్‌ సిటీ స్టేషన్‌ పరిధిలో కేసు నమోదవగా, తర్వాత హెబ్బాగోడికి బదిలీ చేయాలనుకున్నారు. తాజాగా ఈ కేసును సెంట్రల్‌ క్రైమ్‌ బ్రాంచ్‌ బెంగళూరు(సీసీబీ) పోలీసులకు అప్పగిస్తున్నట్లు కర్ణాటక పోలీసులు ప్రకటించారు. ఇందులో సెక్స్‌ రాకెట్‌ అంశం కూడా ఉన్నట్లు పోలీసులు అనుమానించి, ఆ దిశగా సైతం విచారణ చేస్తున్నారు. ఈ ఘటనలో పోలీసులు సీజ్‌ చేసిన కార్లలో ఫార్చ్యూనర్‌ కారు ఏపీ 39 హెచ్‌ 0002 నంబర్‌తో ఉంది. ఇది చిత్తూరులోని గుడిపాల మండలం రాసనపల్లెకు చెందిన త్యాగరాజులు నాయుడు అనే వ్యక్తి పేరిట ఉంది. త్యాగరాజులు నాయుడు కారు అక్కడ ఎందుకు ఉందనే దానిపై పోలీసులు ఇప్పటికే విచారణ ప్రారంభించారు. ఇంతలోపు ఈ కారును తొమ్మిది నెలల కిందటే మరో వ్యక్తికి విక్రయించినట్లు, అతను ఇంకా కారును తన పేరిట మార్చుకోలేదని కొత్త డ్రామా చేస్తున్నట్లు తెలుస్తోంది. చిత్తూరు నియోజకవర్గానికి చెందిన ఓ టీడీపీ ముఖ్య నేత ఈ కారును ఉపయోగించినట్లు సమాచారం.

రేవ్‌పార్టీపై లోతుగా దర్యాప్తు

- సెంట్రల్‌ క్రైమ్‌ బ్రాంచికి అప్పగింత
- కర్ణాటక డీజీపీ అలోక్‌మోహన్‌ వెల్లడి
- పార్టీలో 250 మందికి పైగా పాల్గొన్నట్టు అనుమానాలు
- ఎంట్రీ ఫీజు కింద ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షలు వసూలు!

బనశంకరి (బెంగళూరు): బెంగళూరు నగర శివారులోని హెబ్బగోడి ఫాంహౌస్‌లో జరిగిన రేవ్‌ పార్టీ కేసును లోతుగా దర్యాప్తు చేసేందుకుగాను సెంట్రల్‌ క్రైమ్‌ బ్రాంచి (సీసీబీ)కి అప్పగిస్తున్నట్లు కర్ణాటక డీజీపీ అలోక్‌మోహన్‌ బుధవారం తెలిపారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నట్టుగా అనుమానాలు వ్యక్తమవుతున్న ఈ రేవ్‌ పార్టీపై సీఐ లక్ష్మీప్రసాద్‌ ఆధ్వర్యంలో విచారణ జరగనుంది. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం తెల్లవారుజామువరకు మద్యం, మాదక ద్రవ్యాలు, మ్యూజిక్‌, నృత్యాలతో హోరెత్తిన ఈ పార్టీలో సుమారు 100 మంది పాల్గొన్నట్టు తొలుత వార్తలు వచ్చినా 250 మందికి పైగానే పాల్గొన్నట్టు తెలుస్తోంది. సీసీబీ అధికారులు దాడి చేసే సమయానికే చాలామంది వెళ్లిపోగా, మరికొందరు మాత్రం తెల్లవారు జామువరకు ఉండిపోయారు. వీరిని అదుపులోకి తీసుకున్న సీసీబీ అధికారులు, స్థానిక పోలీసులు.. దాడి సమయంలో పరారైన కొందరిని గుర్తించే పనిలో ఉన్నారు. వాసు అనే వ్యక్తి పుట్టినరోజు పేరుతో సాగిన రేవ్‌ పార్టీలో పలువురు యువతులు కూడా పాల్గొనడంతో అసాంఘిక కార్యకలాపాలు కూడా సాగినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. సదరు ముఠా సమాచారం కూడా సేకరించారు.

పుట్టినరోజు పార్టీ అబద్ధం

పార్టీకి హాజరైన ఒక్కొక్కరి నుంచి వాసు ఎంట్రీ ఫీజు కింద రూ.2 లక్షలు వసూలు చేసినట్లు తెలిసింది. పోలీసులు వచ్చి అడిగితే బర్త్‌డే పార్టీకి వచ్చామని, తామంతా స్నేహితులమని చెప్పాల్సిందిగా ముందే సూచనలు అందినట్లు సమాచారం. పోలీసుల విచారణలో పుట్టినరోజు పార్టీ అబద్ధమని కూడా తేలింది. రేవ్‌ పార్టీలో రాజ్‌బావ అనే డ్రగ్స్‌పెడ్లర్‌ కోరిన వారికి కోరిన డ్రగ్‌ను అందజేసినట్లు తెలుస్తోంది. పార్టీలో పాల్గొన్న వారి నుంచి రక్త నమూనాలు సేకరించిన పోలీసులు పరీక్షల నివేదిక కోసం ఎదురు చూస్తున్నారు. నివేదిక అందితే ఎంతమంది డ్రగ్స్‌ వాడారనేది తెలుస్తుందని అంటున్నారు. మరోవైపు నగరంలో ఇలాంటి డ్రగ్స్‌, రేవ్‌ పార్టీలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్‌ కమిషనర్‌ దయానంద్‌ ఆదేశించారు.

ప్రజల సమష్టి కృషి, భాగస్వామ్యంతోనే జీవవైవిధ్య పరిరక్షణ

- రాష్ట్ర ప్రిన్సిపల్‌ సెక్రటరీ చిరంజీవి చౌదరి..
- విశాఖ వేదికగా జాతీయ స్థాయి జీవవైవిధ్య దినోత్సవం

ఏయూ క్యాంపస్‌: ‘అన్ని వర్గాల ప్రజల సమష్టి కృషి, భాగస్వామ్యంతోనే జీవ వైవిధ్య పరిరక్షణ సాధ్యమవుతుంది. తద్వారా 2030 నాటికి అన్ని రంగాలకు సుస్థిరమైన పర్యావరణాభివృద్ధి ఫలాలు అందుతాయి. ఆ దిశగా ఏపీ బయోడైవర్సిటీ బోర్డు కృషి చేస్తోంది’ అని రాష్ట్ర ప్రిన్సిపల్‌ సెక్రటరీ, చీఫ్‌ కన్జర్వేటర్‌ ఆఫ్‌ ఫారెస్ట్‌ చిరంజీవి చౌదరి తెలిపారు. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం పురస్కరించుకుని ఏయూ కన్వెన్షన్‌ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన జాతీయ స్థాయి జీవవైవిధ్య దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జీవవైవిధ్య పరిరక్షణ, జీవవనరుల స్థిరమైన వినియోగం, అన్ని వాటాదారుల మధ్య జీవవనరుల న్యాయమైన, సమానమైన భాగస్వామ్యం అనే మూడు ప్రధాన లక్ష్యాలను ఏపీ జీవ వైవిధ్య బోర్డు నిర్దేశించుకుందని ఆయన తెలిపారు. భవిష్యత్‌ తరాలకు సుస్థిర ప్రయోజనాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జీవవైవిధ్యంలో విశాఖపట్నం ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుందన్నారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి మాట్లాడుతూ రానున్న 50 ఏళ్లలో సమాజంలో అన్ని రంగాల, వర్గాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏయూ ప్రధాన కేంద్రంగా బయో డైవర్సిటీ పార్క్‌ నెలకొల్పుతామని, ఇప్పటికే చర్యలు చేపట్టామన్నారు. తాము చేపట్టిన జీవవైవిధ్య పరిరక్షణ కార్యక్రమాల వల్ల దేశంలో గుర్తింపు పొందిన రెండు గ్రీన్‌ వర్సిటీల్లో ఒకటిగా ఏయూ నిలిచిందన్నారు. ఏపీ స్టేట్‌ బయోడైవర్సిటీ బోర్డు మెంబర్‌ సెక్రటరీ బీవీఏ కృష్ణమూర్తి, విశాఖ జిల్లా చీఫ్‌ కన్జర్వేటర్‌ ఆఫ్‌ ఫారెస్ట్‌ ఎస్‌.శ్రీకాంత్‌నాథ్‌ రెడ్డి, జాతీయ బయోడైవర్సిటీ అథారిటీ ప్రతినిధి ఆచార్య హంచినల్‌ రాయప్ప రామప్ప, వైఎస్సార్‌ హార్టికల్చరల్‌ యూనివర్సిటీ వీసీ ఆచార్య టి.జానకీ రామ్‌ కార్యక్రమంలో ప్రసంగించారు. అనంతరం అతిథులు ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి స్టాల్స్‌లో ప్రదర్శించిన ఉత్పత్తులను తిలకించారు. వేడుకల్లో భాగంగా వివిధ రకాల పుస్తకాలు, బ్రోచర్లను అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం విశిష్ట సేవలందించిన వారికి అవార్డులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో అనంత్‌ శంకర్‌, జూ క్యూరేటర్‌ నందనీ సలారియా, రాజమండ్రి సెంట్రల్‌ జైల్‌ సూపరింటెండెంట్‌ రాహుల్‌ తదితరులు పాల్గొన్నారు.



మామిడి, అరటి పళ్ల స్టాల్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్‌ సెక్రటరీ చిరంజీవి చౌదరి, ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

తిరుచానూరులో వేడుకగా ప్రారంభమైన వసంతోత్సవాలు

నేడు స్వర్ణరథోత్సవం

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరులో కొలువైన శ్రీవారి పట్టపురాణి శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక వసంతోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఏడాది వసంత రుతువులో అలివేలుమంగమ్మకు పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా వసంతోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. అమ్మవారిని వేకువనే సుప్రభాతంతో నిద్ర మేల్కొల్పి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారిని సన్నిధి నుంచి వేంచేపుగా ఉద్యానవనం మండపానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. అనంతరం వేదమంత్రోచ్ఛరణ, మంగళవాయిద్యం, గోవిందనామ స్మరణ నడుమ అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో ఆలయ అర్చకులు నిర్వహించిన స్నపన తిరుమంజనం నేత్రపర్వంగా సాగింది. రాత్రి సర్వాంగ శోభితురాలైన శ్రీ పద్మావతి అమ్మవారు తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగారు. వసంతోత్సవంలో భాగంగా రెండవ రోజైన గురువారం ఉదయం 7.45 గంటలకు స్వర్ణరథంపై తిరువీధుల్లో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. మధ్యాహ్నం ఉద్యానవనంలో స్నపన తిరుమంజనం, రాత్రి తిరుచ్చి ఉత్సవం జరుగుతుంది.



పద్మావతి అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

నేటి నుంచి బిష్కెక్‌ నుంచి భారత్‌కు విమానాలు

- కిర్గిజ్‌స్థాన్‌లో పరిస్థితి ప్రస్తుతం సాధారణంగానే ఉంది
- ఏపీఎన్‌ఆర్‌టీఎస్‌కు తెలిపిన యురేషియా అదనపు కార్యదర్శి చరణ్‌జిత్‌ సింగ్‌

సాక్షి, అమరావతి: కిర్గిజ్‌స్థాన్‌లో పరిస్థితిని ఏపీ ప్రభుత్వ రంగ సంస్థ ఏపీఎన్‌ఆర్‌టీఎస్‌ నిరంతరం పర్యవేక్షిస్తోందని సొసైటీ ఎగ్జిక్యూటివ్‌ ఆఫీసర్‌ బుధవారం తెలిపారు. తెలుగు విద్యార్థులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ, వారికి కౌన్సెలింగ్‌ ఇస్తోందని పేర్కొన్నారు. తమ ప్రయత్నాలకు కొనసాగింపుగా..కిర్గిజ్‌స్థాన్‌లో ఏపీ విద్యార్థుల భద్రత, శ్రేయస్సు గురించి, ప్రస్తుత పరిస్థితి, విద్యార్థుల సమస్యల గురించి వివరిస్తూ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, యురేషియా అదనపు కార్యదర్శి చరణ్‌జిత్‌ సింగ్‌ కార్యాలయంతో సంప్రదింపులు జరుపుతోందని వెల్లడించారు. కిర్గిజ్‌స్థాన్‌లోని ఏపీ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుండి వస్తోన్న అభ్యర్థనలను విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు వివరిస్తూ త్వరగా విద్యార్థులను స్వదేశానికి రప్పించే అవకాశాల గురించి ఏపీఎన్‌ఆర్‌టీఎస్‌ ఆరా తీసిందని పేర్కొన్నారు. అదనపు కార్యదర్శి కార్యాలయం యురేషియా, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, దీనిపై స్పందించి కిర్గిజ్‌స్థాన్‌లోని బిష్కెక్‌ లో ప్రస్తుత పరిస్థితి సాధారణంగానే ఉందని ఏపీఎన్‌ఆర్‌టీఎస్‌కు తెలియజేసిందన్నారు. స్వదేశానికి తిరిగి రావడానికి ముందు, నేషనల్‌ మెడికల్‌ కమిషన్‌ ఆఫ్‌ ఇండియా మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోవాలని భారత విద్యార్థులకు సూచించింది. విద్యార్థులు భారత్‌కు తిరిగి రావాలనుకుంటే, మే 23 నుండి బిష్కెక్‌ నుండి న్యూఢిల్లీకి నేరుగా ప్రతిరోజూ రెండు విమానాలు నడుస్తాయని విదేశాంగ శాఖ తెలిపింది. అత్యవసర సహాయం కోసం, భారతీయ, తెలుగు విద్యార్థుల బిష్కెక్‌లోని భారత రాయబార కార్యాలయం వారి హెల్ప్‌లైన్‌ నంబర్‌ 0555710041 ను సంప్రదించాలని కోరారు. కిర్గిజ్‌స్థాన్‌లోని ఏపీ విద్యార్థుల సహాయం కోసం ఏపీఎన్‌ఆర్టీఎస్‌ 24/7 హెల్ప్‌లైన్‌ నంబర్లు +91 863 2340678; +91 85000 27678(వాట్సాప్‌) లేదా ఈ-మెయిల్‌ info@apnrts.com; helpline@-apnrts.com ను సంప్రదించాలని కోరింది.

క్లుప్తంగా...

'నిట్'లో పీహెచ్‌డీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం



తాడేపల్లిగూడెం: పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఏపీనిట్)లో 2024–25 జూన్ సెషన్‌కు సంబంధించి పీహెచ్‌డీ ఫుల్‌టైం, పార్ట్‌టైం ఇంటర్ డిసిప్లినరీ కోర్సులకు (రెండు విభాగాలను అనుసంధానిస్తూ) అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీన్ అకడమిక్ డాక్టర్ టి.కురుమయ్య బుధవారం తెలిపారు. ఫుల్‌టైం కోర్సులకు మాస్టర్స్ డిగ్రీతో పాటు గేట్ పరీక్షలో విధిగా అర్హత సాధించాలన్నారు. పార్ట్‌టైం అభ్యర్థులు మాస్టర్ డిగ్రీతోపాటు ఏదైనా అకడమిక్ ఇన్‌స్టిట్యూట్‌లో లేదా పరిశ్రమలో రెండేళ్ల పనిచేసిన అనుభవం ఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాత పరీక్ష, ముఖాముఖి పరీక్ష ద్వారా అర్హులను ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు నిట్ వెబ్‌సైట్ లేదా నిట్ అడ్మిషన్ల అధికారి డాక్టర్ తపస్‌ను సంప్రదించాలని కోరారు.

ఏపీఆర్‌సెట్ ఫలితాలు విడుదల

- 4,352 మంది ఉత్తీర్ణత
- జూన్ 10 తరువాత ఇంటర్వ్యూలు



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ శ్రీకాంత్ రెడ్డి, కన్వీనర్ దేవప్రసాద్‌రాజు

సాక్షి, అమరావతి/తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈనెల 2 నుంచి 5 తేదీ వరకు పీహెచ్‌డీ కోర్సు ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీఆర్‌సెట్–24 ఫలితాలను ఎస్వీయూలో వీసీ శ్రీకాంత్ రెడ్డి బుధవారం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏపీఆర్‌సెట్ మొత్తం 64 సబ్జెక్టుల్లో పరీక్షలు నిర్వహించామని తెలిపారు. 10,050 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 8,651మంది ప్రవేశ పరీక్షకు హాజరయ్యారని పేర్కొన్నారు. ఇందులో 4,352మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారని, వారిలో పురుషులు 2,226 మంది, మహిళలు 2,126మంది ఉన్నారన్నారు. ఏపీఆర్‌సెట్‌ను విజయవంతంగా నిర్వహించిన కన్వీనర్ ప్రొఫెసర్ దేవప్రసాద్‌రాజును ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అనంతరం దేవప్రసాద్ రాజు మాట్లాడుతూ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు జూన్ 10 తరువాత ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. ఫలితాల కోసం https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు పీసీ వెంకటేశ్వర్లు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లిప్‌కార్ట్ మాజీ అధిపతి ఇంట్లో నక్షత్ర తాబేళ్లు సీజ్

కృష్ణరాజపుర: ఆన్‌లైన్ షాపింగ్ వేదికైన ఫ్లిప్‌కార్ట్ మాజీ సీఈఓ–చైర్మన్ సచిన్ బన్సాల్ ఇంట్లో బుధవారం బెంగళూరు సీఐడీ, అటవీ విభాగం అధికారులు సోదాలు నిర్వహించారు. బెంగళూరు కోరమంగళలో ఆయనకు విలాసవంతమైన నివాసం ఉంది. ఇందులో నిషేధిత వన్యప్రాణులు ఉన్నట్లు సమాచారం రావడంతో దాడులు చేశారు. ఈ దాడిలో అరుదైన మూడు నక్షత్ర తాబేళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దాడి సమయంలో సచిన్ బన్సాల్ ఇంట్లోనే ఉన్నారు.

నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం!

- రేపటికల్లా వాయుగుండంగా మార్పు
- ఆపై తుపానుగా బలపడే అవకాశం
- మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు



సాక్షి, విశాఖపట్నం: నైరుతి బంగాళాఖాతంలో బుధవారం ఉదయం అల్పపీడనం ఏర్పడింది. ఇది ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా తీరాలకు ఆనుకుని ఉంది. ఈ అల్పపీడనం ఈశాన్య దిశగా కదులుతూ శుక్రవారం ఉదయానికి మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడనుంది. అనంతరం ఈ వాయుగుండం అదే దిశలో పయనిస్తూ 25 సాయంత్రం ఈశాన్య బంగాళాఖాతానికి ఆనుకుని ఉన్న వాయవ్య బంగాళాఖాతంలోకి చేరుకోనుంది. ఆపై అది తుపానుగా మారే అవకాశం ఉంది. మధ్య బంగాళాఖాతం నుంచి దారి మళ్లి బంగ్లాదేశ్ వైపు కదిలే అవకాశం ఉన్నందున దీని ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పై నామమాత్రంగానే ఉండనుంది. ఫలితంగా రానున్న నాలుగు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసేందుకు ఆస్కారం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) బుధవారం రాత్రి నివేదికలో తెలిపింది. గురువారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోనూ, శుక్రవారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోనూ, శనివారం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వివరించింది. అల్పపీడనం, వాయుగుండాల ప్రభావంతో రానున్న ఐదు రోజులు కోస్తాంధ్ర తీరం వెంబడి గంటకు 30–40 కి.మీల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, సముద్రం అలజడిగా మారుతుందని, అందువల్ల మత్స్యకారులు చేపలవేటకు వెళ్లవద్దని హెచ్చరించింది.

నేడు 26 మండలాల్లో వడగాడ్పులు..


రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ఫలితంగా మళ్లీ అక్కడక్కడ వడగాడ్పులు వీయనున్నాయి. గురువారం శ్రీకాకుళం జిల్లాలో 9, విజయనగరం 5, పార్వతీపురం మన్యం 11, అల్లూరి సీతారామరాజు 1 (కూనవరం) వెరసి 26 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అలాగే శుక్రవారం శ్రీకాకుళం జిల్లాలో 5, విజయనగరం 5, పార్వతీపురం మన్యం 7 మండలాల్లోనూ వడగాడ్పులు వీస్తాయని పేర్కొంది.

హార్సిలీహిల్స్‌పై పునుగు పిల్లి ప్రత్యక్షం

- ఇనుప కంచెకు చిక్కుకుని వెలుగులోకి..
- కాఫీ తోటల పెంపకంతో ఇక్కడ మనుగడ?
- శ్రీశైలం మల్లన్న సన్నిధిలో మరొక పునుగు పిల్లి సందడి

బి.కొత్తకోట/శ్రీశైలం: శ్రీవారు కొలువైన తిరుమల కొండల్లో కనిపించే పునుగు పిల్లి అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై బుధవారం ప్రత్యక్షమైంది. వివరాల్లోకి వెళితే... కొండపైన పోలీస్, టూరిజం అతిథి గృహాల మధ్యలో ఇనుప కంచె ఉంది. ఈ కంచెకు చిక్కుకుని ఓ వన్యప్రాణి విలవిల్లాడుతోందని పోలీస్ అతిథి గృహంలో పనిచేసే సిబ్బంది కొండపై ఉన్న అటవీ సిబ్బంది రవి, రమణలకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని పునుగు పిల్లి శరీరానికి అతుక్కున్న కంచెను కత్తిరించడంతో అది అడవిలోకి వెళ్లిపోయింది. కంచె తీగను కత్తిరించే సమయంలో దాన్ని వీడియో తీసి హార్సిలీహిల్స్ సెక్షన్ ఆఫీసర్ అడపా శివ కుమార్‌కు పంపగా ఆ వన్యప్రాణి పునుగు పిల్లిగా నిర్ధారించారు. తిరుపతి శేషాచలం అభయారణ్యానికే పరిమితమని భావిస్తున్న తరుణంలో పునుగు పిల్లి జాడ హార్సిలీహిల్స్‌పై వెలుగులోకి రావడం విశేషం. పునుగు పిల్లుల్లో 38 రకాల జాతులున్నప్పటికి ఆసియా రకానికి చెందిన పునుగు పిల్లి ఇది. దీని గ్రంథుల నుంచి సుగంధ ద్రవ్యం వెలుపలికి విసర్జిస్తాయి. పునుగు పిల్లి చర్మాన్ని దేనికైనా రుద్దితే వెలువడేదే పునుగు తైలం. పునుగు తైలాన్ని తిరుమల శ్రీవారి సేవల్లో వినియోగిస్తారు. పునుగు పిల్లులు కాఫీ కాయలను తిని గింజలను విసర్జిస్తాయి. కాఫీ తోటలున్న హార్సిలీహిల్స్‌పై వీటి మనుగడ ఉన్నట్టు భావిస్తున్నారు. కొండపైన అటవీశాఖ ప్రాంగణం, ఘాట్ రోడ్డులో పైనుంచి కిందకు వచ్చే రెండో మలుపులో అటవీశాఖ ఆధ్వర్యంలో కాఫీ తోటల నిర్వహణ సాగుతోంది. వెలుగులోకి వచ్చిన పునుగు పిల్లుల సంతతిపై అధ్యయనం జరగాల్సి ఉంది.

శ్రీశైలంలో క్యూలైన్లో మరొకటి..



శ్రీశైలం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల ఉచిత దర్శన క్యూలైన్‌లో బుధవారం ఉదయం భక్తులకు ఓ పునుగు పిల్లి కనిపించింది. సాధారణంగా శేషాచలం కొండల్లో కనిపించే ఈ పిల్లి ఇక్కడ ప్రత్యక్షం కావడంతో భక్తులు ఆశ్చర్యానికి గురయ్యారు.

స్కూళ్లు తెరిచే నాటికి పుస్తకాలు, యూనిఫామ్ అందించాలి

విద్యా శాఖ అధికారులకు సీఎస్ జవహర్ రెడ్డి ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జూన్ 12న స్కూళ్లు తెరిచేనాటికి పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్‌తో పాటు యూనిఫాం, బ్యాగులు వంటివన్నీ విద్యార్థులకు అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డా. కేఎస్ జవహర్ రెడ్డి విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. 2024–25 విద్యా సంవత్సరం ఏర్పాట్లు, నాడు - నేడు పనుల ప్రగతిని, మధ్యాహ్నం భోజనంపై బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన విద్యా శాఖ అధికారులతో సమీక్షించారు. రానున్న విద్యా సంవత్సరానికి సన్నాహక ఏర్పాట్లను విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జూన్ 12న స్కూళ్లు పున:ప్రారంభమవుతాయని, 10వ తేదీ లోగా విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ప్రవీణ్ ప్రకాశ్ చెప్పారు. ఇప్పటికే 82 శాతం పుస్తకాలు మండల స్టాకు పాయింట్లకు చేరాయని వివరించారు. 1 నుండి 10వ తరగతి వరకు 70,42,012 మంది విద్యార్థులు ఎన్‌రోల్ అయినట్లు చెప్పారు. వారిలో ప్రభుత్వ పాఠశాలల్లో 36,54,539 మంది విద్యార్థులు ఎన్‌రోల్ అయ్యారన్నారు. ఇప్పటివరకు ఎన్ని పుస్తకాలు, యూనిఫామ్‌లు, బ్యాగులు సమకూర్చింది, ఇంకా సమకూర్చుకోవాల్సిన వాటిపై ప్రతి రోజూ పర్యవేక్షించి, సకాలంలో విద్యార్థులకు అందేలా చూడాలని సీఎస్ ఆదేశించారు. రాష్ట్రంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, కృషోన్నతి యోజన కింద వ్యవసాయ, అనుబంధ రంగాల్లోని పథకాలన్నిటినీ ఒకే గొడుగు కిందకు తెచ్చి అమలు చేసేందుకు కన్సాలిడేటెడ్ వార్షిక కార్యాచరణ ప్రణాళిక 2024–25 అమలుపై రాష్ట్ర స్థాయి సాంక్షనింగ్ కమిటీ సమావేశం కూడా సీఎస్ అధ్యక్షతన జరిగింది. ఈ వార్షిక కార్యాచరణ ప్రణాళిక కింద చేపట్టే వివిధ పథకాలకు నిధుల మంజూరు తదితర అంశాలపై సీఎస్ సమీక్షించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, కమిషనర్ సీహెచ్ హరికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజహితం కోసం కృషి చేయాలి

- లక్ష్యసాధన దిశగా చదువులు కొనసాగాలి
- రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్



గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న గవర్నర్ నజీర్

వెంకటాచలం: విద్యార్థులు జీవితంలో నైతిక విలువలు పాటిస్తూ సమాజ హితం కోసం కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని వెంకటాచలం మండలం, కాకుటూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం 8, 9వ స్నాతకోత్సవ వేడుకలు గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అధ్యక్షతన బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత గవర్నర్‌కు వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి, కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి ఘన స్వాగతం పలికారు. వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి వీఎస్‌యూ ప్రగతి నివేదిక, కార్యాచరణ ప్రణాళిక నివేదికను క్లుప్తంగా వివరించారు. అనంతరం ఈఎన్‌టీ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ ఈసీ వినయ్‌కుమార్‌కు వీఎస్‌యూ నుంచి గౌరవ డాక్టరేట్‌ను గవర్నర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ విద్యార్థులందరూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలగా దాన్ని నెరవేర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు సాధించే డిగ్రీలు వ్యక్తిగత యోగ్యతకు నిదర్శనమని, సమాజానికి సేవ చేయడానికి ఒక సోపానమన్నారు. పదిహేనేళ్లలో వీఎస్‌యూ సమాజానికి సేవ చేయడంలో విశేషమైన పురోగతిని సాధించిందని తెలిపారు. వీఎస్‌యూకు న్యాక్ గ్రేడ్‌-ఏ గుర్తింపు రావడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా 29 మందికి గోల్డ్ మెడల్స్, 275 మందికి డిగ్రీ పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, సుడా వైస్ చైర్మన్ టి.బాపిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, వీఎస్‌యూ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

స్విమ్స్ అసోసియేట్ ప్రొఫెసర్‌కు ఫెలోషిప్ అవార్డు



ఫెలోషిప్ అవార్డు అందుకుంటున్న డాక్టర్ గాయత్రి

తిరుపతి తుడా: స్విమ్స్ యూనివర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గాయత్రిని అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ క్లినికల్ ఎండోక్రినాలజీ (ఎఏసీఈ) ప్రతిష్టాత్మకమైన ఫెలోషిప్ అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డు వరించింది. ఈ మేరకు ఆమెకు ఫెలోషిప్ అవార్డు వచ్చినట్టు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ బుధవారం మీడియాకు తెలిపారు. ఈనెల 11వ తేదీన అమెరికాలోని లూసియానా రాష్ట్రం, న్యూ ఓర్లీన్స్‌లో నిర్వహించిన అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ క్లినిక్ ఎండోక్రైనాలజిస్ట్స్ వార్షికోత్సవ సదస్సులో గాయత్రి ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఆమె ప్రతిభను గుర్తించిన సంబంధిత అసోసియేషన్ ఈ ఫెలోషిప్ అవార్డును అందజేసింది. ఈ సందర్భంగా డాక్టర్ గాయత్రిని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.వి. కుమార్ అభినందించారు.

ఉచిత పాఠ్య పుస్తకాలు సిద్ధం

▶ మొదటి పేజీ తరువాయి

ఈసారీ ద్విభాషా పుస్తకాలనే ముద్రించారు. వేసవి సెలవుల అనంతరం జూన్ 12న స్కూళ్లు ప్రారంభమవుతాయి. జూన్ 8వ తేదీకే అన్ని స్కూళ్లకు విద్యార్థుల సంఖ్యను అనుసరించి పుస్తకాలను తరలించనున్నారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు 1.08 కోట్ల రెండో సెమిస్టర్ పుస్తకాల ముద్రణ సైతం దాదాపు పూర్తయింది. సెమిస్టర్–2 బోధన అక్టోబర్ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో వాటిని జూలైలో విద్యార్థులకు అందిస్తారు.

ఈసారి పదో తరగతి ఇంగ్లిష్ మీడియంలో

గత విద్యా సంవత్సరం వరకు 1 నుంచి 9వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం అమల్లో ఉంది. జూన్‌లో ప్రారంభమయ్యే కొత్త విద్యా సంవత్సరం నుంచి 10వ తరగతి కూడా ఇంగ్లిష్ మీడియంలోకి మారనుంది. ఈ నేపథ్యంలో ఎన్సీఈఆర్టీ సిలబస్‌ను అనుసరించి అధికారులు పుస్తకాలను సిద్ధం చేశారు. పదో తరగతి ఫిజికల్ సైన్స్ పుస్తకాలను తొలిసారి పూర్తి ఆర్ట్ పేపర్‌పై ముద్రించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఫ్యూచర్ స్కిల్స్ కోర్సును అందుబాటులోకి తెచ్చింది. ఈ కోర్సు బోధనకు ఇంజినీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులను ఎక్స్‌పర్ట్స్‌గానూ నియమించింది. ఫ్యూచర్ స్కిల్స్ సిలబస్‌ను అనుసరించి మొత్తం 4.30 లక్షల పుస్తకాలను సిద్ధం చేసింది. బైలింగ్యువల్‌లో మేథమెటిక్స్, బయాలజీ, ఫిజిక్స్, సామాజిక శాస్త్ర పాఠ్య పుస్తకాలను విద్యార్థులు ఆసక్తిగా చదివేలా తీర్చిదిద్దారు. దీనిద్వారా విద్యార్థులకు సబ్జెక్టులపై మరింత అవగాహన పెరుగుతుందని, ఆంగ్ల భాషా నైపుణ్యాలు మెరుగుపడతాయని నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలను మార్కెట్‌లోకి రెండు రోజుల్లో విడుదల చేస్తామని ప్రభుత్వ టెక్స్ట్ బుక్స్ డైరెక్టర్ కొండా రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. వాటిని ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలన్నారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా పుస్తకాల ముద్రణను జ్యుడిషియల్ ప్రివ్యూ పూర్తయిన తర్వాతే కాంట్రాక్టు అప్పగించామన్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకటి నుంచి 10వ తరగతి వరకు పాఠ్య పుస్తకాలు పాఠశాల విద్యా శాఖ వెబ్‌సైట్ (www.cse.ap.gov.in)లో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు.

యథావిధిగా ఆరోగ్యశ్రీ సేవలు

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద పేద, మధ్య తరగతి రోగులకు యథావిధిగా ఉచిత చికిత్సలు అందుతున్నాయి. పథకం సేవలు నిలిపివేసినట్టు కొన్ని ఆస్పత్రుల యాజమాన్యాలు ప్రకటనలు చేశాయి. కాగా, ఎక్కడా పథకం సేవలు నిలిచిపోలేదని ముఖ్య కార్యనిర్వహణ అధికారి(సీఈవో) డాక్టర్ లక్ష్మీషా బుధవారం తెలిపారు. ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం కింద 3,257 ప్రొసీజర్‌లలో నగదు రహిత చికిత్సను అందిస్తున్నట్టు తెలిపారు. ఇలా ప్రతి కుటుంబానికీ వార్షిక చికిత్స పరిమితి రూ.25 లక్షల వరకూ ఉందన్నారు. గత ఆర్థిక సంవత్సరం(2023–24)లో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ నుంచి రూ.3,566.22 కోట్లు నెట్‌వర్క్ ఆస్పత్రులకు జమ చేశారు. బుధవారం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ నుంచి అన్ని ఆస్పత్రులకు రూ.203 కోట్ల బిల్లులు చెల్లించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మొదటి రెండు నెలల్లోనే రూ.366 కోట్లు చెల్లించినట్లయింది. మిగిలిన బకాయిలనూ త్వరలోనే విడుదల చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఐదేళ్లలో వైద్య శాఖలో 54 వేల పోస్టుల భర్తీ

కొన్ని ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటనలిస్తున్న క్రమంలో పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవల విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని జిల్లా కలెక్టర్‌లకు వైద్య శాఖ ఆదేశాలిచ్చింది. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేసుకోవాలంది. ఆరోగ్యశ్రీ లబ్ధిదారుల వైద్య సేవలకు అంతరాయం కలిగించే ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు అసౌకర్యం కలగకుండా చూడాలని సూపరింటెండెంట్లకు సూచించింది. గత ఐదేళ్లలో 54 వేల మేర వైద్య శాఖలో పోస్టులు భర్తీ చేశారు. దీంతో ఆస్పత్రుల్లో పూర్తి స్థాయిలో వైద్యులు ఉన్నారు.

'సిపెట్' కోర్సులకు 31 వరకు దరఖాస్తు గడువు

సాక్షి, అమరావతి: భారత ప్రభుత్వ విద్యాసంస్థ 'సిపెట్' విజయవాడలో ప్లాస్టిక్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సంస్థ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు మూడేళ్ల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ), బీఎస్సీ విద్యార్థులకు రెండేళ్ల వ్యవధి గల పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెస్సింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ–పీపీటీ) కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు కళాశాల ప్రాంగణంలో ప్రత్యేక హాస్టల్ వసతి ఉందని, అర్హులైన విద్యార్థులకు ఏపీ ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 31వ తేదీ లోగా https://cipet24.onlineregistrationform.org/CIPET/లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చే నెల 9న సిపెట్ అడ్మిషన్ టెస్ట్ (సీఏటీ) విజయవాడ, అనంతపురంలో నిర్వహించి, ర్యాంక్ ఆధారంగా విజయవాడ కేంద్రంలో 150 సీట్లను భర్తీ చేస్తామని వివరించారు. ఈ కోర్సులు పూర్తిచేసిన వారికి ప్లాస్టిక్ రంగంలో గల బహుళ జాతి సంస్థల్లో అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఇతర సమాచారం కోసం 9398050255 నంబర్‌లో సంప్రదించాలని శేఖర్ విజ్ఞప్తి చేశారు.

జగనన్న కాలనీలో వసతులపై కేంద్ర బృందం కితాబు



పెదతాడేపల్లిలోని జగనన్న కాలనీని సందర్శిస్తున్న కేంద్ర బృందం

తాడేపల్లిగూడెం రూరల్: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి గ్రామంలోని జగనన్న కాలనీని కేంద్ర బృందం బుధవారం సందర్శించింది. గ్రామంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో ఇళ్ల నిర్మాణ పురోగతి, పనితీరు, లబ్ధిదారులకు పథకం ద్వారా ఎలాంటి లబ్ధి చేకూరిందనే వివరాలు అడిగి తెలుసుకుంది. జగనన్న కాలనీలో అభివృద్ధి పనులు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలపై సర్పంచ్ పోతుల అన్నవరం, గ్రామ పంచాయతీ కార్యదర్శిని అభినందించింది. ఈ బృందంలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల అధికారులు అభిషేక్ గుప్తా, ఫాతిమా, అభిషేక్ దీక్షిత్, అపరాజిత్ రావత్, చంచల్ కుమార్, బి.విశ్వసాయిరెడ్డి, కేఎం నాగరాజు ఉన్నారు.



మత్స్యకన్యలు

దేశంలోనే మొదటిసారిగా సాగర కన్యల జల ప్రదర్శన • ఫిలిప్పీన్స్ నుంచి వచ్చిన మర్మెయిడ్ అమెజాన్ నది నుంచి అరుదైన చేపలు • అబ్బురపరుస్తున్న అండర్ వాటర్ మర్మెయిడ్ షో

సాక్షి, హైదరాబాద్: మత్స్యకన్యలు, సాగర కన్యల గురించి కథలుగా చెప్పుకోవడం, సినిమాల్లో చూడటం తప్ప నిజంగా వారిని చూసిన వారెవరూ లేరు. అయితే ఈ జల కన్యలు ఉన్నది వాస్తవమో కాదో కానీ... హైదరాబాద్ నగరానికి చేరుకున్న మత్స్య కన్యలు మాత్రం అందరినీ ఆశ్చర్యచకితులను చేస్తున్నారు. దేశంలో మొట్టమొదటిసారిగా కూకట్‌పల్లిలో ఏర్పాటు చేసిన అండర్ వాటర్ టన్నెల్ డబల్ డెక్కర్ ఎగ్జిబిషన్ మర్మెయిడ్ షోలో మనం చూస్తుంది నిజమేనేమో అనిపించేలా మత్స్యకన్యలు ఆకట్టుకుంటున్నారు.

ఫిలిప్పీన్ సాగర కన్యలు.. అమెజాన్ చేపలు..

అండర్ వాటర్ టన్నెల్ డబల్ డెక్కర్‌ను ఏర్పాటు చేసి, అందులో అరుదైన చేపల ప్రదర్శన, స్కూబా డైవింగ్ వంటి వినూత్న ప్రదర్శనలు ఏర్పాటు చేయడం నగరవాసులకు పరిచయమే. కానీ ఊహాజనిత కథలుగా చెప్పుకునే సాగరకన్యలు, హాలీవుడ్ సినిమాల్లో అందంగా కనిపించే మత్స్యకన్యల ప్రదర్శన మాత్రం దేశంలోనే ఇదే మొదటిసారి. దీని కోసం పసిఫిక్ మహాసముద్రంలో ప్రదర్శననిచ్చే ఫిలిప్పీన్స్‌కు చెందిన ఆరుగురు యువతులు నగరానికి చేరుకున్నారు. మర్మెయిడ్‌గా పిలుచుకునే వీరు జల కన్యల వస్త్రధారణతో 8 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అండర్ వాటర్ టన్నెల్‌లో ఆక్సిజన్ లేకుండా ప్రదర్శన చేయడం సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తుంది. ఈ మమెడ్ షోలు గతంలో దుబాయ్, థాయ్‌లాండ్, హాంకాంగ్ వంటి దేశాలకు మాత్రమే పరిమితం. ఈ అండర్ వాటర్‌లో సింగపూర్, మలేసియాతో పాటు అమెజాన్ నది నుంచి తీసుకువచ్చిన 600 అరుదైన చేపలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అంతేకాకుండా ఇక్కడి స్కూబా డైవింగ్ కూడా మంచి అనుభూతిని అందిస్తుంది. మరో 37 రోజుల వరకు ఈ ప్రదర్శన జరగనుందని నిర్వాహకులు తెలిపారు.

విజ్ఞానం, వినోదమే లక్ష్యంగా..

విదేశాల్లో మాత్రమే చూడగలిగే మర్మెయిడ్ షోను కోట్ల రూపాయల వ్యయంతో, ఎంతో వ్యయప్రయాసలకోర్చి నగరంలో ఏర్పాటు చేశాం. ఎగ్జిబిషన్ రంగంలో మాకు 39 ఏళ్ల అనుభవం ఉంది. ప్రజలకు అద్భుత అనుభూతిని అందించేందుకు ఫిలిప్పీన్స్ నుంచి జలకన్యలను తీసుకువచ్చాం. ఆక్సిజన్ లేకుండా నిమిషానికిపైగా నీటిలోనే ఉంటూ ప్రదర్శన ఇవ్వడం అరుదైన కళ. వీటితో పాటు 27కు పైగా అమ్యూజ్‌మెంట్ గేమ్స్ ఉన్నాయి. ముఖ్యంగా విద్యార్థులకు విజ్ఞానం, వినోదం అందిస్తున్నాం. ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ప్రదర్శన కొనసాగుతుంది. షో మాత్రం మధ్యాహ్నం 3 గంటల నుంచి అందుబాటులో ఉంటుంది.

– రాజారెడ్డి, నిర్వాహకుడు





జలకన్యలను చూస్తూ ఆనందిస్తున్న సందర్శకులు

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943